కొత్త కథ

2019

Our sincere thanks to

Sri Veerashankar, Movie Director
and Hidden Castle

Sri Madhu
Kudali Intergenerational Learning Centre

# కొత్త కథ

2019

సంపాదకులు

కె. సురేష్
మహమ్మద్ ఖదీర్‌బాబు

WRITERS 'MEET
Publications

# Kotha Katha 2019

A collection of New Short Stories from the Writers of Writers' Meet - March 2018 & December 2018.

**Writers:**
Aruna Pappu, Aparna Thota, Aripirala Satyaprasad, Chandu Tulasi, Jhansi Papudeshi, Kuppili Padma, Kunaparaju Kumar, Kottam Ramakrishna Reddy, Kadali Satyanarayana, Ramadurgam Madhusudan Rao, Mercy Margaret, Midhuna, V. Mallikarjun, Peddinti Ashok Kumar, Poodoori Raji Reddy, Rishi Srinivas, Rishita Galanki, Vunudurthi Sudhakar, Vanaja Tatineni, Venkat Siddareddy, Araathu, Vasudendra.

Published: June 2019
By Writers' Meet Publications,
Hyderabad.

Editors:
K. Suresh
Mohammed Khadeer Babu

Co-ordinator:
V. Mallikarjun

Copies Available at
Nava Chetana, Visalandhra,
Navodaya and all leading Book Stores

Printed at
Anupama, Hyderabad.

Price: Rs. 149/-

Cover & Book Making:
Mahy Bezawada
Artio Creative Agency
97059 72222

Lay-out: Jhansi Nallamelli

# ముందుమాట



## ఇవీ కథలు


1. అనంతరం • అరుణ పప్పు • 1
2. గుడ్‌మార్నింగ్ అదితి • అపర్ణ తోట •
3. డబుల్నాట్ • అరిపిరాల సత్యప్రసాద్ •
4. వేకువ చూపిన పాట • చందు తులసి •
5. నీరుగట్టోడు • ఝాన్సీ పాపుదేశి •
6. వే టు మెట్రో • కుప్పిలి పద్మ •
7. మేపిల్ ఆకులు • కూనపరాజు కుమార్ •
8. స్పర్శ • కొట్టం రామకృష్ణారెడ్డి •
9. ఆగు • కడలి సత్యనారాయణ •
10. చేను చెప్పని కత • మధుసూదన్‌రావు రామదుర్గం •
11. మత్తయి 5:11 • మెర్సీ మార్గరేట్ •

## ఇవీ కథలు


12. శీలానగర్ రెండో మలుపు • మిథున ప్రభ •

13. అస్పష్టపు గాలి • వి. మల్లికార్జున్ •

14. తీపి చావు • పెద్దింటి అశోక్ కుమార్ •

15. ఫ్యామిలీ ఫొటో • పూడూరి రాజిరెడ్డి •

16. ధనియావర్తనం • రిషి శ్రీనివాస్ •

17. ముఖం • రిషిత గాలంకి •

18. చలిచీమల కవాతు • ఉణుదుర్తి సుధాకర్ •

19. పూవై పుట్టి • వనజ తాతినేని •

20. ఒజామా–షిమాసు • వెంకట్ శిద్దారెడ్డి •

21. తమిళ కథలు • అరాత్తు •

22. డెవిల్ డాగ్ • వసుధేంద్ర •

# అనంతరం



## అరుణ పప్పు

ఆచితూచి కథను సాధన చేస్తున్న రచయిత. 1979లో వైజాగ్‌లో జన్మించారు. దాదాపు అన్నీ ప్రముఖ దినపత్రికల్లో వీరి కథలు ప్రచురితమయ్యాయి. పాత్రికేయ రంగంలో కొన్నాళ్లు పని చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో కూడా కొనసాగారు. కథలు రాయడాన్ని ఒక ప్రత్యేక అవసరంగా భావిస్తారు. మనుషుల భావోద్వేగాలు, పరిస్థితులు మారినప్పుడు వాళ్ల ఆలోచనలు ఎలా ఉంటాయన్నది కథల్లో చెప్పడం వీరి ఆసక్తి. ప్రముఖుల జీవిత కథలు కూడా రాస్తున్నారు. బయోగ్రఫీలను కూడా మెయిన్‌స్ట్రీమ్ సాహిత్యంగానే చూడాల్సిన అవసరం ఉందన్నది వీరి అభిప్రాయం. ఇప్పటికి 30 కథల దాకా రాశారు.

నివాసం : విశాఖపట్టణం.

మొబైల్ : 80966 09989

పార్కులో ఆకుపచ్చని పచ్చిక మీద పరుగులు పెడుతూ అందాల పాప. అమ్మా, నాన్నా అని ముద్దుగా అంటోంది. వేసుకున్న పసుప్పచ్చ గౌను గాలికి ఎగురుతోంది. చిన్నచిన్న పిలకలకు పెట్టిన పసుప్పచ్చని రబ్బరు బ్యాండ్లు వదులయ్యి జుట్టు మొహమ్మీద పడుతుంటే కూడా పట్టించుకోకుండా పాప సీతాకోకచిలుకల వెనకాల ఎగురుతోంది.

ఎక్కణ్నుంచి వచ్చిందో ధామ్మని వచ్చేసింది కారు. కొట్టేసింది.

బంతి పువ్వులా ఉన్న పాప గాల్లోకి ఎగిరింది. ముప్ఫై అడుగుల దూరంలో తొక్కేసిన ముద్దమందారంలా పడిపోయింది. అమ్మా అనో, నాన్నా అనో, ఏదో ఒకటి అరవడానికీ, ఎవరో ఒకర్ని పిలవడానికీ వ్యవధి లేదేమో.

అంతా అయిపోయింది. ఒక్క నిమిషంలో.

ఏసీ పని చేస్తున్నా, చెమట్లు పట్టి లేచిపోయాడు మహేంద్ర. అది కలే. ఎన్నిసార్లు వచ్చినా ఆగిపోదెందుకనో. మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటుంది. రాత్రి ఎప్పటికో వచ్చిన నిద్రను చెరిపేసి, కళ్ల నిండా నీళ్లను కూరి మరీ లేపుతుంది. గుండె లోపల రాతి క్వారీ ఉన్నట్టు. దాన్నెవరో పేలుస్తున్నట్టు. ఉండుండి వినపడే పేలుళ్లు ఉలిక్కిపడేలా చేస్తుంటాయి. ఈ భారం ఎప్పటికీ దిగేది కాదేమో.

అతను లేచి హాల్లోకి వెళ్లి బల్ల మీదున్న నీళ్ల సీసాను లేపి గడగడా తాగాడు.

తిరిగి వచ్చేసరికి గౌరి లేచి ఉంది.

‘మళ్లీ కలేనా?’

‘మ్... కలా అది? ఆగుతుందా ఎప్పుడైనా?’

‘మీరు ఆపితే...’

‘నీలాగా అందరికీ కుదర...’ వాక్యం అతని గొంతులోనే ఆగిపోయింది. అందులోని బోలుతనమెంతో ఆమె చూపులో లోతు చూస్తే అతనికి అర్థమయ్యింది.

ఇదివరకు ఇలా మాట్లాడినప్పుడు ఆమె దెబ్బతిన్న ఆవుదూడలాగా చూసేది. కళ్లలో నీళ్లు నిండేవి.

తర్వాత వెక్కిళ్ల మధ్య కొన్ని మాటలు నడిచేవి. నిజానికవి మాటలు కాదు, బాధ దట్టించిన తూటాల్లాంటి ప్రశ్నలు.

‘ఏం పాప మీకేనా? నాక్కాదా? కడుపున మోసింది నువ్వా నేనా? నొప్పులు పడి కన్నది మీరే మరి!’

సంధించిన ఆమెకీ బాధే, పడిన తనకూ బాధే. అందులో ఒకరు వేటగాడు మరొకరు వేటాడబడిన జంతువూ కాదు. ఏదో దురదృష్టం వేటాడింది ఇద్దరినీ.

ఇద్దరంటే ఇద్దరినే కాదు. మొత్తం కుటుంబాన్ని. అంతకు ముందు తలొక చోటా ఉన్నా అంతా కలిసే ఉన్నామన్న భావన ఒక నిండుదనాన్నిచ్చేది. ఇప్పుడు అంతా కలిసే ఉంటున్నా, చెట్టుకొకరూ పుట్టకొకరుగా కకావికలమైపోయినట్టుగా ఉంది.

చాలా అరుదుగానే అయినా, అప్పుడప్పుడు మహేంద్ర ఆ సంఘటనకు దూరంగా నిలబడి ఆలోచిస్తుంటాడు. అలాంటప్పుడతనికి ఆశ్చర్యంగా అనిపిస్తుంది. పాప పుట్టక ముందు తామందరికీ జీవితాల్లేవా? సంతోషాల్లేవా? సరదాల్లేవా? బాధల్లేవా? ఎందుకు జీవితంలోని ఆనందాన్నంతటినీ పాపలోనే మూటగట్టారు? ఎవరు చేశారా పని? పుడుతూనే పాప అందరి సంతోషాన్నీ తన గుప్పిట పట్టేసిందా? ఆమె పుట్టినప్పుడే తామందరూ పుట్టినట్టు, ఆమె లేకపోతే భవిష్యత్తే కాదు, వర్తమానమూ, ఆఖరికీ గతమూ కూడా లేనట్టు ఎందుకు అనిపిస్తోంది?

కాని ఈ ఆలోచన అతనిలో ఎక్కువసేపు ఉండదు. సముద్ర కెరటాల్లో కొట్టుకుపోతున్నప్పుడు ఒక్క సెకను బయటకొచ్చినట్టు, అలాగ అదొక భ్రమగా ఉంటుంది. అంతే. మళ్లీ శోకపు కెరటాల్లో ఊపిరాడకుండా ఒడ్డుకు దూరంగా కొట్టుకుపోతాడు.

గౌరి కూడా తనలాగే బాధపడుతున్నదని అతనికి తెలుసు. అతని తండ్రి ఆనాడు వంచిన తల ఇప్పటివరకూ ఎత్తగా అతను చూడలేదు. తల్లి కూడా అంతే. తామిద్దరూ ఉద్యోగాలకు వెళుతున్నా, తండ్రి కూరలు తెస్తున్నా, తల్లి వంట చేస్తున్నా, ఎవ్వరేం చేసినా అవన్నీ యాంత్రికంగా, మరమనుషుల్లాగా చేసుకుపోవడమే. ఇంట్లో ఓ మాటామంతీ అన్నదే లేదు. అదొక రకమైన భయపెట్టే నిశ్శబ్దం.

కాని ఇప్పుడిప్పుడే గౌరిలో ఏదో మార్పు కనిపిస్తోంది అతనికి. దుఃఖాన్ని మించిన నిబ్బరమేదో చిన్న మొలకలాగా తొంగి చూస్తోంది. ఇంట్లో ఆమె మాటలూ వినిపిస్తున్నాయి. ఫోన్లోనేమో అనుకున్నాడుగాని, కాదని ఇప్పుడే అర్థమవుతోంది.

'మీరు ఆపితే...' అన్న మాటలో అది మెరుపులాగా అతనికి సాక్షాత్కరించింది.

అనుకోకుండా ఆమె దగ్గరగా వెళ్లాడు. చుట్టూ చేతులేసి పొదివి పట్టుకున్నాడు. ఆమె కదిలిపోయింది. వెక్కివెక్కి ఏడుస్తుందనుకున్నాడు. కాని ఆమె అతని చుట్టూ చేతుల్ని కంచెలాగా అల్లేసింది. ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న నిధి దొరికినట్టు, దాన్ని పోనివ్వకూడదన్నట్టు ఊపిరాడనివ్వనంత బలంగా కౌగిలించుకుంది. ఆమెలో అంత బలం ఉండొచ్చని ఊహించలేదేమో, ఒక్కడుగు తూలాడు మహేంద్ర.

పాప పోయిన తర్వాత తామిద్దరం ఒకరినొకరు తాకినట్టు గుర్తులేదు అతనికి.

తర్వాత గంట, రెండు గంటలు సమయం ఎలా కదిలిపోయిందో ఇద్దరికీ తెలియదు.

స్పర్శ ఇవ్వగలిగిన సాంత్వన ఇద్దరికీ అనుభవంలోకి వచ్చింది.

ఇంకా తెల్లారక ముందు ఉండే ఒక మెత్తటి చల్లటి గాలి ఆ ఇంట్లోకి వచ్చింది.

'నేనొక మాట చెబుతాను వింటారా?' అడిగింది గౌరి.

చెప్పమన్నట్టు ఊ కొట్టాడు చెవికి దగ్గరగా.

'మహీ, నువ్వేమనుకున్నా, పాప పోయిన దుఃఖం మనిద్దరికీ సమానమే. ఎవరికీ ఎక్కువా తక్కువా కాదు. కొందరు బయటకేడుస్తారు. కొందరు లోపలేడుస్తారు. కొందరు ముందుకెళుతూ జ్ఞాపకాల్ని పదిలం చేసుకుంటారు, కొందరు అక్కడ ఆ నిమిషంలో ఫ్రీజయి ఉండిపోవడమే అసలు నివాళి అనుకుంటారు. ఇందులో ఏది కరెక్టు, ఏది కాదు అన్నదేం ఉంటుందనుకోను.'

అతను వినడం ప్రారంభించాడు.

'నువ్వు ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు నీ నేస్తం ఎవరో కొత్త షూస్ తీసుకెళ్లి పోగొట్టేశాడు చూడు... అది గుర్తుందా?'

బాగా గుర్తుంది మహేంద్రకి. పెద్ద బ్రాండ్ షూస్. దాదాపు రెండేళ్లు అడగ్గా అడగ్గా, దసరాకు బోనస్ డబ్బులొస్తే వాటితో కొన్నాడు నాన్న తనకు. 'కాళ్లకు వేసుకునే షూలకు అంత డబ్బా? చక్కటి పట్టుచీరొద్దును...' అని తల్లి ఆశ్చర్యపోవడం గుర్తుంది. 'జాగ్రత్తగా వాడుకో, మళ్లీ మళ్లీ కొనగలిగిన వస్తువు కాదు' అని తండ్రి హెచ్చరించడమూ గుర్తుంది. ఆ సాయంత్రం కొన్నది మొదలు తన మనసు గాల్లోనే ఎగురుతూ ఉండేది. రాత్రి వాటిని పక్కన పెట్టుకుని పడుకున్నాడు. వాళ్లమ్మ చూసి నవ్వుకుందేమో, మర్నాడు మహేంద్ర లేచేసరికి అవి మంచం కిందన పక్కకు పెట్టి

ఉన్నాయి. ఆ నిమిషానికే తన గుండె ఆగి కొట్టుకున్నట్టయింది. వాటిని వేసుకుని స్కూలుకు వెళ్లిన రోజు తానొక మహారాజులాగా ఫీలయ్యాడు. క్లాసులోని మగపిల్లలంతా చుట్టూ మూగి చూడడమూ ఎక్కడ కొన్నదీ, ఎంతయినదీ అడగడమూ ఇవన్నీ అయ్యాయి. ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు కూడా ప్రశంసగా చూశారన్నట్టే అనిపించింది. తన బెస్ట్‌ఫ్రెండ్ రమేశ్ సాయంత్రం వాటిని అడిగాడు.

'రేయ్, నిన్న రాత్రంతా నీ దగ్గరే ఉన్నాయి. ఈ రోజంతా నువ్వే వేసుకున్నావు. మా నాన్న ఎలాగూ కొనరు. నాకీ సాయంత్రం ఇవ్వరా. రేప్పొద్దున్నే నీకిచ్చేస్తాను' అని పదేపదే వేడుకున్నాడు. కొత్త షూలను ఇవ్వాలని లేకపోవడం ఒకవైపు, అమ్మా నాన్నా అడిగితే ఏం చెప్పాలని మరోవైపు, బెస్ట్ ఫ్రెండు కోరికను కాదనలేకపోవడం ఇంకోవైపు... ఇవన్నీ కలిపి మహేంద్రను ఉక్కిరిబిక్కిరి చేశాయి. అయినా ఇచ్చాడు.

ఆ రాత్రంతా కలత నిద్రే.

ఏం చిత్రం జరిగిందో, రమేశ్ ఇంటికెళ్లాక ఏమయ్యిందో తెలియదు, అవి పోయాయి!

ఆ విషయం మర్నాడు ఉదయం తెలిసింది మహేంద్రకు. అంతే రమేశ్‌ను కిందపడేసి, వాడి మీదెక్కి కూర్చుని మరీ కొట్టేశాడు. పిడిగుద్దులతో వాడు పచ్చడైపోయేవాడేమో. అయినా తప్పించుకోవడానికి వాడెంత మాత్రమూ ప్రయత్నించలేదు. 'నాకీ శాస్తి కావలసిందే' అన్నట్టు పడ్డాడుగాని, కొడుతున్న మహేంద్ర మాత్రం గుండె పగిలిపోయేలా ఏడ్చాడు.

షూలు పోవడం చిత్రమైతే, అంతకన్నా చిత్రం, ఇలా జరిగిందని తెలిశాక మహేంద్ర తండ్రీ తల్లీ కూడా రమేశ్‌నీ ఏమనలేదు, మహేంద్రనూ ఏమీ అనలేదు. 'మనకెంత ప్రాప్తమో అంతే' అన్నారు పైకి. లోపల ఏమనుకున్నారో ఇప్పటికీ తనకు తెలియదనిపించింది మహేంద్రకి.

ఆ తర్వాత రమేశ్ సెక్షన్ మార్పించుకున్నాడు. స్కూల్లో ఎదురుపడినప్పుడల్లా అప్పుడే తప్పు చేసినట్టు బాధ పడేవాడు. పదో తరగతి తర్వాత రమేశ్ కనిపించలేదు. మూడు నాలుగేళ్ల క్రితం స్కూలు రీయూనియన్ అంటే ఒక్క రమేశ్ గుర్తొచ్చి తాను వెళ్లడం మానేశాడు.

'మహీ, తర్వాత రమేశ్ ఏమనుకుని ఉంటాడో, తనెంత బాధ పడుంటాడో ఆలోచించావా ఎప్పుడైనా?' అడిగింది గౌరి.

లేదు. తానెప్పుడూ ఆలోచించలేదు. తనకేం బాధ అనిపించింది.

ఉండొచ్చునేమో అని ఇప్పుడు, ఈ నిమిషం అనిపిస్తోంది.

'ఏదైనా ప్రమాదం జరిగితే, ప్రియమైనదాన్ని పోగొట్టుకుంటే మనకే ఎందుకు

జరిగిందీ అనిపిస్తుంది, దానికి కారణమైన వాళ్లను ఎప్పటికీ క్షమించకూడదనిపిస్తుంది. నాక్కూడా అలాగే అనిపించింది. కాని నెమ్మదిగా ఆలోచించడం మొదలుపెట్టాను. మనమిద్దరం ఉద్యోగాలు అంటూ వెళ్లినప్పుడు, పాపను కంటికి రెప్పలా కాచుకున్నది అత్తయ్యగారు, మావయ్యగారే. మూడు నెలల పసిపాప నుంచి దానికన్నీ చేసింది వాళ్లే. ఆ ప్రాసెస్‌లో వాళ్లెంత అలసిపోయేవాళ్లో కూడా మనం ఎప్పుడైనా గమనించామో లేదో. వాళ్లు మనకోసం కష్టపడిందంతా పడ్డాక, కాస్త రిటైరయ్యే సమయానికి మళ్లీ మన పిల్లలు, వాళ్ల సంరక్షణ, స్కూళ్లు, క్యారేజీలు... ఇవన్నీ అంటే...'

'అది ముందే చెప్పాలి... మీ పిల్లల్ని మీరే చూసుకోవాలి అని. అప్పుడు ఎవరి జీవితాలు వాళ్లవిగా ఉండేవి. వాళ్లను నమ్మితే ఇలా చెయ్యిదిలేస్తారని అనుకుంటామా?' ఎనిమిదో క్లాసు పిల్లాడి ఉక్రోషం మహేంద్ర గొంతులో పలికింది.

'పోనీ అలా ముందే చెప్పారనుకో. అప్పుడేమంటాం? ఒకే ఊళ్లో ఉండి కూడా ఏ సాయమూ చెయ్యనివాళ్లు అసలు తల్లిదండ్రులేనా అని అంటాం. అటు ఉద్యోగాల్తో ఇటు పాపతో కిందా మీదా పడుతూ ఉంటే వీళ్లకేం పట్టదా అని కోపం పెట్టుకునేవాళ్లం.'

నిజమేనా? కాదా? మొదటిసారి తప్పనిసరై తనదిగాకుండా వేరేవాళ్ల చొక్కా వేసుకున్నట్టు కొత్తగా అనిపిస్తున్న ఆలోచన చొరబడింది అతనిలో.

'ఆరోజు ఏం జరిగింది మహీ? రోజూలాగానే పాపను స్కూలు నుంచి తీసుకురావడానికి మావయ్యగారు వెళ్లారు. రోడ్డు దాటుతున్నారు. అనుకోకుండా పాప ఆయన చెయ్యి వదిలేసింది, అంతలోనే సిటీబస్సు స్పీడుగా వచ్చేసింది. కొట్టేసింది. దానిలో ఆయన తప్పేముంది? అప్పటికి ఏడాదిన్నరగా ప్రతిరోజూ చేస్తున్న పనే అది. ఒక్కరోజయినా పొరపాటు జరగలేదు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవరు అరెస్టయ్యాడు. కాని నువ్వెందుకు మీ నాన్నగారితో మాట్లాడ్డం మానేశావు?'

వలలో పడ్డ చేపలాగా గింజుకున్నాడు మహీ. ఏదో చెబుదామనుకుని చెప్పలేకపోయాడు.

'క్షమించడం అనేది పెద్ద పదం. అది వాడను. అయిపోయిందేదో అయిపోయింది. పాపను పోగొట్టుకున్నదానికి తోడు నువ్వు మాట్లాడవన్నది ఆయన్నెంత బాధ పెడుతోందో చూడు..'

'చెప్పడానికి సులువు. చెయ్యడం కష్టం. అంత మర్చిపోవడమూ కష్టం' అన్నాడతను. అంటున్నప్పుడు లోపల ఏదో బోలుగా అనిపించింది. అదేమిటో మళ్లీ అర్థం కాలేదు.

'నిజమే. కాని క్షమించడమంటే ఆ సంఘటనను పూర్తిగా మర్చిపోవాలని, మనసు నుంచి తుడిచెయ్యాలనీ కాదు. అంతా మామూలుగా మారిపోయి, ఇక రేపటి నుంచి కలిసిమెలిసి ఉంటామని కాదు. అసలు క్షమించడం అవతలివాళ్ల కోసం కాదు. మన కోసం. అది మనకు మనం చేసుకునే ఉపకారం. వాస్తవాన్ని అంగీకరించడం. ఆ వాస్తవంతో కలిసి బతకడం. దానికి కొంత సమయం పడుతుంది. కష్టమే. సులువేం కాదు.'

'ఎందుకంత కష్టమైన పని చెయ్యాలి? మన పేపర్లన్నీ సిద్ధమవుతున్నాయి. కొన్ని రోజుల్లో అమెరికా వెళ్లిపోతున్నాం..'

'అమెరికా వెళ్లిపోతే పాపను పోగొట్టుకున్న దిగులు తగ్గిపోతుందా? పాప లేచి నవ్వుతూ వచ్చేస్తుందా? ఏం మారిపోతుంది మన జీవితాల్లో?'

అతనేమీ చెప్పలేకపోయాడు.

'ఇలాంటప్పుడు సమస్య వేరే దగ్గర ఉంటుంది మహీ. ఆలోచించి చూడు. మనం బాధితులమనుకో, అప్పుడు మనలో ప్రతీకార ధోరణి ఉంటుంది. దానికితోడు మనకు మనం ఒకరకమైన నైతికమైన ఆధిపత్యాన్ని ఆపాదించుకుంటాం. ఈ రెండింటితోనూ ఎదుటివాడిని శిక్షించాలనుకుంటాం. బాధితుణ్ణి అన్న ఒక ఐడెంటిటీ తెలియకుండానే నచ్చుతూ ఉంటుంది. మనపట్ల మనకే జాలి... అదో వ్యసనమై కూర్చుంటుంది...'

మహేంద్ర లేచి ఆశ్చర్యంగా చూశాడు గౌరి వైపు.

'నాక్కూడా చాలా రోజులు అర్థం కాలేదు మహీ. కోపం ఎవరి మీదో ఎందుకో తెలియకుండా ఉండేది. కాని ఆయన తప్పేం లేదు కదా అనిపించేది. ఇలా నా లోపలే నేను రెండు వైపులా మాట్లాడుకునేదాన్ని. పాపను పోగొట్టుకున్న సంఘటన గురించి ఆలోచించాను. ఎన్నిసార్లో చెప్పలేను. వాళ్ల తప్పును, నిర్లక్ష్యాన్ని ఎన్నోమార్లు ఎత్తి చూపించుకున్నాను. కాని చిన్నదో పెద్దదో తప్పు చెయ్యని మనిషేడీ అనిపించేది. మనం పోగొట్టుకున్నది విలువైనదే. ఆ శోకం తీరేదీ కాదు. నాకు బాధ కలిగించిన సంఘటన వాళ్లకూ బాధ కలిగించేదే. వాళ్ల మానసిక వ్యధను పట్టించుకున్నవారేరీ? పాప ఒక్కసారే పోయింది మహీ. వీళ్లెన్నిసార్లు చచ్చిపోయారో. సూటిపోటి మాటలు తట్టుకోలేక? ఎప్పుడైనా ఆలోచించావా?'

ఆలోచించాల్సిన పనేం లేదు.

ఆ సంఘటన తర్వాత శుభాశుభ కార్యక్రమాలకు సరే, మామూలు మార్నింగ్ వాక్ కో, దేవాలయాలకో కూడా వెళ్లడం మానేశారు అతని అమ్మానాన్నా. ఎక్కడికెళ్లినా ఏవో చూపులు వెంటాడుతున్నట్టు, 'వీళ్ల మనవరాలే...' అంటూ జనాలు వెనకాల మాట్లాడుతున్నట్టు, 'పిల్ల చెయ్యొదిలేశారంటగా. అప్పుడే బస్సు కొట్టేసిందట...'

అంటూ జాలి మాటలు... ఆ నరకాన్ని వాళ్లు తట్టుకోలేకపోయారు. ఇంట్లో ఉన్నా టీవీ చూడరు. న్యూస్‌పేపర్లు చదవరు. ఎప్పుడైనా ఎవరైనా వచ్చినా పొడిపొడి మాటలే.

మహేంద్రకు అన్నీ కాకపోయినా కొన్ని తెలుసు. 'పడనీ' అనుకునేవాడు కసిగా. కాని అలాగనుకున్నప్పుడల్లా గొంతులో ఏదో చిన్న దారం కదిలినట్టు అనీజీగా ఉండేది.

'మహీ... కోపం, చేదు, అసహ్యం ఇలాంటివి మన శరీరం మీదా ఆలోచనల్లోనూ బరువుగా వేలాడుతుంటాయి పిశాచాల్లాగా. వాటిని వదిలెయ్యకపోతే మనకే నష్టం. క్షమించడమంటే ఆయన పట్ల నీలో గూడుకట్టుకున్న దుఃఖాన్ని, జడ్జిమెంటునూ పోనివ్వడం. ఆ చేదు, పగలను బయటకు పోనివ్వడం. నీకు ప్రశాంతతను తెచ్చుకోవడం. శారీరకంగా ఇటు నువ్వూ, అటు ఆయనా కుంగిపోవడం చూస్తునే ఉన్నాను. ఇదంతా వద్దు... నేను చెయ్యగలిగానంటే నువ్వు కూడా చెయ్యగలవు...'

'ఏమో.... చూద్దాం...' అన్నాడు పొడిగా మహేంద్ర.

అంటూనే అటు తిరిగి నిద్రపోయాడు. అతని మీద చెయ్యేసి గౌరి కూడా నిద్ర పోయింది.

ఓ రెండు గంటల తర్వాత పూర్తిగా తెల్లవారింది.

అందరి స్నానాలూ, తల్లిపూజ అన్నీ ఎప్పట్లానే. ఎవ్వరితో ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు.

ఇద్దరికీ ఆఫీసు టైమ్ అయ్యింది. గౌరీ రెండడుగులు ముందే ఉంది.

వెనుకగా కదులుతూ, డైనింగ్ టేబుల్ పక్కగా ఉన్న కారు తాళాలు తీసుకుంటూ 'ఆఫీసుకు వెళ్లొస్తా' అన్నాడు మహేంద్ర చిన్నగా, ఎవ్వర్నీ ఉద్దేశించకుండా.

పెద్దవాళ్లిద్దరికీ ఆ మాటలు వినిపించాయి.

మానవజాతి యుగాలుగా అనేక గాయాలను దాటి ముందుకు నడిచినట్టే ఆ ఇంటి మనుషులు కూడా బహుశా ఇక దాటి ముందుకు నడుస్తారు.

# గుడ్‌మార్నింగ్ అదితి



## అపర్ణ తోట

బుద్ధిజీవుల గమనింపులోకి వచ్చిన ఇటీవలి కలం. పుట్టింది విజయవాడ అయినా జీవితం హైదరాబాద్‌తో మమేకం అయ్యింది. జన్మ సంవత్సరం 1980. సోషల్ వర్క్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. టీచింగ్‌లో, ఎన్జీఓ రంగంలో పని చేశారు. 2013 నుంచి దాదాపు 15 కథలు రాశారు. 'ఒక అతడు ఒక ఆమె', 'పునీత' తదితర కథలు గుర్తింపు తెచ్చాయి. సాహితీ వ్యాసాలు, ఇంటర్వ్యూలు కూడా వీరి ఖాతాలో ఉన్నాయి. దేహరాజకీయాలపై చర్చ పెట్టడానికి కథ ద్వారా ప్రయత్నిస్తుంటారు.

నివాసం: హైదరాబాద్.

ఈ–మెయిల్ : thota.aparna@gmail.com

"చెప్పు... నీ అసలు పేరేంటి ?" గెడ్డం కింద లాఠీతో గుచ్చుతూ అడిగాడతను.

పిల్లిగెడ్డం వాడేం మాట్లాడలేదు. థియేటర్ అంతా చీకటి. స్క్రీన్ పైన క్లోజప్‌లో ఉన్న వాడి బట్టతల కాస్త మెరుస్తోంది.

"ఆ రోజు ఆ గదికి ఎందుకు వెళ్ళావు?"

అభావంగా చూసాడు పిల్లిగెడ్డం.

"చెప్పు" ఆతని గొంతులో మెత్తదనం బద్ధకంగా పడుకున్న పాముని గుర్తుకు తెస్తోంది.

లాఠీతో గడ్డం కింద సున్నితంగా తోస్తూ మళ్ళీ అడిగాడు..

"నువ్వే చంపేసావా?" థియేటర్ నాలుగు వైపులా స్పీకర్లు అదితి గుండెలో ఘోషించాయి.

అంతా నిశ్శబ్దం.

"చెప్పు..." లాఠీమనిషి పిల్లిగెడ్డాన్ని పట్టుకు తోసాడు. వాడు కుర్చీతో పాటు కిందపడ్డాడు.

ఛెళ్...

• • •

"నువ్వే చంపేసావా?"

"నువ్వే చచ్చిపోయావా?"

"అదితి ఏయ్, చంపేసావా... చచ్చిపోయావా..." అదితికి థియేటర్ ఏసీలోనూ చెమటలు పట్టాయి.

ఛెళ్...

ఈ శబ్దం వినే ఆ రోజు శకుంతల అంత కంగారుగా నిద్ర లేచింది.

“మేడం...” అదితి సర్దుకుని వెళ్ళడానికి స్థలం ఇచ్చింది. మోహన్ ఆమెని దాటుకుని వెళ్లి పక్క సీట్‌లో కూర్చున్నాడు. అదితి సినిమా మీద దృష్టి పెట్టడానికి ప్రయత్నించింది.

ఎందుకెళ్ళావు? లాఠీతో గెడ్డం మీద ఫట్టున కొట్టాడు. నోట్లోంచి చిక్కటి ఎరుపు ఉబుకి స్క్రీన్ మీదకి పాకుతోంది.

అదితి చప్పున కళ్ళుమూసుకుంది. ఎందుకెళ్ళావు ?

• • •

ఆఫీస్ క్లోజింగ్ అవర్స్ టైం దాటి చాలాసేపే అయింది. టైమ్ రాత్రి తొమ్మిది అయింది. లాప్టాప్ మూసి బ్యాగ్‌లో సర్దుకుని లిఫ్ట్ దగ్గరికి వచ్చింది.

లిఫ్ట్ మూసుకుంటున్నప్పుడు హడావిడిగా అతనూ వచ్చాడు.

“ఏంటి మేడం, ఈ రోజు మీకు లేట్ అయిందా...” చెమట వాసన వస్తోంది. వీపు వెనుక మాసిపోయిన బ్యాక్ ప్యాక్.

నవ్వి ఊరుకుంది.

లిఫ్ట్ ఓపెన్ అయి లాబీలోకి నడిచారిద్దరూ. బయటకు రాగానే ఎక్కించుకోవడానికి తన కార్ దగ్గరికి వస్తోంది. ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి. వెళ్ళాలా... వెళ్ళాలి. వెళ్లాలని లేదు. ఎక్కడికి వెళ్ళాలి?

కాస్త ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చాడు అతను. “మేడం, మీకు ఓకే అయితే మెట్రో దాకా నన్ను మీ కార్‌లో డ్రాప్ చేస్తారా?”

ఆమె కార్ డోర్ వైపే చూస్తోంది. ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి, వెళ్ళాలి, వెళ్ళాలి... వెళ్ళా, అరే, వెళ్ళిపోతున్నాడేంటి? పేరేంటి? ఛ.. గుర్తు రావట్లేదు.

బ్యాగ్ గట్టిగా పట్టుకుని చిన్నగా పరిగెత్తింది. వెళ్లి భుజం తాకగానే వెనక్కి తిరిగాడు.

“పేరు మర్చిపోయాను...” ఆయాసంతో రొప్పుతూ అంది.

“మోహన్”

“మోహన్, ఓహ్ రైట్. సారీ. పదిహేను రోజులకి ఒకసారి వస్తా కదా, మర్చిపోతుంటా...”

మోహన్ తిరిగి నవ్వలేదు.

“మోహన్. నాకు ఇంటికి వెళ్లాలని లేదు. నీతో మీ ఇంటికి రావచ్చా.”

మోహన్ ఏం విన్నాడో తెలీనట్లు నిలబడ్డాడు.

"నీకు పెళ్లైందా?" చప్పున ఏదో గుర్తొచ్చినట్లు అడిగింది.

అతనింకా మాట్లాడట్లేదు. అదితికి ఓపిక లేదు. "అయిందా" కాస్త గద్దించింది.

"అవలేదు."

బ్యాగ్ మీద ఆమె చేయి కాస్త వదులైంది.

"రూమ్‌లో ఉంటున్నావా..." అవునన్నట్టు తలాడించాడు.

"అయితే వస్తాను పద" ఆ దారినే పోతున్న ఆటోని పిలిచిందామె.

• • •

ఫ్లోర్ మీద పొర్లుతున్న మాసిన బట్టల వైపు చూస్తోంది అదితి. మురిగ్గా ఉన్న ఈ పెంట్ హౌస్ వరండా ఏదో విశ్రాంతినిస్తోంది ఆమెకు.

"అయినా సినిమాకి పోతానన్నావు కదరా... ఇప్పుడు దేన్నోయేసుకొచ్చావు..." మోహన్ రూమ్మేట్ గొంతు తగ్గించినా బయట ఉన్న అదితికి వినిపించేట్లు కసురుతున్నాడు. ఏదో పడేసిన శబ్దం.

"ఏయ్ ఆగు." లోపల నుంచి ఆడగొంతు.

అదితి గబుక్కున వరండా దాటి బయటికి వచ్చింది. మరో నిముషంలో మోహన్ బయటపడ్డాడు. "రండి", మెట్లదారి పట్టాడు.

• • •

ఏం సినిమా? ఏమో!

సినిమాలో పిల్లిగడ్డం వాడిని ఎడాపెడా కొడుతున్నారు. వాడు కిక్కురుమనడం లేదు. తన్ని తన్ని వెళ్లిపోయారు అందరు.

స్క్రీన్ మీద మాంసం కుప్పలా పడి ఉన్నాడు అతను. గది వెనుక నుంచి పడే మూడు కంతల్లాంటి వెంటిలేటర్ లోంచి అతని మొహం నల్లబడి, కన్ను వాచీ, పెదవి చిట్లి, ముక్కు నుంచి రక్తం కారుతూ అసహ్యంగా కనిపిస్తోంది. నొప్పిని భరించలేకపోతున్నట్లు అతని పెదవులు కంపిస్తున్నాయి. 'నీళ్లు, నీళ్లు' అరిచాడతను. బదులు లేదు. దూరంగా ఎవరో నవ్వుతున్నట్టు లీలగా వినిపిస్తుంది. ఎక్కడిదో ఒక దోమ 'గీ' మంటూ అతని మొహం చుట్టూ తిరుగుతోంది.

సన్నగా తేలుతూ ఆలాపన. సమ్మెటతో వేడి ఇనుమును గంటల కొద్దీ దెబ్బలు కొట్టి, సానబెట్టి, తీగెలాగా మార్చినట్లు... ఆ స్వరం నెమ్మదిగా తేనెధారంత మధురంగా... దృశ్యం జైలు గోడలు దాటి మైదానంలోకి వెళ్ళింది. అక్కడ చుక్కలాంటి అమ్మాయి. పాలతో కడిగినట్లు, దేవతలా తెల్లటి వస్త్రాలతో... ఆమె చేతిలో ఒక

రంగురంగుల పూలకొమ్మ. ఆమె వేరే లోకం నుండి వచ్చినట్లు ఉంది.

తనకు ఆమెలో శకుంతల కనపడుతుందెందుకూ? తనలాగే ఉందేమో కూడా! నవ్వినప్పుడు శకుంతల, నడిచినప్పుడు తానూ...

ఆగినప్పుడు రాజమ్మా?

• • •

తల పైకెత్తి పకపకా నవ్వే శకుంతల, దెబ్బ తగిలితే ఉమ్ము రాసుకుని తగ్గిపోతుందిలే అనుకునే శకుంతల, అక్కా తలనొప్పిగా ఉందా... అంటూ తలకు నూనె రాసే శకుంతల... తన పుట్టింటి ఊరిలోని పక్కింటి పిల్ల. చిన్నప్పటి నుంచి తన వెనుకే గంతులేస్తూ తిరిగిన లేగదూడ.

వెళ్ళిపోయింది. నిన్న బస్సులో వెళ్లిపోయేప్పుడు శకుంతల చూసిన చూపు గుర్తొచ్చింది. అందులో అసహ్యం, కోపం ఏమి లేవు. అదేంటో!

"ఏమక్కా, మనం మన పాటి చేయలేమా. రాత్రి ముడిచిన పూలు, పొద్దున్న చెత్తలో పారేసినట్టు పారేస్తారక్కా మగోళ్ళు మనని..."

పిచ్చి శకుంతల. రాత్రికి కూడా అలా నెత్తి మీదకి ఎక్కించుకునే మగాళ్ళెక్కడ... అప్పుడు కూడా మన మీద వాళ్ళే ఆడతారు. శకుంతల. కిందటేడే దాని పెళ్లైంది. అదితి పెళ్ళికి వెళ్ళలేదు. వెళ్లలేక కాదు. వెళ్లలేకపోయింది అంతే.

అయినా కోపం తెచ్చుకునే మనిషి కాదు శకుంతల.

పెళ్ళికి ముందు ఫోన్ చేసినప్పుడు ఉత్సాహంగా అంది, "అతను జాబ్ చేస్తున్నాడక్క."

"ఏమి జాబే ?"

"ఏదో కంపెనీలో సూపర్‌వైజర్ అంటక్కా. పద్దెనిమిది వేలు జీతం. కట్నం బానే తీస్కున్నారులే... కమ్మలు, గాజులు పెడుతున్నారు. తాళిబొట్టు కూడా ఇస్తారు కదక్కా, విజయవాడలోనే ఉండేది."

కానీ పెళ్ళైన ఆర్నెల్లలోనే తిరిగొచ్చేసింది.

"ఆ అబ్బాయికి ఉద్యోగముందని అబద్ధం చెప్పారమ్మా. చాలా గొడవలైనాయి. నువ్వు నన్ను మోసం చేసావు అంటుందట. దీన్ని కొట్టాడు. ఇదింక ఉండనని వచ్చేసింది. వాళ్ళ నాన్న దీని పాటే పాడతాడు. ఇప్పుడు గృహహింస కేసు పెడతారంట. చదువు ఎగ్గొట్టే, పెళ్లి పెటాకులయ్యే. వాడికి ఉద్యోగమన్న రావాలి, లేదంటే కేసు పెట్టి డబ్బులన్న ఇప్పించుకుంటా అంటుందమ్మా." పండక్కి వెళ్ళినప్పుడు శకుంతల అమ్మ కన్నీళ్లు పెట్టుకుంది.

'నా కూతురి పుట్టినరోజు వరకు నా దగ్గరే ఉండవే', అదితి శకుంతలని వెంటబెట్టుకొచ్చేసింది.

శకుంతలకు కూడా కావలసిందదే. పెళ్ళికి ముందే తీసుకెళదామనుకున్నా ప్రతీసారీ శకుంతలకు పరీక్షలో లేక పెళ్ళిచూపులో ఉండేవి.

ఇంతకన్నా మంచి సందర్భం దొరకలేదేమో గొణుక్కున్నారందరు.

• • •

హీరోయిన్‌తో పాటయిపోయింది. అతను నెత్తి బాదుకుంటూ జాలిగొలిపేలా ఏడుస్తున్నాడు ఆమె కోసం. ఏమైంది  ఆమె? శకుంతల ఏమైంది? తాను ఏమైంది? ఫోన్ మోగుతుంది. ఎవరి నుంచో తెలిసినా చూసి నిర్ధారించుకుని డిస్కోనెక్ట్ చేసి, స్విచ్ ఆఫ్ చేసేసింది.

• • •

"అక్క, నువ్వు సూపర్ హీరోయిన్‌వి అక్క. ఎంత బావుంటావో. సంతూర్ మమ్మీవి."

అదితి వేసుకునే బట్టలంటే పిచ్చి శకుంతలకి.

"అక్క, నువ్వు ఈ స్కర్టులు, జీన్స్, గౌన్లు వేస్కుంటావే! నీ వయసు అసలు తెలీదక్క"

"నీకు కార్ నడపడం వచ్చు, నేర్పిస్తే విమానం కూడా నడిపేస్తావేమో!"

"ఊరుకోవే" అదితికి  పొగిడించుకోవడం బావున్నా కొన్నిసార్లు విసుగు వచ్చేది.

వచ్చిన దగ్గర  నుంచి శకుంతల తనను గమనించడమే. తను ఇల్లు సర్దుకున్నా, ఎవరితో మాట్లాడుతున్నా, వచ్చిన గెస్ట్‌లను రిసీవ్ చేసుకున్నా, తనకు వచ్చిన కాల్స్ ఎటెండ్ అవుతున్నా...

"ఇంత బావుంటావు కాబట్టే అక్కా, బావగారు నిన్ను ఏరి కోరి చేసుకున్నారు. ఏరి...కోరి..."

కానీ ఇన్ని మాట్లాడే శకుంతలకి అదితి భర్త ముందు భయమే. మొదటిలో ఎదురుపడడానికి కూడా భయపడేది. కానీ శకుంతలకు ఎంతోకాలం మొహమాటం నడవదు. అన్ని కూరల్లోనూ కలిసిపోయే దోసకాయపిల్ల.

పొద్దున్నే నెమ్మదిగా కబుర్లు చెప్తూ అతను ఆలస్యం చేస్తే, "లేవండి లేవండి ఆఫీసుకెళ్లే టైం అయిపోయింది", అని తరిమేంత వరకూ వచ్చింది.

ఒకసారెప్పుడో శకుంతల ఆకతాయి సమాధానానికి అదితి భర్త నవ్వుతూ చెయ్యెత్తాడు కూడా.

శకుంతలతో ఇబ్బందంతా కూతురి పుట్టినరోజు సన్నాహాల్తో మొదలైంది. అప్పటి నుంచి గమనించిందో అప్పటికే గమనించిందో మరి.

• • •

సినిమా అయిపోయింది. మోహన్ కాస్త హుషారుగా నడుస్తున్నాడు. ఆ చల్లగాలి. చీకటి ఇద్దరి మధ్యా ఉన్న దూరాన్ని కాస్త తగ్గించిందేమో. అదితికి కూడా భలే బావుంది.

“ఎలా వెళదాం..” అడిగాడు.

“నీ ఇష్టం”

“నడుచుకెళ్తే ఒక నాలుగు కిలోమీటర్లుంటుంది. మామూలుగా ఐతే...”

“మామూలుగా ఐతే...?”

“నడుచుకెళ్లడం నా కిష్టం.”

“......”

“ఎటూ మనం బయటే ఉండాలి. వాడు తలుపు తెరవడు.”

“ఎప్పుడూనా...?”

“ఎప్పుడూ కాదు. ప్రతి శుక్రవారం. అతని గాళ్‌ఫ్రెండ్ వచ్చిందిగా.”

“మరి నీకు?”

“ప్రతి శనివారం.”

అదితి నవ్వింది. “బావుంది.”

నడుస్తున్నారిద్దరూ... ఎక్కడో కుక్క మొరిగింది.

మెయిన్ రోడ్. కంగారులేదు. అప్పుడప్పుడూ పెట్రోలింగ్ వ్యానులు వెళ్తున్నాయి. టైం పన్నెండున్నర దాటిందేమో. మొబైల్ స్విచ్ ఆఫ్ చేసిన విషయం గుర్తొచ్చింది. తనని వెతుకుంటారా?

శకుంతలకి కాల్ చేస్తూ ఉంటారేమో..

రాజమ్మలానే తాను కూడా... అనుకుంటారా.

“భలే ఉందీ రాత్రి.” హఠాత్తుగా అంది. ఇంకా ఫిబ్రవరి దాటని చలి. నలభై దాటిన తన పక్కనే పాతికేళ్ళు దాటని ఈ పిల్లవాడు.

ఆఫీసులో స్టేషనరీ అయిపోతే తప్ప ఇతని జోలికి పోదు తాను. అకౌంట్స్ సెటిల్చేసేప్పుడు కాస్త రోడ్డకోట్టుడు మాటలు అంతే.

చల్లగాలి హాయిగా తాకిందామెను. తలెత్తి నిండుగా శ్వాస తీసుకుంది.

ఎంత సుఖంగా ఉందీ గాలి?

ప్రయాణమెప్పుడూ బావుంటుంది. మనకెప్పుడు గమ్యాన్ని గురించి హైరానాలే.

ఆమె ప్రయాణాన్ని ఎగవేసి ఇంటి నుంచే పని చేస్తుంది. ప్రయాణపు సమయం పిల్లలకు, భర్తకు రుచికరమైన వంట చేయడంలో వాడుతుంది.

కానీ ఈ రోజు, ఆమె యథేచ్ఛగా తెలియనివాడితో సినిమా చూసి అతని గదికి వెళ్లి అక్కడే పడుకుంటుంది. ఇదంతా తన కోసమే చేస్తోంది.

తన కోసం మాత్రమే!

ఈ రోజు ప్రయాణం తనకీ, శకుంతలకీ మరువరానిది.

• • •

"కాస్త తిండి తగ్గించి పొట్ట తగ్గించరాదా" అన్నమాటతో గిరుక్కున వెనక్కు తిరిగింది అదితి.

"అదేం మాట బావ, అక్క అంత చక్కగా ఉంటే... నాలాగా అవ్వాలా ఏంటి. మీరంతా అంతేలే. కండలేదు అంటారు. ఉంటే పుష్టిగుంది అంటారు." అదితికి భయం వేసి శకుంతలను చిన్నగా తాకింది ఆపమన్నట్టు.

"దాని నోరు కాస్త తగ్గించుకోమను." షూ అందిస్తున్నప్పుడు భర్త పదునుగా చెప్పాడు.

ఆ సాయంత్రం ఆతనితో షాపింగ్‌కి వెళ్లి అతనికి నచ్చిన బట్టలే కొనుక్కుంది. అప్పుడు కాస్త కోపం తగ్గుతుంది. అతనే చెప్తాడు ఏం వేసుకోవాలో ఎలా వేసుకోవాలో. తనకు ఇబ్బంది లేదు. అందరూ వాళ్ళిద్దరిని మోడల్ కపుల్ అని పిలుస్తారు.

బర్త్ డే పార్టీలో బార్ కౌంటర్.

"ఏమక్క ఊరిలో పండగలపుడు తిడతావే. మరిక్కడ తాగితే పర్లేదా.."

"నోరుముయ్యవే..." అదితి చెరో గ్లాస్ చేత్తో పట్టుకుని భర్త వైపు నడిచింది.

"మై వైఫ్? షి ఈజ్ నాట్ డైనమిక్ లైక్ యు", భర్త తన ఆడకలీగ్‌తో అంటున్నాడు అందరి మధ్యలో. అదితి అందించిన పెగ్ అందుకుంటూ... "షి చోస్ టు వర్క్ ఫ్రాం హెూమ్..." అవతల మనిషి ఇబ్బంది నటిస్తూ అదితివైపు చూసి పెద్దపెద్ద చెవి రింగులు ఊగేలా నవ్వింది.

అదితి లక్ష్యం లేనట్టు గ్లాస్లోంచి గుటక వేసింది. భర్త అదితిని దగ్గరికి లాక్కుంటూ ముద్దు పెట్టుకున్నాడు. "ఆంట్యు హనీ? ఎవ్రివన్ నోస్ దట్ యామ్

హెన్పెక్డ్…" ఆడవాళ్ళిద్దరూ అవసరం లేకపోయినా నవ్వారు. దూరం నుంచి శకుంతల వీళ్లనే చూస్తోంది.

ఇలాంటప్పుడు గ్లాస్‌లో ద్రవం మరుగుతుంది. అదితికి తెలుసు మళ్ళీ దీన్ని ఎలా చల్లబరచాలో. వేరే గుంపుని పలకరిస్తూ వెళ్ళింది. కాసేపటికి ఆమె భర్త ఆమె వెనకే వస్తాడు.

రెండు నిముషాలు మామూలు పలకరింపులకి– "అదితిజీ, ఈ ప్రదేశం మొత్తం మీ నవ్వులతోనే వెలిగిపోతుంది అని నేనూ, లేదు మీకంటి వెలుగుకే అని వీడూ బెట్ వేసుకున్నాము." అని ఒక బెంగాలీబాబు అంటాడు.

నవ్వుతూ అదితి భర్త వచ్చి జాయిన్ అవుతాడు. "మరి మా అదృష్టం ఏమని చెప్పమంటారు. రెండు వెలుగులూ నావే. ఐ హావ్ ఎ మోడరన్ వైఫ్ విత్ ట్రెడిషనల్ వాల్యూస్."

"స్వీట్ హార్ట్, సమ్ వన్ ఇస్ కాలింగ్ యు దేర్, గో సీ" భర్త అదితి భుజం చుట్టూ చేయి వేసి చిన్నగా తోసాడు. నియమించిన సమయం కన్నా ఎక్కువ మాట్లాడితే ఆపమనే కోడ్ అది.

వారిద్దరికే కాదు అందరికి అర్థమయ్యే కోడ్ అది.

• • •

శకుంతల అప్పుడప్పుడు మొగుడి గురించి చెప్పేది. చిన్నచిన్న సరదాలు జరిగాయి ఇద్దరికీ. వారంలో రెండుసార్లు సినిమాలు చూసేవారట. సాయంత్రాలు ఇంటికి రాగానే కళ్ళతో వెతికేవాడట. తాను ఎక్కడో దాక్కుని ఎదురుపడకుండా చాలాసేపు ఏడిపించేది.

"కానీ నెమ్మదిగా అర్థమయిందక్కా, ఇవన్నీ మించి మనిషనే కాస్త సొంత గౌరవం ఉండాలి కదా."

"మరి నువ్వు కూడా చదువుకోకుండా కట్నం ఇచ్చి పెళ్లిచేసుకున్నావు కదే."

"చెప్పే చేస్కున్నాగా… ఆసోసి, చదువుకుని ఉద్యోగం తెచ్చుకున్నాక ఇంకా నాకు మొగుడెందుకు?"

పక్కున నవ్వింది అదితి.

"రాజమ్మ లాగనా అక్క పెళ్లి అంటే అంత తీర్చిపోవడానికి? మొగుడు లేకపోతె ఏందీ… వీధిలోనే ఇంకోడితో కాపురం పెట్టేస్తుందా?"

"సిగ్గు వదిలేస్తే ఏముంది? అయినా ఆమెకి ఏం మర్యాద ఉంది. మన వీధిలో అందరూ అనేవారే."

"ఆ అంటారులేక్కా.. ఇప్పుడు చిట్టీలేసి కాస్త సంపాయించాక అనేవారు తగ్గిపోయారు."

"అందరనీ వెనక్కి తిప్పుకునే నేర్పులేవే.."

• • •

"ఎందుకు మీరు ఏమి మాట్లాడట్లేదు."

అతని ప్రశ్న అర్థం చేసుకోవడానికి పెద్ద ప్రయత్నించనక్కర్లేదు. రూమ్‌కి దగ్గరవుతున్నట్లున్నారు. మెయిన్ రోడ్ నుంచి చిన్నచిన్న సందుల బాట పట్టారిద్దరూ.

"ఎందుకొచ్చానో చెప్పను. నీకు అవసరం ఉందా?"

"లేదు." గేటు తీస్తూ అన్నాడు. "మీరు ఇప్పుడు నాకు చెప్పినా రేపు మీకు సాయం చేసేంత ఓపిక నాకు లేదు."

"గుడ్."

మెట్లెక్కి మేడ మీది వరండాలోకి వచ్చారిద్దరూ... "ఆకలేస్తోందా..." అడిగింది.

"లేదు."

"నాకు వేస్తోంది." హ్యాండ్ బాగ్ వెతికింది. ఎప్పుడు బిస్కెట్ ప్యాకెట్ ఉంటుంది. పిల్లల్ని పెంచడం వలన వచ్చిన అలవాటు.

ఆమె పాకెట్ చించి పరపరా నమలడం మొదలుపెట్టింది.

• • •

"నిజం అక్క నా మొగుడేమన్నా ఆఫీసరా... కులుక్కుంటూ వాడి వెంబడే తిరగడానికి."

అదితికి నచ్చలేదు ఆ మాట.

"ఎందుకు?"

"ఎందుకు ఏంటక్కా, చూడు బావ నీకోసం ఎన్ని కొంటాడో. మొన్న పాప బర్త్‌డేకి వేస్కున్నావు కదా డైమాండ్ సెట్."

"వెడ్డింగ్ గిఫ్ట్‌గా ఇచ్చారే." ప్రతి నగ వెనుక ఒక సందర్భం ఉంటుంది. యనివెర్సరీ అని బర్తడే అని చెప్పుకుంటారు కానీ అవన్నీ రహస్య ఒప్పందాలు.

"ఎంత ముద్దుగా పిలుస్తాడక్క బావ."

మరి! బూతులెవరికీ వినపడకుండా జాగ్రత్తపడింది.

• • •

వరండాలో బొంత తెచ్చి మేడ గచ్చు మీద వేసాడు. “మీరు పడుకోండి.”

“మరి నువ్వు”

అతనేం మాట్లాడలేదు. ఆమె బొంత మీద దుప్పటి తీసి కిందపరచింది. కప్పుకోడానికి తన దుప్పట్టా ఇచ్చింది.

“పర్లేదు పడుకో”

అతను ‘ఈ కొరివిని ఎక్కడ తగిలించుకున్నానా’ అని ఆలోచిస్తున్నాడు.

“చూడు మోహన్ రేపొద్దున్నకి నేను వెళ్లిపోతాను. నీ ఇష్టం ఇంకా”.

ఆమె పడుకుంది కాని నిద్ర పోలేదని తెలుసు అతనికి. పడుకోలేక కాదు. ఇందాక కాస్త ఆవులించింది కూడా. కానీ అతని నిద్రను చెడగొట్టినందుకు కాస్త సిగ్గుగా ఉంది.

ఇలా ఇంకో చోటికివచ్చి... వేరే మగవాడితో... ఆడదానివేనా?

ఆమె భర్తకి ఆడతనం అంటే ఏంటి?

కోరిక కలగుతుంది. అది అతని కోరికా లేక తన కోరికా అన్నదే ముఖ్యం. అతని కోరిక తీరుతుంది, ఆమె కోరిక తీరొచ్చు. రెండు పరిస్థితులనూ ఆరోపణ లేకుండా అంగీకరించడమే ఆడతనం. మోహన్ నెమ్మదిగా తన పక్క మీదకి చేరాడు. ఆమె చున్నీ కప్పుకుంటే డబ్బున్నప్రౌఢ పరిమళం అతనిలో నిండింది.

ఫోన్ చూసుకున్నాడు. అతని గాళ్‌ఫ్రెండ్ నుంచి మెసేజులు. ప్రతి శుక్రవారం ఈ హింస తప్పదతనికి. తనేమో పిచ్చెక్కించే మెసేజిలు పెడుతూనే ఉంటుంది. వాళ్ళిద్దరికి మాత్రమే అర్ధమయ్యే వివరాలుంటాయందులో.

“వెన్నెల ఎంత బావుంది కదా మోహన్.” మోహన్ మొదటిసారి నవ్వాడు. వచ్చిన మెసేజిలతో పాటు ఆమె చున్నీ పరిమళం ఒక మాయను కమ్ముతోంది.

ఆమె లేచింది. అతను నిద్రపోతున్నట్టు చప్పున కళ్ళు మూసుకున్నాడు. కొన్ని సెకన్ల తరువాత తెరిచాడు.

పిట్టగోడ మీద మోచేతులు ఆనించి చుట్టూ చూస్తోందామె. నిశ్శబ్దం వలన ఆ రాత్రి ఇంకా చిక్కబడ్డది. ఒక అరగంట తర్వాత ఆమె వచ్చి తన పక్క మీద నడుము వాల్చింది. పక్కనే మోహన్ నిద్రపోతున్నాడు.

చదునుగా ఉన్న గచ్చు నడుముకు ఏదో సుఖాన్ని సమకూర్చింది.

పక్కటెముకలకు ఏదో గుచ్చుకుంది. అండర్ వైర్ మెష్ పుషప్ బ్రా. ఎప్పుడు షేప్‌లో కనిపిస్తే నచ్చుతుంది ఆమె భర్తకి.

మరి తనకి?

అతని పరపతి, అతని ఆస్తి. అతను సమకూర్చిన హోదా.

తన ప్రవర్తన, అతని అహానికి వైర్మెష్ బ్రా.

లేకపోతే...

ఒకటి రెండుసార్లు కొట్టాడు కానీ అతను ఒప్పుకోడు. అతని ప్రకారం తానే రెచ్చగొట్టింది, లేక క్షమించమని అతనే కాళ్ళ మీద పడ్డాడు.

ఆమె లేచి చిన్నటెక్నిక్‌తో డ్రెస్ ఉంచుకుని బ్రా మాత్రమే తీసి పక్కనే పడేసింది. కాస్త గాలి ఆడినట్టు అనిపించిందామెకు. జుట్టుకున్న క్లిప్ కూడా తీసేసి దాని పక్కనే పెట్టింది.

ఎంత హాయిగా ఉందీ రాత్రి. భయం లేకపోవడమేనా హాయిగా ఉండడమంటే? మరే భయానికి తానింతకాలం ఆగింది?

పొద్దున్న ఐదున్నరయింది. ఆమె లేచింది. హ్యాండ్ బ్యాగ్లోంచి ఫోన్ తీసింది. శకుంతల చేరిందేమో. ఫోన్ ఆన్ చేసి శకుంతలకు కాల్ చేసింది.

"చేరావా?" చేరక ఏమి చేస్తుంది? సొంత భర్తలోని అడ్డగోలుతనాన్నే భరించలేకపోయింది. ఇక తనవంటి అక్కని భరించగలదా.

"వచ్చేసా అక్కా." శకుంతల ఆగింది. "అక్కా.. మనమింక రాజమ్మని తిట్టుకోవద్దక్కా, సరేనా?"

అదితి మొహం మీద ఒక నవ్వు కదిలింది. తన చెల్లి కదూ ఇది." సరే"

"గెట్ అవుట్ అఫ్ మై హౌస్." తన గర్వమూ, తన ఉనికి అయిన తన మగవాడు అన్నాడు. "ఎక్కడికిపోతావే...."

ఎక్కడికైనా పోగలను. అతని అహాన్ని కొట్టలేదు. చంపేసింది. సినిమాలో పిల్లిగెడ్డం వాడు ఎవడినో చంపి జైలుకి వెళ్ళాడు. తాను మొగుడి ఆహాన్ని చంపాక జైలు నుండి విడుదలై వచ్చింది.

• • •

మోహన్ ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్నాడు. అతని తల కింద రాత్రి విడిచిన వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నాయి. నెమ్మదిగా తీసుకోవడానికి ప్రయత్నించింది కానీ మోహన్ కళ్ళు తెరిచేశాడు.

"గుడ్ మార్నింగ్" అదితి అతను కప్పుకున్న చున్నీ లాక్కుంటూ నవ్వింది. "టీ తాగుదాం వస్తావా? అక్కడినుంచి క్యాబ్‌లో ఇంటికెళ్ళిపోతాను.

మోహన్ చప్పున నిలబడ్డాడు. "పదండి."

# డబుల్నాట్




## అరిపిరాల సత్యప్రసాద్

విరివిగా రాస్తున్న కథారచయిత. దాదాపు వంద కథలు, రెండు నవలలు రాశారు. రూరల్ మేనేజ్‌మెంట్‌లో ఎం.బి.యే చేసి ప్రస్తుతం ఒక ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నారు. రూపాంతరం చెందుతున్న మానవ సంబంధాలను పరిశీలిస్తూ వాటిని తార్కికంగా విశ్లేషించే కథలు రాసేందుకు ఇష్టపడతారు. 'ఊహాచిత్రం' అనే కథల సంపుటి, మరో ముగ్గురు రచయితలతో కలిసి 'నాలుగు నాలుగుల పదహారు', 'మొపాస కథలు' ఫ్రెంచ్ కథల అనువాదాలు వీరు వెలువరించిన పుస్తకాలు. ఆర్థిక పాఠాలని సరళమైన కథలుగా చెప్పిన 'రూపాయి చెప్పిన బేతాళ కథలు' పుస్తకం ఈ మధ్యే విడుదలై పాఠకాదరణ పొందింది. 1978లో గుంటూరులో పుట్టారు.

నివాసం : హైదరాబాద్.

మొబైల్ : 99669 07771

ఆ రాత్రి, ఉచ్ఛ్వాస నిశ్వాసల సంగీతంతో శరీరాలను దగ్ధం చేయాల్సిన రాత్రి.

మహాద్భుత ప్రాచీనాహ్లాదమేదో ఝరిగా, నదిగా, ప్రవాహంగా మారి, ఉత్తుంగ తరంగమై పైకెగసి, దుమికి, ఉద్ధృతలో నేలను తాకాల్సిన రాత్రి.

ఆమెలో కరిగిపోవాలన్న కోరిక కలిగి, నిప్పుగా రగిలి, అగ్నిగా మారి దహించమని ఆహ్వానించే వేళ. అనాఛ్ఛాదితగా అహ్వానాన్ని శరీరభాషలో ప్రకటించే క్షణం.

అతను ప్రవహించడు. అతను రగలడు. అతను ఆమెతోపాటు దగ్ధమవడు.

విఫలయత్నాల అసహనం నిట్టూర్పుగా మారి రెండు శవదహనాలు చేసినంత విషాదంతో ముగుస్తుంది. వ్యర్థమైన వెన్నెలని తోసేస్తూ చీకటి రూపాన్ని అందుకుంటుంది ఆ రాత్రి.

1.1

అంతకు ముందు ఎప్పుడో ఒకసారి –

ఓ అర్ధరాత్రి ఇద్దరూ నిద్రలో వున్నప్పుడు శరీరాలు మాట్లాడుకున్నాయి. అనుకోకుండా ఒక యుద్ధం మొదలైంది. మధురంగా అనుభవాన్ని ఆస్వాదించేందుకు మూసుకున్న కళ్ళకు విజయపతాక రెపరెపలు తెలుస్తున్నాయి.

అంతలోనే ఏదో తెలియని అపశృతి. చెయ్యి చాస్తే అందేంత దూరంలో వున్న మరో లోకపు ఆనందం జర్రున జారి అగాధంలో పడిపోయినట్లు అనిపించింది. ఆమె కళ్ళు తెరిచింది.

అతను వున్నాడా? లేనట్టు వున్నాడు.

లేడా? వున్నట్టు లేడు.

గది మూల ఒంటరిగా వున్నాడు. ముఖం మీద ముడిపడ్డ భృకుటి. ఎటో చూస్తున్నాడు. ఆమెకి మెడ దగ్గర ఏదో కనిపిస్తూ వుంది. ఎర్రటి పాములా. ఏమిటది?

నల్ల మచ్చల ఎర్ర టై. నిజంగా కనిపిస్తూ వుందా? లేదా భ్రాంతా?

• • •

“నాకు అర్థం కావడానికి కొంతకాలం పట్టింది. ఒకటి రెండుసార్లు అదంతా మామూలే అనుకున్నాను. ఐ మీన్, ఏవో కారణాలు వుంటాయి కదా అనుకున్నాను. కానీ తరచుగా వద్దు అనేవాడు. ఇప్పుడు కాదులే అనేవాడు. అర్థం అయ్యేది కాదు. ఒక్కోసారి మొదలుపెట్టి ఫెయిల్ అయ్యేవాడు. అప్పుడు కష్టం అనిపించడం మొదలైంది.”

ఇబ్బంది పడుతోంది. కానీ చెప్పక తప్పదు.

“సాకేత్‌కి కూడా ఇబ్బందిగానే వుండేది. అంటే మీకు అర్థం అయ్యిందనుకుంటాను. అవమానం అని కాదు కానీ, చెయ్యలేకపోతున్నాను అన్న బాధ వుంటుంది కదా. కారణం ఏమిటో అనే అనుమానం వుంటుంది కదా. బహుశా అదే కోపంగా బయటికి వచ్చేదేమో. నాకు అర్థం అయ్యేది కాదు. నేను ఏం చెయ్యగలను? నా తప్పేమైనా వుందా అని చాలా ఆలోచించేదాన్ని. ఇప్పుడు ఆలోచిస్తుంటే అనిపిస్తోంది. బహుశా అవమానంగా కూడా ఫీల్ అవుతున్నాడేమో”

కొంతసేపు ఏమీ మాట్లాడలేదు.

“మొదట్నుంచి అలా లేదు. ఐ మీన్... మొదట్లో అంతా బాగానే వుండేది. అన్ని రాత్రులు కాకపోయినా... లేదు లేదు... దాదాపు అన్ని రాత్రులు... అంటే అతను ఎప్పుడూ ఏక్టివ్‌గానే వుండేవాడు. ఒకసారి ఆకలితో వున్న పులిలా, ఒకసారి కుంచె పట్టిన ఆర్టిస్ట్‌లా... తల్చుకుంటుంటే నవ్వు వస్తోంది. చెప్పడానికి సిగ్గేస్తోంది. కానీ ఇప్పటి పరిస్థితితో పోల్చుకుంటుంటే బాధ కూడా కలుగుతోంది.”

నిట్టూర్పు. తల ఎత్తలేదు.

“నా కోరిక తీరట్లేదు అని కాదు. అది కూడా వుంది. కాదనను. ఎలా చెప్పాలి మీకు? మా వయసెంతని? అతనికి ముప్ఫై ఒకటి. నాకు ఇరవై ఎనిమిది. ఇంకా పిల్లలు ప్లాన్ చెయ్యలేదు మేము. ఇప్పుడో అప్పుడో అనుకుంటున్న టైంలో ఇలా... ఎందుకలా అయిపోయాడు?”

1.2

అతను అలాగే కూర్చున్నాడు. చాలాసేపు. మాట్లాడటానికి మొహమాటమో, భయమో, అవమానమో.

"నేను బాగానే వున్నాను. ఎందుకు ఇదంతా? అనవసరం ఇదంతా. నేను చెప్తున్నాను కదా. ఐ యామ్ ఫైన్."

డినైయల్. టైం తీసుకుంటున్నాడు.

"ఏంటి అది వుంటేనే అన్నీ వున్నట్లా? మా ఇద్దరి మధ్య అది తప్ప ఇంకేం లేదా? దిస్ ఈజ్ రిడిక్యులస్ మ్యాన్. సంతోషంగా వున్నాం కదా? ఇంకేంటి?"

మళ్లీ ఆలోచనలో పడిపోయాడు.

"ఓకే. ఒప్పుకుంటున్నా. బట్ కనీసం నెలక్రితం దాకా... అంతా నార్మల్‌గానే... అప్పుడప్పుడు కుదిరేదికాదు. మీకు తెలుసు కదా. ఒక్కోసారి కావాలని అనిపించదు. కారణం ఏదైనా... కానీ ఒకసారి మొదలుపెడితే... యూ అండర్‌స్టాండ్ రైట్? ఫెయిల్యూర్ ఎప్పుడూ లేదు. ఈ మధ్యే... ఐ థింక్ ఏదో సైకలాజికల్ అనుకుంటా... ఫిజికల్లీ ఐ యాం ఫైన్... బిలీవ్ మీ... మెడికల్ ప్రాబ్లం కాదనుకుంటాను."

చేతికి వున్న ఉంగరాన్ని తిప్పాడు. చాలాసేపు.

"యమునతో ఏ ప్రాబ్లం లేదు. షీ ఈజ్ గుడ్ లుకింగ్... ఐ మీన్ షీ ఈజ్ ఏక్టివ్... తనతో ప్రాబ్లం లేదు. నాకు ఇంకేవరితోనూ... ఛ ఛ అలాంటిదేమీ లేదు"

ఉంగరం తిరుగుతూనే వుంది వేలి చుట్టూ.

"నిజం చెప్పేస్తున్నాను. నాకు కూడా ఇష్టమే. కావాలని అనిపిస్తుంది. కానీ నావల్ల కావటం లేదు. ఎంత ట్రై చేసినా..."

అతని కళ్లలో నుంచి నీళ్లు.

"గూగుల్ చేశాను నా ప్రాబ్లం. అప్పుడే తెలిసింది ఇలాంటి సమస్య ఒకటి వుందని."

2.1

"అతన్ని పూర్తిగా చూసి చాలా కాలం అయ్యింది. అతన్ని స్వచ్ఛంగా చూడాలని కళ్లు తెరుస్తానా? ఎప్పుడూ అలా వుండడతను. ఆ టై అతని మెడలో ఎప్పుడూ వుంటుంది. నిజం. నేను చెప్తుంటే మీరు నమ్మట్లేదు కదా? ఇది నిజంగా నిజం. అతను నా మీద వున్నప్పుడు కూడా ఆ టై నా ముఖం మీద స్పృహ అనే అక్షరాలను రాస్తుంటుంది.

"ఆ టై గురించి చెప్పాలి మీకు. పెళ్లి చూపులకి వచ్చినప్పుడే చూశాను. ఇదే కాదు కానీ ఇలాంటిదే. నల్ల చారలున్న పసుపుపచ్చ టై కట్టుకొచ్చాడు. మాది అరేంజ్డ్ మ్యారేజ్. ఫోటోలు చూసుకున్నాం కానీ అదే మొదటిసారి నేరుగా చూడటం. మా వాళ్లు అందరూ ఆ టై గురించే మాట్లాడుకున్నారు. నేను ఎంతో అదృష్టవంతురాలినని చెప్పారు. ఇప్పుడు తెలుస్తోంది నా అదృష్టమేమిటో. పెళ్ళప్పుడు

కూడా టై కట్టాడు. ఎదురుకోల అని చేస్తారు మా వైపు. ఎదురెదురుగా నిలబెట్టి పెళ్లికొడుకుని, పెళ్లికూతుర్ని... ఓహ్ మీకు తెలుసా ఎదురుకోల గురించి. అయితే ఏమైందో తెలుసా? ఇద్దరం దగ్గరకు వచ్చిన తరువాత ఒకరి మీద ఒకరు గంధం, సెంట్ చల్లుకోవాలి కదా. అతను చల్లాడు. నేను కూడా చల్లాను. వెంటనే టై మీద చేతులు వేసుకోని దులుపుకున్నాడు. "మరీరా నువ్వు" అన్నారు పక్కనే వున్న మా బావగారు. అదే సాకేత్ వాళ్ల అన్నయ్య"

ఏదో గుర్తొచ్చినట్లు నవ్వుకుంది. చిన్నగా.

"తరువాత తీసేశాడు లెండి. పెళ్లిపీటల మీద. పంచె కట్టుకోని, పైన పై పంచె కప్పుకోని. ఆ పైపంచె అంచుల మధ్యలో నుంచి కనిపించీ కనిపించని ఛాతి... చూడాలనిపిస్తుంది. సిగ్గేస్తుంది. చచ్చాను పీటల మీదే."

బుగ్గలు ఎర్రబడ్డాయి. మాటల్లో ఉత్సాహం పదాలను మింగేసింది.

"అలా అతని ఛాతి మళ్లీ చూడాలని వుంది నాకు. కానీ కనపడదు అలా. ఆ నల్లమచ్చల ఎర్ర టై... అసహ్యం వేస్తోంది దాన్ని తల్చుకుంటుంటే."

2.2

టైతో ఆడుకున్నాడు. ఎర్ర టై. నల్ల మచ్చలున్న ఎర్ర టై.

"ఇలా జరిగిన దగ్గర్నుంచి ఈ టై గురించి మాట్లాడుతోంది యమున. ఈ టైతో వచ్చిన ప్రాబ్లం ఏంటో నాకు అర్థం కావటంలేదు. దానికీ దీనికి ఏంటి సంబంధం? ఇది ఎప్పటి నుంచో వుంది. పెళ్ళైన కొత్తల్లో లేదా? పెళ్ళిచూపుల్లో కూడా వుంది. ఇన్‌ఫ్యాక్ట్ పెళ్లికి ముందు నుంచే నాకు టై వుంది. ఈ టై అంటే తనకి ఇష్టం లేదా కనుక్కోండి. పెళ్లైన కొత్తల్లో ఈ టైతోనే ఆడుకునేది. టైతో మాట్లాడేది. నా టై పట్టుకొనే కదా సినిమాహాళ్లు, మాల్స్‌లో షాపింగ్, జ్యువలరీ, కార్, ఇల్లు కొనుక్కుంది. ఈ టై లేకపోతే కొనుక్కునేదా? నా సమస్యకి టైకి సంబంధం ఏమిటి చెప్పండి?"

ఇంకా ఏవో ఆధారాలు జ్ఞాపకాలలో వెతుక్కున్నాడు.

"ఈ టై వల్ల నాకు వచ్చే హొూదాని కూడా యమున అనుభవించింది. హొూటల్లో, ఫ్లైట్లో వాళ్లంతా ఈ టైని చూసి గౌరవం ఇస్తుంటే ఎంజాయ్ చేసేది. కాదనమనండి చూస్తాను. మరి అలాంటప్పుడు ఈ టై సమస్య ఎలా అవుతుందో చెప్పమనండి"

3.1

"ఒక ఇన్సిడెంట్ చెప్తా వినండి. మార్నింగ్ టైమ్. నేను పూజ చేసుకుంటుంటాను. ప్రెజర్ కుక్కర్ తన మీద వున్న బరువుని పైకెగరేసి ప్రజర్ని

బయటికి వదులుతూ వుంటుంది. "సాకేత్, స్టౌ ఆఫ్ చేస్తావా?" అని అడుగుతాను. పలకడతను. కుక్కర్ నిరసనగా మళ్లీ అరుస్తుంది.

హాల్ మధ్యలో ల్యాప్‌టాప్ తెరిచి ఎనిమిది దిక్కులలో ఎనిమిది మందితో కూర్చొని వాళ్ళతో చర్చిస్తూ వుంటాడు. వాళ్ళంతా అంతే. వున్నట్లుండి వచ్చిపడతారు. అందరూ అలాగే వుంటారు. మెడలో టై తో. సాకేత్ కూడా అంతే. కింద షార్ట్స్ పైన టీ షర్ట్‌తో. మెడలో టై. కట్టుకున్న టై ఎవరికి ఉరిగా బిగుసుకుంటుందో అన్న భయం అందరి కళ్లలో. సాకేత్ కళ్లలో కూడా.

వాళ్ల మధ్యలో నుంచి నడుచుకుంటూ వెళ్లి సాకేత్ ఎదురుగా కాఫీ మగ్ పెట్టేసి వస్తాను. మార్నింగ్ మొదటి కాఫీ అంటే ఒక అనుభవం నాకు. చిరుచిరు చలిగాలి, వేడి వేడి కాఫీ పక్కపక్కనే ఇద్దరం. ఎన్ని రోజులైందో అలా నేను సాకేత్‌తో కూర్చొని కాఫీ తాగి. ఎప్పుడూ ఎవరో ఒక టైగాడు అడ్డమే."

కూర్చున్న కుర్చీ చివర్ల మీద వేళ్లతో తన బాధలేవో రాసిందామె.

"ఒక్క కాఫీ తాగేటప్పుడే కాదు. టిఫిన్ చేసేటప్పుడు వాళ్ల బాస్ వచ్చి పక్కనే కూర్చుంటాడు. సినిమాకి వెళ్తే ఎచ్.ఆర్. హెడ్ వచ్చి సాకేత్ ఒళ్లో కూర్చుంటాడు. వాణ్ణి సినిమా చూడనివ్వడు. మధ్య మధ్యలో నాకు కూడా అడ్డం వస్తాడు. నేను కోపంగా అరిస్తే ఆ వచ్చినాయన సాకేత్ టై పట్టుకొని బయటికి తీసుకెళ్తాడు. ఇవన్నీ ఫర్లేదు. ఈ మధ్య బెడ్ రూమ్‌లోకి కూడా వస్తున్నారు. అందరూ ఆ టై పట్టుకొనే వస్తారు. వాళ్లు ఆ టై ని వదలరు. సాకేత్ ఆ టైని వదలడు"

చాలాసేపు ఏడ్చింది.

3.2

"ఏం మాట్లాడుతున్నారు మీరు? ఈ టైకి నా సమస్యకి ఏంటి సార్ సంబంధం. వూరికే డబ్బులు దొబ్బడానికి పిచ్చి పిచ్చివన్నీ కనెక్ట్ చెయ్యకండి. మీకంటూ ఒక రెస్పెక్ట్ వుంది."

కోపంగా వున్నాడు. బహుశా ఇదే కోపాన్ని ఇంట్లో కూడా చూపిస్తుంటాడు. కనుక్కోవాలి.

"సారీ... ఐ థింక్ మీరు ఏదైనా మెడిసిన్ ఇస్తే మంచిదనుకుంటాను. సమ్ టాబ్లెట్. మళ్లీ అంతా మామూలు అయిపోతుంది. ఇదే లాస్ట్ సిట్టింగ్ అవ్వాలి. ఐ డోన్ట్ వాంట్ టు కమ్ ఫోర్త్ టైమ్."

తీక్షణంగా చూశాడు. అలాగే చూస్తూ చాలాసేపు వుండిపోయాడు.

"కమాన్ డాక్టర్. మీరు నమ్ముతున్నారా? ఈ టైకి నా డిస్ఫంక్షన్‌కీ సంబంధం వుందని? ఆర్ యు సీరియస్? అలా అయితే చెప్పండి. ఈ టై ఇప్పుడే తీసేస్తాను."

టై తీసేయడానికి చేతులు మెడ మీద వేసుకున్నాడు. తీయగలడా? లేకపోతే అందరిలాగే...

4.1

"మీరు చెప్పినట్లే టై తీయించాలని ట్రై చేశాను. నిన్న ఉదయం కింద కూర్చొని ముందుకు వంగి పేపర్ చదువుతున్నప్పుడు చూసాను. మాటిమాటికీ టై పేపర్‌కి అడ్డం పడుతోంది. చిరాగ్గా దాన్ని పక్కకి నెడుతూ చదువుతున్నాడు. "తీసేయచ్చు కదా" అన్నాను. అతను తలాడించి ఊరుకున్నాడు. టవల్ చుట్టుకొని బాత్రూమ్‌లో దూరేటప్పుడు చూశాను – మెడలో టై అలాగే వుంది. "ఆ టై తీసేసి వెళ్లచ్చు కదా" అన్నాను కానీ ఆ మాటలు కూడా గాల్లో కలిసిపోయాయి. స్నానం చేసి బయటికి వచ్చిన తరువాత కూడా అలాగే వుందా టై. అయినా అది తడవలేదు. టైతోనే రెడీ అయ్యాడు. టైతోనే టిఫిన్ చేశాడు. టై తోనే బై చెప్పి వెళ్లిపోతుంటే అప్పుడు మళ్లీ అడిగాను – "ఎప్పుడూ అలా టై మెళ్లో వేసుకోని వుంటే ఎలా? ఎప్పుడన్నా ఒకసారి తియ్యాలి కదా?" ఈ రోజు ట్రై చేస్తానని చెప్పి వెళ్లిపోయాడు. చెప్తున్నప్పుడు ఆమె చూపులు చాలాసేపు నేలని గుచ్చుతూ వుండిపోయాయి.

4.2

"చాలాసార్లు టై తీశాను. అసలు ఇతకు ముందు వున్న పచ్చ టై అయితే రెగ్యులర్‌గా తీసేవాడిని. ఎస్పెషల్లీ వీకెండ్స్‌లో టై వుండేది కాదు మెడలో. ఆ టై తీసేసి, ఈ నల్ల మచ్చల ఎర్ర టై కట్టుకోడానికి కారణం యమునే! మార్చమని చెప్పింది కూడా యమునే. ఇప్పుడదంతా మర్చిపోయి మాట్లాడుతోంది"

కోపం తగ్గింది కానీ అతని చేతులు మాత్రం టై తీసే ప్రయత్నం చెయ్యడం లేదు.

"కాలేజీలో... ఏదో సెమినార్ కోసమో, కోర్స్ అసైన్మెంట్ కోసమో మొదటిసారి వేసుకున్నా. మళ్ళీ తీసేశా. క్యాంపస్ ప్లేస్మెంట్స్ అప్పుడు మళ్లీ వేసుకున్నా. ఆ తరువాత రోజూ వేశాను. రోజూ తీశాను కూడా. కానీ క్రమంగా అది నా శరీరంలో ఒకభాగం అయిపోయింది. ఇప్పుడు తీయాలంటే ఏదో ఇబ్బందిగా వుంది."

"బలవంతంగా తీసేయాలని ఒకసారి ట్రై చేశా. యమున బలవంతం మీదే. కానీ తీయాలన్న ప్రయత్నం మొదటిసారే దెబ్బకొట్టింది. వదులు చేసే కొద్దీ మరింత బిగుసుకోవడం మొదలుపెట్టింది. ఊపిరాడని పరిస్థితి వచ్చింది. భయంవేసి వదిలేశాను."

"నిన్న మళ్లీ ట్రై చేశాం. బాగా రాత్రి. నేనేదో నిద్రలో పని చేసుకుంటున్నా. లేపింది. టై తగలబెడదామా అంది. సరే అంటే సరే అనుకున్నాము. ఒకవేళ మంట నన్ను అంటుకుంటే? మెడ చుట్టూ కాలిపోతే? అని భయం వేసింది. అయినా ధైర్యం చేశాము. యమున అగ్గిపెట్టె తెచ్చి అంటించింది"

5.1

"టై అంటుకోగానే నా మెడలో నగలు మాయమయ్యాయి. ఆ మంట పెరుగుతుంటే ఫర్నీచర్, డైనింగ్ టేబులు కదలి గుమ్మం వైపు నడవడం మొదలుపెట్టాయి."

ఆమె కళ్లలో ఆశ్చర్యం లేదు. నిర్లిప్తత.

"నేనే ఆర్పేశాను. అదృష్టం బాగుండి అది తగలబడలేదు. చిన్న మరక పడింది అంతే!"

"బహుశా మన ఆలోచన కరెక్ట్ కాదేమో. అనవసరంగా ఆ టైని బ్లేమ్ చేస్తున్నాం అనిపిస్తోంది. దానికి ఏం సంబంధం? వుంటే వుంటుంది మెడలో. ఏం? అది అతని శరీరంలో భాగం అయిపోయింది. ఇది అర్థం చేసుకున్నాను నేను. అందుకని దాన్ని అలాగే వదిలేద్దామని డిసైడ్ అయ్యాను."

5.2

"తీయలేను. తీద్దామని ప్రయత్నించిన ప్రతిసారీ అది ఇంకా బిగుసుకుంటోంది. తగలబెట్టడానికి యమున ఒప్పుకోవటం లేదు. డాక్టర్ ప్లీజ్... ప్లీజ్ హెల్ప్ మీ... నౌ ఐ అండర్‌స్టాండ్ ఇది మెళ్లో వున్నందువల్లే నేను ఫెయిల్ అవుతున్నాను. ఇది మెడలో వున్నంతకాలం నేను అలా ఫెయిల్ అవుతూనే వుంటాను. కానీ ఏం చెయ్యాలి? టై విప్పడానికి ఇంకేదో పద్ధతి వుండే వుంటుంది. ఏదో! చాలా సులువుగా ఏ మాత్రం నొప్పి తెలియకుండా టై విప్పేవాళ్లను నేను చూశాను. అది నేర్చుకోవాలి. ఎలాగైనా సరే! ప్లీజ్ హెల్ప్ మీ... ప్లీజ్... ప్లీజ్..."

# వేకువ చూపిన పాట



## చందు తులసి

ఈతరం తెలంగాణ కథకుల్లో ఒకరు. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను కథలుగా తీసుకొని, వర్తమాన జీవితాలను చిత్రిస్తున్న రచయిత. సూర్యాపేట జిల్లాలోని బండమీది చందుపట్లలో 1978లో పుట్టారు. పాత్రికేయ రంగంలో పని చేశారు. సాహితీ వెబ్‌సైట్లలో ఇంటర్వ్యూలు, పరిచయాలు రాస్తుంటారు. ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. 'ఊడలమర్రి' పేరుతో రాసిన మొదటి కథతోనే పాఠకుల గమనింపులోకి వచ్చారు.

నివాసం : హైదరాబాద్

మొబైల్ : 99855 83022

*వీరులారా వందనం... విద్యార్థి*
*అమరులారా వందనం పాదాలకు...*

ఇస్తారికి  పాట మల్లామల్లా వినిపిస్తనే వున్నది.

అర్ధరాతిరి పూట... ఊరంతా నిదరపోయినా ఇస్తారికి మాత్రం నిదురపడత లేదు.

నాలుగు బజార్లు కలిసిన చోట... ఆ వూరి రచ్చబండ కాడ పెద్ద ఏపచెట్టు. ఆ ఏప చెట్టు చుట్టూ సిమెంటుతోని కట్టిన గద్దె. ఆ గద్దె మీద కాళ్లు బార్ల చాపుకొని పండుకున్నడు ఇస్తారి.

*ఆడుదాం డప్పుల్ల దరువెయ్ రా...*
*తల్లీ తెలంగాణ పాటపాడరా...*

ఇంకో పాట చెవులల్ల మొదలైంది. ఇంత మద్దెరేత్రి పూట ఎవడన్నా సెల్‌ఫోన్‌లో పాటలు గిట్ల ఇంటున్నరా అనుకుని లేచి అటూ ఇటూ చూసిండు ఇస్తారి.

చుట్టూ చీకటి.

దూరంగా ఏదో కేక. ఆర్తనాదం. బాధతోనో, భయంతోనో...!?

ఎవరిదాకేక?

గిట్టుబాటు ధర రాక, అప్పులు కట్టలేక ఎట్లరా భగవంతుడా అని కుమిలిపోతున్న ఏ రైతు ఇంట్లె నుంచి వచ్చిందో... ఆ కేక...? సంవత్సరాల కొద్దీ కోచింగు తీసుకుని చదివినా కొలువు రాక, చేయడానికి పనిలేక, చేతగానివాడిలా

మిగిలిపోయిన ఏ నిరుద్యోగి ఆవేదనో ఆ కేక. దుబాయికి పొట్ట చేతపట్టుకుని పోయిన బిడ్డ... ఇంక లేడని తెలిసి కన్నపేగు పెట్టిన ఆర్తనాదమో ఆ కేక?

బలవంతంగా కళ్లుమూసుకొని పండుకున్నడు... జరంత నిద్రపట్టిందో లేదో...!

*నాగేటి సాల్లల్ల నా తెలంగాణ... నా తెలంగాణ*

*నవ్వేటి బతుకెల్ల నా తెలంగాణ... నా తెలంగాణ*

ఇంకో పాట మొదలైంది... ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు ఇస్తారి.

కదిలితే పాట, మెదిలితే పాట...

కంటికి జరసేపు కునుకు పడితే ఒట్టు. అటు ఇటు ఎంతసేపు దొర్లినా నిద్రపట్టలేదు.

మామూలుగా ఐతే ఈ యాలకల్లా ఇంత ముద్ద తిని... గుర్రుపెట్టి పండుకోవాలె. కానీ పొద్దున లోకల్ లీడర్ ముత్యాలరావు పటేల్ ఇంట్లె జరిగిన అవమానం వల్ల ఇస్తారికి నిద్ర పట్టటం లేదు. ఎంత మర్చిపోదామనుకున్నా పటేల్ మాటలే మల్లామల్లా యాదికొస్తున్నాయి.

“ఎంత మాట అన్నడు పటేల్ నా కొడుకు. పదిమంది ముందు పరువు తీసిండు...”

• • •

ఇస్తారి.... పేరు వినడానికి ఇచిత్రంగా వుంటది కానీ... వాళ్ల అమ్మ నాయిన పావురంగా పెట్టుకున్న పేరు అది.

ఇస్తారి కంటే ముందు పుట్టిన బిడ్డలు పురిట్లనే సచ్చి పోయిన్రట. అందుకని వాళ్ల అమ్మ ఇస్తారి పుట్టంగనే కట్ట మైసమ్మకు మోదుగాకు విస్తరిల పెట్టి “ఈ బిడ్డను నీకు దానమిస్తన్న తల్లీ, నీదే భారం...” అని మొక్కిందట. అట్ల విస్తరాకుల పెట్టిన్రు కాబట్టి ఇస్తారి అనే పేరొచ్చింది. ఇదంతా ముప్పయ్యేళ్ల కిందటి ముచ్చట.

మైసమ్మకు మొక్కితే పుట్టిన బిడ్డ ఇస్తారికి... వారసత్వంగా ఇవ్వడానికి వాళ్ల అమ్మ నాయిన దగ్గర భూములు లేవు. ఆస్తులు అంతకన్నా లేవు. ఉన్నదొక్కటే డప్పు. తాతల కాలం నుంచీ ఆ వూరిలో పెళ్లైనా, చావైనా... డప్పు కొట్టడం, లేదంటే చాటింపు వేయడం... ఇస్తారి కుటుంబమే చేస్తోంది. కాబట్టి ఇస్తారికి వాళ్ల నాయిన ఇచ్చిన ఆస్తి అంతా ఆ డప్పే. ఇస్తారి డప్పు కొట్టడం ఎవలదగ్గరా నేర్చుకోలేదు. తన ఈడు పిల్లలనందరినీ జమచేసి రేకు డబ్బాల మీద, పాత చాటల మీద డప్పు కొట్టేటోడు. ఆ రేకు డబ్బాల మీదనే తీరొక్క దరువులు వేసేటోడు. అట్ల వాళ్ల నాయిన కాలం చేసినంక ఆ డప్పు ఇస్తారికి వచ్చింది. ఆ చుట్టు పట్టు ఊళ్లల్లో దర్వు వేయడంలో ఇస్తారిని మించినోడు లేడని పేరు తెచ్చుకున్నడు.

మొదట్లో కమ్యూనిస్టోళ్ల సభలు, ఊరేగింపుల దగ్గర డప్పులు కొట్టేటోడు. ఆళ్ల సిద్ధాంతాలు, రాద్ధాంతాలు ఏవీ ఇస్తారికి అర్థం కాకుండె. తనకు కావాల్సింది పాట. ఆ పాటకు దగ్గ దరువు.

*ఎరజెండెర్రజెండెన్నియ్యల్లో...*

*ఎర్రెర్రనిదీ జెండెన్నియల్లో...*

ఆ పాట వినిపిస్తే చాలు పూనకం వచ్చినట్టు దరువేసేవాడు.

కాలం ఎప్పుడూ ఒక్క తీర్గ నడవదు కదా. కొంతకాలం తర్వాత ఆ వూళ్లె జెండాలు, గద్దెలు మిగిలినయి కానీ కమ్యూనిస్టోళ్లు కనుమరుగైనరు. ఎర్రజెండాలు వదిలి రంగు రంగుల జెండాలు పట్టినరు. జనాన్ని కూడా మార్చినరు. ఇపుడు ఆ వూరి పోరగాళ్లకు ఎర్రజెండా పార్టీ వొకటుందంటే కూడా నమ్మరు. నాయకులే మారినంక తమకేం అనుకున్నయో ఏమో కానీ ఎర్రరంగు గద్దెలు కాస్తా... ఆకు పచ్చగానో, పసుపు పచ్చగానో మారిపోయినయి.

అటువంటి సమయంలో తెలంగాణ పోరాటంలకు వచ్చినడు ఇస్తారి. అప్పటిదాకా అర్థంకాని సిద్ధాంతాల గురించిన పాటల కన్నా తెలంగాణ పాటలు ఇస్తారిని ఎక్కువ ఆకర్షించినయి. మన బతుకులు మారాలంటే... మన పాలన మనమే చేసుకోవాలనే సంగతి ఎరుకయ్యింది. ఇంగ అప్పటి నుంచి ఎక్కడ సభ జరిగినా ఇస్తారి డప్పు పట్టుకోని ముందు నడిచేటోడు. తనకొచ్చిన వానకాలం చదువుతోనే పాటలు కట్టేది కూడా నేర్చుకున్నడు. తెలంగాణ మీద చాలా పాటలు రాసిండు. రకరకాల దర్వు వేసుకుంట పాటలు పాడేటోడు.

అస్పైదులా హారతి కాళ్ల గజ్జెల సమ్మతి...

తెలంగాణ లడాయికి సాగుతున్న హిమ్మతి...

దరువు కొట్టుకుంట, అడుగేసుకుంట, పాట పాడుతుంటే... ముసలోళ్లు కూడా ఊగిపోయేటోళ్లు.

చిన్నపుడు డప్పు నేర్చుకుంటుంటే వాళ్ల నాయిన ఒక ముచ్చట చెప్పి వుండె.

“నాయినా... డప్పుకొట్టె ఇజ్జె...అందరికీ రాదురా. ఆ తల్లికి నీ మీద గురి కుదిరింది. అందుకే నీకీ విద్య వంటపట్టింది. ఆ తల్లి చూపు లేకుంటే కాళ్లు పైకి, తల కిందకి పెట్టి పది జన్మలు తపస్సు పట్టినా ఈ విద్య రాదు. అసోంటి విద్య నలుగురికి ఉపయోగపడాలి కానీ పాణం పోయినా అమ్ముకోకూడదు. గుర్తుంచుకో... నీ ఇజ్జను అమ్ముకోవడమంటే అమ్మను అమ్ముకున్నట్టే...”

వాళ్ల నాయిన చెప్పినట్టే... ఏనాడూ పైసల కోసం డప్పు కొట్టలేదు ఇస్తారి.

ఇస్తారికి ఇరవై ఏళ్లు నిండకుండనే లగ్గమయ్యింది. మేనమామ పిల్లనే చేసుకున్నడు. పెళ్లైతే చేసుకున్నడు కానీ పెళ్లానికి ఒక్క పూట గట్టిగ తిండి పెట్టలేదు.

ఉద్యమంలో గొడవలు పడి తనకో ఇల్లు, పెళ్లాం ఉందన్న సంగతే మర్చిపోయాడు. సచ్చిపోయేలోపు తెలంగాణ రాష్ట్రం చూస్తే చాలు అనుకున్నడు. ఉద్యమం, పాట... ఈ రెండే ఊపిరిగా బతికిండు.

అటువంటి ఇస్తారికి మొదటిసారిగా ఇయాల పొద్దున అవమానం జరిగింది.

• • •

సరిగ్గా నెలరోజుల కిందట ఆ ఏరియా లీడర్ ముత్యాలరావు పటేల్... ఇస్తారిని, వాళ్ల కళాబృందాన్ని ఇంటికి రమ్మని కబురు పెట్టిండు.

కళాకారులందరికీ మస్తుగ చికెన్ బిర్యానీ పెట్టి... తాగినంత మందు పోసిండు.

దావత్ అంత అయిపోయినంక అసలు సంగతి చెప్పిండు పటేల్.

"ఇస్తారి. మీరంతా గొప్ప కళాకారులు. నాకు తెలుసు. ఒక రాజకీయ నాయకుడు పొద్దంతా మాట్లాడినా చెప్పలేని సంగతి మీరు ఒక్క పాటతోని చెపుతరు. అందుకనే మీలాంటి కళాకారులను నేను గౌరవించాల. కాబట్టి ఈ దావత్ చేస్తున్న. ఈ విందు ఈ వొక్క రోజే కాదు... మీకు కావాలంటే రోజూ వుంటది. కాకుంటే మీరొక చిన్న పని చేయాల. మన ఏరియా ఎమ్మెల్యే... ఈ మధ్యనే చనిపోయిన సంగతి మీకు తెలుసు. అభివృద్ధి కార్యక్రమాలంటే ఆపేయచ్చు కానీ  ఎలక్షను ఆపకూడదు కదా. ఆ ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నాను. మీకు నా గురించి తెలుసు. మా తాతల కాలం నుంచీ మేము ప్రజలకు సేవ చేయడం కోసమే కదా రాజకీయాల్లో ఉంటున్నాము. మాకెన్ని యాపారాలు ఉన్నా... అవన్నీ మా తమ్ముళ్లకు వదిలేసి... నేను రాజకీయాల్లో కొనసాగుతున్నానంటే దేనికీ...? ప్రజలకు సేవ చేయడం కోసమే. నేను మండలాధ్యక్షుడిగా ఎన్ని గొప్ప పనులు చేశానో మీకు తెలుసు. ఇళ్లు గట్టించాను. రోడ్లు వేయించాను. డబ్బులు గవుర్మెంటుయే అనుకోండి...! కాబట్టి వచ్చే ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా గెలవాలంటే జనానికి నా గురించి తెలవాల. అందుకని మీరు నా గురించి పాటలు రాయాల. ఆ పాటలకు మంచి రాగం కట్టి ప్రతీ వూరులోనూ... ప్రతి వీధిలోనూ పాడాల. అంతే." అసలు గుట్టు విప్పి చెప్పాడు పటేలు.

అక్కడికొచ్చిన కళాకారులంతా ఓస్ ఇంతేనా అనుకున్నారు. మీ గురించి పాటలే కాదు... కథలు, బుర్రకథలు కూడా చెబుతాం... కాకుంటే మీరు మాకు ఈ దావతు రోజూ పెట్టడం మాత్రం మర్చిపోకండి అన్నారు.

“మీకు పదిరోజులు గడువిస్తున్నా. పది రోజులు మీకిష్టమొచ్చినంత తాగండి... తినండి. ఈ లోపు పాటలు రెడీ అయిపోవాల. నా గురించి ఊరూరా ప్రచారం మొదలు పెట్టాల.” అని ఆర్డరేశాడు పటేలు.

వాళ్ల కళాబృందంలో పాట రాసేది... పాడేది ఇస్త్రారి. కాబట్టి పాట రాయాల్సిన భారం ఇస్త్రారి మీదే పడింది. మొహమాటానికైతే వొప్పుకున్నాడు కానీ పాట మాత్రం రాయలేకపోతున్నాడు.

ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజులు... ఊహూ. పెన్ను కదలదు, గొంతు పెగలదు... పాట రావట్లేదు.

ఉద్యమకాలంలో కళ్లు మూసి తెరిచేలోపు ఒక పాట గురించిన ఆలోచన వచ్చేది. ప్రాణత్యాగం చేసుకున్న వీరుని గురించో... అన్యాయమైపోతున్న తెలంగాణ గురించో తలచుకోగానే పాటలు పుట్టేవి. మరి ఇప్పుడు...

ఎంత కొట్టుకున్నా పాట రావడం లేదు. కారణం ఏమిటో అర్థం కావడం లేదు.

పది రోజులు గడిచాయి. పటేలు దగ్గరి నుంచి కబురు రానే వచ్చింది. తన గురించి ఏమేం పాటలు రాశారో పాడమని చెప్పి సోఫాలో కూలబడి కళ్లు మూసుకుని చెవులు తెరిచాడు పటేలు. తమ గురించి, తమ తాతల గురించి, తమ పథకాల గురించి ఎంతో గొప్పగా పాడుతారని ఊహించుకున్నాడు. పాట కాదు కదా... చిన్న మాట కూడా బయటకు రాలేదు ఇస్త్రారి గొంతులోంచి.

“పటేల్ సాబ్. మీరిట్ల తొందరపెడితే మంచి పాట రావట్లేదు. ఇంకొంచెం గడువు కావాలె.”

ఇస్త్రారి మాటలకు మొదట కంగారు పడ్డాడు ముత్యాలరావు.

‘మా గొప్పతనం గురించి... మా ప్రభుత్వం గొప్పతనం గురించి పాట రాయడానికి అంత గడువు ఎందుకు...? ఇలా తలుచుకుంటే అలా పాటలు రావాలి కానీ...’ అనుకున్నాడు.

“సరే. అట్లనే... కానీ. ఇంకో పదిరోజులు టైం తీసుకోండి. పాటలు మాత్రం మంచిగా రావాల” అన్నాడు.

పదిరోజులు నెల అయింది. పరిస్థితి మారలేదు. గిలగిల గింజుకున్నా ఇస్త్రారి పాట రాయలేక పోయాడు.

పరిస్థితి అర్థమైన పటేల్‌కు కోపం కట్టలు తెంచుకున్నది. మాటతీరు కూడా మారింది.

"మీరేదో గొప్ప పాటగాళ్లు అనుకుని... ఏదో పాడిచేస్తారనుకుని మందు తాపించి... బిర్యానీలు పెట్టించాను కదరా. వొక పాట రాయమంటే రాయలేక పోయినారు. థూ. దొంగనా కొడుకుల్లారా. మిమ్మల్ని నమ్ముకుని ప్రచారం కోసం లక్షల రూపాయలు పెట్టి అంతా సిద్ధం చేశాను. ఇప్పుడు ఇదంతా ఏమైపోవాల. అంత చేతగానప్పుడు ఎందుకొచ్చార్రా... పాటలు పాడుతామని...?" అని బండ బూతులు తిట్టాడు.

"మీకు ఇంకో పది రోజులు గడువు ఇస్తున్నా. మీరు పాటలు రాసి పాడినారా సరే. లేకుంటే మా పెద్దమ్మ వూరి నుంచి రికార్డింగు డ్యాన్సోళ్లను తీసుకొచ్చి ప్రచారం చేసుకుంట. వెళ్లిపొండి..." అని తిట్టి పంపించాడు.

"నిన్ను నమ్ముకున్నందుకు పటేల్ దగ్గర మా పరువుపోయిందిరా ఇస్తారి..." అని వాళ్ల ట్రూప్‌లోని వాళ్లు కూడా తలోమాట అన్నారు.

ఐతే పటేల్ తిట్టినందుకో... తోటి కళాకారులు తిట్టినందుకో బాధగా లేదు ఇస్తారికి. అసలు తనకు పాట రాయడం మర్చిపోయినందుకు బాధగా వుంది.

ఉద్యమ కాలంలో రోజుకొక్క పాట రాసి పాడిన తనకు ఇప్పుడేమయింది...? ఎందుకు రాయలేకపోతున్నాడు...?

• • •

తెలంగాణ కోసం కొట్లాడుతున్నపుడు బతుకు ఎట్ల ఉండె...?

అసెంబ్లీ ముట్టడి, సకల జనుల సమ్మె, సాగరహారం... వొక్కటని కాదు. వొక్కరోజని కాదు... ప్రతిరోజూ వొక పోరాటంలాగా గడిచింది.

లాఠీల దెబ్బలు, తూటల వర్షాలు... కేసులు, జైళ్లు... వొక్క గోస అని కాదు.

తెలంగాణ జనం కన్న కష్టాల పడ్డరు. చివరకు వీరుల త్యాగాలు ఫలించాయి.

బోనం గద్దెనెక్కింది. తెలంగాణ వచ్చింది.

ఆ రోజు ఇస్తారికి ఎన్నడు చూడని ఆనందం.

కానీ ఆ ముచ్చట మూడునాళ్ల మురిపెమే అయింది.

తెలంగాణ వచ్చినంక జనమెంత లాభపడ్డరో కానీ ముత్యాలరావు లాంటి రాజకీయ దళారీలు మాత్రం బాగా సంపాయించినరు.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్నపుడు ముత్యాలరావు వేరే పార్టీల వుండె. అసలు ముత్యాలరావుది ఈ వూరే కాదు. వాళ్ల తాతలు వేరే ప్రాంతం నుంచి వలస వచ్చినరు. ఇక్కడికొచ్చి యాభై ఏళ్లు దాటినది కానీ వాళ్లు ఇక్కడి మనుషులు కాలే. ఇక్కడి భాష కూడా రాలే. వాళ్లు ఇండ్లు కూడా దూరంగా కట్టుకున్నరు. వాళ్లకు కోడలు కావాలంటే కూడా వాళ్ల ప్రాంతం నుంచే తెచ్చుకుంటరు.

ఈ గడ్డ మీద బతికి ఇక్కడి తిండి తింటరు కానీ... బువ్వ పెట్టిన నేలను మాత్రం ప్రేమించలేదు వాళ్లు.

అందుకనే ముత్యాలరావు తెలంగాణ పోరాటం చేస్తున్నపుడు ఉద్యమకారులను ఎగతాళి చేసేటోడు. మీరు ఎన్ని ఏషాలు వేసినా తెలంగాణ రాదని పకపకా నవ్వేటోడు. తెలంగాణ పోరాటంల పాల్గొంటే తన పొలంల పనికి రానియ్యనని జనాన్ని భయపెట్టి మీటింగులకు రాకుండా చేసేటోడు. పోలీసులకు చెప్పి కేసులు పెట్టించేటోడు.

అటువంటి ముత్యాలరావు... తెలంగాణ వచ్చిన తెల్లారే కండువా మార్చిండు. డబ్బులు ఇయ్యనోడు పడవ ముందు ఎక్కినట్లు... అప్పటిదాకా తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన ముత్యాలరావు ఇయ్యాల పెద్ద నాయకుడైనడు. అసలు నన్ను మించిన తెలంగాణవాది లేడంటడు. అధికారులను బట్టుకున్నడు. పైసలు గుమ్మరించిండు. పెద్ద పెద్ద కంట్రాక్టులు సంపాయించిండు.

పంట పొలాన్ని ఈనగాచి నక్కల పాలు చేసినట్లు అనిపిస్తది ఇస్తారికి.

ఉద్యమ కాలంలో అనేక పాటలు పాడి... పాటే లోకంగా బతికిన ఇస్తారి వొక్కసారిగ పాట రాయడం ఎట్ల మర్చిపోయాడు. ఎందుకని పటేల్ మీద పాట రాయలేకపోయినడు...?

ఆ సంగతి చెప్పాలంటే వొక మూడు రోజుల కిందట ఏమయ్యిందో చెప్పాలె.

• • •

మూడు రోజుల కిందట...

తెల్లవారు జామున గూడెమంతా కలకలంగా ఉంది.

ఏవో మాటలు వినిపించి బయటకు వచ్చి చూశాడు. గములోళ్ల వెంకటేశు ఉరి పెట్టుకుని చచ్చిపోయిండట అని చెపుతున్నరు.

వెంకటేశు–ఇస్తారి ఐదో క్లాసు దాకా కలిసి చదువుకున్నరు. ఇస్తారి చదువు మధ్యలోనే ఆపేసినా వెంకటేశు మాత్రం ఉస్మానియా క్యాంపస్‌లో ఎం.ఏ. దాకా చదివిండు. ఏదన్నా టీచర్ నౌకరో, లెక్చరర్ నౌకరో చేద్దామని ఐదారేళ్లు కోచింగ్ తీసుకుని మరీ ప్రిపేర్ అయినడు. సంవత్సరాలు గడిచినయి కానీ ఒక్క ఉద్యోగ ప్రకటన రాలేదు. వయసు కూడా దాటిపోయింది. ఉద్యోగం వచ్చినంక చేసుకుందామని పెండ్లి కూడా చేసుకోలేదు. అటు నౌకరి రాదాయె, ఇటు పెండ్లి కాదాయె... ఎం.ఏ. చదువుకి ప్రైవేటుల కూడా కొలువు రాదాయే. ఎటు కాకుండా అయిపాయె నా బతుకు అని పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నడు.

శవాన్ని కిందకి దింపి గడ్డి మీద పడుకోబెట్టినరు. వెంకటేశు తల్లి గుండెలు బాదుకోని ఏడుస్తున్నది. ఆమెను ఆపుడు ఎవ్వలితోనే కావట్లేదు.

"పాపం బిడ్డ. చిన్నప్పటి నుంచి చదువూ, చదువని బతికిండు. ఒక్క నౌకరి రాదాయె. తెలంగాణ వస్తే మన కొలువులు మనకు దక్కుతయని కొట్లాడితిమి. మన రాష్ట్రం మనకు వచ్చింది గనీ, ఒక్క కొలువు రాదాయె. కోర్టులని, కేసులనీ ఏళ్లకేళ్లు వాయిదాలు ఏయబట్టిరి. ఈలోపు వయసు దాటిపాయె."

"పోటీ పెరిగిపాయె. కోచింగ్ లేనిదే కొలువు రాదాయె. మరి కోచింగుల కోసం సంవత్సరాల కొద్దీ హైదరాబాద్‌ల ఎట్ల బతకాలే..? "

అక్కడ కొంతమంది యువకుల మాటలని బట్టి వెంకటేశు చావుకు కారణమేమిటో అర్థమయింది ఇస్తారికి.

వెంకటేశు శవానికి అంత్యక్రియలు మొదలయినయి.

ఆనవాయితీ ప్రకారమే తమ గూడెం మాదిగోళ్లతో కలిసి చావుడప్పులు మోగించాడు ఇస్తారి. కొడుతోంది డప్పునైనా, ఆ డప్పు తన గుండెల మీద కొడుతున్నట్లు అనిపించింది.

డప్పు కొడుతుంటే ఎపుడు లేంది... పొరలు పొరలుగా దుఃఖం కమ్ముకొస్తా వుంది.

వెంకటేశు కూడా తెలంగాణ పోరాటంలో ముందు నడిచిండు. మన పాలన మనకు కావాలని చెప్పేటోడు. మన ప్రభుత్వం వస్తే మన నౌకర్లు మనకొస్తయి అని చెప్పి జనంలో ప్రచారం చేసిండు. తెలంగాణ వచ్చింది. తీరా ఇప్పుడేమయింది.? రాజకీయ నాయకులు బాగుపడ్డరు కానీ కొట్లాడిన యువకులకు ఏమి ఫాయిదా లేకపాయె?

శవాన్ని దానం చేసి ఇంటి కొచ్చిండు ఇస్తారి. పండుకున్నంక కూడా అదే ఆలోచన...

*వీరులారా వందనం విద్యార్థి...*

*అమరులారా వందనం పాదాలకు....*

కళ్లు మూసినా తెరిసినా ఆ పాటలే ఇనిపించాయి కానీ... కొత్త పాట రాయలేక పోయాడు ఇస్తారి. మనసంతా ఎట్నో వుంది. అటువంటి ఇస్తారి ముత్యాలరావును మెచ్చుకుంటూ ఏ పాట రాయగలడు...?

• • •

రెండవ రోజు.

ఊరిలో ఏదో చాటింపు ఉంటే దప్పు కొట్టుకుంట ఊరిలో తిరుగుతున్నడు. వొక దగ్గర జనం గుంపులు గుంపులుగా ఉన్నరు. పోలీసోళ్ల జీపు కూడా ఆగి ఉంది. ఆ ఇల్లు కమ్మరోళ్ల మల్లేశ్‌ది.

మల్లేశ్ తెలంగాణ ఉద్యమంల చాలా హుషారుగా పని చేసి ఉండె. రాస్తారోకో ఐనా, హర్తాళ్ ఐనా ముందుగాల నడిచేటోడు. ఎక్కడ మీటింగ్ ఐనా జనాలను తీసుకుని పోతుండె. తెలంగాణ వచ్చేదాక పోరాటం ఆపొద్దని చెప్పేటోడు. ఈసారి ఎట్లనైన తెలంగాణ వస్తదని నమ్మకంగ చెబుతుండె.

రకరకాల రాజకీయాలతోటి తెలంగాణ రావడం ఆలస్యమయ్యేసరికి మల్లేశ్ నీరుకారిపోయిండు. ఈసారి ఉద్యమం ఆగిపోతే ఇంగ ఎప్పటికీ తెలంగాణ రాదని దిగులుతోని పగలు, రాత్రి నిద్ర పోకుండా ఆలోచించిండు. చివరకు తన చావుతోనైనా జనాలల్ల కదలిక రావాలని ఆత్మాహుతి చేసుకున్నడు. మల్లేశ్ ప్రాణత్యాగం తర్వాత ఉద్యమం మళ్ల నిప్పు రాజేసినట్లు అయింది. ఉద్యమం ఉవ్వెత్తున లేచి చివరకు తెలంగాణ వచ్చింది.

రాష్ట్రం వచ్చింది కానీ చేతికందిన కొడుకు పోవడంతో మల్లేశ్ కుటుంబం దిక్కులేనిది అయింది. తిండికి ఎల్లేది తిప్పలయ్యింది. ఏం పని చేద్దురా దేవుడా అని మల్లేశ్ తండ్రి  ఆలోచిస్తుంటే... వాళ్ల బంధువెవురో గుర్తొచ్చిండు. ఆయన దుబాయ్‌ల ఉంటడు. ఆయన పోయినట్టే నేను కూడా పోత అని మల్లేశ్ తండ్రి రెండు లక్షలు అప్పు చేసి దుబాయ్ పోయిండు. అటు కొడుకు ఉద్యమంలో పోయి, పెనిమిటి దుబాయికి పోయి మల్లేశ్ తల్లి ఒంటరిదయింది.

"ఏమైందన్నా..." అక్కడున్న ఓ పెద్దమనిషిని అడిగిండు ఇస్తారి.

"మల్లేశ్ తండ్రి దుబాయ్ పోయిండు కదా. ఆ దేశంలో ఏం జరిగిందో, ఏమో... టక్కరయి చనిపోయిండట. అది కూడా జరిగి రెండు నెలలు అయిందట. పోలీసోళ్లకు ఇయాళ తెలిసిందట. అందుకనే వచ్చి చెప్పిన్రు. పీనిగను తీసుక రావాలంటే లక్ష రూపాయలు కావాలెనట...."

మాకు దిక్కెవరు దేవుడా... అని అరిగోస పెడుతున్న ఆ తల్లి బాధ చెప్పతరం కాకున్నది.

ఇట్ల రోజుకో తీరుగ జరుగుతున్న గోరాలు చూసి ఇస్తారికి ఎక్కడనో గుండె చెదిరినట్లయింది.

పరాయోడు పాలించినపుడు కష్టాలు తప్పకపాయె. ఇప్పుడు మన రాజ్యమొచ్చినంక కూడా ఈ కష్టాలు తీరకపాయె ఎట్ల...? మనోళ్ల గురించి మనం పట్టించుకోకపోతె ఎట్ల...?

రోజంతా అదే ఆలోచనల పడ్డడు ఇస్తారి.

అగో... అటువంటి టైములల మళ్లీ పటేల్ ముత్యాలరావు రమ్మంటున్నడని కబురు వచ్చింది. వొక్కడే పోయిండు ఇస్తారి.

"నా మనసు మంచిగ లేదు పటేల్ సాబ్... నేను పాటలు పాడలేను" అని చెప్పిండు.

ఆ మాట చెప్పంగనే జింక మీద పులిలాగ దుంకిండు పటేల్.

"ఏదో నాలుగు ముక్కలు వస్తయి, పాటలు బాగ పాడుతవని... నెత్తికెక్కించుకుంటే మంచిగ బుద్ధి చెప్పినవు కదరా. నేను తలుచుకుంటే నీ తాతలాగా రాస్త పాటలు. ఇంకోసారి కనపడితే నరుకుతా నా కొడకా... పో అవతలకి..."

పటేల్ ఎన్ని మాటలన్నా బాధపడలేదు ఇస్తారి.

ఇంటికొస్తూ వస్తూ... ఊరి బయట సారా అమ్మే దుకాణంల అరకాయ తాగిండు.

ఎక్కినట్టు అనిపియ్యలే. ఇంకో రెండు పావులు తాగిండు. మెల్లగా మత్తెక్కినట్లయింది. అప్పుడిదాకా తేనేటీగల రొదలాగా ఉన్న మనసులో ఆలోచనలు తెరిపినపడ్డయి. వచ్చి రచ్చబండ దగ్గర ఈ ఏపచెట్టు కింద చేరాడు. ఎక్కడెక్కడి పాటలో చెవిన పడుతున్నాయి.

ఎప్పుడూ చంక కింద పసిబిడ్డలా ఉండే దప్పు ప్రశ్నలాగా ములుగర్రలాగా గుచ్చుతూ ఉంది.

వాళ్లమ్మ గుర్తుకొచ్చింది. "మన ఇజ్జను పైసలకు అమ్ముకోవద్దు బిడ్డా" అని చెప్పిన అయ్య గుర్తొచ్చిండు. తెలంగాణ కోసం పాణం ఇడిచిన అమరవీరులు గుర్తొచ్చినరు.

రాష్ట్రం కోసం కష్టపడ్డది ఎవరు... ఇప్పుడు ఫలితాలు అనుభవిస్తున్నది ఎవరు...?

త్యాగం ఒకనిది...? ఫలితం ఒకనిది ఎందుకయింది...?

ఈనగాచిన పంట పొలం నక్కల పాలు ఐనట్లు అయింది పరిస్థితి...!!

ఆ బాధల...

ఆ గోసల...

అగో అప్పుడు...

మల్ల పాట గుర్తొచ్చింది.

అగ్ని పర్వతం బద్ధలైనట్లు...

నిండు కుండలాంటి చెరువు కట్ట ఒక్కసారి తెగిపోయినట్లు...

వంట్లోని శక్తినంతా కూడదీసుకుని బలంగా డప్పు మీద దరువేశాడు.

ధమ..... ధమ..... ధమ..... ధమ.....
ధమ..... ధమ..... ధమ..... ధమ.....

అప్పటిదాకా గాఢనిద్రలో..... మత్తులో ఉన్న జనం ఉలిక్కిపడి లేచారు.

ధమ..... ధమ..... ధమ..... ధమ.....
ధమ..... ధమ..... ధమ..... ధమ.....

*పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా.....*
*వీర తెలంగాణమా.....*
*వీర తెలంగాణమా కోట్లాది ప్రాణమా.....!*

ఓ పక్క డప్పు కొడుతూనే..... ఇంకో పక్క పాట అందుకున్నాడు.

పాట పాడుతూనే అడుగులేస్తూ ఎగురుతున్నాడు.

ఇపుడు అతని పాట మామూలు పాటలా కాదు.

నిద్దుర లేపే వేకువ పాటలా ఆ ఊరంతా ప్రతిధ్వనిస్తోంది.

# నీరుగట్టోడు



ఝాన్సీ పాపుదేశి

పుట్టి పెరిగిన ప్రాంతానికి సంబంధించిన జీవితాలను చిత్రించే అవసరం ఉందని గ్రహించి, ఆ దిశగా కథలు రాస్తున్న రచయిత. 1975లో చిత్తూరులో పుట్టిన వీరు ప్రస్తుతం బెంగళూరులో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. 2006 నుంచి కథలు, కవిత్వం రాస్తున్నారు. ఇప్పటికి పది కథల దాకా రాశారు. కథలు రాయడానికి ముందు జర్నలిస్ట్‌గా పని చేసిన అనుభవం కొన్ని జీవితాలను చూపించిందని, ఆ జీవితాల్ని పరిచయం చేయడమే తన పనని చెబుతున్నారు. మాండలికంలో ఎక్కువగా కథలు రాయడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

నివాసం : బెంగళూరు.

మొబైల్ : 96868 97333

నీళ్లను చూడాలని చాలాసేపుగా తిరుగుతున్నాడు నీరుగట్టోడు. నీళ్లు చూస్తే వాడి మనసుకు శాంతంగా ఉంటుంది. నీళ్లను చూస్తే తెరిపిన పడినట్టుగా ఉంటుంది. నీళ్లను చూస్తే డొక్కలకు ప్రాణవాయువు అందినట్టుగా ఉంటుంది.

కాని నీళ్లు లేవు. నీళ్లు నేరుగా కనపడవు. ఒక అంచనాను భరోసాను ఇచ్చే విస్తారమైన జల సముదాయం హృదయానికి చిక్కదు.

తల ఎత్తి మెడ విరిగిపోయేలా చూశాడు నీరుగట్టోడు. చాలా అంతస్తుల భవంతులు. వరుసగా చాలా ఎత్తుగా ఉన్న అపార్ట్‌మెంట్లు. వీళ్లందరికీ నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయి? ఎన్ని రోజులు వస్తాయి? ఎంత తేమ ఇంకా మిగిలి ఉందో ఎలా చెప్తాయి?

నాలుగేళ్లయ్యింది ఈ నగరానికి వచ్చి. కంటికి కనపడని నీళ్లుండే నేల ఇది. అలాంటి నేల మీద ఉండటం వాడికి ఉక్కిరిబిక్కిరిగా ఉంటుంది. కాని తప్పదు– కొడుకు కోసం.

తిరిగి తిరిగి ఒక ట్రీగార్డ్ ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు నీరుగట్టోడు. ఇవాళ్టితో ఈ నగరానికి తనకూ సెలవు. వెళ్లిపోతాడు తను. తన తావుకు వెళ్లిపోతాడు. వెళ్లిపోయే ముందు కొంచెం కూడదీసుకోవడానికి అటూ ఇటూ గమ్యం లేనట్టుగా తిరుగుతున్నాడు. గోధుమరంగు పంచె, అదే రంగు ముతకగుడ్డతో కుట్టిన చొక్కా, భుజాన తుండు... అక్కడ నిలబడ్డ నీరుగట్టోడి కథ ఆ దారిన వేగంగా పోతున్న ఆ నగరపౌరలకు ఏమాత్రం తెలిసే అవకాశం లేదు.

నీరుగట్టోడి అసలు పేరు చిన్నబ్బ. ఆ పేరుతో పిలిస్తే చిత్తూరు దగ్గరున్న ఆ చిన్న పల్లెటూరులో ఎవరూ గుర్తు పట్టలేరు. చెరువులో నీళ్లను వూర్లో రైతుల

పొలాలకు సమంగా పంచడం వాడి పని కనుక అంటే నీరు గట్టేపని గనక అందరూ వాణ్ణి నీరుగట్టోడని పిలుస్తారు. నీరుగట్టోడి నాన్న కూడా నీరుగట్టోడే. తండ్రి పోయాక ఆ పని అతడు చేయాల్సి వచ్చింది.

మంత్రగాళ్లకు మంత్రాలు వస్తాయో రావోగాని నీరుగట్టోడికి మాత్రం నీటిమంత్రం వచ్చు. చెరువు గట్టు మీద నిలబడి నుదుటికి చేయి ఆన్చి తేరిపార చూశాడంటే ఆ నీళ్ల ఎన్ని రోజులు ఎన్ని పొలాలకు ఎన్ని తడుపులకు వస్తాయో ఇట్టే చెప్పేసేవాడు. బావిలోకి తొంగి చూసి రాయి విసిరాడంటే అది బుడుంగుమంటూ మునిగే చప్పుడుని పట్టి ఆ బావిలో ఎన్ని లోతుల నీళ్లున్నాయో తేల్చేసేవాడు. ఆ ఊరి జనానికి వాన రాకడ మీద నమ్మకం లేదు. నీరుగట్టోడి నీటి పోకడ మీదే నమ్మకం.

నీరుగట్టోడి తండ్రి నీరుగట్టోడికి పాటలు నేర్పించాడు. పాడుకునేదానికి కాదు. లెక్క గుర్తు పెట్టుకోవడానికి. చెరువు నుంచి నీటిని ఎంతసేపు విడుదల చేయాలన్నది పాటను బట్టి చేస్తాడు. నీరు కట్టాల్సిన పొలం పెద్దదైతే పెద్దపాట. చిన్నదైతే చిన్నపాట. నీరు వదిలి పాడుకుంటూ కూచుంటే చివరి పదం ముగిసే సరికి పొలం సరిగ్గా తడవాల్సిందే. నేలను వేలితో నొక్కి తేమశాతాన్ని అంచనా వేయడం నీరుగట్టోడికి మన్నుతో పెట్టిన విద్య. వాడికి బొమ్మలేయడం వచ్చు. బొగ్గు ముక్క దొరికిందంటే చాలు, వూహలకు ప్రాణాలొచ్చేవి. ఆ బొమ్మల్లో జల దేవతలు.. మబ్బులు... నీరు పారుతూ సుభిక్షంగా ఉన్న నేలలు... సంతోషంగా ఆత్మీయంగా ఉన్న మనుషులు...

వేసవిలో చెరువు పూర్తిగా అడుగంటేది. అప్పుడు నీరుగట్టోడు చెరువు కింది భాగంలో పిల్లనగ్రోవిని, మధ్య భాగంలో ఐదుపంగలు వున్న చక్రాన్ని, పై భాగంలో తనకెంతో ఇష్టమైన శంఖం గుర్తును లోతుగా చెక్కి పెట్టుకునేవాడు. వానలు పడి చెరువు నిండేది. నీటి అంచు శంఖం గుర్తు వరకు నీరున్నప్పుడు ప్రతిరోజూ నీళ్ల వొదిలేవాడు. చక్రం గుర్తు వరకు ఉన్నప్పుడు వారంలో ఐదురోజులు మాత్రమే నీరు వొదిలేవాడు. ఇక పిల్లనగ్రోవి గుర్తు వరకు నీరున్నప్పుడు వారంలో ఒకరోజు మాత్రమే పొలాలు తడిసేవి. దాన్నిబట్టి ఏ పంటలు పండించుకోవాలో ఒక అవగాహనకు వచ్చేవారు ఆ వూరి రైతులు.

తక్కువని చెప్పుకునే కులంలో పుట్టినా చేసే పని వల్ల వాడిని పల్లెత్తుమాట అనడానికి కూడా జంకేవారు వూరి పెద్దమనుషులు. చేతిలో కర్ర నేలకు గుచ్చి ఎదురు నిలబడ్డాడంటే కోరిన కోరిక తీర్చే ముందడుగేసేవారు ఎవరైనా. అది వాడికున్న పరపతి. వూర్లో బిచ్చమెత్తుకోవడానికి వచ్చే మొండోళ్లు బియ్యమో, రాగులో జోలెలో పడేవరకు ఇంటి ముందు నిలబడి నానా రాద్ధాంతం చేసేవాళ్లు. కత్తితో

చేతుల మీద కోసుకుని నెత్తురు చూపి భయపెట్టేవాళ్లు. వాళ్ల మొండితనం నాలుగు వేళ్లూ నోట్లోకి పోవడానికే. అలాంటి మొండోళ్ల కంటే మొండోడని నీరుగట్టోడికి పేరు. ఊరు నా సొంతం ఊరికి నేను సొంతం అన్నట్టు ఉండడంతో వాడికి ఎదురు లేకుండా గడిచిపోయింది. రేపటి చింత వాడికి ఏనాడు లేదు.

కొడుకును పట్టణంలో చదువుకు చేర్చాక నీరుగట్టోడి పెళ్లాం కడుపునొప్పి తట్టుకోలేక వడిశాకు తిని ప్రాణం తీసుకుంది. ఒంటోడై పోవడంతో పిచ్చిపట్టినంత పనైంది వాడికి. కొడుకు చదువు పూర్తయ్యేదాకా ఏం తిన్నాడో, ఎలా బతికాడో ఆ చెరువుగట్టుకి మాత్రమే తెలుసు.

ఈలోపు కాలం మారిపోయింది. రుతువులు గతి తప్పాయి. ఆకాశం మీద మేఘాలు నిండు చూలాల్లా తిరగడం మానుకున్నాయి. పసిపిల్లల ఆగని నవ్వులా వాన కురవడం తక్కువైపోయింది. నీటి విలువ పాలకులకు తెలియదు. చెరువుకు వాన నీరొచ్చి చేరే మార్గాల మీద కాలు పెట్టకూడదని మారుతున్న కాలానికి తెలియదు. చెట్లు ఉండాల్సిన చోట సిమెంటు ఇళ్లు వచ్చాయి. లోతులన్ని మట్టసం అయ్యి కాలనీలు ఏర్పడ్డాయి. నెలల తరబడి జ్వరం తగిలిన బరెగొడ్డులా చెరువు చిక్కిపోయింది. మెషీన్లు కనిపెట్టిన మానవుడు పాతాళానికి బోర్లు వేయడం మొదలుపెట్టాడు. అందరిలాగే ఆ వూరి రైతులు కూడా బోర్ల మీద ఆధారపడటం ప్రారంభించారు.

చెరువులో నీళ్లకు లెక్కగాని బోరులోని నీళ్లకు ఏం లెక్క? నీరుగట్టోడు ఏం చేయాలో ఊరివాళ్లకు నీరుగట్టోడికి కూడా అర్థం కాలేదు. బోరులో ఎన్ని నీళ్లున్నాయో చెప్పే విద్య వాడికి లేకపోవడంతో నీరుగట్టోడి అవసరం ఎవరికీ లేక వాడికి రెండుపూట్లా తిండి కూడా కరువైపోయింది. కొన్ని రోజులు కబురు మోసే పని చేశాడు. చావుకబురు వూళ్లో ఇంటింటికీ చేరేసినందుకు రూపాయో అర్ధో ముట్టేది. చేతిలో చిల్లర లేనప్పుడు ఎవరైనా పోతే బావుండునని అనుకున్న రోజులు కూడా వున్నాయి. అప్పటికి కొడుకు చదువు పూర్తి చేసుకుని బిల్డింగ్ సూపర్‌వైజర్‌గా వుద్యోగం తెచ్చుకున్నాడు. మంచిరోజులు ముందున్నాయని నమ్మిన నీరుగట్టోడు పోలేరమ్మకు జీవాన్ని బలి యిచ్చి పొర్లుదండాలు పెట్టుకున్నాడు. వాడకు వీడ్కోలు చెప్పి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి కొడుకుతోనే. వేళకింత వండుకోని, టీవీ చూస్తూ కాలం గడుపుకోవడం అలవాటు చేసుకున్నాడు.

రోజులు ఇలా గడుస్తూ ఉండగా ఒకరోజు కొడుకు ఏ విషయం గురించో గాలి మళ్లిందని నీరుగట్టోడికి అర్థమైంది. కొడుకు తనకేదో చెప్పాలనుకుని అంతలోనే మానుకుంటున్నాడని గమనించాడు. అర్దరోజు ఈ భాగోతమంతా చూశాక కొడుకుని నిలబెట్టి అడిగాడు.

'ఏందో చెప్పాలని బయల్దేరతావు. మళ్లీ పూడుపామాల పడుకుంటావు. తెల్లారి నుండి చూస్తా వుండా నీ కత. ఏమయ్యింది కొడకా?'

'ఏమీ లేదు నాయినా. నీకో విషయం చెప్పాల. చెప్పినాక నువ్వు కాదనకూడదు'

'కాదన్నులే చెప్పు. ఎందుకట్టా తనకలాడతావు'

'నేనొక అమ్మిని ప్రేమించినా. పెండ్లి చేసుకుంటానని మాటిచ్చినా'

'యావూరు?'

'కర్నూలు. ఇప్పుడు హైదరాబాద్‌లోనే వుండారు. మా ఆఫీసులో రిసెప్షనిస్టుగా పని చేస్తోంది. చాలా మంచిది నాయనా'

'మనోళ్లేనా?' అడిగాడు మళ్లీ

'కాదు. ఆయమ్మికి మనమేందో, మన జాతేందో చెప్పినా. అయినా సరే నన్ను పెళ్లి చేసుకుంటాననింది. నువ్వే కులమైతే నాకెందుకు. నువ్వంటే నాకిష్టం. మా ఇంట్లోవాళ్లకు నేను చెప్పుకుంటా అనింది'

'ఒరే. రోజూ పేపర్లలో, టీవీల్లో ఎన్ని జరగతా వుండాయి. చూస్తా వుంటేనే ప్రాణం పోతింది. వాళ్లోళ్లు ఎవురైనా ఇంటి మిందికొస్తే ఎట్టరా. ఈ వూళ్లో మనల్ని బద్దరిచ్చే వాళ్లు కూడా ఎవురూ లేరు. పరాయి వూరయిపోయె' భయంగా అన్నాడు నీరుగట్టోడు.

'ఏం భయం లేదు నాయినా! వాళ్లు దుడ్డున్నోళ్లు కాదు అవన్నీ చేసేదానికి. నువ్వొప్పుకుంటే చాలు. రేపువారం పెండ్లి' అన్నాడు.

'సరే కానీ. నువ్వు ధైర్యంగా వుండు. నాకుండేది నువ్వొక్కడే. మీరిద్దరూ కలిసి బతకాలనుకున్నాక నాకేం బాధ. నీకేది మంచిదనిపిస్తే అదే చెయ్యి'

తరువాతి వారమే ఇద్దరికీ గుళ్లో పెళ్లయిపోయింది.

అయితే అమ్మాయి వాళ్లింట్లో పెద్ద యుద్ధమే జరిగింది– 'ఇంత బతుకూ బతికి కడజాతోడితో పెళ్లేంద'ని.

'నేను మేజర్ని. నా ఇష్టమొచ్చినోడ్ని చేసుకునే హక్కు నాకుంద'ని ఇంట్లో నుంచి కట్టుబట్టల్తో వొచ్చేసింది.

కోడలి తెగువకి నీరుగట్టోడికి చాలా ముచ్చటేసింది. గడుసుపిండమే అనుకున్నాడు.

రెండునెల్లు కాపురం సజావుగానే సాగింది. ఇప్పుడే, వారం రోజుల్నుంచి ఇంట్లో వాతావరణం కొత్తగా వుంది నీరుగట్టోడికి. ఇంతకుముందులాగా తనను పొయ్యికాడికి రానీయడం లేదు కోడలు. తనతో కలిసి కూర్చుని అన్నం తినడం

లేదు. తానే పలకరించినా సమాధానం లేదు. వాళ్లిద్దరూ వుద్యోగం నుంచి ఇంటికొచ్చేదాకా తను చేసిన తప్పేందో అర్థం కాక విలవిల్లాడిపోతున్నాడు. కొడుకు కూడా అంటీ ముట్టనట్టు మాట్లాడుతున్నాడు. ఎవురి మనసులో ఏం జరుగుతోందో తెలీక తల చెడిపోతోంది నీరుగట్టోడికి. సొంతింట్లో పరాయోడిలాగా బతకతా వుండాడు. ఏం తింటా వుండాడో. ఏం తాగతా వుండాడో. వున్నట్టుండి ఎవురూ లేనోడైపోయినట్టుగా వుంది. ఊపిరి ఆడ్డం లేదు.

రోడ్డు మీద ఎవరి బండో ఎవరి బండికో టక్కర్ ఇచ్చినట్టుంది. ఇద్దరూ దిగి ఒకరిపైకి మరొకరు పోతూ ఉన్నారు. నీరుగట్టోడికి వాళ్లను చూస్తుంటే ఇవాళ ఉదయం ఇంట్లో జరిగింది గుర్తుకొచ్చింది.

రోజూలాగే తెల్లారే లేచిన నీరుగట్టోడు కోడలు వంట చేసుకుంటుంటే, అక్కడే కాసేపు తచ్చాడి, మాట్లాడ్డానికి ప్రయత్నించి అట్నుంచి సమాధానం లేకపోవడంతో ఏం తోచక బయటికొచ్చాడు. వీధి చివర మటన్ షాపులో నాటుకోడి కూర కనిపిస్తే ఒక అరకేజీ కొనుక్కుని ఇంటికి బయల్దేరాడు. ఎన్ని రోజులైందో నాటుకోడి కూర తిని. వూర్లో వున్నప్పుడు ఇంటికి చుట్టాలొస్తే ఇంట్లో పెంచుకునే కోళ్లలో ఒక దానికి మూడేది. కోడికూర వాసనతోనే సగం కడుపు నిండిపోయేది. పండగలా వుండేది. ఇప్పుడంతా రుచీపచీ లేని ఫారంకోళ్లు. పట్నం వొచ్చినప్పటి నుంచి చప్పిడి తిండికి, ఫారంకోడి కూర రుచికి మనసు చచ్చిపోయింది. ఆకలేస్తే ఏదోటి తిని లేవడం తప్ప మనస్ఫూర్తిగా తిండి తిన్నది లేదు. ఈరోజు భాయ్ షాపులో నాటుకోడి కూర దొరికేసరికి ఇంట్లో పరిస్థితులు కూడా మర్చిపోయాడు నీరుగట్టోడు. వండకుండానే మసాలా వాసన వస్తోంది వాడికి. హుషారుగా కూరతో ఇంటికి రాగానే బయటే ఆగిపోయేలా కోడలి గొంతు గట్టిగా వినిపిస్తోంది. కొంచెం కఠినంగా కూడా. అక్కడే ఆగిపోయాడు.

'పెళ్లికి ముందే చెప్పినా నీకు. మనిద్దరమే వుండాలని. రెండు నెలల్లో వూరికి పంపించేస్తా అన్నావు. ఇల్లొదిలి పెట్టేలా కనిపీయడం లేదు. ఎప్పుడు పంపిస్తావో చెప్పు' గద్దిస్తోంది కోడలు.

'ఇప్పుడాయనేం అడ్డం నీకు. నీకు తెలుసుకదా. ఆయనకు మనం తప్ప ఎవరూ లేరు. ఎక్కడికి పోతాడు పొమ్మంటే? సర్దుకో' బతిమాలుతున్నాడు కొడుకు.

'మా అమ్మ ఫోన్ చేసింది. ఇంటికొచ్చి నన్ను చూసిపోతానని. నువ్వంటే చదువుకున్నావు. నిన్ను చూస్తే ఎవరూ నీది తక్కువ కులమని అనుకోరు. మరి మీ నాయన? ఆయన... ఆయన అవతారం. ఆ బట్టలు. చూడ్డానికి నాకే నచ్చదు. రేపు మా అమ్మోళ్లు ఇంటికొస్తే ఆయన్ని చూసి ఏమనుకుంటారు? నీతో సర్దుకున్నా

ఆయన వున్న ఈ ఇంట్లో అర నిముషం కూడా వుండరు. వాళ్లు మనతో కలిసిపోయి, గొడవలన్నీ సర్దుకోవాలంటే ఆయన్ని మీ వూరు పంపించెయ్'

'నీకు ఏం చెప్పినా తలకెక్కదు. అంతగా మేము, మా కులము నీకు అడ్డొస్తే నువ్వే మీ ఇంటికి పో. ఇంకోసారి ఈ మాటెత్తితే మర్యాదగా వుండదు' కోపంగా అనేసి కొడుకు బయటకొచ్చాడు.

నిండుగా వున్న చెరువు కళ్ల ముందే కరిగి ఆవిరై పోయినట్టు అనిపించింది నీరుగట్టోడికి. తన జీవితం కొడుకు కోడలితో, పుట్టుకొచ్చే మనవడు, మనవరాలితో ఇక్కడే పండిపోతుందని కలలు కన్నాడు. తనమీద ప్రేమలేని మనుషుల మధ్య, తన అవసరం ఇంకెంతమాత్రం లేనివాళ్ల మధ్య వున్నాడని అర్థమైన మరుక్షణం వాడి ప్రాణం విలవిల్లాడిపోయింది. కొడుకు బయటకు రావడంతో సర్దుకుని అప్పుడే ఇంట్లోకొస్తున్నట్టు నటిస్తూ లోపలికి వెళ్లాడు నీరుగట్టోడు. కోడలు కూడా ఆఫీసుకు వెళ్లేవరకు మనసు వుగ్గబట్టుకుని వున్నాడు. వెళ్లిపోగానే బాధంతా కరిగిపోయేవరకు భోరున ఏడ్చుకున్నాడు. తరవాత కాస్త స్థిమితపడి ఆలోచించాడు. చూడగానే నోరు ఊరేలా బాగా మసాలా పెట్టి కోడికూర వండిపెట్టాడు. ఎంత నోరూరుతున్నా ఒక్క ముద్ద అన్నం కూడా తినలేకపోయాడు.

ఇదా అసలు సమస్య. వాళ్లిద్దరూ సఖ్యంగా లేకపోవడం వల్ల ముభావంగా వున్నారనుకున్నాడు ఇన్ని రోజులూ.  ఇప్పటికైనా తెలిసింది. తెలియక పోయివుంటే ప్రాణం ఇంకెంత కొట్టుకలాడేదో. ఇప్పుడు సమస్య నాతోనే. ఎక్కడికి పోవాలి తను. వూర్లో తనకుండేది ఒక జోబిడి. అది కూడా చూసేవాళ్లులేక ఈపాటికి పడిపోయుంటుంది. కానీ వెళ్లిపోవాలి. కళ్లల్లో పెట్టుకుని పెంచుకున్న కొడుకు తన వల్ల నలిగిపోవడం బాగలేదు. పరువుహత్యల గురించి విని కొడుకు ప్రాణం గురించి భయపడ్డాడే కానీ, కొడుకుని దూరం చేసి తనను ప్రాణం లేనోడిగా నిలబెడ్తారని అనుకోలేదు. తను లేకపోతే వాళ్లిద్దరూ బాగుంటారు. వాళ్లు సంతోషంగా వుండటమే తనకు కావల్సింది.

ఆ మాట అనుకున్నాక ఇంట్లో ఉండబుద్ధి కాలేదు. కొడుకూ కోడలు ఆఫీసు నుంచి వచ్చే వరకూ అలా తిరుగుదామని రోడ్ల మీద పడ్డాడు. ఎక్కడైనా ఒక చెరువో దొరువో కనిపిస్తే కూచుని మనసు తేలిక పరుచుకుందామనుకున్నాడు. కాని ఈ నగరంలో కాలుష్యపు ఏరు... కనికరం లేని బతుకుపోరు తప్ప మరేం కనిపించలేదు.

చెట్టు కింద నుంచి కదిలిన నీరుగట్టోడు తిరిగి తిరిగి ఆఖరుకు ఇంటికొచ్చి పడ్డాడు.

సాయంత్రం ఆఫీసు నుంచి కొడుకూ కోడలు వచ్చేసరికి స్నానం చేసి మంచి బట్టలు వేసుకుని ఎదురుచూస్తూ ఉన్నాడు.

వాళ్లు రాగానే 'ఇట్టొచ్చి కూర్చోండి. మీ ఇద్దరికీ ఒక విషయం చెప్పాల' అన్నాడు.

'ఏంది నాయినా' అన్నాడు కొడుకు.

కోడలు చూస్తూ నిలుచుని ఉంది.

'అబయా... నాకు నీళ్లతో మాట్లాడటం తెలుసుగాని మనుషుల్తో మాట్లాడటం తెలియదు. చెరువుల్లో, బావుల్లో నీళ్లు కనిపిస్తున్నాయంటేనే అవి మనతో మాట్లాడుతున్నట్టు లెక్క. నీళ్లనే ఏముంది నా చిన్నప్పుడు ఊళ్లలో మనుషులు కూడా అన్నీ మాట్లాడుకునేవారు. మాట్లాడకపోయినా ఎదుటోడి మనసులో ఏముందో తెలిసిపోయేది. ఇప్పుడెక్కడ? బోర్ల కాలం. నీళ్లు లోపల ఎన్నున్నాయో, ఎంతకాలం సుఖంగా వాటిని వాడుకోవచ్చో తెలిసే అవకాశం లేదు. ఎప్పుడో వున్నట్టుండి బోరెండిపోయి నీళ్లు రావడం మానేస్తాయి. మనుషులు కూడా అట్టే తయారైనారు. ఎప్పుడు వాళ్ల మనసులు ఎండిపోతాయో ఎవరికి తెలుసు. అబయా.. నేను బతికినంత కాలం గట్టు మీద గౌరవంగా బతికినోణ్ణేగాని వాలులో దొర్లి పడినోణ్ణి కాదు. ఇప్పుడు కూడా పడను. వూర్లో జోబిడి బాగు చెయ్యమని మీ చిన్నాయనకు ఫోన్ చేసి చెప్పినా. ఈ పట్నంలో మాటామంతీ లేని మనుషుల మధ్య వుండటం కష్టంగా వుంది. మీరిద్దరు ఒకరికొకరు తోడున్నారు కాబట్టి నా అవసరం అంతగా వుండదనిపించి వూరెళ్లిపోతావుండా. చెరువుతో మాట్లాడుకుంటానో, చావుకబురు చెప్పుకుంటానో బతికేస్తా. నాకు చుట్టూ తేమ ఉండాలి. తేమ లేని తావులో నేను ఉండలేనురా' అని చెప్పాల్సిందంతా చెప్పి చేతిసంచీ అందుకున్నాడు నీరుగంటి చిన్నబ్బ.

మనసులో దాచుకున్న దోసెడు నీళ్లు వాడి కళ్లలోంచి ఉబికి వస్తున్నాయిప్పుడు.

# వే టు మెట్రో



## కుప్పిలి పద్మ

తెలుగు పాఠకులకు పరిచయం అక్కర్లేని పేరు. పుట్టింది వైజాగ్, పెరిగింది రాజమండ్రి. నగర జీవనంలో స్త్రీల సంఘర్షణలను మొదటగా నమోదు చేయడమే కాదు స్థిరంగా కొనసాగిస్తున్నారు. ఏడు కథా సంపుటాలు, మూడు నవలలు, ప్రేమలేఖలు, మ్యూజింగ్స్ వెలువరించారు. 'మసిగుడ్డ', 'ముక్త', 'యిన్స్టంట్ లైఫ్', 'సాలభంజిక' తదితర కథలు వీరి దృష్టికోణాన్ని నిశితంగా పాఠకులకు చేరవేశాయి. 'వార్త' దినపత్రికలో దశాబ్దకాలం పాటు 'మైదానం' కాలమ్‌ను నిర్వహించడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఇటీవల 'నెమలీకలు పూసే కాలం' కవిత్వం, 'మంత్రనగరి సరిహద్దులలో...' ప్రేమకథలు పుస్తకాలుగా వచ్చాయి. స్త్రీ అంశతో రాయడం వీరి ప్రధాన రచనా ఉద్దేశం.

నివాసం: హైదరాబాద్

మొబైల్ : 98663 16174

బొంగరాన్ని సంధించి వదిలేవాళ్ళకి గిర్రున తిరిగే బొంగరం వో కేరింత. కానీ అలా తిరిగి తిరిగి యే క్షణాన తను వొరుగుతుందోనని బొంగరానికెంతో ఆందోళనగా వుంటుంది. అలా వాలి వో చోట వుండనిచ్చినా వో పద్ధతి. వున్న చోటనే వుండటంలో చిన్నదో చితకదో వో నిశ్చింత. కానీ అలా వుండనివ్వరు కదా. ఆ తాడుని అందుకొన్న మరో చెయ్యి తన ప్రతాపం చూపిస్తుంది.

అంట్లు తోముతోన్న ఝాన్సీకి బొంగరం ఆట కళ్ళ ముందు కదుల్తోంది.

యింతకు ముందు యీ అపార్ట్‌మెంట్‌లో పిల్లలు, పెద్దలు ప్లే యేరియాలో ఆడుతోన్నప్పుడు బొంగరం పరిభ్రమణాన్ని తదేకంగా చూసేది. కానీ యిప్పుడామెలో ఆ పారవశ్యం లేదు.

ఆ బొంగరంలో ఆమెకి తన జీవితం కనిపిస్తోంది.

ఆ తాడు యిప్పుడు యేయే చేతుల్లోకి మారుతుందా అనే ఆదుర్దాగానూ వుందామెకి.

405 ఫ్లాట్‌లో పని పూర్తి చేసే సరికి సాయంత్రం వెలుతురు మందగించింది. ఝాన్సీ అన్ని ఫ్లోర్స్ కారిడార్స్‌లో లైట్స్ వేసింది. తమకిచ్చిన వాచ్‌మెన్ గదిలోకి వచ్చి పిల్లలను అన్నం తినేసి, చదువుకోమని చెప్పి అపార్ట్‌మెంట్ మెయిన్ గేట్ దగ్గరకి వచ్చింది.

సరిగా అప్పుడే కూతురి డ్యాన్స్ ప్రోగ్రాం కోసం కుట్టిన బట్టలు తీసుకురావడానికి టైలర్ దగ్గరకి బయలుదేరిన 302 మేడమ్ కార్‌ని చూసి అక్కడ నుంచి యేదో పనున్నట్టు ఝాన్సీ పక్కకి తప్పుకొంది.

తను బయటకి వెళ్ళుతున్నప్పుడు యెదురు రావొద్దని రెండ్రోజుల క్రితమే ఆమె సూపర్‌వైజర్ ప్రవీణ్‌తో ఝాన్సీకి స్పష్టంగా చెప్పించింది.

బొట్టు చెరిపేసుకొని యింకా పట్టుమని నెలరోజులు కాలేదేమో బొట్టు లేని ముఖం మనసుకింకా అలవాటు కాలేదు ఝాన్సీకి.

బొట్టు పెట్టుకోవాలనే వుంది. కానీ యీ బొట్టుకి అంజిబాబుకి ముడి పెడుతున్నారు తన వాళ్ళు. అంజిబాబు యెక్కడికి వెళ్లిపోలేదు తన మనసులోనే వున్నాడు. తన బొట్టుబిళ్ళల అట్టా తన పరుసులో తన హృదయానికి దగ్గరగానే వుంది. అప్రయత్నంగా ఆమె చెయ్యి జాకెట్టుకి యెడమ వైపున వాలింది. పల్చని పర్సు చేతికి తగిలింది.

యేయే ఫ్లాట్స్ వాళ్ళు యెలా యెలా ప్రవర్తిస్తారనే గ్రహింపు దాదాపు పదేళ్ళ నుంచి యీ అపార్ట్‌మెంట్‌లోనే పని చేస్తున్న అనుభవం ఝాన్సీకి నేర్పింది.

అయినా సరే ఝాన్సీ ఫ్లాట్స్ వాళ్ళ నుంచి యిలాంటి ఆజ్ఞ వస్తుందని వూహించలేకపోయింది.

వారం రోజుల్లో కొత్త వాచ్‌మెన్ వస్తున్నాడని కమిటీ వాళ్ళు ఆమెని యిల్లు ఖాళీ చెయ్యమన్నారని ఝాన్సీకి సూపర్‌వైజర్ చెప్పాడు.

“యిల్లు ఖాళీ చెయ్యాలా. యెందుకు... అయినా కొత్త వాచ్‌మెన్ రావడం యేంటి” ఆదుర్దా ఝాన్సీ స్వరంలో.

సూపర్‌వైజర్ తనకేం తెలీదన్నట్టు కళ్ళు పైకెత్తి రెండు చేతులూ ఆకాశం వైపు చూపించాడు.

కమిటీ వాళ్ళనే అడుగుతాను అని ఝాన్సీ సెక్రెటరీ యింటికి వెళ్లి అడిగింది.

అందరితో మాటాడి చెపుతానందామె.

• • •

వాళ్ళంతా యేం మాటాడుకున్నారో కానీ ఆ తరువాత రోజు సెక్రెటరీ బయటకి వెళుతూ గేట్ దగ్గర ఝాన్సీ కనిపిస్తే “వీలుకాదు. వాచ్‌మెన్ పని అంటే మొగవాళ్ళు చేసే పని. ఆడమనిషివి నువ్వతనికి చేదోడు వాదోడుగా పనులు చెయ్యోచ్చు. కానీ నువ్వెలా మొత్తం వాచ్‌మెన్‌గా వుండగలవ్ అన్నారు కమిటీ మెంబెర్స్' అని చెప్పేసి ఝాన్సీకి మాటాడే అవకాశమే యివ్వకుండా తెరచి వున్న మెయిన్ గేట్ నుంచి కారు డ్రైవ్ చేసుకొంటూ బయటకి వెళ్లిపోయింది.

ఆ వెళ్ళిపోతున్న కారు రేపిన పల్చని దుమ్ము కాసింత పొగ ముక్కులోకి వెళ్ళకుండా చేత్తో అటూ యిటూ విసురుకొంటూ ఝాన్సీ తనకి యీ విషయంలో యెవరు సహాయం చెయ్యగలరా అని ఆలోచించింది.

• • •

406లో వున్న మేడం బస్తీల్లో స్త్రీల గురించి పని చేస్తుందని, అప్పుడప్పుడూ టీవీల్లో కూడా స్త్రీల సమానత్వం గురించి మాటాడుతుందని అమె దగ్గరకెళ్ళి వాచ్‌మెన్ పని చేసుకోగలను.. నేనే చేసుకొంటానని అడిగింది ఝాన్సీ.

“యిక్కడ నా మాట యెవ్వరూ వినరు... యిక్కడ కొన్ని రూల్స్ వున్నాయి. వాటిని ఫాలో అవ్వాలి...’ అని ఆగి వో అరక్షణం తరువాత ‘వో... వాటే బ్రైట్ ఐడియా... వాచ్ విమెన్ కాంసెప్ట్ మీద పని చెయ్యాలి. గుడ్... గుడ్... ప్రపోజల్ రాయాలి వాళ్ళకి...’ అని తనలో తనే స్వగతంలా అనుకొంటూ ‘సారీ... హెల్ప్ చెయ్యలేను’ అందామె.

‘యెవరికి రాస్తారమ్మా... యీ అపార్ట్‌మెంట్ కమిటీకా” అడిగింది ఝాన్సీ.

ఆమె వో క్షణం అయోమయంగా చూసి “ప్చ్... వీళ్ళకి కాదు... యీ మార్పు రావాలంటే పెద్ద వుద్యమం చెయ్యాలి. వేరే దేశం వాళ్లకి రాయాలి” అంది.

‘తనకి వచ్చిన వాచ్‌మెన్ పని చెయ్యటానికి, తనని కొన్నాళ్ళు యిక్కడ వుండనివ్వటానికి ఆమె అంత పెద్ద పని చెయ్యాలా... అదీ వేరే దేశం వాళ్ళతో కలిసి... యేమిటో నా సమస్యకి పరిష్కారం అంత కష్టమా’ అనుకొంది ఝాన్సీ.

• • •

యింటి పని చేసే 301 మేడంకి ఝాన్సీ విషయం చెప్పింది.

‘వాచ్‌విమెన్‌గా వుండటం వీలుకాదు అంటున్నారు ఝాన్సీ. పోనీ నువ్వు వుంచమని అడుగుతోన్న ఆ కొన్ని నెలలు కూడా నేను నిన్ను యింట్లో వుండమనలేను. చుట్టం చూపుగానో, స్నేహంతోనో వచ్చిన వాళ్ళే వో రోజు కంటే యెక్కువ వుంటే యిబ్బందిగా ఫీల్ అయ్యే రోజులకి యెప్పుడో వచ్చేసాం. వచ్చేవాళ్ళు కూడా వుండటానికి యిబ్బందిగా ఫీల్ అవుతున్నారు. నువ్వు వొక్కదానివే కాదు పైగా యిద్దరు పిల్లలు. యింతమందిని యెవ్వరూ తమతో వుండమని అడగలేరు. యేం అనుకోకు... కానీ దగ్గరలోనే యిల్లు తీసుకో. మరో రెండిళ్ళల్లో పని వెతుక్కో. అవునూ మన యేరియాలో బస్తీలేం వున్నట్టు లేవు కదా’ అని సలహాలని సందేహాన్ని కలిపి వెలిబుచ్చిందామె.

‘అవును... యిక్కడ తను వుండటానికి బస్తీలు యేం వున్నాయో యెక్కడికి వెళ్ళుతుంది తను’ అనుకొంది ఝాన్సీ.

కొత్తపెళ్ళి కూతురుగా అంజిబాబు వెంట యీ అపార్ట్‌మెంట్‌కి వచ్చింది. గత తొమ్మిదేళ్ళుగా యిక్కడే వుంటున్నారు. తాము యిక్కడకి వచ్చినప్పటికే సైబరాబాద్ పెద్దపెద్ద భవంతులతో పూర్తిగా కాపుకొచ్చిన అరటిగెలలా వుంది.

పిల్లలిద్దరూ యిక్కడే పుట్టారు. పెద్దాడికి యేడేళ్ళు. చిన్నదానికి నాలుగేళ్ళు. పిల్లల్ని బాగ చదివించుకోవాలని దగ్గర్లో వున్న కాన్వెంట్‌లో వొక్కొక్కరికి యేభై వేలు డొనేషన్ కట్టారు. ఆ డబ్బు కోసం చీటీని కొంత నష్టానికి ముందే పాడారు. యిక్కడి నుంచి వెళ్ళాలి అంటే వుండే యిల్లొక్కటే సమస్య కాదు. కోల్పోయే పని. నెలనెలా కట్టాల్సిన చీటీలు కళ్ళ ముందు కదిలాయి ఝాన్సీకి.

పిల్లల డొనేషన్ చీటీ, అలానే అంజి ఆఖరి చెల్లి పెళ్ళికని మరో చీటీ పాడి లక్ష రూపాయలు వూరికి పంపారు. అంజి తల్లి బంగారం గాజులంటే యీ మధ్యే మరో చీటీ పాడి నలభై వేలు పంపారు.

యీ మూడు చీటిలకే నెలకి దగ్గర దగ్గర పద్దేనిమిది వేలు కడుతున్నారు.

అంజికి వాచ్‌మెన్ పనికి  పది వేలు, పన్నెండు కార్లని తుడవటం వల్ల ఆరువేలు వస్తాయి. ఝాన్సీ మూడు యిళ్ళల్లో చేసే పనికి పద్దెనిమిది వేలు వస్తాయి. యీ ముప్ఫై నాలుగు వేలల్లోంచి చీటీ డబ్బులు కడుతున్నారు. యింటి అద్దె లేదు. కరెంట్, కేబుల్, నీళ్ళ బిల్లు లేదు. చీటీలు కట్టగా మిగిలిన పదహారు వేలల్లో అంజి రోజూ తాగడానికి దాదాపు ఐదు వేలు నెలకి ఖర్చు చేస్తాడు. యిక మిగిలిన పదకొండు వేలల్లో పిల్లల స్కూల్ ఫీజ్, ట్యూషన్ ఫీజు, యూనిఫాం, పుస్తకాలు, ప్రతి పండక్కి పుట్టిన రోజులకి పిల్లలకి కొత్త బట్టలు, వాటిని జరపటం, అత్తగారికి ఖర్చు కోసం నెలకో వెయ్యి, తమకి నెలకి కావలసిన సరుకులు తెచ్చుకోవటం ఆ యింట్లోనో యీ యింట్లోనో చేసే చిన్నచిన్న పనులకి వచ్చే వందో రెండొందల్లో మొత్తానికి డబ్బులకి తడుముకోవలసిన చికాకు లేకుండా, వెనకేసుకొన్న పైసలేం లేకపోయినా జీవితం సాఫీగా సాగుతోంది.

మూడు నెలలకి వోసారి రేషన్ తెచ్చుకోడానికి వూరెళ్ళి వస్తారు. ఆ రేషన్ కార్డ్ పోకుండా. మళ్ళీ వోటు వెయ్యడానికి వెళ్ళినప్పుడు తప్పా పెద్దగా సెలవలూ పెట్టరు.

యీ తొమ్మిదేళ్ళలో యింటికి కావాల్సిన టివీ, ఫ్రైజ్, మిక్సీ, గ్యాస్ స్టవ్, గాడ్రెజ్ బీరువా, మంచం, పిల్లలకి వీడియో గేమ్స్, తమిద్దరికీ నెట్ ఫోన్, పిల్ల చెవులకి బంగారపు పోగులు, కాళ్ళకి వెండి పట్టీలు, బాబుకి వో వుంగరం, తన కోసం జుంకాలు యిలా కాసింత బంగారాన్ని వీలైనప్పుడంతా ఝాన్సీ సమకూర్చుకొంటోనే వుంది.

అంజి శరీరాన్ని కాస్త కూడా అలవనీయడు. రాత్రిపూట శుభ్రంగా తాగి పదింటికల్లా నిద్రపోయేవాడు. అప్పుడు మిగిలపోయిన పనులు ఝాన్సీయే చేసేది. నైట్ సెక్యూరిటీ గార్డ్‌కు కార్ల రాకపోకల్లో సాయం పట్టేది. ముఖ్యంగా వారాంతంలో అయితే పార్టీలకు వెళ్ళివచ్చే యువతీ యువకులు, పెద్దలూ కూడా యెక్కువ. తెల్లారి మూడు వొక్కోసారి నాలుగు వరకు వస్తూనే వుంటాయి కార్లు. తనే గేట్ తీయడం మూయడం చేసేది.

వుదయం ఐదింటికి లేచి అపార్ట్‌మెంట్ ముందు వూడ్చి కళ్ళాపి జల్లి ముగ్గు పెట్టేది. నీళ్ళ మోటార్లు వేసేది. జనరేటర్‌కి కావాల్సిన డీసిల్ వుందో లేదో చూసుకొనేది.

అపార్ట్‌మెంట్‌లో అంజిబాబు కడగటానికి వొప్పుకొన్న వో పది కార్లని తెల్లారక ముందే ఝాన్సీనే కడిగేది. అంజిబాబు యెప్పుడైనా తుడిచేవాడు.

వుదయమే ముగ్గు వెయ్యకపోతే యెలా అని ఆమె పని చేసే యిళ్ళల్లో వాళ్ళు అప్పుడెప్పుడో అన్నప్పటి నుంచి తెల్లార్తునే ఆ యిళ్ళ ముందు తుడిచి ముగ్గు పెట్టేసేది.

సుద్దముక్క ముగ్గుని యిష్టపడనివాళ్ళే వాళ్ళంతా.

యింట్లో వంట ముగించి, పిల్లలని రెడీ చేసి, టిఫిన్ పెట్టి, బాక్స్ కట్టి యిద్దరు పిల్లలని బడికి పంపించి తను పని చేసే యిళ్ళల్లో పనికి వెళ్ళేది. తినడానికి, బడికి వెళ్ళడానికి పేచి పెట్టని తన పిల్లలని చూస్తే ఝాన్సీకి భలే ముద్దు.

అంజిబాబు తీరిగ్గా యే యెనిమిదికో లేచేవాడు. శుభ్రంగా స్నానం చేసి వుతికి యిస్త్రీ చేసిన బట్టలేసుకొని నుదిటిన బొట్టు పెట్టుకొని దేముడి ముందు వో అగరొత్తి వెలిగించి అప్పుడొచ్చి గేట్ ముందు కూర్చునేవాడు.

తన యింటిని ఆ అపార్ట్‌మెంట్‌ని తన రెండు రెక్కలపై నిలబెట్టటం చూసిన వాళ్ళంతా ఝాన్సీ సమర్థతని మెచ్చుకొనేవారు.

నెలన్నర క్రితం వో పాడు జ్వరం బారినపడి అంజిబాబు పోయాడు.

అంజిబాబు పోయాక 'ఆ బాడీ యిక్కడికి తీసుకు రావొద్దు. దినాలు యిక్కడొద్దు. మీ బంధువులంతా వస్తే యెక్కడుంటారు' అని మేనేజ్‌మెంట్ కమిటీ సూపర్‌వైజర్‌తో ఝాన్సీకి ఫోన్‌లో చెప్పించారు.

ఆమేం ఆశ్చర్య పోలేదు. నొచ్చుకోనూ లేదు.

ఫ్లాట్‌లోని పెద్దవారు పోయినప్పుడు వాళ్ళని అక్కడ వుంచడానికి వొప్పుకోరు. సొంతవాళ్ళకే దిక్కు లేదు. తనెంత.

మేనేజ్‌మెంట్ ఝాన్సీకి యిమ్మని పదివేలుని సూపర్‌వైజర్‌కి యిస్తూ అతన్ని మరో కొత్త వాచ్‌మెన్ని వెతకమని చెప్పారు.

అంత తొందరగా వాచ్‌మెన్ యెక్కడ దొరుకుతాడు అనుకొంటూ దొరికేక ఝాన్సీకి ఆ విషయం చెప్పొచ్చులే అనుకున్నాడతడు. పిల్లల స్కూల్ పోతుందని ఆమె ఊరి నుంచి త్వరగానే రావొచ్చు... అప్పటి వరకూ యిక్కడ ఆ డీసిల్ పని లైట్స్ వేసే పని యిలా చాల పనులు తన నెత్తి మీదే పడతాయి అనుకున్నాడు కూడా.

అంబులెన్స్‌లోనే పిల్లలు, అంజిబాబు తమ్ముడు, ఝాన్సీ తమ వూరు వెళ్ళారు.

అక్కడ కార్యక్రమాలన్నీ పూర్తి అయ్యాక పదిహేను రోజులకే ఝాన్సీ తిరిగి అపార్ట్‌మెంట్‌కు వచ్చింది.

అప్పటికీ వాచ్‌మెన్ కుదరలేదు.

వాచ్‌మెన్ కుదరక ముందే ఆమెని గది ఖాళీ చెయ్యమంటే రోజు వారి పనులకి యిబ్బందని సూపర్‌వైజరే అప్పుడే ఆమెకీ విషయం చెప్పొద్దని కమిటీవాళ్లకి సలహా యిచ్చాడు. వాళ్ళూ నిజమే కదా అతనికి అప్పచెప్పాం అతనే చూసుకుంటాడు... యివన్నీ పట్టించుకొనే టైం తమకి యెక్కడుంది... అపార్ట్‌మెంట్ పనులు చూసుకోడానికేగా సూపర్‌వైజర్ అనుకున్నారు.

ఝాన్సీ వచ్చిన రెండు వారాలకి కొత్త వాచ్‌మెన్ కుదిరాడు. పనిలో చేరడానికి వారం రోజుల టైం అడిగాడు. అప్పుడు ఝాన్సీకి వో వారం టైం యిచ్చి యిల్లు ఖాళీ చెయ్యమని సూపర్‌వైజర్ చెప్పాడు.

"పిల్లల చదువులు మధ్యలో వున్నాయి. యిప్పటికిప్పుడు ఖాళీ చెయ్యమంటే యెలా... పనులన్నీనే చేస్తున్నాగా. మా ఆయన వున్నప్పుడు కూడా నేనే కదా అన్నీ పనులు చేసేదాన్ని" అందామె.

"మాటలు అనవసరం. డెసిషన్ అయిపోయింది" స్పష్టంగా చెప్పేసి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు సూపర్ వైజర్. .

'అంతగా నా పనిని మెచ్చుకునే వారిప్పుడు మొగమనిషే వాచ్‌మెన్‌గా వుండాలి అంటున్నారు. పిల్లల చదువులు అయ్యేవరకైనా వుండే అవకాశం యివ్వటం లేదు. యిన్నాళ్ళుగా వాళ్ళు తనని మెచ్చుకోవటాన్ని యెలా అర్థం చేసుకోవాలో తెలియక, మారిపోతోన్న ప్రపంచపు తీరా యిది' అనుమానంగా అనుకొంది ఝాన్సీ.

• • •

ఝాన్సీ పిల్లలకి టిఫిన్ పెట్టింది. పద్ధతిగా తినేసి, బడికి వెళ్ళుతోన్న పిల్లలని చూస్తే ఝాన్సీకి కాస్త మనసు స్థిమితపడుతోంటుంది.

208లో పనికి వెళ్ళాల్సిన సమయం అవుతోంటే గబగబా వెళ్ళింది.

నిన్న మొన్నటి వరకు పనికొచ్చిన తన ముఖం యిప్పుడు యెదురికి పనికిరాదని ఝాన్సీకి తెలుసు.

ఆ యింటి యజమాని ఆఫీసుకి బయలుదేరే సమయం కంటే కాస్త ముందుగానే ఆ యింటికి పనికి వెళ్ళింది.

గిన్నెలు తోమి బట్టలుతికి ఆరేస్తోంటే ఆమె "కాస్త చేపలు శుభ్రం చేసిపెట్టు" అని అడిగింది.

శుభ్రం చేస్తూ "అమ్మా యీ యేడాది పిల్లలు పరీక్షలు అయ్యే వరకైనా వుండనివ్వండి అమ్మా" నమ్రతగా అడిగింది ఝాన్సీ.

"నీకు తెలుసుగా... నాకు టైం వుండదు. నేనేప్పుడూ యీ మేంటెన్స్ విషయాల్లో కల్పించుకొనని. వాళ్ళు అడిగిన డబ్బులు కట్టటం. నీళ్ళు కంటీన్యూస్‌గా వచ్చినంత కాలం నేను యింకేం పట్టించుకోను" అందామె.

"ఆ యిన్స్యూరన్స్ డబ్బులతో అప్పులు తీర్చేసుకో" అందామె.

"మాకేం యిన్స్యూరెన్స్ వుందమ్మా... వుంటే యజమాని పోతే చాల డబ్బులు కుటుంబానికి వొస్తాయంట కదమ్మా... ఆ 508 మేడం చెప్పారు... మా బతుకులకి అంత ముందు చూపు యేడ" నిర్లిప్తంగా అంది ఝాన్సీ.

చేపలు శుభ్రం చెయ్యటం పూర్తి చేసి వాసన పోయేట్టు చేతులు శుభ్రంగా కడుక్కొంది.

అయినా వాసన పూర్తిగా పోలేదు.

• • •

"యిల్లు దొరికిందా" అడిగింది 105 ప్లాటామె.

"యెక్కడా... లేదమ్మా... యీ చుట్టుపక్కల బస్తీలు లేవు కదమ్మా"

"మరెలా"

"దూరంగా వెళ్ళాలంటే పిల్లల బడికి దూరం అయిపోతుంది. యీ స్కూల్ బాగుంటుందని డొనేషన్ కట్టామప్పుడు. యిప్పుడు వేరే స్కూల్ అంటే మళ్ళీ డొనేషన్ కట్టాలి. అదీకాక యిప్పుడు సంవత్సరం మధ్యన కదమ్మా. కాస్త సెక్రటరీ మేడం గారికి చెప్పండమ్మా" బతిమాలుతూ అడిగింది ఝాన్సీ.

"ప్చ్. యెవరూ వినటం లేదు ఝాన్సీ. కొత్త వాచ్‌మెన్‌ని కూడా మాటాడేరుగా. మంచిరోజు చూసుకొని వస్తాడని సూపర్‌వైజర్ చెప్పాడు" అందామె.

అంతా వొట్టిది... యీమె మాటాడి వుండదు. యీ మేడంలందరూ కలిసి వో మాటగా ఝాన్సీ యీ పని చెయ్యగలదు అని వో మాట అంటే సార్లు యేం అనరు. ఆ సార్లుకి అనాలని వున్నా యీ ఆడవాళ్ళు యేం అంటారోనని వాళ్ళకి భయం అని  సూపర్‌వైజర్ మొన్ననే మాటల్లో చెప్పాడు.

* * *

సైబరాబాద్‌లో రోడ్‌కి అటూ యిటూ వున్నా పెద్దపెద్ద భవనాలని చూస్తూ నడుస్తోన్న ఝాన్సీ మనసు పరిపరి విధాల పోతోంది.

యిల్లు యేదో వొక బస్తీలో వెతుక్కోవాలి. పిల్లల్ని స్కూల్‌కి బస్సులోనో, మెట్రోలోనో, యం.యం.టియస్.లోనో వెళ్లి రావటం అలవాటు చెయ్యాలి. అంజి సంపాదించే ఆ పద్దెనిమిదివేలు కోసం తనెంతగా పని చెయ్యాలో. వంట చెయ్యటానికి వో రెండు యిళ్ళు చూసుకోవాలి. ఆ పెద్ద పెద్ద గాజు అద్దాల భవనాల్ని చూస్తూ తన పిల్లల్ని బాగ చదివించుకోవాలి. యిలాంటి ఆఫీస్‌ల్లో వుద్యోగం చేసేంత బాగ చదివించుకోవాలి. యేమైనా సరే పిల్లల స్కూల్‌ని మార్చను అని గట్టిగా ఝాన్సీ నిర్ణయం తీసుకొంది.

• • •

ఆ రాత్రి పిల్లలు నిద్రపోయాక కూర్చుని కాస్త తీరుబడిగా ఆలోచించుకోవాలని పెన్, పేపెర్ తీసుకొని యిక్కడ నుంచి వెళ్లి పొతే తగ్గిపోయే సంపాదన యెంతో, పెరిగే ఖర్చులు యెన్నో రాసుకొంటే యింటి అద్దె, కరెంట్, కేబుల్, నీళ్ళ బిల్లు పెరుగుతుంది. అంజిబాబు సంపాదన తగ్గటమే కాక వో ఆరువేలు వరకు ఖర్చులు పెరుగుతాయి. అంటే తనిప్పుడు అదనంగా వో యిరవై రెండు వేలు సంపాదించాలి.

యీ యేరియాని వదిలి వెళ్ళటం యిప్పట్లో కుదరదు. మరో యేరియాలో యింతింత జీతాలూ యింటి పనికి, వంట పనికి రావు. పిల్లలు దూరం నుంచి రావటానికి ఆటో పెట్టాలి. అదో ఖర్చు. కానీ తప్పదు. చుట్టాలంతా వూర్లో వున్నారు. స్నేహితులూ లేరిక్కడ.

యే అపార్ట్‌మెంట్ వాళ్ళేనా వాచ్‌మెన్‌కి మాత్రమే యిల్లు యిస్తాం అంటున్నారు. సర్వెంట్ క్వాటర్స్ వున్న వాళ్ళూ కూడా డ్రైవర్ పని చేసే వాళ్లకి యిల్లు యిచ్చి ఆడ మనిషిని యింటి పనికో వంట పనికో పెట్టుకొంటారు. వర్కింగ్ విమెన్, మెన్స్ హాస్టల్స్‌లో కూడా గది యిచ్చి పని దొరుకుతుందేమోనని వాటి చుట్టూ తిరిగింది. పని వున్నా గది లేదు. కొన్ని చోట్ల పని లేదు.

తనిప్పుడేం చెయ్యాలి. తెల్లారితే కొత్త వాచ్‌మెన్ వస్తున్నాడు. గది అప్పచెప్పమని రాత్రే సూపర్‌వైజర్‌తో కబురు పంపించారు.

యేదో వొకటి చెయ్యాలి. యెక్కడికి వెళ్ళాలి. కనీసం మరో నెలరోజులు వుండటానికి యిక్కడ మరో గదీ లేదు. యెప్పటికి తను కుదురుకోగలదో.

రోడ్డు మీద వుండటానికి పేమెంట్స్ లేవు. ఫ్లైవోవర్స్ మెట్రో స్టేషన్స్, మెట్రో స్తంభాలకి స్తంబాలకి నడుమ వున్న ప్రదేశమంతా రంగు రంగుల క్రోటన్ మొక్కలతో నింపేసారు. కాస్త దూరంలో వున్న బస్తీలో యిల్లు దొరికే వరకూ యెక్కడుండాలి. తనలాంటి వాళ్ళు వుండే హాస్టల్స్ లేవు. ఆలోచించి ఆలోచించి విసుగొచ్చేసింది. ఆ విసుగులోంచే ఆమెకి వో ఆలోచన తళుక్కుమంది. అది మాయమైయ్యే లోగానే ఆమె ఆ పని చేసైయ్యాలని నిర్ణయించుకొంది.

తనవి పిల్లలవి అవసరమైన బట్టలు వొక సూట్‌కేస్‌లో, మరి కొంత సామాను వో లెదర్ బ్యాగ్‌లో సర్దింది. పిల్లల పుస్తకాలు అన్నీ స్కూల్ బ్యాగ్‌లో పెట్టింది. బయట సామాను బట్టలు అన్నీ బీరువాలో సర్దింది. తాళం వేసింది పిల్లలిద్దరిని లేపి రెడీ చేసింది.

ఆ గదిని వొక్కసారి పరిశీలనగా అంగుళం అంగుళం చూసుకొంది.

గదిలోంచి బయటకి వచ్చింది.

నైట్‌డ్యూటీ చేస్తున్న సెక్యూరిటి గార్డ్‌కి గది తాళం యిచ్చి సూపర్‌వైజర్‌కి యివ్వమని చెప్పింది. తన చేతిలో సూట్‌కేస్ గార్డ్ కూర్చున్న కేబిన్‌లో వుంచింది.

తను పని చేస్తున్న యిళ్ళకి వెళ్లి యింటి ముందు ముగ్గు వేసింది. కొంత పని చేసి మళ్ళీ వస్తానని వాళ్ళకి చెప్పి పిల్లలని స్కూల్‌కి వెళ్ళే దారిలో వున్న బండి మీద యిడ్లీ కొంది. ముగ్గురూ తిన్నారు.

పిల్లలకి బడి దారి తెలుసు. వాళ్ళని బడికి వెళ్ళమని చెప్పి తిరిగి అపార్ట్‌మెంట్‌కి వచ్చింది.

అప్పటికి కొత్త వాచ్‌మెన్ కుటుంబం వచ్చారు. యిద్దరు పిల్లలు తన పిల్లల వయసే వుంటుంది.

గదిలో సామాను తీయలేదింకా అన్నాడు సూపర్‌వైజర్.

'నాకు యిల్లు దొరికే వరకూ నా సామాను యిక్కడే వుంటుంది. కాదనకండి' అని ఆ సూపర్‌వైజర్ చేతిలో మూడు వేలు పెట్టింది.

అలా అయితేనే అతను కమిటీవాళ్లకి, యీ కొత్త వాచ్‌మెన్‌కి సర్ది చెపుతాడు.

వచ్చిన వాళ్ళని 'మీకు మంచం వుందా' అడిగింది ఝాన్సీ.

లేదన్నారు.

'అన్నా, నాకు కావల్సిన సామాను తీసుకున్నా. పెద్ద గదిలోకి మారాక మిగిలిన సామాను తీసుకుపోతా. మంచం, టివీ, ఫ్రిజ్, గ్యాస్‌బండ, బీరువా వున్నాయి. బీరువాలో నా సామానుంది. అది తప్పా మీరు అన్నీ వాడుకోవచ్చు అంది.

కొద్దిగా వంట గిన్నెలు బట్టలతో వచ్చిన కొత్త వాచ్‌మెన్‌కి యిలా సామానుతో గది దొరకటం బానే అనిపించింది. ఆ బీరువా అని నసిగాడు. "యీ సామాను వూరికే వుంచుతున్నా కదా... నా అవసరమే అనుకో... కానీ మీకూ వుపయోగమేగా" అంది. అతని భార్య "ఆ బీరువా" అని మళ్ళీ గొనిగింది.

'సర్లే... పట్టుకుపోతాలే. సామానంతా మా చుట్టాలు కావాలన్నారు... యేదో యిక్కడ వుంటే రోజూ పనికి వస్తాను కదా... కళ్ళ ముందు వుంటాయనుకొన్నా' అంది ఝాన్సీ.

ఝాన్సీకి తెలుసు వాళ్ళు మెత్తపడతారని.

'సర్లే... కానీ... త్వరగా పట్టుకుపోవాలి. పెద్ద గది దొరగ్గానే' అంది కొత్త వాచ్‌మెన్ భార్య.

ఝాన్సీ అలాగే అన్నట్టు తలాడిచింది.

పనులు పూర్తి చేసి ఝాన్సీ కార్ల యజమానుల యింటికి వెళ్ళి కార్లు తనే తుడుచుకొంటానని అంది.

'కొత్త వాచ్‌మెన్‌కేగా యీ పని యివ్వాలి' అన్నారు వాళ్ళు.

'యిది బిల్డింగ్‌లో పని కాదు కదా... మీరు విడిగానే చేయించుకొనేదేగా' అంది.

యీ పని కూడా వుంటుందనే కదా ఆ వాచ్‌మెన్ వాళ్ళు ఆ జీతానికి వచ్చిందని యెవ్వరూ కార్లు తుడిచే పని యివ్వటానికి వొప్పుకోలేదు.

నిజమేగా అనుకొని పనులు పూర్తి చేసుకొంది. పిల్లలు బడి నుండి వచ్చాక సాయంత్రం వంటకి కుదిరిన యింట్లో వంట చేసేటప్పటికి యెనిమిది అయింది.

తనకి కావలసిన సామానుని వో చిన్ని సంచిలో పెట్టుకొంది. మిగిలిన బట్టలని సూట్‌కేస్‌లో సర్దుకొంది. ఆ సూట్‌కేస్‌ని యిస్త్రీ బల్ల కింద వుంచుకొంటానని యిస్త్రీ అతనికి చెప్పింది. అవక్కడ పెడుతున్నానని సూపర్‌వైజర్‌కీ చెప్పింది. సెక్యూరిటీకి, వాచ్‌మెన్‌కి తన మిగిలిన సామాను చూసుకోమని యిద్దరికీ చెరో ఐదొందలు యిచ్చింది.

'పోవులేమ్మా చూసుకొంటాం' అన్నారిద్దరూ.

అప్పటి వరకూ యిస్త్రీ అబ్బాయి బల్ల దగ్గర చదువుకొంటున్న పిల్లలనీ, ఆ చిన్న సంచినీ తీసుకొని అపార్ట్‌మెంట్ నుంచి బయటకి వచ్చింది.

కర్రీపాయింట్ దగ్గర ముగ్గురుకి కావలసిన అన్నం, కూరా, పప్పు కొంది. తిన్నాక మెల్లగా నడుచుకొంటూ తన కళ్ళల్లో ఫోటోలా ముద్రించుకుపోయిన ప్రదేశానికి వచ్చింది.

నిలువెత్తు మెట్రోస్టేషన్ స్లాబ్‌కి వొక గోడ వో ఆఫీస్ కాంపోండ్ వాల్. రెండో గోడ షాపింగ్ మాల్‌ది. మూడో గోడ మెట్రో స్టేషన్‌కి వెళ్ళే లిఫ్ట్‌ది. కింద చక్కని నున్నని గచ్చు. కప్పుతో సహా మూడుగోడలు అమిరాయి.

వొక గదిలా వుంది మొత్తం.

అక్కడ పక్క వేసి పిల్లల్ని పడుకోమంది.

బయటకి గుమ్మం వుండాల్సిన వైపు పల్చటి నల్లని దుప్పటిని కర్టన్‌గా వేసి పెద్ద ప్లాస్టర్‌తో గోడలకి అతికించింది.

గది లేదా యిల్లు యేదైతేనేం వుండటానికి వో చోటుని ఝాన్సీ అమర్చుకోగలిగింది.

బయటకి వచ్చి రోడ్ వైపు నుంచి ఆ కర్టన్ వైపు చూసింది. మరీ పట్టిపట్టి చూస్తే కానీ యీ కర్టెన్ కనిపించటం లేదు.

యెవరైనా వచ్చి యిక్కడ రాత్రి పడుకోటాన్ని అభ్యంతర పెట్టినా వాళ్ళని యెలా వెనక్కి పంపాలో తనకిప్పుడు తెలుసు. ఆమె చెయ్యి జాకెట్టు యెడమ వైపు స్పర్శించింది. పర్సు చేతికి తగిలింది.

తనపై కన్నేసి దారే పోయేవాడు వచ్చినా యేం చెయ్యాల్లో తనకి తెలుసు. వాడికింక చూపు వుండదు. ఆ సినిమా తను చూసింది టీవీలో. యెర్రని కారం... మండించే కారం...

పగలు యీ పరదాని తను తీసేస్తుంది. పిల్లలకి ఆ అపార్ట్‌మెంట్‌లో పనివాళ్ళ కోసం వున్న రెస్ట్ రూమ్‌నే వాడుకుంటుంది. స్నానాలు చేసి బడికి పిల్లలు వెళ్లి పోతారు. తను పనికి వెళ్లిపోతుంది. సర్వెంట్ బాత్రూము వాడుకోడానికి, సామాను పెట్టుకోడానికి వొప్పుకొన్నా ఆ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో పడుకోడానికి మేనేజ్‌మెంట్ వొప్పుకోలేదు.

సూపర్‌వైజర్‌ని అడిగింది "అన్నిటికీ వొప్పుకొన్నారుగా. యింత పెద్ద పార్కింగ్ యేరియా వుంది. ఖాళీ స్థలం వుంది కదా... యెక్కడోక్కడ పడుకొంటే యేం"

"యిక్కడ యిళ్ళల్లో పని చేస్తున్నావు కదా... యిళ్ళల్లో యెంత ఫ్రీగా తిరిగినా తిన్న ప్లేట్ దగ్గర తాగే గ్లాస్‌ల దగ్గర కూర్చునే దగ్గరా పడక దగ్గరా యెవరి స్థాయి యేమిటన్నది వాళ్ళు మనకి చెపుతూనే వుంటారు. నీకు తెలుసా యీ ఫ్లాట్స్‌లో

పని మీద నన్ను మాటాడటానికి పిలుస్తారు. కొంత మంది నిలబెట్టి, కొంతమంది వాళ్ళు సోఫాలో కూర్చుని ప్లాస్టిక్ చైర్ యిస్తారు. వొకరిద్దరు మాత్రమే యీ భేదం పాటించరు. కానీ వాళ్ళ సంఖ్య తక్కువ. అందుకే యిక్కడ వాళ్ళ మాటలకి విలువ లేదు. యెవరి స్థాయి యేమిటన్నది చెప్పకపోతే తరువాత చాల గొడవలు వొస్తాయని అనుకుంటారనుకొంటా... అయినా నువ్వేమిటమ్మా ఆ స్కూలో అని పట్టుకు వేలాడుతోన్నావు" కొంత విసుగు అతని స్వరంలో.

యీ సూపర్‌వైజర్ ఆఫీస్ గదిలో కూర్చుని మాటాడతాడు తమతో. యెప్పుడూ కూర్చోమనే అడగటం తను చూడలేదు. పని చేసేటి వాళ్ళంతా అతనితో నిలబడే మాటాడాలి. యేమో అనుకుంటాం కానీ అంతా యిలానే సాగుతోంది. మనుషులందరి చుట్టూ వున్నాయన్నట్టే రాత్రి పడుకొనే చోటు చుట్టూ చాలా విషయాలున్నాయన్నమాట.

యిల్లు దొరికేవరకూ యిక్కడే.

యీ మెట్రో స్టేషన్ లిఫ్ట్ దగ్గరే.

యిప్పుడామెకి తాడు బొంగరం తన చేతిలోనే వున్నంత నిశ్చింత. తనని తనే ఆడిస్తుంది. మరెవ్వరికీ ఆ అవకాశం యివ్వనే యివ్వదు.

పరదా దగ్గరకి వచ్చి నిలబడి పక్కకి చూసింది. తన జాకెట్ లోంచి చిన్ని పర్సు తీసి జిప్ తీసింది. అంజిబాబు ఫోటో చేతుల్లోకి తీసుకొని, మళ్ళీ పర్సు లోంచి బొట్టుబిళ్ళల అట్ట తీసి యెర్రని గుండ్రని పెద్ద బొట్టు స్టిక్కర్ నుదిటి మీద పెట్టుకొని,

'నీ మీద వొట్టయ్యా పిల్లల్ని చూసుకొంటా కంటికి రెప్పల్లా. కానీ చదువు కోసం కొన్నాళ్ళు కష్టపడక తప్పదు. నమ్మయ్యా... యెంటో నువ్వెప్పుడూ పని చెయ్యవూ అనుకునేదాన్ని... బాధ్యత లేదు అనుకునేదాన్ని... కానీ నువ్వు చాలా పెద్ద బాధ్యతనే మోసావయ్యా... ప్చ్... నడిరోడ్డులో యిప్పుడు నిలబడింది రహదారి కోసమేనయ్యా...' ఆమె కళ్ళల్లో వూరుతోన్న సుడిగుండం.

'ఛా... నే జీవితాన్ని సుళ్ళు తిరగనివ్వనయ్యా... నదిలా పారిస్తా...' చీర కొంగుతో కళ్ళు వొత్తుకొంటూ కుడివైపుకి చూసింది.

గుండ్రని అక్షరాలు మెరుస్తూ... వాటిని చూడగానే ఝాన్సీ పెదవులపై చిరునవ్వు. అంజిబాబు వెళ్ళిపోయాక ఆమె పెదవులపై తొంగి చూసిన మొదటి చిరునవ్వూ. యెడమ వైపుకి చూసింది.

అవే గుండ్రని అక్షరాలు మెరుస్తూ – వే టూ మెట్రో...

నిచ్చన చివరన్న మెట్రో ఆఖరి స్టేషన్ దగ్గర పంచ వర్ష ప్రణాళిక పూర్తి అవుతుంది. ఆ తరువాత కొత్తగా వచ్చిన ప్రభుత్వం మరిన్ని ప్రణాళికలు రచియిస్తుంది. అప్పుడు యెవరి జీవితాలు యే మెట్లు యెక్కుతాయో యే మెట్లు దిగుతాయో తెలీదు.

ఝాన్సీ యిక్కడకి టెంపరరీగా చేరింది. యిటు తరువాత యేం చెయ్యాలో ఝాన్సీకి తెలీదు.

యీ వర్షం తగ్గే వరకూ, యీ మెట్టు యెక్కే వరకూ, యీ రాత్రి తెల్లారేవరకూ యేం చెయ్యాలి యెక్కడుండాలి అన్నది మాత్రం ఝాన్సీకి తెలిసినంత యింకెవరికీ తెలీదు. యే సమస్య వొస్తే యేం చెయ్యాలి అని జీవితానికి సంబంధించిన ప్రణాళిక ఝాన్సీ దగ్గర లేదు. కానీ నగర ప్రణాళికల గజిబిజి దారుల మధ్య నుంచి చాకచక్యంగా యెదిగిపోగల ఝాన్సీ రేపటి రోజున యీ నగరంలో యేం చేస్తుందో యెవరికి తెలుసు.

# మేపిల్ ఆకులు



## కూనపరాజు కుమార్

సాహిత్యం పట్ల ఉండే అనురక్తి వ్యక్తులను రచయితలుగా మారుస్తుందనడానికి వీరు ఉదాహరణ. ఆలస్యంగా మొదలై కథారచన చేస్తున్నారు. స్వస్థలం ప.గో.జిల్లా పెదనికొం్రడ కొలను. పుట్టింది 1959లో. బీఎస్సీ, ఆ తర్వాత ఎం.ఏ. సైకాలజీ చేశారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ నిర్వహించారు. ఇండియాకు తిరిగి వచ్చాక టీవీ 9, సాక్షి టీవీల్లో ప్రావాసాంధ్రుల కోసం 'వేదిక', 'వారధి' కార్యక్రమాలకు కో–ఆర్డినేటర్‌గా ఉన్నారు. 'న్యూయార్క్ కథలు' వీరి కథా సంపుటి. 'తోలు బొమ్మలాట' కథాసంపుటి వెలువడింది. సినీ నటుడు ఎం.ఎస్. నారాయణ జీవిత కథను పుస్తకంగా తెచ్చారు. ప్రస్తుతం అక్వా రైతుగా ఉన్నారు.

నివాసం: పెదనిం్రడకొలను.

మొబైల్: 99899 99599

బెడ్ మీద హఠాత్తుగా కళ్ళు తెరిచింది ప్రియ. ఏదో కీడు శంకించే కల. ఒక్కసారిగా మెలకువ వచ్చేసింది. హమ్మయ్య... కలే... నిజం కాదుగా అనుకుంది. అప్పటికే ఉదయం తొమ్మిది గంటలయ్యింది. కిటికీ తలుపులు తీస్తే వచ్చిన చల్లగాలిని గుండెల నిండా పీల్చుకొంది.

మేపిల్ చెట్లు ముదురు ఆకుపచ్చ రంగు ఆకులతో నిండుగా వున్నాయి. అక్కడక్కడా పసుపు రంగు కూడా పులుముకొన్నాయి. అవును. 'ఫాల్' ప్రారంభం అవుతోంది. మనోహరంగా వున్న ఈ దృశ్యాన్ని ప్రియ ఆశ్వాదిస్తోంది. తన చదువు చివరి అంకానికి చేరింది. ఇండియాలో మెడిసిన్, అమెరికాలో పి.జి. ఇప్పుడు డ్యూక్ యూనివర్శిటీలో ఫెలోషిప్ ప్రారంభించబోతోంది. తన కిష్టమైన మనస్తత్వ శాస్త్రంలో 'చైల్డ్ అండ్ ఎడోలసెంట్ సైకియాట్రీ' స్పెషలైజేషన్ తీసుకొంది. దీని కోసమే వారం రోజుల క్రితం నార్త్ కరోలినా రాష్ట్రంలోని యూనివర్శిటీ దగ్గరలోని 'ధరహమ్'లో ఫ్లాట్ తీసుకొంది. ఎప్పుడా అని ఎదురుచూసిన రోజు వచ్చేసింది. ఈ రోజే మొదటి క్లాస్. ఎలా జరగబోతోందనే ఉత్సాహంలో వుంది.

ముందే 'వాట్సాప్' ద్వారా పరిచయమైన వాళ్ళు, మరికొంత మంది కొత్త వాళ్ళతో కలిపి పది మందితో సైకియాట్రీ క్లాసు ప్రారంభం అయ్యింది. విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొన్నారు. కేంపస్‌ను సీనియర్ విద్యార్థులు పరిచయం చేసారు. చదవబోయే సిలబస్ గురించి, తెలుసుకోవాల్సిన విషయాల గురించి వివరించిన డా.రాబర్ట్, యూనివర్సిటీ హాస్పిటల్‌లోని సైకియాట్రీ విభాగానికి తీసుకు వెళ్ళి, అక్కడి రెసిడెంట్ డాక్టర్‌కు పరిచయం చేసి 'గుడ్ లక్' చెప్పి వెళ్లిపోయాడు. ఇతను ఇక్కడి పరిస్థితులు వివరించి, పేషెంట్‌లు, వాళ్ళకున్న మానసిక వ్యాధుల వివరాలు చెబుతున్నాడు.

ప్రియ వార్డులు తిరుగుతూ, బయట లాన్‌లోకి వచ్చింది. అక్కడ దూరంగా చెట్ల దగ్గర ఓ అమ్మాయి పచ్చగడ్డిలో ఆడుకుంటోంది.

నర్స్‌ను అడిగింది 'ఎవరా అమ్మాయి?' అని.

నర్స్ అటువైపు చూచి 'ఓ... ఆమె మన పేషంటే. గీత. మీ ఇండియన్నే తెలుగుభాష మాట్లాడుతుంది' అంది.

'ఓ గ్రేట్! అరె తెలుగు అమ్మాయా. నేను వెళ్ళి మాట్లాడవచ్చా.' అని అడిగింది ప్రియ.

'జాగర్త. డాక్టర్ పర్మిషన్ తీసుకో ఇక్కడవున్న అందరిపేషెంట్ల కంటే ప్రమాదకరమైన వ్యక్తి. ఎవ్వరూ ఆమె జోలికి పోరు. హాస్పటల్ స్టాఫ్ అంటే ఆమెకు కోపం. చాలా భీభత్సంగా ప్రవర్తిస్తుంది. అందుబాటులో వున్న పదునైన వస్తువుల తోనో, తన చేతి గోళ్ళతోనో, తన ఒళ్ళంతా గీసుకొంటుంది. రక్తం ఓడుతూ మన మీదపడి రక్కుతుంది. అంది భయంగా నర్స్. ఓసారి మా స్టాఫ్‌నర్స్ తలుపు తీసుకొని తన గదిలోనికి వెళ్తే అప్పటికే గీత తన షిట్‌ని నర్స్ మొహం మీద కొట్టి, పిచ్చిగా నవ్వింది. ఏం చేస్తుంది నర్స్. కోపాన్ని దిగమింగుకొని వెనుకకు పరిగెత్తింది. పదహారేళ్ళ వయసు వచ్చే వరకూ పేషెంట్లను బెల్టులతో కట్టకూడదు. కానీ ఏం చేస్తాం ఒకోసారి అలాగే చేయాల్సి వస్తోంది.

ప్రియకు ముందు కొంచెం భయం వేసింది. నెమ్మదిగా గీత దగ్గరకు వెళ్లింది.

'ఎలావున్నావు గీతా!' అని స్వీట్‌గా తెలుగులో పకలరించింది.

గీత ఆశ్చర్యంగా ఆనందంగా తలపైకెత్తి 'హాయ్' అని ప్రతిస్పందించింది.

'గీతా నీకోసం ఇండియా నుండి జిలేబీ, కాజా, ఇంకా చాలా రకాలు తెచ్చాను. తింటావా' అంది.

తన మొఖం వెలిగిపోయింది.

'ఏవి?' అంది.

'ఇంటి దగ్గర వున్నాయి. రేపు తెస్తాలే' అంది ప్రియ.

'అక్కా! నీ పేరేంటి?' అంది తనకు దగ్గరా చేరి. కొద్దిసేపు మాట్లాడుకున్నాక.

'ఈ దేశం ఎలా వచ్చావు గీతా' అని అడిగింది ప్రియ నెమ్మదిగా.

'ఇంకా పదహారేళ్లైనా నిండలేదు కానీ నా జీవితం నిప్పుల కుంపటిలో పడి మాడి మసైపోయింది అక్కా. బోళ్ళన్ని సార్లు చచ్చిపోవాలని అనిపించేది. మరోసారి బతకాలని కసి తీర్చుకోవాలని, నా అక్కలకు సహాయం చేయడానికైనా బతకాలని అనిపించేది' అంది.

వాళ్ళిద్దరూ ఆ పచ్చగడ్డి మైదానంలో సాయంత్రం పడుకొని ఆకాశం వంక చూస్తున్నారు. సూర్యాస్తమయం అవుతోంది. పిట్టలు ఆకాశానికి అడ్డంగా, ఎక్కడికో గుంపులుగా వెళుతున్నాయి.

'మాది ఒంగోలు దగ్గర ఓ పల్లెటూరు. మేం అయిదుగురు ఆడపిల్లలం. నేనే చివరిదాన్ని. అమ్మ మమ్మలను బాగా చూసుకునేది. నాన్న కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ప్రమోట్ అయ్యాడు. ఎప్పుడూ ఇంటికి లేటుగా వచ్చేవాడు. అప్పుడు నాకు అయిదారు ఏళ్ళ వయసు ఉంటుంది. అమ్మ దూరపు బంధువు, 'అంకుల్' అనేవాళ్ళం అప్పుడప్పుడు చూడటానికి వచ్చేవాడు. అతని ప్రవర్తన మాకు నచ్చేది కాదు. గేలిగా ప్రవర్తించేవాడు. అతను రాజకీయ నాయకుడని తరువాత తెలిసింది. ఓరోజు మేం అంతా తిరునాళ్లకు వెళ్లి, ఇంటికి తిరిగి వచ్చేసరికి, ఇంట్లో అమ్మ ఏడుస్తోంది. మేం అంతా తలుపులు కొట్టాం. అంకుల్ తలుపు తెరిచాడు. లోపల ఇల్లంతా చిందరవందరగా వుంది. అమ్మని కావలించుకొని ఏడ్చాం. అమ్మ బట్టలు చిరిగి పోయివున్నాయి. అంకుల్ అమ్మని వేలెత్తి చూపిస్తూ, ఎవ్వరితో అయినా చెప్పావా మీ ఆయన ఉద్యోగం పోతుంది, మీరందరూ బజారుపాలౌతారు అని వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోయాడు. అమ్మ చాలాసేపు ఏడ్చింది. మేం కూడా ఏడ్చాం. నాన్న వచ్చే సమయానికి మేం అంతా పడుకున్నాం. తరువాత రోజు నుంచి నాన్న ముభావంగా వుండేవాడు. మాతోకూడా పెద్దగా మాట్లాడేవాడు కాదు. ఇది జరిగి వారంరోజులు కూడా తిరగకుండానే నాన్న స్టేషన్‌లోనే పురుగుల మందు తాగి చనిపోయాడు. శవాన్ని పోలీసులు ఇంటికి తీసుకువచ్చారు. అమ్మ ఎంతో ఏడ్చింది. ఈ పిల్లలను ఎలా పోషించాలని బాధపడిపోయింది. కొన్ని రోజుల తరువాత అంకుల్ వచ్చి మమ్మలను నేను చూసుకుంటాను నా మాట అందరూ వినాలి అనేవాడు. అమ్మను అప్పుడప్పుడు కొట్టేవాడు. అమ్మ ఎందుకు భరిస్తోందో నాకు అర్థం అయ్యేది కాదు. మాతో కూడా అసభ్యంగా ప్రవర్తించేవాడు' అని ఆగింది.

ఆ అమ్మాయి గుంట కళ్ళల్లో ఏవో నీడలు కదలాడుతున్నట్టు అనిపించాయి. మళ్లీ మాట్లాడింది.

'అంత చిన్నప్పుడే అమ్మ బాధ చూడలేక అంకుల్ హింస భరించలేక ఇంటి నుంచి పారిపోయాను. రాత్రయ్యేదాకా నడిచి వెళ్లి ఏదో ఊళ్ళో ఇళ్ళ అరుగులపై పడుకునేదాన్ని. కొన్ని రోజులు పాతబడిన కారు కింద పడుకొన్నాను. చెత్త వేసేచోట సగం తిని పడేసిన ఆహారం తినేదాన్ని. కొన్నిరోజులకు నాలాంటి వాళ్ళు పరిచయం అయ్యారు. వాళ్ళు నాకు భోజనం తెచ్చేవాళ్ళు. మేం పాత వంతెనల కింద, కూలిపోయిన భవనాల్లోనూ బతికేవాళ్ళం. వాళ్ళు రాత్రులు, నా ప్రక్కలోకి చేరి

ఏదేదో చేసేవాళ్లు. కొన్ని రోజులకు వాళ్ళ హింస పెరిగిపోయింది. నేను పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిపోయాను. అప్పటికే నాకు అప్పుడప్పుడూ ఫిట్స్ వచ్చేవి. జ్వరం కూడా వచ్చేది. అంకుల్‌కు తెలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నన్ను తీసుకొని పోతానన్నాడు. నేను ఒప్పుకోలేదు. ఏదైనా అనాథ ఆశ్రమానికి పంపించమని పోలీసులను వేడు కొన్నాను. అలా ఒంగోలులో 'ఆర్ఫనేజ్ హెూం'కి చేరుకొన్నాను. అక్కడ కొంత ఆరోగ్యం కుదుటపడింది. కానీ, నా మానసిక క్షోభ పెరిగిపోయింది. అమ్మనూ అక్కలను చూడాలనిపించేది. అక్కడకు వెళితే అంకుల్ వుంటాడనే భయం. మా ఆశ్రమానికి అమెరికా నుంచి మేరీ అనే ఆవిడ వచ్చింది. ఆమె ఈశ్వరి అనే అమ్మాయిని దత్తత తీసుకొని అమెరికా తీసుకెళ్లింది. కొంతకాలానికి ఎలిజిబత్ అనే ఆవిడకు నా గురించి చెప్పింది. ఆమె వచ్చి నన్ను దత్తత తీసుకొంటానంది. నేను సరే అన్నాను. అలా ఎలిజిబత్ ద్వారా నార్త్ కరోలినా వచ్చాను."

చీకటి పడింది. నక్షత్రాలు కనిపిస్తున్నాయి. నర్స్ వాళ్ళను పిలుస్తోంది డిన్నర్ టైం అయ్యిందని. వాళ్లిద్దరూ అక్కడ నుండి భారంగా బయలుదేరారు.

ఓ వారం తరువాత గీతను కలిసింది ప్రియ. ఈసారి హుషారుగా రిసీవ్ చేసుకొంది గీత.

'అక్కా నీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఇండియా నుంచి తెచ్చిన పిండివంటలు ఏమైనా తెచ్చావా?' అని అడిగింది గీత.

చెక్కిడాయిలు, అరిసెలు, పూతరేకులు ఇచ్చింది ప్రియ. గీత వాటిని ఇష్టంగా తింటూ 'ఇంకా నా కథ వుంది వింటావా? అక్కా?' అని అడిగింది.

'అమెరికా వచ్చాక ఇక్కడ నాకు బాగా నచ్చేసింది. ఓ స్కూల్‌లో చేర్పించారు. నాకు చదువు సరిగా రాలేదు. ముఖ్యంగా పక్క విద్యార్థులతో నేను కలవలేకపోయాను. ఇంటిలో కూడా నాకు నచ్చలేదు. ఎలిజిబత్‌కు ఓ బాయ్‌ఫ్రెండ్ వుండేవాడు. అప్పుడప్పుడూ తాగి వచ్చి పిచ్చిచేష్టలు చేసేవాడు. అప్పటి నుంచీ నాకు మతి స్థిమితం తప్పింది. వాళ్ళు నన్ను అమ్మ నాన్న అని పిలవమనేవారు. మేం నిన్ను దత్తత చేసుకొన్నాం కదా అనే వారు. వేరే అమ్మా నాన్నలకు నేను పుట్టాను... వారిని తప్ప ఎవ్వరినీ అలా పిలవలేనని వాదించాను. నాకు పిచ్చెక్కేది. ఏవో చేష్టలు చేసేదాన్ని, అందుకే వాళ్లు ఇక్కడ చేర్పించారు. ఇక్కడ నర్సులు, డాక్టర్‌లు నన్ను ఇంకా పిచ్చిదానిగా చూసేవారు. ప్రపంచం అంతా ఇలా పిచ్చిగా వుందేంటి? ఎవరికీ దయ, ప్రేమ లేవు. మొదట్లో కావాలని పిచ్చిగా ప్రవర్తించేదానిని. కానీ ఇప్పుడు నాకు నిజంగానే పిచ్చి ఎక్కువవుతోంది అక్కా.' అంది గీత దీనంగా మొఖం పెట్టి.

"గీతా... నీకు సైకో థెరఫీ చేయిస్తూ, మందులు సక్రమంగా వాడితే తప్పనిసరిగా నీ వ్యాధి తగ్గుతుందనే నమ్మకం నాకుంది. నేను మీ డాక్టర్, నర్సులతో మాట్లాడతాను. వాళ్ళతో కొంచెం సహకరించు" అంది.

"సరే అక్కా నువ్వు అప్పుడప్పుడూ కనిపించి నాకు ధైర్యాన్ని ఇవ్వాలి. సరేనా" అంది గీత.

ప్రియ మనస్సంతా గీత సమస్యతో నిండిపోయింది. డా.రాబర్ట్‌తో వివరంగా చర్చించింది. అతనన్నాడు– 'గీత పోస్ట్ ట్రోమాటిక్ స్ట్రెస్ డిసార్డర్ అనే వ్యాధితో బాధపడుతోంది. చిన్ననాడే తల్లిపై జరిగిన లైంగిక అత్యాచారం అమెలో మానసిక ఒత్తిడిని పెంచింది. ఆ సంఘటన హృదయాంతరాలలో పాతుకునిపోయి మనస్సును కల్లోలం చేస్తోంది. సైకో థెరఫీతో మనస్సుపై పడ్డ ముద్రలను తొలగిస్తే ఆమెను మామూలు మనిషిని చేయవచ్చు. నువ్వు తెలుగు అమ్మాయివే కాబట్టి, ఇంకొంచెం దగ్గరగా మాట్లాడి, ఆమెను థెరఫీలో సహకరించేటట్లు చేస్తే తప్పనిసరిగా కోలుకొంటుంది' అన్నాడు డా.రాబర్ట్.

రెండు మూడునెలలు ప్రతీవారం గీతను కలిసింది. 'నేను బాగుపడితే ఇక్కడ బాగా చదువుకుంటా. బాగా సంపాదించి ఇండియాలో మానవత్వం కల స్టాఫ్‌తో ఆర్ఫనేజ్ హెూమ్‌లు పెడతా. అక్కలకూ, అమ్మకూ మంచి జీవితాన్ని ఇస్తా!' అని తన కలను ప్రియతో చెప్పుకొంది.

ఈ విషయాన్ని డా.రాబర్ట్‌కు చెబితే 'గీతకు బోర్డర్‌లైన్ పెర్సనాలిటీ డిసార్డర్ అనే మానసిక రుగ్మత కూడా ఉంది. ఈ జబ్బు వున్నవారు మామూలుగా వున్నప్పుడు అందరిలాగానే ఆలోచిస్తారు. కానీ విపరీత ధోరణి వచ్చినప్పుడు అతిగా ప్రవర్తిస్తారు. ఈ వ్యాధిని కూడా తగ్గించుకోవచ్చు' అన్నాడు డాక్టర్.

'డాక్టర్!. ఇంత చిన్న వయసులో వున్న వాళ్ళపై కూడా మానసిక ముద్రలు పడతాయా?' అంది ప్రియ ఆశ్చర్యపోతూ.

'జార్జియా నుంచి వచ్చిన ఓ కేసు గురించి చెబుతా. ఆరేళ్ళ వయస్సు వున్న ఓ చిన్న అబ్బాయి వాళ్ళ నాన్నను చంపుతానని వంటింటిలో వున్న కత్తిని తీసుకొని తిరుగుతున్నాడు. అతనితో వివరంగా మాట్లాడిన తరువాత అర్థమయినది ఏమిటంటే ఆ పిల్లవాడు పుట్టగానే క్రిబ్‌లో వున్నప్పుడే, వాళ్ళ నాన్న ఇతనిని చంపడానికి, ఓ పెట్టెలో ఉంచి ఇతనికి ఊపిరి ఆడకుండా చేయాలని ప్రయత్నించాడట. వాళ్ళ అమ్మ కలుగజేసుకోవడంతో ఆగిపోయాడు. ఈ సంఘటన ఆ కుర్రవాడికి గుర్తుండి పోయింది. అందుకే కొంచెం పెద్దయ్యాకా తన తండ్రిపై ఇలా కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నిచాడు.' అన్నాడు డాక్టర్.

మరోపాప తనకు నాలుగు ఏళ్ళ వయసులో ఓ బాతును గట్టిగా కౌగిలించు కొంది. ఆ బాతు చచ్చిపోయింది. దానితో తను భయపడి పోయింది. కొన్ని రోజులు పోయాక, తను మాట కోల్పోయింది. బాతును చంపేశాననే అపరాధభావన వల్ల మాట పడిపోయింది. దీనినే 'సెలెక్టివ్ మ్యుటిసిజం' అంటారు. అసలు గర్భంలో వున్న తల్లిపై పడే తీవ్ర, ఉద్రిక్త భావాలు పుట్టబోయే బిడ్డలపై కూడా ప్రభావం కలుగజేస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి' అన్నాడు డా.రాబర్ట్.

నెమ్మదిగా నిస్పృహగా ఇంటికి చేరింది ప్రియ. ఆకురాలు కాలం పూర్తి అయ్యింది. మేపిల్ చెట్లు తమ ఆకులను పసుపు, ఎరుపు, గోధుమ రంగులలోనికి మార్చి చివరకు రాల్చేసాయి. చెట్లు అన్నీ మోడులుగా మారిపోయాయి. చలి పెరిగింది. ప్రియ ఇంట్లో సోఫాలో కూలబడింది. ఏవో ఆలోచనలు. కొంత మంది జీవితాలు, ఇంత దారుణంగా వుంటాయని తాను ఊహించలేదు. మనస్సు వికలమైయ్యింది. ఎప్పటికో సోఫాలోనే నిద్రపోయింది ప్రియ.

వేరే హాస్పిటల్ డ్యూటీ వల్ల ఓ నెలరోజులు గీతను కలవలేకపోయింది. ఓ రోజు గీతను కలుద్దామని వెళితే వారం రోజుల క్రితమే గీత వెళ్ళిపోయిందని, తనను అడిగానని చెప్పమందని, అక్కడి నర్సులు చెప్పారు.

'అక్కా! నాకు కొన్ని రోజులలోనే పదహారు సంవత్సరాలు నిండుతాయి. చట్టప్రకారం అన్ని హక్కులూ వచ్చేస్తాయి. అప్పుడు ఈ దత్తత తల్లి దండ్రులకు నాపై ఎటువంటి పెత్తనం వుండదు. అన్ని జైళ్ల నుండీ విముక్తి అవుతాను. నా బతుకు నేనే చూసుకొంటాను' అన్న గీత మాటలు గుర్తుకు వచ్చాయి. 'విష్‌యూ ఆల్ ది బెస్ట్ గీతా' అని మనస్సులో అనుకొంది.

కాలం గడిచింది. ప్రియ తన కోర్సు పూర్తి చేసుకొంది. ఈ లోపులోనే ఫ్లోరిడాలో ఓ హాస్పిటల్‌లో జాబ్ వచ్చింది. ఇప్పుడు సామాన్లు ప్యాకింగ్ హడావుడిలో వుంది ప్రియ. ఇంతలో ఠాత్తుగా గీత నుంచి ఫోన్.

'హాయ్ అక్కా! నేను గీతను. ఎలావున్నావ్' అని పలకరించింది. తను సైకో సెంటర్ నుంచి న్యూయార్క్ వెళ్ళిపోయిందట. అక్కడి కొంతమంది ఇండియన్స్ సహాయంతో మొదట గ్రోసరీ స్టోర్స్‌లోనూ, తరువాత పెట్రోల్ బంకులలోనూ పని చేసి, చిన్న ఇండియన్ రెస్టారెంట్ కొనుక్కొందట. ఇప్పుడు ఈ వ్యాపారం బాగుందట. ప్రైవేటుగా డిగ్రీ కూడా కట్టింది, త్వరలోనే ఇండియా వెళతానని అక్కడ అక్కలకూ సహాయం చేస్తానని చెప్పింది. తరువాత కలుస్తానని చెప్పింది.

"అక్కా నువ్వు చేసిన సహాయం మరువలేను. అప్పటికే నాలో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చేవి. నీ పరిచయం వల్ల జీవితంపై ప్రేమ అభిమానం

పెరిగి నన్ను మనిషిని చేసాయి. అక్కా ఇండియా వెళ్లొచ్చాక, నిన్ను తప్పక కలుస్తానక్కా!' అంది గీత పూడుకుపోయిన గొంతుతో.

ప్రియకు ఆనందం కలిగింది. తనకు ఓ ఆధారం దొరికింది అదే చాలు అనుకొంది.

బయటకు వస్తే, మేపిల్ చెట్లు లేత ఆకులు తొడుగుతున్నాయి. పాత్‌వే పక్కన ఉన్న చెట్లు పూలు విరగబూసాయి. ఉడతలు ఆటలు ఆడుకొంటున్నాయి. స్ప్రింగ్ అందాలు అంతటా అలుముకొంటున్నాయి. గీత ఇండియా వెళ్ళినపుడు, వాళ్ళ అమ్మను, అక్కలను కలిస్తే బాగుండును. ఈలోపు వాళ్ళ జీవితాలలో ఉత్పాతాలు జరగకుండా వుంటే బాగుండును. గీత కథ ఇప్పుడైనా సుఖాంతం అయితే ఎంత బాగుండును. అలా అవ్వాలని మనసారా కోరుకుంటుంది ప్రియ.

చేదు జ్ఞాపకాలను ఆకులుగా రాల్చి కొత్త ఆకులను ఆశలుగా తొడుక్కోవటం చేస్తూనే ఉండాలేమో బహుశా. లోపలి నుంచి శక్తి చాలకపోతే ప్రకృతి నుంచి స్వీకరించాలేమో బహశా. సాటి మనిషి తోడ్పాటుతో ముందుకు అడుగులేస్తూనే ఉండాలేమో బహశా అని అనుకొంది.

టాక్సీ వచ్చింది. డ్యూక్ యూనివర్శిటీకి బైబై చెబుతూ, వేయి ఆశలతో ఫ్లోరిడాలోని కొత్త ఉద్యోగంలో చేరడానికి ప్రయాణం అయ్యింది ప్రియ. అక్కడ బోళ్ళన్ని కథలు తనకోసం ఎదురుచూస్తూవుంటాయని ప్రియకు తెలుసా....!

# స్పర్శ



## కొట్టం రామకృష్ణారెడ్డి

మానవ సంబంధాలు, సున్నితమైన ఉద్వేగాల మీద కథలు రాస్తూ పాఠకుల గుర్తింపు పొందిన రచయిత. 1969లో రంగారెడ్డి జిల్లా ఘట్‌పల్లిలో జన్మించారు. పాతికేళ్ల క్రితమే కథలు రాయడం మొదలుపెట్టినా, ఆ తర్వాత రెండు సంవత్సరాల్లోనే కథలకు దూరమయ్యారు. మళ్లీ గత ఐదేళ్లుగా కథల్ని వెతుక్కుంటూ వచ్చి తాను చెప్పాల్సిన అవసరం ఉందనుకున్న కథలు రాస్తున్నారు. ‘కథలు రాయడం ద్వారా ఒక సంతృప్తి లభిస్తుంది’ అని చెబుతారు. ఇప్పటికి 25 కథలుదాకా రాశారు. త్వరలోనే ఈ కథలు పుస్తకం రూపంలో రానున్నాయి. మార్కెటింగ్ రంగంలో పని చేస్తున్నారు.

నివాసం : హైదరాబాద్.

మొబైల్ : 92465 65824

ఇదేం బాధ?

బయటకి చెప్పుకోలేని బాధ.

తమాయించుకోలేని వ్యథ.

ఏమిటిది? తాపమా? తమకమా.

పదాలేవైనా బాధ ఒకటేనేమో.

ఉదయం బాల్కనీలో నిల్చున్నప్పుడు జామచెట్టు మీది చిలకలజంట నా కంట్లోనే ఎందుకు పడాలి. వాటి సరాగాలు చూస్తున్నకొద్దీ బాధ... ఒంటి బాధ.

మెడ వంపులో పారాడే వేళ్ల కొసల స్పర్శ కోసమో, చెవులను తాకే నులివెచ్చని ఊపిర్ల కోసమో... ఇదమిత్థంగా చెప్పలేక వెంపర్లాడుతోంది మనసు. లేకపోతే శీతలం గదిలో చెమటలు పట్టడం ఏమిటి?

ఎలా? ఎలా? ఎలా తగ్గించుకోవాలి ఈ నొప్పిని. పెయిన్ కిల్లర్స్ పని చేస్తాయా? తమకాన్ని అణిచేసే మందులు దొరుకుతే బాగుణ్ణు!

ఎడమవైపు పడుకున్న పాప మెల్లగా మసిలింది. నిద్రలో ఒళ్ళు విరుచుకుంది. ఆకలి గుర్తొచ్చినట్లుంది 'కేర్'మంది. దగ్గరగా జరిగి పొదువుకున్నాను. నా స్పర్శకి ఆత్రపడసాగింది. నైటీ తప్పించి నోటికి అందించాను. ఏడాది దాటినా పాలను మరిపించలేకపోయాను. పెన్నిధి దొరికినట్టుగా గట్టిగా పట్టుకుని గబగబా తాగసాగింది. ముక్కుకి అడ్డు తగిలి ఊపిరి పీల్చుకోవడానికి తల్లడిల్లుతూ ఉంటే...

ఒడుపుగా చూపుడు వేలికీ, మధ్య వేలికీ మధ్యన పట్టుకుని శ్వాస తీసుకోవడానికి వీలుగా సందు చేశాను. అలాగే గట్టిగా పట్టుకుని తాగుతూ తాగుతూ... మగతలోకి జారి ఉలిక్కిపడి, మళ్ళీ వెతుకుతూ, చప్పరిస్తూ నిద్రపోయింది. కుడిచేత్తో పాప వెన్ను నిమురుతూ నేను.

అప్పటిదాకా దహించిన దేహం చల్లబడసాగింది. శరీరం శాంతించినా మనసు మదనపడుతూనే ఉంది. మంచం మీద కుడివైపు ఖాళీగా... దాదాపు ఒకటిన్నర సంవత్సరాలుగా... అవును. అమెరికా నుండి వచ్చినప్పటి నుండి ఆ భాగం ఖాళీయే.

నాకెన్నేళ్లు... ఎస్... ఇరవయ్యారు. అవును లెక్క సరిపోయింది. ఇరవై మూడేళ్ళకి పెళ్లయ్యింది... పీజీ అయిపోయిన వెంటనే... రెండునెల్లకే అతనితో... మూడుముళ్ళ బంధం ఏర్పడింది. ఆ వెంటనే సుయ్యిమంటూ ఫ్లైయిట్‌లో... అమెరికాలో లాండింగ్.

అతను కొత్త. అమెరికా కొత్త. అక్కడంతా కొత్త. ఆ స్పర్శా కొత్తే!

కాలం అంత వేగంగా ఎప్పుడూ గడవలేదు. అన్నీ ఆశ్చర్యాలే! అన్నీ అద్భుతాలే! అన్నీ అపురూపాలే! మంచం మీద కుడివైపు ఎప్పుడూ ఖాళీగా లేదు. రాత్రివగానే, చెరకు వింటి వేలుపు పడక మీదే కొలువు తీరేవాడు.

కన్సీవయ్యాను... సంవత్సరం తర్వాత. అయిదో నెల దాటకుండానే ఇండియాలో వాలిపోయాను, డెలివరీ కొరకు. అక్కడ తోడెవరూ లేరు చూసుకోవడాకని.

అమ్మా వాళ్ళు ఊళ్ళో ఉంటారు. హాస్పిటల్స్ అవైలేబులిటీ ఉండదని. అత్తా వాళ్ళ దగ్గరే ఉంటున్నాను సిటీలో.

డెలివరీ అయ్యింది, సిజేరియన్... పాప! అమెరికా నుండి అప్పుడొచ్చి వెళ్ళాడు... వారం ఉన్నాడంతే! పాపకి మూణ్నెల్లు నిండాక వెళదామంటే అప్పుడు పుట్టింది ముసలం.

వీసా వేషాలు, ట్రంప్ లంపటాలు. అదిగో... ఇదిగో అంటూ కాలం గడిచిపోతూనే ఉంది. ఎడం పెరిగిపోతూనే ఉంది.

తను రాలేదు. నేను వెళ్లలేను.

రానురాను ఫోన్లో మాట్లాడ్డం కూడా తగ్గించేశాడు. ఏమడిగినా పనివత్తిడంటాడు. తనకేనా ఒత్తిడి... నిద్ర తగ్గించుకొని నా కోసం సమయం కేటాయించలేడా! కనీసం ఆ విధంగా అయినా నన్ను నేను సంబాళించుకునేదాన్నేమో! కొంతలో కొంత ఈ మెలిపెట్టే బాధ నుండి విముక్తి లభించేదేమో!

రాత్రివేళ పనులు ముగించి పాప పక్కలోని చేరిపోతానా... ఎక్కడ పొంచి ఉంటాడో... హెూరెత్తించే మకర ధ్వజుడి వికటాట్టహాసాలు. ఎన్నాళ్లని భరించను? నన్నింతగా బాధపెడుతున్న అతన్ని జీవితంలో క్షమించగలనా!?

ప్చ్... పెళ్లి కాకపోయినా బాగుండేది. అనుభవం అవగాహన అయ్యేది కాదేమో. ఇలా అందరూ సిగ్గు విడిచి చెప్పుకుంటారో లేదో నాకు తెలీదు... నా సంగతి వేరేమో. అందరికీ ఇంతేనా? లేక, నా ఒక్కదానికేనా.

పాప నిద్రలో ఉలిక్కిపడి కేర్ మంది. తనని దగ్గరికి పొదువుకున్నాను. నేను తన దగ్గరే ఉన్నానని తెలిపే నా స్పర్శకి మళ్ళీ నిద్రలోకి సర్దుకున్నది.

• • •

నా రూంలోంచి బయటికొచ్చి చూసా... ఏడయ్యింది. మామయ్యకి బీపీ టాబ్లెట్ ఇచ్చి మంచి నీళ్లు నోటికి అందిస్తూంది అత్తయ్య, ఆయన భుజాల చుట్టూ చెయ్యి వేసి పట్టుకొని.

అత్తయ్యలో నాకు నచ్చని విషయం అంటూ ఉందంటే ఇదే. ఎంత మంది ముందైనా అంతే. మామయ్యను టచ్ చేసి మాట్లాడుతుంది.

"మొహం కడుక్కోరా... కాఫీ పెట్టిస్తాను" అంటూనే "చిన్నది పడుకునే ఉందా..." అని ఆరా తీసింది.

"రాత్రి నిద్ర పట్టలేదత్తయ్యా, చిన్నది కూడా ఇప్పుడిప్పుడే నిద్రపోయింది" అన్నాను.

మొహం కడుక్కుని వచ్చేసరికి వేడి కాఫీ అందించింది. కాఫీ తాగి వంటింట్లోకి నడిచి, టిఫిన్ రెడీ చెయ్యడానికి ఉపక్రమించాను.

మామయ్య రిటైర్ అయ్యి అయిదేళ్లవుతోంది. అత్తయ్య మామయ్యను ఎప్పుడూ అంటిపెట్టుకునే ఉంటుంది. ఎంతో అత్యవసరం అయితేనే కాని అతడిని వదిలి వెళ్లదు. వాళ్లిద్దరూ ఒకరికొకరు అంటుకు ఉండటం కూడా నావల్ల కావటం లేదు.

ఉల్లిపాయలు తరుగుతూ ఉంటె, వెనకగా వచ్చి "నీకు నిద్ర సరిగా పట్టినట్టులేదు, నలతగా ఉన్నట్టుంది... నువ్వెళ్లు నేను చేస్తాలే" అంది, భుజం మీద చెయ్యి వేసి.

"ఫర్వాలేదత్తయ్యా" అన్నాను.

"చిన్నది ఎందుకు నిద్రపోలేదు?"

"ముక్కు పట్టేసినట్టుంది, ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బంది పడింది" అని అబద్ధమాడి, ఫ్రిజ్‌లోంచి క్యారెట్స్, మిరపకాయలు బైటికి తీశాను.

"మొన్న చిన్నదానికి జ్వరం వచ్చినప్పుడు డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాను కదా... అతని దగ్గరకెళ్ళి ఏవైనా డ్రాప్స్ రాసిస్తాడేమో అడుగుతానత్తయ్యా..."

"సరే, స్నానం చేసి టిఫిన్ తిని వెళ్ళు... చిన్నదాన్ని నేను చూస్కుంటాలే" అంది.

మొన్నామధ్య చిన్నదానికి జ్వరంగా ఉందని దగ్గర్లోని పీడియాట్రిషియన్ దగ్గరకి తీసుకెళ్ళాను. చిన్నదాన్ని అందుకునే వంకతో మునివేళ్లతో చెస్ట్ టచ్ చేశాడు.

ఝల్లుమంది ఒళ్లు!

చురుగ్గా చూశానతని వైపు. నన్నే చూస్తున్నాడు. అనుకోకుండా కాదు... కావాలనే టచ్ చేసాడు. తేరిపార చూశాను. ముప్ఫైలోపే అనుకుంటా వయసు. యంగ్ డాక్టర్, హేండ్‌సమ్‌గా... నీట్ షేవ్. షేవ్ చేసిన భాగమంతా పచ్చగా నవనవలాడుతోంది.

చిన్నదాన్ని ఎగ్జామిన్ చేసి నాకందిస్తూ మళ్ళీ టచ్ చేశాడు, ఇంకాస్త ఫోర్స్‌తో నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూస్తూ. తన చూపులు చెప్తూనే ఉన్నాయి తన ఉద్దేశాన్ని.

అతని మునివేళ్ళ స్పర్శ ఇంకా వెంటాడుతూనే ఉంది. నెగడు అంటుకుంది. అలజడి రేగుతూనే ఉంది. తప్పొప్పుల మీమాంసలో మనసు కొట్టుమిట్టాడుతూనే ఉంది.

ఏది రైటో... ఏది రాంగో...

నిర్ణయించుకోమంటోంది మనసు.

మనసు మాట వినదు అంటారు... దాని మాట నేనెందుకు వినాలి?!

మస్తిష్కం, మనసుల మధ్య యుద్ధం మొదలయ్యింది. ఒకే శరీరంలో పరస్పర విరుద్ధ భావాల అలలు.

క్లినిక్‌కి చేరుకొని కన్సల్టెంట్ రూంలోకి అడుగుపెట్టాను. నన్ను చూడగానే అతని కళ్ళల్లో మెరుపు.

చిన్నదానికి ముక్కు పట్టేసిన విషయం చెప్పాను. జాగ్రత్తగా విన్నాడు. విని, "పాలు పట్టడం కష్టమయ్యిందా?" అడిగాడు, నా ఎదపై దృష్టి నిలుపుతూ. నిటారుగా కూర్చున్నాను. చున్నీని సవరించుకుంటున్నట్లు ఇంకొంచం తప్పించాను.

అతని కళ్ళల్లోకి చూస్తూ అవునన్నాను. నా కళ్ళల్లోని ఆకలి అతనికి తెలిసిపోతుందేమోననే సందిగ్ధత.

ఏదో సిరప్ ప్రిస్క్రిప్షన్ మీద రాశాడు. మళ్ళీ ప్రిస్క్రిప్షన్ వద్దులే అని తన దగ్గరున్న శాంపిల్ సిరప్ ఇచ్చాడు. ప్రిస్క్రిప్షన్ మీదున్న తన ఫోన్ నంబర్‌ని అండర్ లైన్ చేసి నాకందించాడు.

ఫీజ్ ఇవ్వబోతే వద్దన్నాడు.

"పాపకి తగ్గినాక చెప్పండి" అన్నాడు. "తగ్గకపోయినా చెప్పండి... మందు మారుస్తాను" మళ్ళీ చెప్పాడు.

ఉద్దేశం అర్థమయ్యింది. వచ్చేశాను.

వచ్చేశాక కూడా గుండె దడగానే ఉంది. 'యస్' ఆర్ 'నో' ఊగిసలాటలో మనసు కొట్టుకుంటూనే ఉంది. నాలుగడుగులు ముందుకి రెండడుగులు వెనక్కి... ఏదీ పాలుపోవడం లేదు. తప్పు చెయ్యొద్దనే ఉంది. శరీరం సహకరించట్లేదు. దేహం దేహీ అంటూనే ఉంది.

చిన్నదానికి సిరప్ పట్టించలేదు. రెండోనాడు ఫోన్ చేసి చిన్నదానికి తగ్గిందని చెప్పాను. కాల్స్ మొదలయ్యాయి. ఫ్రీక్వెన్సీ పెరిగింది. రెండు మూడుసార్ల వరకు కొనసాగుతున్నాయి. అక్కడి విషయాలు ఇక్కడికి, ఇక్కడి విషయాలు అక్కడికీ బదిలీ అవుతున్నాయి. బ్యాచిలర్, దగ్గర్లోని ఫ్లాట్లో ఒంటరిగా ఉంటున్నాడనే ముఖ్యమైన వాటితో సహా.

• • •

ఈ రోజే ముహూర్తం.

తొందరగానే లేచాను. అత్తయ్యకి మామయ్యకీ కాఫీ పెట్టిచ్చాను. బ్రేక్‌ఫాస్ట్‌కి ప్రిపేర్ చేస్తూంటే వచ్చింది అత్తయ్య. నిల్చుని అడిగింది, "ఏమైనా హెల్ప్ చెయ్యనా?" అని.

"ఫర్వాలేదు అత్తయ్యా... ఈ రోజు మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళొస్తానత్తయ్యా... మధ్యాహ్నం రెండు మూడింటివరకు వచ్చేస్తాను... చిన్నదాన్ని కొంచెం చూస్తారా?" బెరుగ్గా అడిగాను, కాస్త నిబ్బరం కూడగట్టుకుని.

"అంతగా చెప్పాలా? వెళ్ళిరా... చిన్నదాన్ని నేను చూస్కుంటాలే"

చకచకా పనులన్నీ పూర్తి చేసి, చిన్నదాన్ని అవసరాలన్నీ తీర్చేసి, అత్తయ్యకి అప్పచెప్పి ఇంట్లోంచి బయటపడ్డాను.

గుండెలు దడదడలాడుతున్నాయి. అడుగులు తడబడుతున్నాయి. అరచేతులు చెమటలు పడుతున్నాయి.

తప్పటడుగులా? తప్పుటడుగులా?

• • •

ఎడారిలో చలివేంద్రం దొరికినట్లుంది. అలిసిన శరీరానికి మత్తావహించింది. అతని భుజం మీద తలను చేర్చి, గట్టిగా హత్తుకుని... కళ్ళు మూతలు పడుతున్నాయి.

మాగన్నుగా నిద్రలోకి జారుకోబోతుండగా కాలింగ్ బెల్ మోగింది... వెంటనే తలుపుల మీద దబదబా బాదిన చప్పుడు. మళ్ళీ వెంట వెంటనే కాలింగ్ బెల్... మోగుతూనే ఉంది. ఉలిక్కిపడి లేచాం ఇద్దరం. అతను సర్దుకున్నాడు. నేనూ సరిచేసుకున్నాను. గుండె దడ స్పష్టంగా వినిపిస్తోంది. కాళ్ళూ చేతులూ బిగదీసుకు పోయాయి. శరీరం స్తంభించిపోయింది. శ్వాస రెట్టింపయ్యింది.

అతను హాల్లోకి నడిచి మెయిన్ డోర్ కొద్దిగా తీశాడు. బెడ్‌రూమ్ లోంచి హాల్లోకి తొంగి చూశాను. తలుపు వారగా తెరిచి ఉంది. అవతలి వైపున్న వాళ్ళు కనిపించటం లేదు.

అతనితో వచ్చినవాళ్లు ఏదో చెపుతున్నారు.

"అలాగా... ఇప్పుడే వస్తున్నాను" అంటూ బెడ్‌రూమ్‌లోకి వచ్చాడు.

"ఏమయ్యింది" అడిగాను.

"ఎదురింటి ఫ్లాట్లో ఉండే పెద్దావిడకి పెరాలసిస్ అటాక్ అయిందట... బయట డాక్టరు బోర్డు చూసి, మన తలుపు తట్టారు" చెప్పాడు.

రక్తప్రసరణ మందగించింది. బిగదీసుకున్న కండరాలన్నీ వదులయ్యాయి. శ్వాస నెమ్మదించింది.

మెడికల్ కిట్ తీసుకుని, "ఇప్పుడే వస్తాను" అంటూ బయల్దేరాడు. వెనకాలే నేనూ హాల్లోకి వచ్చాను.

అక్కడ డోర్ దగ్గర చంకలో చిన్నదానితో నిల్చుని...

అత్తయ్య!

అవాక్కయ్యాను.

వెన్నులోంచి మొదలైన భయం పాకుతూ మెదడులో ఘనీభవించినట్లైంది. ఈ స్లాబ్ ఉన్నదున్నట్టుగా భూమిలోకి కుంగిపోయి అందులో నేను కప్పడిపోతే బావుండుననిపించింది. ఏం చెయ్యాలో, ఎలా రియాక్ట్ కావాలో తెలీక శిలలా నిల్చుండిపోయాను.

అత్తయ్య పరిస్థితీ అంతే. నన్ను చూసి చిన్నది కేరింతలు కొడుతూ రెండు చేతులూ చాచింది.

ఇద్దరిలో ముందుగా తేరుకుంది అత్తయ్యే. కళ్ళు భూమిలోకి దించేసి నిస్సత్తువగా నిల్చున్న నాకు చిన్నదాన్ని అందించి, అతని వెనకాలే ఎదురు ఫ్లాట్లోకి దారి తీసింది. నాకు తెలీకుండానే అనుసరించాను.

అక్కడ హాల్లో దివాను పైన పడుకున్న ఆవిడ పక్కన కూచుంది అత్తయ్య. ఆవిడ చెయ్యి తన చేతిలోకి తీసుకుని చెప్పసాగింది.

"ఇదీ నేనూ క్లాస్మేట్స్... స్టేట్స్‌లో ఉండే దీని కొడుకు ఇవ్వాళ పొద్దున్నుంచీ కాల్ ట్రై చేస్తూంటే ఇది ఆన్సర్ చేయట్లేదని నాకు మధ్యాహ్నం ఫోన్ చేసి చెప్పాడు. నేను బయల్దేరి వచ్చి చూసేసరికి ఇదీ దీని పరిస్థితి. ఏం చెయ్యాలో తోచక ఎదురుగా డాక్టర్ నేమ్ ప్లేట్ కనిపిస్తే తలుపు తట్టాను."

అప్పుడు పరిశీలనగా చూశాను ఆ పడుకున్నావిడని. కుడిచెయ్యి కుడి కాలూ వంకర తిరిగున్నాయి. మూతి కుడివైపుకి కొద్దిగా విరిచినట్లు కనిపించింది. బేలగా చూసింది నా కళ్ళల్లోకి. నా పరిస్థితీ అంతకు తీసి పోయినట్లేమీ లేదు. అత్తయ్య మొఖంలోకి చూడలేకపోతున్నాను. అపరాధభావం నన్ను ఊపిరి పీల్చుకోకుండా ఉక్కిరిబిక్కిరి చెయ్యసాగింది.

"నే... వెళ్తాను" అన్నాను గోడకి చెప్తున్నట్టు.

"ఉండమ్మా, నేనూ వస్తాను. దీని తమ్ముడికి కబురు చేశాను. ఇంకాసేపట్లో రావచ్చు... కొంచెం సేపుండు తోడుగా" అంది అత్తయ్య.

ఆమాటకి పెద్దావిడని పరీక్ష చేస్తున్న అతను వింతగా చూశాడు మమ్మల్ని!

ఏదో అర్థమైనట్లు కంగారుగా రెండు టాబ్లెట్లు తన కిట్‌లోంచి తీసిచ్చి, దగ్గర్లోని ఓ స్పెషలిస్ట్‌కి రిఫర్ చేసి హడావిడిగా వెళ్ళిపోయాడు.

నేను నిశ్శబ్దంలోకి కూరుకుపోయాను. ఇలాంటి దుస్థితి పగవాడిక్కూడా రావద్దనిపించింది. మెదడులోకి ఏదో బలమైన వైరస్ సోకి మెమరీ అంతా డిలీట్ చేసినట్లు బ్లాంక్ అయిపోయింది.

ఆ పెద్దావిడ తమ్ముడెప్పుడొచ్చాడో? మేమక్కడ ఎంతసేపు ఉన్నామో, ఇంటికి ఎలా వచ్చామో కూడా తెలీలేదు. చిన్నదాన్ని అత్తయ్యకి అప్పజెప్పేసి బెడ్‌రూమ్ లోకెళ్ళి తలుపేసుకుని మంచం మీద వాలి పోయాను.

నిమిష నిమిషానికి మారుతున్న నా ఆలోచనల్లోని ఆవేశం, ఆక్రోశం, కోపం, బాధ, ఉక్రోషం, అవమానం, నిస్సహాయత, అశక్తత నన్ను అతలాకుతలం చేసి

పారేశాయి. గుండెల్లో సునామీ సుడులు తిరుగుతూనే ఉంది. మొట్టమొదటిసారిగా జీవితంలో నా మీద నాకే అసహ్యమేసింది.

సూర్యుడ్ని దిగమింగిన రాత్రి నాకు నిద్రను కరువు చేసింది. నరకం చూపించింది.

ఎప్పటికో తెల్లవారుజామున కలత నిద్రలోకి జారుకున్నాను.

* * *

ఇక ఆ ఇంట్లో ఉండటం జరిగే పని కాదనిపించింది. లగేజ్ సర్దుకుని నా రూమ్‌లోంచి బయటికొచ్చాను.

హాల్లో అత్తయ్య చిన్నదానికి పాలు పడుతూ కనిపించింది. మామయ్య వాకింగ్‌కి వెళ్లినట్లున్నాడు.

నన్ను చూసి ఎప్పట్లాగే నవ్వుతూ, “హాయ్ బేటా! వెళ్లి మొహం కడుక్కునిరా మంచి కాఫీ ఇస్తాను... రాత్రంతా నిద్రపోయినట్లు లేదు, కాస్త ఫ్రెష్ అవుతావు” అంది.

అత్తయ్య మాటల్లో ఏమైనా వెటకారం ఉందా అని తరచి చూస్తూ నాలోకి నేను కుంచించుకు పోయాను.

అత్తయ్య చేతుల్లోని చిన్నదాన్ని అందుకుని లగేజ్ తీసుకుని అడుగేస్తుండగానే... నా చేతిలోని బాగ్ తీసుకుని, నా రూమ్‌లో పెట్టి గొళ్ళెం పెట్టేసి వచ్చింది. చిన్నదాని తీసుకుని చంకనేసుకుని వెంటనే ఫోన్ కలిపింది.

నేనెటూ తేల్చుకోలేక నిస్సహాయంగా నిల్చుండిపోయాను.

ఫోన్ కనెక్ట్ అయినట్లుంది.

“ఒరే! ఎలా ఉన్నావ్? ఆఫీస్ నుండి వచ్చేసావా?... సరే... సరే... సరేగానీ జాగ్రత్తగా విను... నువ్వేం చేస్తావో నాకు తెలీదు. నీకు ఖచ్చితంగా నెల అంటే... నెలనే టైం ఇస్తున్నాను. ఈ లోపు నువ్వొచ్చి మీ ఆవిడ్ని... మీ అమ్మాయిని తీసుకెళ్తావో లేకపోతే నువ్వే వచ్చి ఇక్కడ సెటిలైపోతావో తేల్చుకో... ఉప్పు కారం తినే మనిషిరా అది... అర్థం చేసుకోరా...” అత్తయ్య మాట్లాడుతూనే ఉంది.

నా రెండు కళ్ళూ నయగారాలయ్యాయి. గుండెల్లోని దుఃఖం అంతా పెల్లుబుకి బైటికి తన్నుకొచ్చింది. పరుగెత్తుకెళ్ళి అత్తయ్యని వెనకనుంచి అట్లాగే కావలించుకున్నాను గట్టిగా!

మెల్లిగా తను నా వైపు తిరిగి, నన్ను తన గుండెల్లోకి పొదువుకుని... నా వెన్ను నిమిరింది.

అత్తయ్య స్పర్శలో ఒక సాంత్వన, ఏడ్చే బిడ్డ నోటికి రొమ్మందించిన అమ్మతనం... నాలోని మకిలి మంచులా కరుగుతోంది. అత్తయ్యని మరింత గట్టిగా హత్తుకున్నాను.

# ఆగు




## కడలి సత్యనారాయణ

కాంటెంపరరీ తెలుగు కథలో ఈతరం ఆలోచనలు, ఇష్టాలు వ్యక్తపరచడం వీరి కథల్లో కనిపిస్తుంది. 1996లో ఖమ్మంలో జన్మించారు. ఇప్పటికి పది కథలు రాశారు. సోషల్ మీడియా ద్వారా పాఠకులకు చేరువవుతున్న కథకుల్లో వీరొకరు. 'కడలి ప్రేమలేఖలు' పేరుతో రాసిన లేఖలు గుర్తింపును తెచ్చి పెట్టాయి. ఎం.ఏ. ఇంగ్లిష్ లిటరేచర్ చదివారు. నటనాభిలాష ఉంది. అధ్యాపక రంగంలో పనిచేస్తున్నారు.

నివాసం : హైదరాబాద్.

ఈ–మెయిల్ : kadalikaddy@gmail.com

ఇంకేం హెూప్ మిగిలి లేదు లైఫ్‌లో. ఏదో ఒక పని చేస్కొని బతకొచ్చు అనే ఆశ కూడా చచ్చిపోయింది. భూమి పొరలు చీల్చుకొని వచ్చి ఏ భూతమో అమాంతం మింగేస్తే బాగుండు అనిపించే రోజులవి. ఏమీ దిక్కు తోచదు. చుట్టూ ఏది చూసినా శూన్యం, విషాదం. ఎవరో ఏ మూల నుండో "చచ్చిపో" అని భయంకరమైన గొంతుతో ఉసిగొలిపినట్టు ఒకటే అలజడి. కళ్ళు మూస్తే బుగ్గలు చేరే కన్నీరు. కళ్ళు తెరిస్తే ఏమీ తెలియని తికమక. ఆకలి మాటే లేదు, పేగుల గోల తప్ప. చెంపలు లొట్టలు పడ్డాయి. చేతులు లాగుతున్నాయి. జుట్టు రాలిపోతోంది. అందం అనే పదం కూడా తనని చూస్తే అసహ్యించుకునేలా ఉంది. అద్దం ముందు నిలబడే ఆలోచన లేదు. అంతా గందరగోళం. ఒక్కత్తే కూర్చొని గోర్లు పీక్కోవడం విసుగు పుట్టింది. దిక్కులు చూస్తూ రోడ్లు నడవటం వెగటయ్యింది. ఇక చావే మిగిలింది.

ఏనాడూ తెల్లవారుజామున నిద్రలేవని పూర్ణి, ఆ రోజు సూర్యుడికన్నా ముందే లేచింది. అసలు పడుకుందో లేదో ఆ తలుపు చాటునున్న మంచానికీ, దుప్పటికే తెలియాలి. పూర్ణి అందరిలానే ఆశలు ఉన్న పిల్ల. ఆశలు ఆశలుగానే మిగిలిపోయాయి. తనూ అసంపూర్ణంగానే మిగిలిపోయింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇవి జీవితాలు ఎందుకు అవుతాయి, సినిమా కథలు అవుతాయి. పెంపకం అనే పదానికి భూమికీ సూర్యుడికీ ఉన్నంత దూరం. పెరగటం అనే పదమే తాను. తల్లి లేదు, తండ్రి ఉండీ ఉండకుండా వెళ్లి చంద్రుడిలో దాక్కున్నాడు. టన్నులకొద్దీ స్నేహాలున్నా ఈ పిల్లకి ఆసరా తీసుకోవడం నచ్చదు. ఆత్మాభిమానం అని కొందరు అంటే, ఇంకేదో అని ఇంకొందరు అంటారు. ఈ పిల్లకి మాత్రం అవేవీ చెవి వరకు కూడా చేరవు. ఆ నిమిషానికి ఏదనిపిస్తే అది మాట్లాడి చుట్టూ ఉన్న మనసుల్ని తేలిక  చెయ్యడం మాత్రమే తెలుసు. మొహానికీ, మనసుకీ ముసుగు ఎన్నడూ

వేస్కొని ఉండదు. తప్పుని తప్పని నిక్కచ్చిగా చెప్పగలదు. ఆ తప్పు తానే చేస్తే నిజాయితీగా ఒప్పుకోగలదు. ఇంత ధైర్యంగా కనిపించే పిల్లకి చావు ఆలోచనలు ఎలా పుట్టాయో చంద్రుడిలో దాక్కున్న ఆ తండ్రికే తెలియాలి. కొన్ని వారాలుగా ఆ అద్దం అలానే ఉంది. తుడిచినట్టు లేదు. అంతా మురికీ, దుమ్మూ పేరుకుపోయింది. స్నానం చేసి, తనకి ఇష్టమైన బట్టలు వేసుకొని వచ్చి అప్పుడు చూసింది ఆ అద్దాన్ని. ఇద్దరి స్థితి ఒక్కటే అని అర్థమయ్యి అద్దాన్ని తన తెల్లటి చున్నితో తుడిచింది. పూర్ణికి తాను తాను కానేమో అనిపించింది. ఆ నిస్సారమైన మొహం. చిన్న మొటిమ వస్తేనే ప్రాణం పోయినట్టు వాళ్ళ నాన్నకి చుక్కలు చూపించే పిల్ల ఆ నల్లటి చారలతో ఉన్న ముఖాన్ని చూసి ఒక్కసారిగా భయపడింది. తమాయించుకొని ఆ పక్కనే ఉన్న పెట్టెలోని కాటుక తీసి కళ్ళకు దిద్దింది. కాటుక ఇంకాస్త నలుపు పులుముకొని అందంగా మెరిసింది. నీలి కనుమల్లో ఉన్న ఆ ఆరిపోని చిన్న చినుకుల్లాంటి నీళ్ళు మాత్రం అలానే చూస్తుండిపోయాయి. ఎందుకో ఏమిటో తెలియనితనం. చావు పిలుస్తోంది. చావే ఉంది మనసంతా. తనకయినా తెలియదు ఎందుకు బ్రతకాలి అనే ప్రశ్న. బతికి ఏం పని చేయాలో, అస్సలు ఏ పని చెయ్యగలదో కూడా తెలియదు. ఆలోచనల్లో పడి ఉన్నంతసేపు లోకం తెలీదు. లోకం తెలిసిన మరుక్షణం నుండి చావు ధ్యాస. ఆత్మీయులు ఎంత అడిగినా ఏం లేదు అని చెప్పింది. పాపం నిజంగానే తెలియదేమో. అలా నిలుచోడం ఒక అరగంట జరిగింది. అద్దంలో చూస్తూ కన్నీళ్ళు తుడవడం తనకేం కొత్త కాదు. ఇదివరకూ గ్లిజరిన్తో కన్నీళ్ళు కార్చి, ఐ లైనర్ చెరిగిపోకుండా ఎలా మేనేజ్ చెయ్యాలో ప్రాక్టీస్ చేసేది. ఇప్పుడు తను పిలవకుండానే వచ్చే ఆ కన్నీళ్ళని, తప్పించుకోలేని పరిస్థితి. బోర్లా తిప్పి పెట్టి ఉన్న వాళ్ళ నాన్న ఫోటో చూసింది. "చంద్రుడితో కలిసి ఆడుకుందాం త్వరగా రామ్మా!" అని పిలిచినట్టు అనిపించింది. చుక్కలుగా ఉన్న ఆ కొనల్లో ఉన్న కన్నీళ్ళు ఉవ్వెత్తున అలలుగా మారాయి...!

కిటికీలో నుండి తలెత్తి చూసింది. అక్కడక్కడా వెలుతురు. స్వేచ్ఛగా పరుగులు తీస్తూ పక్షులు. వాటిని చూసి రెండు క్షణాలు ఆశలు గుర్తొచ్చాయి, అవెలా చచ్చిపోయాయో కూడా గుర్తొచ్చింది. కళ్ళు తుడుచుకొని ఇల్లునంతా తేరిపారా చూసుకుంది. నాలుగేళ్ల ముందు స్వర్గం, నాలుగు నెలల ముందు నరకం, నాలుగు నిమిషాల్లో తనకేమి కాని భూమిలాంటి ప్రదేశం. తలుపులు మూసి తాళం వేసి, మళ్ళీ ఆ తలుపునీ ఆ తలుపు చాటున తనకున్న దాగుడుమూతల జ్ఞాపకాల్ని, నెమరేసుకొని తల వీధి వైపు తిప్పింది. మొదలైన నడక. వీధులు అలా వచ్చిపోతున్నాయి కాని నడక మాత్రం ఆగలేదు. నడకలో కూడా చలనం లేని నడక అది. బెదిరించే కుక్కల మూకలు కనీసం నలుసంతగా కూడా కంటికి ఆనలేదు. నేరుగా రైలు పట్టాలు ఉన్న గేటు దగ్గర ఆగింది ఆ నడక. అక్కడ నుండి పట్టాలు

పట్టుకొని సీదాగా నడుచుకుంటూపోయి ఎవరూ లేని దగ్గర పట్టాల మీద పడుకొని కళ్ళు మూయాలని ఆ అమ్మాయి ఆలోచన. నడుస్తూ వెళ్లింది. నడుస్తూ నడుస్తూ ఉండగా రైల్వే స్టేషన్ వచ్చింది. రైల్వే స్టేషనంతా ఖాళీగా ఉంది. చుట్టూ ఎటు చూసినా నలుగురికి మించి ఒక మనిషి లేడు. తను పట్టాలబాటన నడిచినా ఆపేవారు ఉండకూడదని తన ఆశ. దేనికోసమో ఎదురుచూపు కానీ ఏదీ రాలేదు. ఆ టైంకి వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలుతో సహా. తన బతుకే అంత అనే నిరాశ మళ్ళీ ఆలస్యం రూపంలో ఎదురొచ్చి హెన్స్ ప్రూవ్డ్ అన్నట్టు అనిపించింది.

గంటసేపయ్యింది. ఎక్కడ నుండి తెచ్చిపెట్టుకోవాలో తెలియని చోటులో ఉంది ధైర్యం. అంతే బలంగా చావాలనే ఆలోచన. చూపులేమో సూటిగా వెతుకుతూ నిల్చుండిపోయాయి. శ్వాస తీసుకుంటోంది గానీ, బతికుంది అని అనిపించడం లేదు. కాకుల గోల. గూడ్సు బండి ఒకటి పడి చావడానికి వీల్లేనంత మెల్లగా వచ్చి పోయింది. ఆకాశం తేటగా కనిపించడం మొదలయ్యింది. అటు ఇటు చూసి, పట్టాల బాటన నడక మొదలెట్టింది. దూరంగా ఒకాయన తనకోసమే వస్తున్నట్లు అనిపించింది. పట్టించుకోకుండా ముందుకు నడిచింది. ఎవరైనా తెలిసిన వాళ్ళు ఉన్నారేమో అని భయపడింది. రెండు అడుగులు ముందుకు వేసింది. ఎవరో పిలిచినట్టు ఒక గొంతు. ఎవరూ పిలవలేదు. ఆ మనిషి అక్కడే తను అప్పటివరకూ కూర్చున్న బల్లమీదే కూర్చొని ఉన్నాడు. తనని చూసి ఓ నవ్వు నవ్వాడు. నడక ఆగిపోయి ఎవరో గమనిస్తున్నారనే ఆలోచన మొదలైంది. ముందుకు కదలలేకపోయిన నిస్సహాయ స్థితి. మళ్ళీ నవ్వాడు ఆ మనిషి. ఆ నవ్వు పూర్ణికి చీదర కలిగించింది. మళ్ళీ ఒక వెయ్యి ఆలోచనలు కదిలాయి. ఆ నవ్వుని తను మామూలు నవ్వుగా తీసుకోలేక ఒక మగనవ్వుగా తీసుకోవాల్సి వచ్చినందుకు ఆ చీదర. ఆయన 'ఈ ట్రైన్ మూడు గంటలు లేటంటగా అమ్మా...' అన్నాడు. ఆ అమ్మా అనే పదం మాత్రమే చెవుల వరకూ చేరింది. తనంతటతానే తనకి తెలియకుండానే వచ్చి ఆ బల్లపైన కూర్చొని తలాడించింది. ఈయనొక్కడే ఆ స్టేషన్లోకి కొత్తగా వచ్చి చేరిన మనిషి, నలుగురు కాస్త ఇప్పుడు ఐదుగురు అయ్యారు. ఎక్కువమంది ఉంటే తను పట్టాలదారిలో వెళ్లటానికి అడ్డుగా ఉంటారని పూర్ణి భయం. ఆయన వచ్చి మూడు నిమిషాలు అయ్యింది. మూడు నిమిషాలుగా నవ్వుతూనే ఉన్నాడు. ఎందుకో తెలియదు! పూర్ణి ధ్యాసంతా ఈయన చూపు నుండి ఎలా తప్పించుకు నడవాలనే! ఆయన ఉన్నట్టుండి 'అగ్గు' అన్నాడు. పూర్ణికి ఆగు అన్నట్టు వినబడి గుండెల్లో గుబులయ్యింది. తాను చెయ్యబోతున్న పని ఇతనికెలా తెలుసని భయమేసింది. అతను మళ్లీ 'అగ్గు' అన్నాడు. పూర్ణి ఏం మాట్లాడకుండానే అటు చూసింది. ఆయన పూర్ణి వైపు మొహం తిప్పి, "అగ్గు – అగస్త్యసుర్ నందన్. నా కొడుకు. బుడ్డోడు పుట్టిన నాలుగు నెలలకి కానీ చూడలేకపోతున్నాను... సరిగ్గా ఇప్పుడే ఈ

ట్రైన్ లేట్..!" అని రైలు పట్టాలవైపు చూసి నిస్సహాయమైన నవ్వు నవ్వాడు. పూర్ణి తనకి తెలీకుండానే చాలారోజుల తరువాత ఒక విషయంపైన ధ్యాస పెట్టి వినాలి అనుకుంది. "హ్మ్..!" అని మొహం అతనివైపుగా తిప్పి కూర్చుంది.

"మాది హైదరాబాద్ అమ్మా! ఇక్కడికి పని కోసం వచ్చాను. ఎనిమిదో నెల కడుపులో ఉన్నప్పుడు వదిలొచ్చాను. వెళ్ళడం కుదరలేదు. వీడున్నాడే, అగ్గుగాడు, వీడి సంగతులు వీళ్ళమ్మా, వాడి నానమ్మా చెప్తుంటే, పని వదిలేసి పోయి వాడిని హత్తుకోవాలి అనిపించేది. కానీ పని నన్ను ఆపేది. ఇన్నాళ్ళు ఫోన్లో, నెట్వర్క్ అందని వీడియో కాల్లోనే కుదిరింది. ఎంతయ్యి ఉంటాడో వెధవ, నా మోచెయ్యి అంత అయ్యి ఉంటాడా?" అని తన చెయ్యిని కొలుచుకుంటున్నాడు.

పూర్ణి కూడా అతని చేతుల వైపు తీక్షణంగా చూసింది. ఆయన మాట్లాడుతూనే ఉన్నాడు. అలా ఏమీ తెలియని వ్యక్తి ఎందుకు అలా చెప్తున్నాడో అన్న విషయం కుడా పూర్ణి తలలోకి రాలేదు. "వీడు వాళ్ళమ్మ మూతి పగలగొడుతున్నాడంట రోజూ.." అన్నాడు. ఏదో ఉత్సాహంతో ఒక ప్రశ్నలాగా మారిపోయింది పూర్ణి మొహం. "వాడి అరికాళ్ళతో తంతున్నాడంట అగ్గుగాడు... అగ్గిగాడు" అని మురిసిపోయాడు. "వాళ్ళమ్మని పాలు తాగేటప్పుడు కొరుకుతున్నాడంట వెధవ" అని నవ్వాడు. పూర్ణి కూడా చిన్న నవ్వు నవ్వింది. చాలా రోజుల తరువాత నవ్విన నవ్వు అది.

"వాళ్ళ నానమ్మ వేలు పట్టుకొని నిద్రపోతున్నాడంట. ఇదిగో ఈ గడ్డం కూడా పొద్దున్నే షేవ్ చేశాను... వెళ్లి ముద్దాడగానే గుచ్చుకోకూడదని. ఎన్ని పాటలు నేర్చుకున్నానో వాడికోసం. 'అగ్గు' అని పిలిస్తే కళ్ళు మిటకరించి చూస్తున్నాడంట. నన్ను వీడియోకాల్లో చూడగానే ఓయ్... ఊయ్... అని గోల చేస్తున్నాడు. రెండు చేతుల ఊయల వాడి ఫేవరేట్. ఎత్తుకు తిప్పితేనే నిద్రపోతాడు. వీడికీ... ఈ బుడ్డోడికి అలగడం కుడా వచ్చేసింది అప్పుడే. మూడుసార్లు అరచినా వాడి దగ్గరికి వెళ్ళకపోతే ఎన్.టి.ఆర్ లాగా చెయ్యి నోట్లో పెట్టుకొని కొరుక్కుంటున్నాడంట." వెంటనే పూర్ణి ఫక్కున నవ్వింది. "ఇంకా" అని ఆసక్తిగా అడిగింది.

"అవునమ్మా...! నోట్లో వేలు వేసుకునే పిల్లల్ని చూసానుగాని వీడు అమాంతం పిడికెడు నోట్లో పెట్టుకుంటాడు" అని అలా ఆయన చేతిని నోట్లో పెట్టుకొని చూపించాడు.

"భలేగా ఉన్నాడు" అని అచ్చు చూసినట్లే ఆశ్చర్యపడింది పూర్ణి.

"అవును! గడియారం ముళ్ళులా తిరుగుతున్నాడంట నిద్రలో. ఇప్పుడు వెళ్లి చూడాలి వాడిని" అని నిట్టూర్చాడు.

ఇంత మంచి కబుర్లని డిస్టర్బ్ చేసింది ఎనౌన్స్‌మెంట్. ఇంకాసేపట్లో ఒకటవ నెంబర్ ప్లాట్‌ఫాం మీదకు ట్రైన్ వస్తుందని..!

“ఇంకాసేపే ఉంది. చెప్పండి అగ్గ విషయాలు” అని అడిగింది పూర్ణి. అలా ఐదునిమిషాలు నవ్వులు వినపడ్డాయి. అగ్గ ఇలా... అగ్గ అలా... అని ఆయన మాటల్లో మునిగిపోయాడు. పూర్ణి తెలీకుండానే మాములుగా మారిపోయింది.

రెండు చంద్రవంకల్లాంటి కళ్ళు మెరుస్తున్నాయి.

ట్రైన్ వచ్చేసింది. ఆయన రైలెక్కాడు. “ఏమ్మా? నువ్వు రావా?” అని అడిగాడాయన. “లేదండి ఏదో మర్చిపోయాను” అని టాటా చెప్పి పూర్ణి ఇంటికి బయలుదేరింది. తలుపుతీసి వాళ్ళ నాన్న ఫోటో దగ్గరగా తీసి తీక్షణంగా చూసింది. చిన్నప్పుడు జరిగిన సంఘటన ఒకటి గుర్తొచ్చింది. పూర్ణి వాళ్ళమ్మ చీరకట్టుకొని, వాళ్ళమ్మలాగే తయారయ్యి అద్దంలో చూసుకుంటున్నప్పుడు టక్కున వాళ్ళ నాన్న చూడడం. వాళ్ళ నాన్న చూశాడని తను మొహానికి చేతులడ్డం పెట్టుకొని సిగ్గుపడి కిలకిలా నవ్వడం. ఆ నవ్వులు చూసి వాళ్ళ నాన్న “నా చిన్ని పాప సినిమా హీరోయిన్ అవుతుందా” అని పూర్ణిని ఎత్తుకొని గిరగిరా తిప్పడం గుర్తొచ్చింది.

పూర్ణి చూపు, మూలకి పడున్న తన లగేజీ వైపూ, అలమర్లో పడేసిన పోర్ట్‌ఫోలియో వైపూ మళ్లింది.

# చేను చెప్పని కత



## మధుసూదన్‌రావు రామదుర్గం

సామాజిక సమస్యలను వీలైనంత సహజంగా చెప్పాల్సిన అవసరం ఉందని నమ్మే రచయిత. పుట్టింది 1962లో. రాయలసీమలోని ఆదోని సొంత ఊరు. ఇక్కడి నుంచే తన కథలు పుట్టాయంటారు. పాత్రికేయ రంగంలో ఉండటం వల్ల సామాజిక సమస్యలను లోతుగా అర్థం చేసుకునే అవకాశం దొరికింది వీరికి. అదే తనను కథలు రాయడానికి ముందుకు నడిపిస్తుందని చెబుతారు. వీరి రెండు పుస్తకాలు 'మట్టి మనసు', 'కమాన్ వీధి కథలు' పాఠకుల గమనింపు పొందాయి. సాక్షి దినపత్రికలో న్యూస్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

నివాసం : హైదరాబాద్.

మొబైల్ : 99121 99557



కొన్ని కతలంతే. ఎవరూ సెప్పకుండా మట్టిలో కల్సిపోతుంటాయి. కొన్ని ఎవరితో సెప్పకుండా మసకయి ఎనకయి పోతుంటాయి. ఆ కతల్లో మనసుల్లెక్క ఆటికీ ఆయుస్సు తక్కువేమో! ఇంకొన్ని ఉంటాయి. ఆటిని ఎవరూ సెప్పక్కర్లేదు. అందరింట్లో అందరి నోట్లో రకరకాలుగా నానుతుంటాయి. తెలిసి కొంత తెలియంది కొంత. ఆ కతల్లో ఇష్టముంటాది... కష్టమూ ఉంటాది. పొలం అంటే పడిసచ్చే నర్సిమ్మ కతా అట్లాంటిదే.

నర్సిమ్మా... అద్దురుస్టమంటే నీదేరా...!

ఎండిన పెదవుల అంచుదంక పదేపదే వచ్చి ఆగిపోతున్న ఆ మాటకి నర్మిమ్మ మనసులోనే నవ్వుకునిండాడు నీరసంగా. రెండెకరాల సేను. కంటికానినంత దూరం చూస్తునే ఉన్నాడు.

అంత సీకట్లో మట్టిలోంచి ఉండి ఉండి రేగుతున్న వాసన... ఇష్టంగా తాకుతోంది. నాయిన సెమటేమో? కస్టంతో కూడబెట్టిన దుడ్లతో కొన్నదీ సేను. పత్రాలు సేతికందిన రోజు చేసిన పూజలు... సుట్టుపక్కల ఇండ్లోల్లకి పంచిన స్వీటు, డాణి బొరుగులు... ఆనందంతో ఎలిగిపోయిన ఇంటోల్ల ముకం... నర్సిమ్మ కండ్లల్లో తెరలు తెరలుగా కదులుతుండాయి.

వీపుకి గరుకుగా గుచ్చుకుంటుంటే... పక్కకి తిరిగి పడుకున్నాడు. తాళ్ల మంచం. నాయిన పండుకునే మంచం. రాత్రయితే సాలు ఆయప్ప మంచం ఎప్పుడేస్తాడా... పక్కల దూరి కతలు ఇనాలా అని నర్సిమ్మ ఎంత ఆతుర పడిపోయేవాడో. పెద్దాయన మంచంపైనే పోయిండాడు. నచ్చత్రం బాగా లేదు, మంచం పడేయాలని దాసప్పసామి సెప్పినా నర్సిమ్మ ఇనుకోలేదు. ఇది నాయిన్ది ఇడిసేదిలేదన్నాడు. బలే మొండోడు అని దాసప్ప గునిసినాడు. సేనులో సిన్న గుడిసె ఏసుకుని గుమ్మం ముందర మంచం. దానిపై పండుకున్నప్పుడల్లా నాయన పక్కన ఉన్నట్టే అనిపిస్తాది. పాపం సేను సింత తీరుస్తాదని... బతుకులు బాగయితాయని ఎంత ఆశపడిండ్నో ఆ పెద్దమనిసి, ఆయప్ప పాయె. ఆయన తువ్వాలు నర్సిమ్మ బుజాన పడింది.

నర్సిమ్మకి మనసులో ఎంత కష్టమున్నా... ఒక్కసారి ఆ మంచంపై కునుకు తీస్తే సాలు అంతా పెసాంతంగా ఉండేది. ఈ రోజు ఎందుకో మంచంపై పడుకుంటే యాడో పాతాలంలో యాలాడుతున్నట్లుండాది. నాయన పక్కన పండుకున్నట్లు లేదు. గుబులు తగ్గట్లేదు. నలుపెక్కిన ఆకాశంలో పొడుసుకొస్తున్న సుక్కల్ని కండ్లార్పకుండ సూస్తుండాడు. ఆ మూలలో ఉండి ఉండి మెరస్తున్న సుక్క... పక్కనే సన్నది... నాయినా అమ్మలెక్క.. తడారిన కండ్లల్లో సెలమ. మాసినగడ్డంపై తళుక్కుమంటున్న కన్నీటి చుక్కలు. తుడుసు కోవాలనిపించలేదు. 'ఇప్పుడేమయిండాదని ఏడుస్తుండావ్... పోతే పోయిండాదిలే...' పరీక్షలో పెయిలై ఏడుస్తుంటే నాయన అన్న మాటలు నర్సిమ్మకి గుర్తుకొచ్చిండాది. మళ్లీ ఆయప్ప దిగొచ్చి అట్టంటే ఎంత బాగుంటాదో. గుండె నిండా తెలీని బెంగ.

ఆ రోజు ఆయప్ప అట్లనకుండింటే కత ఇంకో లెక్కుండేదేమో! గోడకానున్న నాగలి... ఇంటి సావిట్లో ఎద్దులు... నాయిన నల్లతోలు సెప్పులు... రంగురంగుల సెండుపూలు కట్టిన సెర్నాకోల... ఈటి మద్దెనే పెరిగినంక ఏరే ఆలోచన్లు ఎట్లా వస్తయి. అప్పుట్జేసి నాయన... పేడ కసువు ఎత్తేత్తీ అమ్మ ఎల్లిపోయినంక ఎవుసాయం పూర్తిగా సేతికొచ్చిండాది. ఇంటామె లచ్చుమక్క కష్టమైతదంటే వద్దు. అప్పులు మాత్రం... సేయొద్దు అంటూ మొత్తుకున్నా నర్సిమ్మ పట్టించుకోలేదు. పట్టించుకోలేదని కాదు వేరే పని సేస్కునేకి ఏముండాది? సేనుకైనా పోవాలా... సావిట్లో అన్నా కూసోవాల. కూసుంటే తినేకి ఎట్లా? ఆలోచన్లు తలలో గిర్రున తిరుగుతుండాయి.

పొలం ఒక్కటే... పొలమారుతున్న జ్ఞాపకాలెన్నో!

కేవలం రెండెకరాల పొలం... రెండు తరాల కతలు ఆడ యినిపిస్తాయి. రక్తం సెమటసుక్కలై జారితే తడిసిన మట్టి ఇది! విత్తనం విత్తింది మొదలు... పంట అమ్ముకునేదాంక పడిన తండ్లాటలు ఈ మట్టికి తెల్సినంతగా ఎవురికీ తెలీదు. అయినా ఈ మట్టిలో ఏమో ఉండాది. నర్సిమ్మ మట్టిలోనే అదురుస్టాన్ని ఎతుకుతుండాడు. మట్టితోనే తన కుటుంబం బాగయితాది అనుకుంటుండాడు. ఏసిన విత్తనానికి సత్తువ ఉండాదో లేదో... సెట్టు పైకి లేస్తే సేతికి అందుతాదో లేదో? ఆకాసంలో మోడాలు ఈ బారికైనా వస్తాయో రావో... వర్సం సెయ్యిస్తే... పంట ఎత్తిపోతే... కొత్త అప్పులు నెత్తిపై తైతక్కలాడితే... అన్నీ అనుమానాలే... అంతా అయోమయమే! అయినా సరే మట్టిపై అంటే మమకారం రొవంత కూడా తగ్గదు. ఈ మట్టి పిచ్చి నర్సిమ్మకి కాలి నుంచి తలదంక ఎక్కి ఉండాది. బతుకంతా సేనుతో పెనవేసుకుని ఉండాది. పెండ్లాం పిల్లల్ని సూడకుండా ఉంటాడేమో గానీ... సేనుకు పోకుండా ఉండలేడు.

'అబ్బా...' మెడ పట్టేసినట్టనిపించి లేసి కూసున్నాడు. అంతా తిక్కతిక్కగా ఉండాది. నే సేస్తుండేది సరేనా? మరోసారి ప్రశ్న తలెత్తిండాది. 'ఇప్పటిదంక ఎవురికీ అన్నేయం సేయలేదు... నా బతుకే అన్నేయమై పోయిండాది. ఎందుకిట్టానో ఏమో' ఉస్సూరనుకుంటూ పైకి లేసినాడు. కాలు జోము పట్టేసిండాది. గట్టిగా జాడించి

పొలం వారకి అడుగులేసినాడు. సేను సూత్తుంటే గర్వం రావాల! అంతా సరిగా ఉండి ఉంటే నా కత ఇట్టాగేడిసేదా అనుకునిండాడు నర్సిమ్మ. తనపై తనకే యాస్రికొచ్చి... థూ ఏం దరిద్రంరా నీది అని కసిదీరా తిట్టుకునిండాడు. నిజమే! చెనిక్కాయ ఏస్తే అదీ పాయె... పత్తి పెడ్తే అదీ సేతికందలా... పోనీ అని టమాటా ఏస్తే పంట దక్కిండాది. కాయలు ఏపుగా వచ్చిండాయి. రేటు బాగా ఉంటాదని సంకలు గుద్దుకునేలోపు... మార్కెట్ రేటు ఉన్నట్టుండి పడిపాయ. ఏమంటే పెట్రోలు డీజిల్ రేటు పెరిగిండాయని ధర్నాలంట. సరుకు తెచ్చేటోల్లు లేక ధరలు ధామనిండాయి. మార్కెట్లో పీరన్న 'నర్సిమ్మా... ఏం సేయాల మార్కెట్ డవునయిండాది. కేజీ పది ఇరవై పైసలయిండాది' అంటుంటే కత్తులు తీసుకుని పొడిసినట్టయింది. కండ్లు బైర్లు కమ్ముకుని ఆడే కూసుండి పోయినాడు. సేసేదిలేక అయినకాడికి అమ్ముకునిండాడు. లచ్చల్లో అప్పుల్జేసి పంటపెడ్తే... బిచ్చగానికి పైసలు బొచ్చెలే ఏసినట్టయింది. ఎంత గట్టి గుండైనా ఎట్లా తట్టుకుంటాది?

నర్సిమ్మ ఎత్తిపోయిండాడని తెల్సిన ఎంటనే అప్పులోల్లో గుబులు పెరిగిండాది. ఎగ్గొడ్తాడేమో అని ఎంటపడేది సురువయిండాది. నర్సిమ్మ కంటిపై కునుకు ఎగిరిపోయిండాది. ఇంటి కాడ... రోడ్డు కాడ... పంచాయతీ కట్ట కాడ... గుడికాడ... బడి కాడ యాడ కనిపిస్తే ఆడ అడిగేదే కడిగేదే! అంత సత్తువ లేనోడివి అప్పెట్ల తీసుకుంటివి మల్ల అంటూ వేధింపులు. పోనీ పొలం అమ్మరాదా అని సలహాలు! ఉక్కిరిబిక్కిరయిపోయిండాడు. నిన్నదంక బుజంపై సేతులేసినోల్లే ఇయ్యాల గొంతు పిసికేతట్లయిండారని లోపల్లోపల ఏడ్సుకునిండాడు. అన్నం మానేసిండాడు. ఎప్పుడూ ఏదో ధ్యాసలో దయ్యం పట్టినట్లు కనిపించేటోడు. అయినకాడికి పొలం అమ్ముకుంటే అప్పులన్నీ తీరుతాయా అంటే అదీ లేదు. ఆ ఎంటేసులు సెట్టి వడ్డీకే సగం పోతాది. పొలం పోతే ఎట్లా బతకాల? కూతురు పెండ్లెట్ల సెయ్యాల? కొడుక్కేం ఇవ్వాల? ఇప్పుడేం సెయ్యాల??

ఏం సెయ్యాల... ఏం సెయ్యాల... వారం నుంచి ఇదొక్కటే వంట్లో సత్తువ లాగేస్తుండాది. సేనులో నర్సిమ్మ నడుస్తుండాడేగానీ మనసులో మనసులేదు. మూడు బోరుగుంతలు వెక్కిరిస్తూ కనిపించిండాయి. ఆ గుంతల్ని సూడగానే సుర్రుమనిండాది. దగ్గర దగ్గర అరవై వేలు అప్పు మిగిల్చిన గుంతలవి. 'నీల్లొస్తాయని ఎంత ఆశపడిండాను... అంతా నాశనం అయిండాది. వందలు... వేల అడుగులేసినా సుక్క నీల్లు పడిండాయా? బూడిద తప్పు!' అనుకున్నాడు. ఆశనే కాదు బతుకునే మింగేసిన బోరుబావులు దాటుకుని అడుగులేస్తున్నాడు. సేనులో ఒక్కో సాలు కాడ ఒక్కో గురుతు నర్సిమ్మని తడుముతుండాది... తరుముతుండాది. ఎంత గింజుకున్నా ఎక్కి ఎక్కి ఏడ్సినా బైటపడేది కస్టమని తెల్సి పోతుండాది. ఏం తిరిగేది ఇంగ సాల్లే... ఈ సేను నన్ను మింగేసిండాది అంతే! నిట్టూరుస్తూ మళ్లీ వచ్చి మంచంపై కూలబడిండాడు.

చేతికాడ కొత్త తెల్లగుడ్డ పాములా కనిపిస్తుండాది. ఆ పక్కనే గుత్తుగా సెండూపూలారం. మద్దెలో ఎర్ర గులాబీలు. పూలారాన్ని సూడగానే నర్సిమ్మకి తన పెండ్లి గుర్తొచ్చిండాది. ఇయ్యంకుడు పనికిరాని పూలారం తెచ్చిండాడని నాయన అంతెత్తు ఎగిరిండాడు. 'ఏమప్పా... జీవితంలో ఒక్కసారే సేసుకునేది పెండ్లి! ఇట్లాగేనా పలారం తెచ్చేది. పురికోసు తప్ప పూలాడుండాయి? అని కేకలేసి అప్పటికప్పుడు బామ్మర్దితో పెద్ద పూలారం తెప్పించిండాడు. ఇన్నాల్లకి మల్లీ ఇప్పుడు సెండుపూలారం. పొద్దున్న సంతలో పూలాయమ్మ హారం కట్టేటప్పుడు 'దేవుడికా... ఎవ్రుకి...' అనడిగితే 'లేదు నాకే' అంటే... ఆయమ్మ మూతి వంకర్లు తిప్పి 'సాల్లేప్పా కువ్వాడం సేసేకి నేనే దొరికిండానా...' అంది. నిజమే మల్ల ఈ వయసులో పూలారం నాకే అంటే ఎవరైనా అట్లాగే ఉంటాది. పూలారం కిందే ప్రేము కట్టిన పెద్ద పొటో! నర్సిమ్మదే! నల్లని మీసం మంచి జుత్తుతో అప్పుడెప్పుడో బయలాట కట్టినప్పుడు అదేపనిగా సంతకెల్లి సలీం పొటో స్టూడియోలో తీయించుకునిండాడు! మల్లీ ఇయ్యాల ఆ పొటో పెద్దది తీసి ప్రేము కట్టించిండాడు. పొటోలో తన పాతరూపం సూసి నవ్విండాడు. ఈసారి నవ్వులో తెలీని బయం.

'మారెన్న... పదివేలు, పరమేసప్ప... ఇరవై అయిదువేలు... తనకా బ్యాంకు లచ్చన్నర, ఎంకటేసులు సెట్టి యాభైవేలు (వడ్డీ కలిపి...) ఎరువులంగడి ఉరుకుందకు అయిదు వేలు, కిరానా అంగడి మోహన్కి నాలుగువేలు... నర్సిమ్మ అప్పుల లెక్కలు తెల్లకాగితంపై శ్రద్ధగా రాస్తున్నాడు. రాత్రి పదిగంటలు దాటుతుండాది. అంతా సీకటి. పక్కనే సింతసెట్టు నుంచి వీస్తున్న గాలి. ఆ చీకట్లో... ఆ నిశ్శబ్దంలో... నర్సిమ్మ. ముకంలో తెలీని విచారం. కాసేపు ఆగి మల్లీ పెన్ను తీసుకున్నాడు... 'కుమారుడు ఓబిలేసుకి... నాయనా... ఈల్లకంతా నేను బాకీ ఉండేది నిజమే! అప్పు ఎంత తీసుకునిండేది లెక్క రాసిండాను. నన్ను సెమించప్పా... తండ్రిగా నీకేం సేయలేక పోయిండాను.' నర్సిమ్మ కండ్లల్లో నీల్లు పారుతుండాయి. తట్టుకునేకి అయితలేదు. గట్టిగా ఏడుస్తుండాడు. సచ్చేది కూడా కష్టమని తెలుస్తుండాది.

లచ్మక్క ముకం గుర్తుకొచ్చిండాది. బంగారం లాంటి ఆడమడిసి. కాపురానికి పిల్సుకొచ్చినపుడు మల్లెపువ్వులెక్క ఎంత సుతారంగా ఉండేది. నా దరిద్రం అంతా సుట్టుకుంది. ఆ కండ్లల్లో ఒక్క సుక్క నీల్లు కనబడకుండె... లోపల్లోపల ఎట్టా పెనుగులాడిండాదో ఆయమ్మ. మొదటి రోజు రాత్రి. ఇంకా గుర్తే. 'ఇద్గో నీకేం కష్టం లేకుండా సూస్కుంటా. నాయనిచ్చిన పొలం ఉండాది. ఆయప్ప ఏదో తిక్కపని సేస్కుని సేతులు కాల్చుకునిండాడ్లే. నేనట్లా కాదు. బంగారం... బంగారంలాంటి పంట తీస్తా...!' అంటే '...ఏమో ఇయన్నీ నాకు తెల్దు గానీ ఇట్టా నవ్వుకుంటూ ఉంటే సాలు...' సానా సిన్న కోర్కె కోరిండాది... హూ... ఈ సేను దెయ్యం ఇంత సేత్తాదనుకోలేదు... లచ్మక్క నన్ను సెమించే... నిన్ను వగ్గేసి ఎల్తుండా!' రాత్రి... సీకటి గుయ్యారంలాంటి పొలంలో నర్సిమ్మ సంటోడిలా ఎక్కెక్కి ఏడుస్తుంటే... ఈచే గాలి కూడా జాలిగా చూస్తూ ఉండిపోయిండాది. ఎట్టా ఓదర్సాలో తెలీక!

కాలం కదలుతునే ఉండాది. నర్సిమ్మ కండ్లు తుడుసుకుని మళ్లీ పెన్ను తీసినాడు. నేను పోయినంక నాయిన మద్దెలో కాడి వదిలేసి జారుకునిండాడు అని మాత్రం అనుకోవద్దు. మర్యాద పోయినంక... పేనం పోయినేట్లే! నేనేదీ గుట్టు సేయలేదు. పొలం ఉండాది... అప్పులుండాయి... మీ ఇస్టం. రేప్పొద్దుగాల నేనుండను. నీకు కడా కర్సు వద్దని తెల్లగుడ్డ... పూలారం నేనే కొనుక్కొంచిండానప్పా... నా పొటో మాత్రం ఇంట్లో గోడకేసుకో! ఎందుకో తెల్సా 'ఇట్టా మాత్రం బతకొద్దని' గుర్తుచేసుకునేకి... మీయమ్మ సెల్లిని బాగా సూస్కో' పేపరు మడిచి పొటో ప్రేము పక్కన పెట్టాడు. సంచిలోంచి పొట్లం తీసినాడు... ఇస్టమైన వగ్గాణి పుగ్గాలు. గొంతులో దిగతా లేదు. పురుగుల మందు కలిపిన కూలుడ్రింకు సీసా అందుకునిండాడు.

తెల్లారగానే నర్సిమ్మ పొలంలో సచ్చిండాడన్న ఇసయం ఊరంతా గుప్పుమంది. పొలం కాడ జనాలు. ఓబిలేసు లచ్చమ్మ కూతురు...ఏడుస్తుండారు. సుట్టుపక్కలోల్లు ఓదారుస్తుండారు. ఇంకొంతమంది తర్వాత జరిగే పనులపై మాట్లాడుకుంటుండారు. పొలం కాడా అంతా జాతరలా ఉండాది. పోలీసు జీపు వచ్చిండాది. ఎస్.ఐ. హడావుడిగా తిరుగుతుండాడు. కానిస్టేబుల్ నర్సిమ్మ శవం కాడ ఏమేముండాయో రాసుకుంటుండాడు. పొటోగ్రాపరు పొటోలు తీస్తుండాడు. ఇంత గలాటాలో నర్సిమ్మ మాత్రం మంచంపై పెసాంతంగా పండుకునిండాడు. రాత్రంతా సేనులో ఎంత కుమిలిండాడో... లోపల ఎంత తండ్లాడిండాడో ఈ జనాలకి తెలిసేద్లేదు... అట్లా తెలిసేకి ఈసేను మట్టి ఇడిసేదీ లేదు. అన్నీ మింగి మాటలు రాని నంగనాచిలా ఉండాది.

వారం దాటింది. ఊరు మళ్లీ మామూలైంది. గాయపడ్డ నర్సిమ్మ కుటుంబం తేరుకోలేదు. పంచాయతీకట్ట కాడ కొంతమంది 'అన్నా నీకు దెల్సా నర్సిమ్మ సచ్చినంక కప్పేకి తెల్లగుడ్డ... ఏసేకి పూలారం తనే సంతలో తెచ్చుకునిండాడంట... పొటో కూడ ప్రేము కట్టించుకునిండాడంట' ఆసక్తిగా చర్చించుకుంటుండారు.

'...నర్సిమ్మ సస్తే సచ్చిండాడు కానీ... ఆడు బారతంలో బీస్ముడట్టాంటోడు' పూజారి దాసప్ప అంటుంటే 'అదెట్లా సస్తే గొప్పోడా?' ఎంగటేసులు సెట్టి ఎటకారంగా అన్నాడు.

'అదికాదు సెట్టీ బీస్ముడు తన సావు తన సెప్పుసేతుల్లో పెట్టుకుని అనుకున్నప్పుడు సచ్చిండాడు. మన నర్సిమ్మా అంతే తను ఎల్లాలకు నిండాదు ఎల్లిపోయిండాడు...' అంటుంటే అందరూ నోరెల్లబెట్టిండారు.

ఇయ్యాల రైతు సేతుల్లో ఏముందని... సావు తప్ప.

# మత్తయి 5:11



## మెర్సీ మార్గరేట్

దాదాపు పదేళ్ల పాటు కవిత్వం మాత్రమే రాసి, నాలుగేళ్లుగా కథలతో కూడా మెప్పిస్తున్న రచయిత. కవిత్వం ద్వారా కొన్ని విషయాలను అనుకున్నట్టుగా చెప్పలేమని, తను కథా ప్రక్రియలోకి వచ్చిన కారణం కూడా ఇదేనని చెబుతారు. 2017లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్నారు. 'మాటల మడుగు' కవితా సంపుటికి ఈ పురస్కారం దక్కింది. 1983లో పుట్టిన వీరి జీవితమంతా హైదరాబాద్ నగరంతోనే ముడిపడి ఉంది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పీజీ విద్యార్థులకు చదువు చెబుతున్నారు. దళిత క్రిస్టియన్ల సమస్యలు, వాళ్ల జీవితాలను చిత్రించాలన్నది వీరి ఆలోచన. కథల్లోనూ ఈ చూపు స్పష్టంగా కనిపిస్తుంది.


నివాసం : హైదరాబాద్.

మొబైల్ : 90528 09952

మార్తమ్మా...!! మార్తమ్మా...!!

302 ఫ్లాటు నుంచి బాలత్రిపుర సుందరి పిలుపు. వస్తున్నా అని ఇంట్లో అంట్లు తోముతున్నది కాస్తా పక్కన పడేసి లిఫ్ట్ దగ్గరకి పరుగెత్తింది మార్తమ్మ.

మార్తమ్మా, ఓబులేషు లేకపోతే ఆ అపార్ట్‌మెంట్ చేతుల్లేని మనిషిలా తయారౌవుతుంది. ఆ  అపార్ట్‌మెంట్‌కి రెండు చేతులు, రెండు కళ్ళు వాళ్లు. వీలయితే రెండు కాళ్లు కూడా.

నాలుగు అంతస్థుల అపార్ట్‌మెంట్ అది. స్కై స్టోన్ అపార్ట్‌మెంట్. ఆ ఏరియాలో చాలా పాత అపార్ట్‌మెంట్. అక్కడ మొట్టమొదట కట్టిన అపార్ట్‌మెంట్ కూడా అదే. ఫ్లోర్‌కి ఎనిమిది ఫ్లాట్లు. ఓబులేషు బతుకుతెరువు కోసం నల్గొండ జిల్లా నుంచి వాచ్మేన్‌గా అపార్ట్‌మెంట్‌కి పునాదులు వేసినపుడు వచ్చాడు. అపార్ట్‌మెంట్ కట్టాక మూడేళ్లకి పెళ్ళీ... పిల్లలు... కలిగారు. జీవితం అంటే అపార్ట్‌మెంటే అన్నట్టు బతికేస్తున్నారు వాళ్లు.

అపార్ట్‌మెంటు కింద సెల్లార్లో ఓబులేషుకు రెండు గదులు ఇచ్చారు. వాచ్‌మెన్లకి ఉండటానికి కట్టిన చిన్న చిన్న గదులవి. అంతకు మించి పెద్దగదులు ఇవ్వకూడదని ఎక్కడైనా రూలుందో ఏంటో తెలీదు. కాని ఓబులేషుకీ, మార్తమ్మకీ ఆ రెండు గదులే పాలెస్ అంత పెద్దవి. వాళ్ల సంసారం అక్కడే మొదలైయ్యింది. అపార్ట్‌మెంట్‌లోని అందరికి ఏ పని కావాలంటే ఆ పని చేస్తూ వాళ్ళలో ఒకరైయ్యారు మార్తమ్మ ఓబులేసులు.

ఊర్లో అందరు వీళ్ళని మెచ్చుకునే వాళ్ళే. – "బతుకుదెరువు కోసం పోయి ఎంత పద్దతిగా పని చేసుకుంటున్నారు."– అని గొప్పగా చెప్పుకుంటారు.

పెళ్లైన సంవత్సరానికే మార్తమ్మ నెల తప్పింది. మొదటి కాన్పులో కొడుకు పుట్టాడు. తరువాత నాలుగేళ్లకి కూతురు పుట్టింది. స్కైస్టోన్ అపార్ట్మెంట్‌లోనే. చుట్టూ పక్కన అపార్ట్మెంట్ల వాచ్‌మెన్లు ఆర్నెల్లకు ఒక్కసారి మారిపోతుంటారు. కాని ఓబులేషు మార్తమ్మ పద్నాలుగేళ్ళుగా అక్కడే వుంటున్నారు.

అపార్ట్మెంట్‌లోని మొదటి అంతస్థులోని శర్మగారికి ఓబులేషు పనితీరు బాగా నచ్చుతుంది. ఇంట్లోని ఏ పనైనా అప్పగిస్తాడు. ఆ పక్కింటి జానకీదేవి గారు కూడా– బ్రాహ్మణులే. వాళ్ల కూతురు కాన్పు అయ్యి ఇంటికొచ్చినప్పుడు దిష్టి తీసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ బుడ్డిదాన్ని మార్తమ్మే చూసుకుంటుంది. స్నానం చేయించి సాంబ్రాణి వేసి బుడ్డది నిద్రపోయేదాక ఎత్తుకుని పడుకోబెట్టిగాని ఇంకో ఇంటికి పోదు. .

ఆ పైన మూడో ఫ్లోర్లో వేంకటేశ్వర్లుగారి భార్య రత్నమాలకు మార్తమ్మ లేకపోతే అస్సలు కుదరదు. ఈ మధ్యే ఆవిడకి పక్షవాతం వస్తే మార్తమ్మ దగ్గరుండి చూసుకుంటోంది. టయానికి ఆమెకి మందు బిళ్లలు ఇవ్వటం దగ్గర్నుంచి ఆమె పని అంతా మార్తమ్మే చేస్తుంది.

ఆ పై ఫ్లోరు శాంతమ్మ ఇంట్లో వంట మనిషి మార్తమ్మే. శాంతమ్మకు మార్తమ్మ వంటలంటే భలే ఇష్టం... పుంటికూర బోటి కలిపి వండే వంటంటే శాంతమ్మ ఆమె భర్త ఏలియాలకు, వాళ్ల అబ్బాయి టింకుగాడికి మహాఇష్టం. శాంతమ్మగారు గవర్నమెంటు టీచరు. మార్తమ్మ పిల్లలకు శాంతమ్మ ఫ్రీగ ప్రతి సాయంత్రం ట్యూషన్ చెబుతుంది.

అపార్ట్మెంటులోని వాళ్ల కార్లన్ని శుభ్రంగా ఉంచటం, అపార్ట్మెంట్ అంతా తనదే అన్నంత ప్రేమతో శ్రద్ధగా నీట్‌గా పెట్టడం, అపార్ట్మెంట్‌లోని వాళ్లకు కావలసిన కూరగాయలు తేవటం ఇతరత్రా అంతా ఓబులేషు చూసుకునేవాడు. పెళ్లైనా పేరంటమైనా చావైనా దినమైనా ఏనాడు అపార్ట్మెంట్ వదిలి వెళ్ళలేదు. ఒకవేళ ఓబులేసు వెళ్ళినా వెంటనే వచ్చేసేవాడు. తాను లేకపోతే వాళ్లందరూ ఇబ్బందిపడిపోతారని చాలా కృతజ్ఞతగా అందరిపట్ల ప్రేమగా ఉండేవాడు. తనకి తగ్గట్టుగానే మార్తమ్మ కూడా. అందరికి తలలో నాలుకలా ఉంటూ అందరి దగ్గరా మంచి పేరు తెచ్చుకున్నది వాళ్ల జంట.

• • •

ఇద్దరూ మంచి ఆరాధకులు.– 'నిన్ను వలే నీ పొరుగువాణ్ని ప్రేమించు' అనే యేసు చెప్పిన మాటలని చక్కగా పాటించేవాళ్లు. – "ప్రభువు ఎదుట తనని తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" అనే మాటల్ని ప్రార్థనలో మార్తమ్మ ప్రతీసారి కోట్ చేస్తూ ప్రార్థించేది.

వాళ్ల రెండు గదుల చిన్న ఇంటిని చాలా శుభ్రంగా పెట్టుకునేవాళ్లు. ఇంటి గోడల మీద బైబుల్లోని వాక్యాలు – “యెహోవా యందు నమ్మిక యుంచువానిని కృప ఆవరించుచున్నది. కీర్తనలు 32:10”– “ప్రేమ అనేక పాపములను కప్పును గనుక ఒకని యెడల ఒకడు నిష్కపటమైన ప్రేమ కలవారై యుండుడి. మొదటి పేతురు 4:8...” ఇలా ఇల్లంతా దైవభక్తితో ప్రేమతో నిండి ఉండేది.

యే ఆదివారం కూడా మార్తమ్మ ఓబులేషులు చర్చి మానేసింది లేదు. వాళ్లు సంపాదించే దానిలో దశమ భాగం తప్పకుండా చర్చికి ఇచ్చేవాళ్లు. పాస్టర్ గారిని ఆయన కుటుంబాన్ని బహుశా ప్రేమించేవాళ్లు. అపార్ట్‌మెంట్లో వాళ్లకి కూడా వాళ్ల భక్తి విశ్వాసాలను చూసి ముచ్చటేసేది. ఏనాడు వాళ్ల పట్ల వ్యతిరేక భావన లేదు. దాదాపు పదమూడేళ్లుగా వాళ్లను చూస్తుండటం వల్ల వాళ్లకు మార్తమ్మ ఓబులేషుల మీద మంచి అభిప్రాయమూ నమ్మకమూ ఏర్పడింది.

ఒకసారి వేసవి కాలంలో అపార్ట్‌మెంట్లో దొంగలు పడ్డారు. దొంగతనం చేసి పారిపోతున్న దొంగలను పట్టుకోడానికి వెళ్లి వాళ్ళతో పోరాడి కాలు విరగ్గొట్టుకున్నాడు ఓబులేసు. అప్పటి నుంచి తెలియనివాళ్లు వస్తే ఓబులేసు ప్రశ్నలకన్నిటికి సమాధానం చెబితే కాని వెళ్ళడానికి లేదు. 305 ఫ్లాట్‌లో వుండే శ్రీనివాస్ రెడ్డిగారు ఎప్పుడూ అంటుండేవాడు – “ఒరేయ్ ఓబులేసు చదువు లేక ఇలా ఇక్కడ ఉండి పోయావ్ కానీ లేకపోతే నీ తెలివికి నీకు మంచి ఉద్యోగం ఉండేదిరా అని.”

ఓబులేసుది చిన్నపిల్లాడి మనస్తత్వం. పిల్లలతో కూడా కలిసిపోయి ఆడుకునే వాడు. వాళ్ళతో కబుర్లు చెప్పేవాడు. పండగలకు అల్లరి చేసేవాడు. చిన్నవాళ్లు మొదలుకొని పెద్దవాళ్ల వరకు అందరి ప్రేమను పొందాడు.

• • •

వినాయక చవితికి మూడునెలల ముందు ఫ్లాట్ నంబరు 206 అమ్ముడు పోయింది. శైలజ, శ్రీనివాస్‌గార్లు తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల విభజన వల్ల గుంటూరుకి వెళ్లిపోవలసి వచ్చింది. అక్కడే ఇల్లు కొనుక్కోవలసి రావటం వల్ల ఇక్కడ ఫ్లాట్ నర్సింగ్‌రావు అనే ఆయనకు అమ్మేసారు.

నర్సింగ్‌రావు ఎవరో ఎమ్మెల్యే దగ్గర పని చేసేవాడు. ఎమ్మెల్యే ఎక్కడకెళితే అక్కడ ఆయనతో పాటు తిరిగేవాడు. ఆ అపార్ట్‌మెంట్‌కి వచ్చినప్పటి నుంచి ఓబులేషు మార్తమ్మ అంటే నర్సింగ్‌రావుకీ వాళ్లావిడ లక్ష్మమ్మకీ అస్సలు పడటం లేదు. అందుకు కారణమూ లేకపోలేదు. వాళ్లు ఇంట్లోకొచ్చిన కొత్తలో నర్సింగ్‌రావు కుటుంబం సత్యనారాయణ వ్రతం, ఇంకా ఏవేవో పూజలు చేసుకున్నారు. ఓబులేషు మార్తమ్మలు ఆ వ్రతానికెళ్లి కూర్చోలేదు. ఆ ప్రసాదాన్నీ తీసుకోలేదు. ఎందుకు రాలేదని అడిగితే

వాళ్ల అమాయకత్వం కొద్దీ – “బైబిల్లో ప్రసాదం తినొద్దని ఉందండీ” అని సమాధానం చెప్పాడు ఓబులేషు.

అప్పటి నుంచీ ఓబులేషు మార్తమ్మలంటే సదభిప్రాయం లేదు. నర్సింగ్‌రావు భార్య అపార్ట్‌మెంట్లో వాళ్ల దగ్గర వీళ్ల దగ్గరా మార్తమ్మ ఓబులేసుల ప్రస్తావన తెచ్చేది. అలా ప్రస్తావించినప్పుడు కూడా ఎవరూ తప్పుగా మాట్లాడకపోగా చాలా నమ్మకస్థులని మంచివాళ్లనే ఫీడ్‌బ్యాక్ వచ్చేది. మరీ క్రైస్తవ పోకడల గురించి మాట్లాడినప్పుడూ అంతే ఆశ్చర్యంగా అందరూ – “వాళ్ల విశ్వాసాలు వాళ్లవండి... వ్యక్తిత్వాలు మంచివవటానికి మతం ఉపయోగపడితే మంచిదే గదండి” అని అక్కడికి ఆ మాటలని ఆపేసేవాళ్ళు.

నర్సింగ్‌రావు లక్ష్మమ్మలకు ఓబులేషు మార్తమ్మలు ఇంట్లో రోజూ మాట్లాడుకునే అంశంగా తయారైయ్యారు. మార్తమ్మ ఓబులేషులు మిగతావారి పట్ల ఎంతైతే ప్రేమా గౌరవం చూపిస్తున్నారో అంతే గౌరవాన్ని నర్సింగ్‌రావు దంపతుల పట్లా చూపించారు. ఆదివారాలు మార్తమ్మ వాళ్లు చర్చికి వెళ్లకుండా వీళ్లు ఏదో రకంగా పని చెప్పి ఆపేయాలనే ప్రయత్నమూ చేసారు. కానీ మార్తమ్మ ఓబులేషులు ఎంతో ఓపికతో వాళ్ళని భరించసాగారు.

అపార్ట్‌మెంట్‌లో అన్ని రోజులు వాళ్ల పట్ల జరగనిది కొద్ది రోజులుగా ఏదో కొత్తగా జరుగుతోందని వాళ్లకు అర్థమవుతోంది. ఏనాడు వాళ్ల మత విశ్వాసం పట్ల అపార్ట్‌మెంట్లో ఎవరికీ ఏ అభ్యంతరమూ లేకపోగా ఇప్పుడు కొత్తగా యేవో మార్పులు చోటు చేసుకోవటం గమనించసాగారు వాళ్లు.

• • •

నర్సింగ్‌రావు ఆ అపార్ట్‌మెంట్లోకి వచ్చిన నాలుగో నెలకే వినాయక చవితి వచ్చింది. ఎమ్మెల్యే గారికి దగ్గర ఉండటం అనే హోదాని చూపించుకునే నర్సింగ్‌రావ్ ఈసారి అపార్ట్‌మెంట్లో వినాయక చవితిని ముందు కంటే ఘనంగా జరిపించాలని నిర్ణయించుకున్నాడు. అలా ఆ అపార్ట్‌మెంట్లో తన పేరు మారుమోగిపోవాలని అందుకు వినాయక చవితే సరైన సమయం అని నిశ్చయించుకుని గ్రౌండ్లో మునుపటి కంటే పెద్ద మంటపం... అందులో పెద్ద వినాయక విగ్రహం ప్రతిష్టించాడు. సెల్లార్లో రోజు సాయంత్రం ఏదో ఒక ప్రోగ్రాం పెట్టించాడు. ఆయన భార్య లక్ష్మమ్మ వినాయకుని మంటపాన్ని ఉదయం, సాయంత్రం దగ్గరుండి చూసుకుంటోంది.

దీపాల వెలుగులు, డెకరేషన్, పూజలు, పునస్కారాలు గతంలో కంటే ఈసారి వినాయకుడి పూజలు బాగా జరుగుతున్నాయని అపార్ట్‌మెంట్ అంతా అనుకుంటుంటే లక్ష్మమ్మకి నర్సింగ్‌రావుకి చాలా సంతోషంగా ఉంది. వినాయకుడి నిమజ్జనం కూడా అంతే గొప్పగా చేయాలని కమిటీ వాళ్ళతో కలిసి నిశ్చయించుకున్నాడు. శనివారం

రోజు వినాయకుని నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు నర్సింగ్‌రావు అపార్ట్‌మెంట్ వాళ్ళందరూ.

• • •

కొడుకు పుట్టినరోజు సందర్భంగా మార్తమ్మ ఓబులేసులు తమ ఇంట్లో గృహకూడిక పెట్టుకోవాలని అనుకున్నారు. దేవుడు వాళ్లకు చేస్తున్న సహాయాన్ని జ్ఞాపకం చేసుకుని ఇంట్లో కృతజ్ఞతా కూడిక పెట్టుకుని వచ్చిన వాళ్ళందరికీ భోజనం పెట్టాలని నిర్ణయించుకున్నారు. అంతకు ముందు ఆదివారం చర్చిలో అనౌన్సుమెంటు కూడా చేసారు. ఓబులేసు అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ నారాయణశాస్త్రిగారి దగ్గర అనుమతి తీసుకున్నాడు. ఆయనా ఎప్పటిలాగే అడగగానే అనుమతినిచ్చాడు.

శుక్రవారం రానే వచ్చింది. జానయ్యా అతడి భార్య రూతమ్మా వచ్చారు. ఓబులేసు బంధువైన జానయ్యని తమ పక్క అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పెట్టించాడు ఓబులేసు. జానయ్య... మార్తమ్మ చిన్నాయన కొడుకు. అంటే ఓబులేసుకు బావమరిది. పదవ తరగతి వరకు చదువుకున్నాడు. ఊళ్ళో కొంచెం ఉత్సాహంగా రాజకీయాల్లో పాల్గొనేవాడు. అంతో ఇంతో లోకజ్ఞానం తెలిసినవాడు.

మార్తమ్మ ఇంట్లో పనులన్నీ చకచకా చేసుకుంది. ఓబులేసు చికెన్ షాపుకెళ్ళి చికెన్ తెచ్చాడు. పాస్టర్‌గారికి తన చేతి పుంటికూర బోటి ఇష్టమని అది కూడా చేసింది మార్తమ్మ. రూతమ్మ ఇంట్లో చాపలు పరిచింది. కొడుకుని తయారవమని చెప్పి మార్తమ్మ కూతురిని తయారు చేసింది. తానూ ఓబులేసు మంచి బట్టలు వేసుకుని సిద్ధపడ్డారు. ఒక్కొక్కరుగా సంఘస్తులందరూ వచ్చారు. కొంతమందికి ఇంట్లో కూర్చోడానికి స్థలం లేదని బయట కూడా చాపలు పరిచింది మార్తమ్మ.

శుక్రవారం సరిగ్గా ఏడుగంటలకు ఓబులేసు మార్తమ్మల ఇంట్లో బర్త్ డే ప్రేయర్ మీటింగ్ మొదలైంది.– "నీవు చేసిన ఉపకారములకు నేనేమి చెల్లింతును" అని పాస్టర్‌గారు పాట ఎత్తుకున్నాడు. అందరూ చప్పట్లు కొడుతూ పాడటం స్టార్ట్ చేసారు. నర్సింగ్‌రావు ఇంట్లోకి పాటలు వినిపించాయి. ఏం చేయాలో అర్థం కాలేదు. ఆ పాటలు వింటుంటే వాళ్లకి ఏదో తెలియని కోపం... ఏంటి ఈ దరిద్రపు గోల అని లక్ష్మమ్మ గట్టిగానే తిట్టుకుంది.

ఆ తరువాత వెంటనే – "ఎందుకో నన్నింతంగా నీవు ప్రేమించితివో దేవా..." అనే పాట మొదలుపెట్టాడు పాస్టరుగారు. ఒక అయిదు పాటలు చక్కగా అందరూ కలిసి పాడుకున్నారు. పాస్టర్‌గారు వాక్యం చెప్పాడు. ఓబులేసు కొడుకు కేక్ కోసాడు. అందరికీ భోజనాలు తృప్తిగా పెట్టి పంపారు ఓబులేసు మార్తమ్మలు. వాళ్ల మోహంలో ఎంతో ఆనందం. సంతోషం. అందరూ ఎవరింటికి వాళ్లు వెళ్ళిపోయాక ఇంట్లో

పనంతా చేసుకుని ఎక్కడివక్కడ సర్దిపెట్టి మళ్ళీ ఎప్పటిలాగే ఇద్దరూ కలిసి ప్రార్థన చేసుకుని పడుకున్నారు.

• • •

ఉదయం తొమ్మిది గంటల ప్రాంతం. లక్షమ్మ ఒకటే గోల. అరుపులు. అయ్యయ్యో ఎంత పని జరిగిపోయింది... రండీ రండీ అని అపార్ట్‌మెంట్లో ఉన్న వాళ్ళందరినీ పనికి వెళ్ళే వాళ్ళని ఆపి మరీ పంచాయితీ మొదలు పెట్టింది. నర్సింగ్‌రావ్ కోపంతో ఊగిపోతున్నాడు.

అపార్ట్‌మెంట్లో ఉండే అన్ని కుటుంబాలు అక్కడ చేరాయి. మార్తమ్మ ఓబులేసు వాళ్ల పనిలో వాళ్లున్నారు. నర్సింగ్‌రావ్ గట్టిగట్టిగా తిట్టడం మొదలు పెట్టాడు. – "కులం తక్కువ, మతం తక్కువ ఎదవల్లార ఇది మీ పనేరా. రాత్రి మీరు తప్ప ఎవరూ లేరు ఇక్కడ. ఇది మీ పనే రా... మీరే చేసుంటారు..." – ఊగిపోతూ అరుస్తున్నాడు.

అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్‌గారికి ఏమి పాలుపోవటం లేదు. ఎప్పుడూ లేనిది ఇవ్వాళ ఎందుకిలా జరిగిందో? అని ఆయనకి అర్థం కాలేదు. ఓబులేసు మార్తమ్మ పరుగు పరుగున మంటపం దగ్గరకు చేరుకున్నారు. మంటపంలోని వినాయకుణ్ణి చూసి ఒక్క నిమిషం షాక్ అయ్యారు. వినాయకుడి ఎడమ చేయి విరిగి కింద పడిపోయి ఉంది. మార్తమ్మకీ ఓబులేసుకీ ఏం జరుగుతుందో అస్సలు అర్థం కావటం లేదు. వినాయకుడి చెయ్యి ఎలా విరిగిందో. ఆ పని ఎవరు చేసారో. దానికీ వాళ్లకూ ఏ సంబంధమో అర్థం కాలేదు.

సీసీ కెమెరాలు చూడండి అని నర్సింగ్‌రావ్ అరుస్తుంటే ప్రెసిడెంట్ ముందుకొచ్చి చెప్పాడు. – "నిన్నటి నుంచి కెమెరాలు పని చేయటం లేదు. వైరు తెగిపోయింది. ఆల్రెడీ కంప్లయింట్ ఇచ్చాం. వాడు రేపొస్తా అన్నాడు"– అని బదులిచ్చాడు. నర్సింగ్‌రావ్ లక్ష్మమ్మల కోపం అదుపు చేయటం ఎవరివల్లా కావటంలేదు. అపార్ట్‌మెంట్‌లోని మిగతావాళ్లకి ఓబులేసుని మార్తమ్మని ఎలా రక్షించాలో అర్థం అవటం లేదు.

అప్పటికీ ప్రెసిడెంట్ అన్నాడు – "నర్సింగ్‌రావ్ గారు. ఓబులేసు గురించి మాకు తెలుసు. వాడు అలాంటి పని చేయడు. వేరే వాళ్లతో అలాంటివి చేయనీయడు. మీరు అనవసరంగా తొందర పడుతున్నట్టు ఉన్నారు. నిజాలు తెలియకుండా ఎందుకనటం" –అయినా నర్సింగ్‌రావ్ వింటేనా?

"ఏం మాట్లాడుతున్నారు ప్రెసిడెంట్‌గారు. మీకు ఈ మంటపంలో ఉంది విగ్రహంలా ఉందా లేక దేవుడులా కనిపిస్తున్నాడా?"

"అదేంటండి అలా అంటారు దేవుడ్నే కదా చూస్తాం. బొమ్మ అని ఎలా అనుకుంటాం?"

"మరి ఈ పని ఎలా? ఎవరివల్ల జరిగిందో చెప్పండి. మన అపార్ట్‌మెంట్లో వాళ్లు ఇలాంటి పని చేస్తారా... మన హైందవులు ఇలాంటి పని చేయగలరా? మనకి అంత ధైర్యం ఉంటుందా? రాత్రి వీళ్ల పాస్టర్‌గారు ఏమని చెప్పాడు అడగండి... విగ్రహారాధన చేసే వాళ్లకి ఎంత మంది దేవుళ్ళు? మూడు కోట్ల మంది, కాని మనకు ఒకడే దేవుడు అని అన్నాడా లేదా అడగండి."

"ఏరా ఓబులేసు అలా అన్నాడా మీ పాస్టర్‌గారు?"

నీళ్లు నములుతూ మెల్లిగా అడుగులో అడుగులు వేస్తూ వచ్చిన ఓబులేసు అన్నాడు "అవునయ్యా అన్నారుగాని అది ఈ సందర్భాన్ని బట్టి కాదండయ్యా." అని టపటప కన్నీరు కార్చాడు.

"ఏదేమైనా మన ఓబులేసు ఇలాంటి పని ఎప్పుడు చేయడు. మార్తమ్మ ఓబులేసుల గురించి మాకు బాగానే తెలుసు" అని శాంతమ్మ అంది...

అయినా అక్కడ శాంతమ్మ గొంతు ఒకటే వినిపిస్తోంది. మిగతా వాళ్ళందరకి ఒక్కసారిగా ఓబులేసు మీదకన్నా అలా చేయి విరిగిపోయిన దేవుని విగ్రహం మీద ప్రేమ పెరిగిపోయింది.

• • •

నిమజ్జనం వల్ల శనివారం స్కూళ్ళకు సెలవు ప్రకటించారు. పిల్లలందరూ మంటపం దగ్గర పోగైయ్యారు. అందరూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటున్నారు. ఓబులేసునూ, మార్తమ్మనూ నర్సింగ్‌రావ్ తిడుతూనే ఉన్నాడు. మార్తమ్మకి దుఃఖం ఆగలేదు. ఏడుస్తూనే ఉంది.

నర్సింగ్‌రావ్ దేవుడికి జరిగిన పెద్ద అవమానంగా ఆ సంఘటనని చిత్రించటంలో ఏ ఒక్క అవకాశాన్ని వదలలేదు. అపార్ట్‌మెంట్లోని వేరేవాళ్లు కూడా మెల్లిగా నర్సింగ్‌రావ్ లాజిక్‌ని అంగీకరిస్తున్నట్టే కనబడసాగారు.

"దేవుడి చేయి విరిచే అంత ధైర్యం ఎవరికి వుంటుంది. ఈ జాతికొడుకులే ఇలాంటి పనులు చేసేది. తల్లిపాలు తాగి తల్లి రొమ్మునే తన్నే కొడుకులు. ఈడ మట్టిల పుట్టి పరాయి దేవుళ్ళని పూజించే నా కొడుకులు ఇట్లాంటి పనే చేస్తారని నాకెప్పటినుంచో తెలుసు" అని– నానా మాటలు తిడుతూనే ఉన్నాడు. ఆయనకి తోడు ఆయన భార్య. మెల్లిగా ఒక్కో సంఘటనని ఆయనకి జోడిస్తూ ఆ పని ఓబులేషు ఆధ్వర్యంలో నిన్న ప్రార్థనా కూటానికి వచ్చిన వాళ్ళే చేసుంటారని నిర్ధారణ కలిగేలా మాట్లాడుతోంది.

ప్రెసిడెంటు కమిటీ వాళ్లు ఓబులేసును బయట పడేద్దామని ప్రయత్నిస్తున్నారు. కాని నర్సింగ్‌రావ్ ఎక్కడా వాళ్ళని దాటనివ్వటం లేదు.

"ఎప్పుడూ ఇలా జరగలేదు నర్సింగ్‌గారు. ఎలా జరిగిందో ఏంటో? ఓబులేసును మరీ అంతలా తిట్టకండి" అన్నాడు ప్రెసిడెంట్.

"అలా ఎలా అంటారండీ? మీకు దేవుడి మీద కొంచెం కూడా భక్తి లేనట్టుంది. ఓబులేసు ఉన్న ఈ పన్నెండు ఏళ్ళు జరగలేదు. సరే ఒప్పుకుంటా. ఈ పన్నెండేళ్లలో నిమజ్జనానికి ముందు ఇలా ప్రార్థనా కూటం జరిగిందా?" ప్రశ్నించాడు నర్సింగరావు

"లేదండి ఎప్పుడూ జరగలేదు."

"ఎప్పుడూ జరగలేదు కాని... ఈసారి జరిగింది. అంటే ఎవరివల్ల జరిగి ఉంటుందో అర్థం అవుతుందా?" రెచ్చగొట్టాడు నర్సింగ్‌రావు. అందరూ గుసగుసగా మాట్లాడుకోవటం మొదలు పెట్టారు.

• • •

నర్సింగ్‌రావ్ ఎవరికో ఫోన్ చేసాడు. అప్పటికప్పుడు ఒక పదిహేను మంది అక్కడికి చేరుకున్నారు. మెల్లిగా వర్షం మొదలైంది. అందరూ ఓబులేసును ఘెరావ్ చేసారు. ఎందుకు చేయాల్సి వచ్చింది చెప్పమని ప్రశ్నిస్తున్న వాళ్ళు ఒకరైతే మతం పేరుతో కులం పేరుతో తిడుతున్న వాళ్లు మరొకరు.

ఓబులేసు బంధువు జానయ్యకి విషయం తెలిసి పరుగు పరుగున వచ్చాడు.

జానయ్యకి ఏం చేయాలో తోచలేదు. తన చేతిలో ఉన్న సెల్ ఫోన్లో ఆ గొడవని రికార్డ్ చేద్దామని ఆన్ చేసాడు. అది చూసిన నర్సింగ్‌రావ్ మనిషొకడు ఆ ఫోన్‌ని లాగి కింద కొట్టాడు. ఫోన్ పగిలిపోయింది. జానయ్యకు కోపం వచ్చింది.– "ఏంటి సర్ మీరు చేస్తున్న పని. మా బావగానీ నిన్న వచ్చిన వాళ్లు కాని చేయలేదని చెప్తానే ఉన్నాడు కదా. నిజానిజాలు తెలియకుండా ఇంతమంది ముందు తిడుతున్నారు. ఇది అన్యాయం. మీకు కూడా తెలుసు. కులం పేరు పెట్టి తిడితే అట్రాసిటీ కేస్ పెట్టాల్సి వస్తుందని" అన్నాడు.

ఆ మాటకు నర్సింగ్‌రావ్‌కి ఇంకా కోపం వచ్చింది. జానయ్యని లాగి పెట్టి చెంప మీద కొట్టాడు. జానయ్య నర్సింగ్‌రావ్ గల్లా పట్టుకున్నాడు. అది చూసిన అతని అనుచరులు జానయ్యని ఓబులేసుని ఇద్దరినీ కొట్టారు. మార్తమ్మ దుఃఖం చెప్పలేనిది. ఎవరి కాళ్ళు పట్టుకోవాలో అర్థం కాలేదు.

అపార్ట్‌మెంట్లో వాళ్లు ఏమి మాట్లాడకుండా చోద్యం చూస్తూ నిల్చున్నారు. దేవుడు అనే సబ్జెక్ట్ మనిషిని చూడకుండా చేసింది ఆ నిమిషం.

శర్మగారు అది అపశకునమని ఇలా జరిగి ఉండకూడదు అనగానే అపార్ట్‌మెంట్లో జనాలకి ఇంకాస్త భయమేసింది. అందరూ ఇంకా కుంచించుకు పోయారు. మార్తమ్మకు అర్థం అయిపోయింది. ఇన్ని రోజులు వాళ్ళదీ అనుకున్న ఆ స్థలం ఇంక వాళ్ళది కాదని. పరిస్థితి చేయి దాటిపోయింది. అపార్ట్‌మెంట్ కమిటీ వాళ్లు అందరూ మీటింగ్ పెట్టుకున్నారు.

• • •

పిల్లల గుంపు ఒక్కసారిగా మాయమై మంటపానికి దూరంగా నిల్చుని భయంగా భయంగా చూస్తున్నారు. టింకుగాడికి తెలియకుండానే ఏడుపొస్తోంది. మార్తమ్మ ఏడుపు, వాళ్ల పిల్లల ఏడుపు చూసి వాడికి ఏడుపాగటంలేదు. వాడు ముందు ముందుకు వెళ్తున్నాడు. శేఖర్ అనే కుర్రాడు వాణ్ని వెనక్కిలాగి గట్టిగ పట్టుకుంటున్నాడు. వాడిని కళ్ళతో కట్టడి చేస్తున్నాడు. శేఖర్ అందరికి వార్నింగ్ ఇచ్చాడు– "ఏది జరిగినా ఎవరూ నోరు తెరవద్దు. లేకపోతే మనందరికీ దెబ్బలు ఖాయం." –

టింకుగాడు శాంతమ్మ టీచర్ కొడుకు. అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న లిటిల్ ఫ్లవర్  స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. శేఖర్ టింకుగాడి కన్నా పెద్దోడు. అదే స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అపార్ట్‌మెంట్లో వీళ్ళందరిది ఒక బ్యాచ్. ఎప్పుడూ  వినాయక చవితికి పెద్దన్న వాళ్లు వీళ్ళకీ యే ప్రాధాన్యం ఇవ్వటం లేదని వీళ్ల బాధ. చిన్న వినాయకుణ్ణి పెట్టుకుంటాం అంటే పిలిచి వార్నింగ్ కూడా ఇచ్చారు వీళ్లకి. అందుకే వీళ్ళంతా ఒక పథకం వేసుకున్నారు. ఎలా అయినా నిమజ్జనం రోజు లడ్డూ వేలం పాడేలోగా వినాయకుడి చేతిలోని లడ్డూని దొంగతనం చేయాలని. ఆ విషయం టింకూకి కూడా తెలుసు. కానివాడు వాళ్ళతో పాటు ఆ పనిలో పాల్గొనటానికి వెళ్ళలేదు. వాళ్ల వ్యూహంలో భాగంగా సీసీ టీవీ కెమెరాల వైర్లు కూడా కట్ చేశారు.

• • •

అందరూ భయంగా జరిగేది చూస్తున్నారు. నిర్ణయం ఏదో ఖరారైనట్టు అపార్టుమెంట్ కమిటీ సభ్యులూ నర్సింగ్‌రావూ ముందుకొచ్చారు. ఓబులేసు షర్టు చినిగిపోయింది. ముఖం అంతా దెబ్బలు.  జానయ్యకు ముక్కులోంచి రక్తం కారుతోంది. ఎవరో పోలీసులకు ఫోన్ చేసారు.

దెబ్బలు తిన్న ఓబులేసుని జానయ్యలను ఏమైందని అడిగాడు ఎస్ఐ. తమ తప్పులేదని ఓబులేసు కన్నీళ్లు కారుస్తూ చెప్పాడు. ఓబులేసు మనసు ముక్కలైంది. మనుషుల మీద ఇన్నేళ్ళ తన నమ్మకం ఆవిరైపోయింది.

'ఎస్ఐ గారూ ఇటు రండీ' అని నర్సింగ్‌రావ్ పోలీస్ ఆఫీసర్ని పక్కకు తీసుకెళ్ళి ఏదో మాట్లాడాడు. అది విని వెనకొచ్చిన ఎస్ఐ ఓబులేసునీ జానయ్యన్నీ పిలిచి– "గంటలో అపార్ట్‌మెంట్ ఖాళీ చేయాలి లేకపోతే దొంగతనం కేసు పెట్టి లోపలేస్తా. మత ప్రచారం చేయటం నేరం అని తెలియదారా మీకు. దొంగ ఏడుపులాపి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళండి." అని వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు.

• • •

అన్నేళ్లు అంత నమ్మకంగా అక్కడ పని చేసినందుకు వాళ్లకు దక్కిన ఫలితం ఇదేనా అని మార్తమ్మ ఓబులేసులు దుఃఖించారు. శర్మగారూ, శాస్త్రిగారూ, నాయుడు గారులు, ఓబులేషు మొహం చూడలేకపోయారు. క్రితం ఏడాది నాయుడు గారికి యాక్సిడెంట్ అయ్యి హాస్పిటల్లో అడ్మిట్ అయితే "బీ పాజిటివ్" రక్తం దొరక్క ఆయన భార్య రేవతమ్మ బాధ పడుతుంటే, తనదీ "బీ పాజిటివ్" రక్తమేనని స్వచ్ఛందంగా రక్తం ఇచ్చిన ఓబులేసు ఇప్పుడు వాళ్లకి ఏమీ కాదు.

వెంకటేశ్వర్లుగారి భార్య రత్నమాలకు పక్షవాతం వచ్చినప్పటి నుంచి చిన్న పిల్లలా చూసుకున్న మార్తమ్మ ఇప్పుడు వాళ్లకు ఏమీ కాదు. అపార్ట్‌మెంట్ కోసం అహర్నిశలు పనిచేసిన వాళ్ళిద్దరూ ఇప్పుడు దేవుడి కారణంగా ఏమి కాకుండా పోయారు. ముఖం మీద దెబ్బలు. దెబ్బల వల్ల చినిగిపోయిన షర్టు వాళ్లకు బహుమతి.

ఏనాడూ కొత్తవాళ్ళని అపార్ట్‌మెంట్‌లోనికి రానివ్వకుండా కుక్కలా కాపలా కాసిన ఓబులేసుని అపార్ట్‌మెంట్‌లోకి కొత్తవాళ్లెవరో రప్పించి కొట్టిస్తుంటే ఎవ్వరికీ... "వీళ్ళెవరు?" అనే ప్రశ్నే రాలేదు.

ఓబులేసూ మార్తమ్మా పిల్లలూ ఏడుస్తూ, సామాన్లన్నిటినీ సర్దుకుని అపార్ట్‌మెంట్ బయట పెట్టుకుంటున్నారు. ఒక్కో జ్ఞాపకం నమ్మకంతో పాటు తునాతునకలవుతున్నట్టు అనిపించింది మార్తమ్మకు.

• • •

లడ్డూ దొంగతనం ఇంత పని చేస్తుందని పిల్లలు ఊహించలేదు. అందరూ బిక్కమొహం వేసుకుని ఓబులేసు ముఖం చూసి బాధ పడుతున్నారు. ఓబులేసు అంకుల్ అంటే వాళ్లకు అంత ఇష్టం.

టింకుగాడు వాళ్ళమ్మ శాంతమ్మకు విషయం చెబుదామని వెళ్ళాడు. శేఖర్ వెంటనే వాణ్ని పిలిచి ఇదంతా నువ్వే చేసావ్ అని చెప్తాం అని బెదిరించాడు. వాడు భయంతో అల్లాడిపోయాడు.

నర్సింగ్‌రావ్ సమూహం అదేదో విజయం సాధించినట్టు మాట్లాడుకుంటున్నారు. వాళ్ల ముఖంలో వాళ్ల దేవుడికి ఏదో గొప్ప విజయం

సాధించి పెట్టిన ఆనందం.  శర్మగారు మంటపం పవిత్రం ఎలా చేయాలో స్త్రీలకు ఉపదేశిస్తున్నాడు.

వర్షం కూడా ఏ దయ లేకుండా పడుతూనే ఉంది. మార్తమ్మ రాత్రి మిగిలిన కేక్ తీసుకెళ్ళి చెత్తబుట్టలో పారేసింది. గత ఏడాది వినాయక చవితినాడు ఆమె కొడుకు గెలిచిన బహుమతిని చూసి కన్నీరు పెట్టుకుంది. ఊరికి చిట్టీ డబ్బులు పంపేందుకు దాచిపెట్టిన డబ్బులు లెక్కపెట్టి జానయ్యకి, ఓబులేసుకు హాస్పిటల్ ఖర్చులకు, తమకి గడవటానికి సరిపోతాయా అని చూసుకుంది. పిల్లోడి పరీక్షల ఫీజు కోసం దాచిపెట్టిన డబ్బులు కూడా వాటితో కలిపింది.

బైబిల్ వాక్యాలున్న ఫోటోలు ఒక్కొక్కట్టే సంచిలో పెడుతోంది. అందులో ఆమెకు ఒక వాక్యం ఎంతో ఆదరణగా అనిపించింది.– “నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి. పరలోకమందు మీ ఫలము అధికమగును.”    – మత్తయి 5: 11.

# శీలానగర్ రెండో మలుపు



## మిథున ప్రభ

ఇటీవల చురుగ్గా రాస్తున్న రచయిత. 'సాక్షి' పత్రికలో అచ్చయిన మొదటికథ 'కాటుక డిబ్బీ'తో పాఠకుల గుర్తింపు పొందారు. పుట్టి పెరిగినదంతా విశాఖపట్టణంలోనే. జన్మ సంవత్సరం 1985. ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. పల్లె జీవనం, ఉత్తరాంధ్ర మాండలికం వీరి కథల్లో స్పష్టంగా కనిపిస్తుంది. 'మా భాషను పరిచయం చేయడం, ఇక్కడి కథల్ని చెప్పడం బాగుంటుంది' అని చెప్తారు. 'కచ్చ', 'రామి'... తదితర అరడజనుకు పైగా కథలు రాసి ఈతరం కథకుల్లో తనకంటూ ఒక స్థానాన్ని స్థిరపరుచుకుంటున్నారు.

నివాసం: విశాఖపట్టణం.

మొబైల్: 80745 34044

'వై. వేదకుమారి, రూట్ నంబర్ ఫోర్ హండ్రెడ్'.

కొత్త డ్యూటీ రూటు కోసం చార్టు చూస్కుంటున్న నేను ఆ మాట యినబడగానే పరిగెత్తినట్టెల్లాను లోపలికి. "ఈ ఏడాది నుంచి నీ రూటు గాజువాకటగా. జాగర్తగా ఎల్లిరా" అంటూ నాకు తగ్గ పనిస్మెంటేదో పడ్డట్టు, నిలువెత్తు ఎటకారం గెంజి పెట్టిన తెల్లబట్టల్లో సూపర్వైజర్ కుర్చీలోంచి నన్నే చూస్తా యికిలించింది ఈసారి కూడా. బెదిరింపులాంటి ఆ ఎటకారాలకు, బండబారిన నా చేతి సంతకంలో కొమ్ములు తేడాలిక రావని అతడికర్థమైతే బాగుండు.

"ఈ ఆడ కండెక్టర్లతో గొప్ప చిక్కండీ! ఆ రూటొద్దూ, ఈ డ్యూటీ వొద్దని పొద్దస్తమానం..." అతని వాక్యాన్ని నా ఎర్రచూపు అడ్డగించిందేమో, తమాయించుకుని, చొక్కా కాలరెనక రుమాలును సైలెంటుగా సర్దుకునే పన్లో పడ్డాడు. "ఇన్నేళ్ళ సర్వీసులో ఎన్ని చూసుంటాను. నువ్వో లెక్కా?" అని మాటల్లో చూపెట్టేంత తెగవ నాకు రానందుకు, నా లౌక్యాన్ని మెచ్చుకుంటా ఈ రద్దీ గాజువాక రూట్లో నా కండక్టరు సర్వీసు మరికొన్నాళ్ళు సాగడానికి సిద్ధపడిపోయింది.

డ్యూటీకి రాగానే నన్ను చూసి పొరలుగా అరిగిపోయిన పొడుగాటి తోకతో నా తోలు డబ్బు సంచీ నవ్వుతున్నట్టుగా నోరు తెరుస్తాది. సిల్వరు రేకుతో తాపిన ట్రే బాక్సుకి గుత్తులు గుత్తులుగా గుచ్చిన టిక్కెట్లన్నీ నా చేతిలోకి రాగానే రెపరెపమంటూ నన్ను పలకరిస్తాయి. లాకర్లోంచి తీస్కున్న కాకీ చొక్కా ఎప్పుడెప్పుడు నన్ను కావలించుకుందామా అని కాసుక్కూచుంటదేమో ఒక్క దులుపు దులపగానే ముందురోజునాటి మురికినంతా కిందకొంపేసి కొత్త చేతుల్తో నన్ను హత్తుకుపోతాది.

డిపోలో నా నడకెప్పుడూ ఎర్రటెండలో ఉత్తి పాదాల్తో నడిసినట్టే పరుగులాగ ఉంటదని మావోల్లు నవ్వుతుంటారు. నేనెల్లేటప్పటికి తడిపిన ఏ పాత న్యూసుపేపరు తోటో బస్సు అద్దాల్ని తన వొంటికంటే బాగా రుద్దేస్తూ నావొంక చూసీ చూడగానే ఓ ఎర్ర గుట్కా పళ్ల నోరొకటి పకాల్మంటాది. మా డ్రైవర్ కోటీశ్వరుడి నవ్వు చూడగానే అలవాటుగా నా కళ్ళు ఒక్కసారి పైకెగిరి, చకచకా నన్ను బస్సు లోపలికి పదమంటాయ్.

• • •

ఇవాల పొద్దుటి షిఫ్టు. ఆరుగంటలకే డూటీ ఎక్కిసాం నేనూ మా డ్రైవరూ. డిపో నుండి గాజువాక రెండు ట్రిప్పులు తిరిగేటప్పటికి మజ్జాన్నం ఒంటిగంట దగ్గరౌతాది. వెంట తెచ్చుకున్న సజ్జాల్లోపల కేరేజీల్లో పరమాన్నాల గుమగుమ మా ముక్కుల్ని అదరగొడతాది. అదేటో, ఆకల్తో ఉన్నప్పుడు ఉత్త పెరుగన్నాన్ని కూడా నా ముక్కు పరమాన్నమనే నమ్మించేస్తాది.

నాలుగో ట్రిప్పుకి మజ్జాన్నం అన్నం అరిగిపోయి కడుపులో పేగులు బుర్రకతేస్కుంటాయ్!

పనీ పాటా చేస్కుని, డ్యూటీలు దిగేవోల్లతోటి, పొద్దంతా బడుల్లో పుస్తకాల్తో కుస్తీలు పడి, కాళ్ళీడుస్కుంటూ వచ్చి బస్సెక్కే పిల్లల్తోటీ, రాయితీ బస్సు పాసు ఎలాగూ ఉంది కాబట్టి ఉత్తినే వొదిలేయడం ఎందుకనుకుని షికార్ల కోసం బస్సెక్కే కాలేజీ అబ్బాయిల్తోటీ, ఒకేసారి నిండిపోతాదే అదిగో, అదీ సాయంకాలం నా ఆకరి ట్రిప్పు.

అలిసిపోయి, నిద్దరొచ్చి, ఓపిక తగ్గి, నిండుగా ఉన్న బస్సులో నిలబడలేక ఏ పాసింజరో నా భుజానికో, వీపుకో రాస్కుంటా నిలుచుంటాడు. నేనే సబ్బు వాడతానో తెలుసుకుందామనో, నా వయసు లెక్కలు తేలుద్దామనో సరదా పడుతుంటాయ్ కొన్ని చేతులు. ఏ చిల్లర కోసమో గొడవపడి, ఈ ఆడోల్లకిలాటీ కండక్టరు ఉజ్జోగం ఇచ్చిన గవర్నమెంటుని అర్జెంటుగా మార్చియ్యాలని కొరాకొరా చూస్తుంటాయ్ కొన్ని కళ్లు. నాకే కాదు, నాలాగ చేరిన మా బ్యాచీ ఆడోల్లకందరికీ ఇలాటియి అనుబవాలే!

ఇందులో చేరిన కొత్తల్లో ఎక్కెక్కి ఏడ్సీదాన్ని మాయమ్మను పట్టుకొని. అదీ నాతోపాటే ముక్కు సీదుతా, కొంగు తడుపుకుంటా, ఈ ఉజ్జోగం మానీసి పెల్లి చేస్కుని ఓ యింటి ఇల్లాలై, అల్లుడి నీడలో చల్లగ బతికీమని బావురమనీది. పెల్లి సరే, నా ఆకలి తీర్చి, అన్నం పెట్టి, నన్ను నా కాలిమీద నిలబెట్టే ఈ ఉజ్జోగం ఎందుకు మానియ్యాలి నేను? నాన్న బతికుంటే అతను కలగన్నట్టు ఏ డిగ్రీయో చదివి ఇంతకన్నా మంచి ఉజ్జోగం చేసేదాన్నేమో! పట్టుమని నాకొచ్చిన ఈ

పదోతరగతి పట్టాతో ఈపాటి ఉజ్జోగం సంపాయించుకోడం ఇవాల్టి రోజుల్లో ఎంతకష్టమో ఆ ఎర్రిబాగుల్దానికేటి తెలుసు పాపం.

నాపాటి బతుకుదెరువు కూడా లేకుంట. కానీ పరకా కోసం మొగుడి కాడ చెయ్యి సాచే అబిమానవతుల్ని ఎంతమందిని చూడ్డంలేదూ! కష్టమైన, నష్టమైన నవ్వుతా సాగించే బతుకే బతుకని నాన్న ఎన్నిసార్లు చెప్పేవోడో నాకు. అందుకే ఇల్లాగైతే లాబం లేదని, ఇంక నా సొదల్ని మాయమ్మ కాడ ఒంపడం మానీస్కున్నాను. ఇంకా చెప్పాలంటే ఏడ్డమే మానీసాను.

• • •

"యీ గాజువాక రూట్లో ఉజ్జోగం సెయ్యటం కన్నా పార్తిపురం ఏజెన్సీలో ఉజ్జోగం సెయ్యటం మేలమ్మీ" సాగలేక, సంసారాన్ని నడుపుతున్నంత కష్టంగా స్టీరింగుని తిప్పుతా వాపోతున్న కోటీశ్వరుణ్ణి చూస్తే జాలేసి నవ్వుకుంటాన్నేను.

ఈ పదకొండేళ్ల సర్వీసులో ఎన్నెన్ని సిక్కులు పడ్డానో ఈశ్వరుడికెరుక. యీడు తగిలాడనో, ఆడు గిల్లాడనో నేను నొచ్చుకున్న రోజులు తక్కువేమీ కాదుగాని, వంద దాటిన జొరంతో వొల్లు బాలేకపోయినా, పుండుపడిన కాల్ల నొప్పులు కదలనీకపోయినా, కాయితాల మీది చీవు తలకాయల అక్సరాలు కళ్ళ నీరెట్టించినా, కిమ్మనకుండ పంటిసాట్న నా పాట్లన్నీ దాసిపెట్టినప్పుడో, అప్పగించిన టికెట్ల సంక్యలో తేడా వస్తేనో, చిల్లర డబ్బులెక్క సరిగా తేలకపోతేనో, ఏ రాత్రి చీగట్లో ఏ దార్లోనో టైరు పంచరైపోయి ఇంటికెల్లడం ఆలిస్యం ఐతేనో, ఏ యెదవ టికెట్ తియ్యక, ట్రాఫిక్ సూపర్వైజర్‌కి దొరికిపోయి, నా నిర్లష్యాందే బాజ్జతంటూ నిలదీసినప్పుడో తప్ప, మిగతా అన్ని పని వేలల్లో ఎంత సుకముంది ఈ ఉజ్జోగంలో.

నాకు ఆర్టీసీ బస్సులో కండక్టరు ఉజ్జోగం వచ్చిందని ఎంప్లాయ్మెంటు ఆఫీసునుండొచ్చిన ఉత్తరాన్ని చూపిస్తా సంబరంగా మా వీధిలో తిరిగినప్పుడు ఇరుగుపొరుగు అమ్మలక్కల ఇచ్చికాలు నాకింకా గుర్తే. "లేడీ కండక్టరు ఉజ్జోగమా. చిచ్ఛీ హవ్వ!! బస్సులో మొగరాయుడి లాగా నువ్వు టిగెట్లు కొడతావా" అంటూ నవ్వుకున్నోల్లని ఆల్ల నవ్వుకొగ్గేసీ, "అలాటీ ఉజ్జోగం సేస్తే నీకు పెల్లవ్వదే గుంటా" అని బయపెట్టినోల్లని ఆల్ల బయానికొగ్గేసి, "ఎక్కీవోల్లు దిగీవోల్లు నిన్ను రాస్కుంటా పూస్కుంటా పోతారే" అని ఎటకారాలాడినోల్లని ఆల్ల ఎటకారాలకొగ్గేసి, ఊరి జనాన్ని కాపాడ్డానికి పోలీసు జవానేస్కున్నట్టు రెండు జోబీల కాకీ చొక్కా ఒంటిమీద తొడుక్కోని, ఆరు చెక్రాల బండికి అర్దబలం నేనవుతానంటూ మురిసిపోతూ చేరానీ కండక్టరు పన్లో. అంతవరకూ మగాడు చేసే పనిని ఓ ఆడపిల్ల చేయడమంటే, అది తనకు తాను మగరాయుడి పేరు మెడలో తగిలించుకున్నట్టే అని నాకెప్పుడూ అనిపించలేదు.

• • •

డిపో నుండి ట్రిప్పులు ట్రిప్పులుగా బస్సులు అటూ ఇటూ తిరిగినట్టే ఆరేడు సమ్మందాలు అలాగొచ్చి ఇలా పోయాయ్. మగదిక్కు లేనిల్లు, ముసలితల్లి, మాటవరసక్కూడా రాని పొలం పుట్ర. నేనియ్యిబోయే ఈపాటి కానుకలకి ఆసపడీ పెళ్లికొడుకులెవరుంటారు నా పిచ్చిగాని. ఐనా, కట్నం మాట దేవుడెరుగు, ముందు నా బతుకు తీరే కొందరికి సమస్యంట. పని చేసీ చోట ఏ డ్రైవర్‌తోనో, తోటి మగ కండక్టరుతోనో, ఏ యూనియన్ లీడర్‌తోనో నాకే సమ్మందం ఉందో అని ఓ పెళ్లి కొడుకు డౌటు. ఆడు తిన్నగా వొచ్చి మా డ్రైవరునే అడిగీసాడు. "కాండ్రించ్చి వుయ్యాలా వద్దా, ఆడి మొహాన?!" అని నేను ఆవేశంతో ఊగిపోటం మాయమ్మని కుంగదీసేస్తే, మా యిరుగుపొరుగోల్ల చేత మాత్రం నన్ను మొగరాయుడనీ ముద్రేయించీసింది. కాలం పరిగెత్తింది. మా డిపోలో నాతోటి చేరిన, అంతో యింతో స్తోమత వున్న అమ్మాయిలందరికీ యెప్పుడో పెళ్లిల్లైపోయాయి. చేరకముందే పెళ్లైనోల్లు తల్లులు కూడా ఐపోయారు. ఒక్కసారి మొగరాయుడు ముద్ర పడ్డాక, ఎగిరే కట్నానికి ఎంత పెద్ద రెక్కలుంటాయో తెలీంది కాదుగా!

ఓసారొకడైతే నేను బాగా నచ్చానని, నెలలోపే పెళ్లైపోవాలని తెగ తొందరెట్టాడు. నేనెంత తెలివి తక్కువ దాన్నంటే, అప్పుడే మూర్తనాలెట్టీసినట్టు, అతగాడి ఇల్లాల్నైపోయినట్టు, నా యూనిఫారం చొక్కా మీద నుంచి పైకి కనపడీలాగా నల్లపూసల దండేస్కుని, కాళ్ళకు బూట్లు మానీసి పెద్ద పెద్ద వెండి మెట్టెలు, పిల్లేలు తగిలించుకున్నట్టు, ఓ యింటి ఇల్లాలినై హుందాగా మా డిపోలో అటూ యిటూ తిరిగేస్తున్నట్టు తెగ కలలు కనీసాను. పేరు బలాలు చూపించడానికి పంతులు దగ్గరకెల్లిన మాయమ్మ ముక్కూ నోరూ మూస్కుంటా ఎండనబడొచ్చి మంచమ్మీద దిగాలుగా పడిపోయింది. "ఏటైందమ్మా? ఎందుకలా కూలబడిపోయావూ?!" అనడగ్గానే బావురుమన్నాది పాపం. "ఆడికిదివరకనే పెల్లై, పెల్లాం సచ్చిపోయిందటమ్మా! అది కూడా ఈడివల్లేనట. మూర్తనాలెట్టబోయేముందే పంతులు చెప్పాడమ్మా" అంటూ నిలువెల్లా నీరైపోయింది. నా నల్లపూసలు, వెండి మెట్టెలూ కరిగిపోయి నా వొంట్లో కలిసిపోయాయప్పుడే.

ఎలాగోలా మూడు పదులు మురిగిపోయాయి. ఇంకో ఇరవయ్యేల్లు. ఆడదాన్నని అనిపించుకోవాలంటే పెళ్లీ పిల్లలు తప్పదని మాలాంటాడపిల్లల ఇల్లముందర యేలాడే పెద్ద పెద్ద విదాయకాలు, గుమ్మంలోకి వచ్చీటప్పుడు, ఎల్లీటప్పుడూ మా నెత్తిన టపీ టపీమని మొట్టికాయలేస్తా పెద్దరికం పల్లేస్కుని నవ్వీ కాలం ముగిసిపోద్ది. ఈ కాస్త బిగువూ ఉడిగినాక ఇంకెలాగూ నా జోలికెవడూ రాడు. అందాకా ఈ ఇరవయ్యేల్లు ఈ ఆడతనాన్ని ఎలా సాగదీసేదీ! నాకో తోడు దొరక్కపోతుందా అన్న ఆశ ఎలాగ తీరేదీ! ఏమో! తర్వాతి స్టాపులో ఎక్కబోయే పాసింజరెవరో ముందే ఎలా చెప్పగలం? ఇది కూడా అంతే!

• • •

కోటిబాబు డ్రైవింగ్‌కి కుదుపుల నేల కూడా బయపడతాది, అంత జాయిగా పోనిస్తాడు బండిని. మూడ్రోజుల స్నానం నాటికి ఒరుసుకుపోయిన కాల్లతో ముల్లకంపల మీద కూచున్నట్టున్నా ముకంలో దాన్ని తెలీనీకుండా డూటీ చెయ్యగలుగుతున్నానంటే ఈడి డ్రైవింగ్ చలవేనేమో! ఈ మధ్య అంత జాయిలో కూడా ఆ శీలానగరు రెండో మలుపొచ్చేసరికి బస్సుతో సంబంధం లేకుండానే నా వొల్లంత కుదుపులు మొదలౌతున్నాయ్. తర్వాత స్టాపులో ఎక్కబోయే ఓ మనిషి కోసం నా కళ్ళు ఎదురు చూస్తున్నాయి.

మగాల్ల అందాన్ని చూపుల్తో కొలవగలిగే సక్తి గనక నాకుంటే అతని ఎత్తూ బరువుల్తో పాటు అందం కూడా 'ఇంతా' అని కచ్చితంగా చెప్పేసేదాన్నే. మొన్న నా ముప్పైరెండో పుట్టినరోజు వరకూ అలా చూడటం తప్పేమో అని తప్పించుకోగలిగినా, హాపీబర్త్‌డే వేదాగారూ అంటూ అతనిచ్చిన ఎర్ర చామంతి నా జళ్లోకొచ్చినప్పట్నుంచీ అతన్ని చూడటం తప్పు కాదనిపించింది.

"నా పుట్టినరోజు మీకెలా తెలుసూ?" అని నేనడిగినపుడు "మీరు కట్టుకున్న కొత్త రామనీలపు రంగు చీరని మీ యూనిఫారం దాచలేకపోయిందిగా ఇవాల. పైగా తల్లో పువ్వులూ, చేతుల్నిండా గాజులూ. ఈ మూణ్ణెల్లలో మిమ్మల్ని ఎప్పుడూ ఇలా చూడ్లేదు. ఇంత ప్రత్యేకంగా తయారయ్యారంటే పుట్టినరోజు అయ్యుంటుందని అనుకున్నా. "అంటూ బ్యాగులో ఉంచిన పూలకవరు లోంచి తీసిన ఎర్ర చామంతిని నా చేతికిస్తూ, మూడు నెలలుగా అతను నన్ను గమనిస్తున్నాడన్న విషయాన్ని బలే తెలివిగా చెప్పేసాడు.

నేను పొద్దుటి షిఫ్టుకెల్లేటపుడు రోజూ అతను శీలానగరు రెండో మలుపు దగ్గిర ఎక్కడం ఎరుకే నాకు. వయసు నాలుగు పదుల దగ్గరుండొచ్చు. పెల్లయ్యి పిల్లలు కూడా ఉండొచ్చు. పొట్ట మాత్రం పెద్దగా లేదు. గడ్డం చేత్తో పట్టుకుని ఎవరో దువ్వినట్టు చక్కని పక్కపాపిడి, నొసట ఎప్పుడూ ఆంజనేయస్వామి సిందూరం బొట్టు. పూర్తిగా నవ్వితే పల్లెక్కడ కిందికి ఒలిగిపోతాయో అన్నట్టు పెదాల్తో బిగబట్టి బుగ్గలకి మాత్రం సొట్టలెట్టేవాడు. అతనెక్కిన రోజు బస్సంతా కాలీగా ఉంటే బాగుండనిపించేది. ఉన్న అరగంట సేపట్లో ఎన్నిసార్లు మా కళ్ళు మాటాడుకునేయో. నేను ఓటీలు చేస్తున్నప్పుడు కావాలనే అతను కూడ రాత్రి చివరి బస్సుకి ఆలస్యంగా వస్తూ నా పక్కనే కూర్చునీవోడు. నా వివరాలెలా తెలిసాయో, ఎప్పుడూ మా అమ్మ గురించడుగుతూ ఉండేవాడు.

"పెళ్ళయ్యిందా?" అని అడిగేద్దామంటే సిగ్గేసి "మీ ఫ్యామిలీ ఎక్కడ ఉంటారండీ?" అన్నా వోసారి ఇద్దరం కేంటీన్‌లో టీ తాగుతున్నపుడు. "నేనింకా పెళ్ళి చేస్కోలేదండీ. మొన్నటి వరకూ కొద్దిగా ఫైనాన్షియల్ ప్రాబ్లమ్స్ ఉండేవి. ఇప్పుడు క్లియరైపోయాయి.

నా అక్కయ్యలు, తమ్ముళ్ళూ" అంటూ నేనడక్కుండానే తన కతంతా చదివేయడం నాకు ఆస్చర్యవేసింది. ఒక్కొక్కర్దీ ఒక్కో కత. నాలాగే ఇతనికిన్నూ. అతనలా తనగురించి చెప్తుంటే నాకేటో బాదేసినా, ఇంతవరకూ పెళ్లి కాకపోడానికి ఇంకేదో బలమైన కారణం ఉండి ఉంటాదనిపించింది. అతన్నే చూస్తున్న నా కల్లల్లో అనుమానపు ప్రెశ్నల్ని బాగానే పసిగట్టాడు.

"మీ అనుమానం కరెక్టేనండీ. నాకో మరదలుండేది. ఇద్దరం పెళ్లి చేస్కోవాలని అనుకున్నాం. నాకు ఉద్యోగం రావడం ఆలస్యమైంది. ఎంతాలస్యమంటే, తన కొడుకు నాలుగో పుట్టినరోజునాటికి నా మొదటి జీతంతో గిఫ్ట్ కొనేటంత" నవ్వాలో బాద పడాలో తెలీలేదు. అలా చెబుతూ అతనైతే నవ్వుతున్నాడుగానీ, అతని గుండెల్లో గుచ్చుకున్న ముల్లు కళ్ళల్లో రక్తం చిమ్మించినట్టు అనిపించింది నాకు. ఆ కాంటీన్లో మా ఇద్దరి నోల్లను అంటని టీ కప్పులు లేవని అక్కడున్న వారందరికీ అర్థమైపోయుంటాది.

చనువు పెరిగే కొద్దీ నా మీద అతని అబిమానం నన్ను మరో లోకంలోకి తీసుపోతున్నట్టే అనిపించేది.

• • •

దీపాల అమావాస్య పోయి చలి పెరిగిన రోజులవ్వి. ట్రంకుపెట్టెలో కుంచెడు గులకరాల్లతో పాటు మమ్మల్ని కూడా మడతపెట్టి ఎట్టినట్టుగా ఉంది ఆ వేల మా ప్రయానం. ఈ నాల్రోజులు కొత్తవలస రూట్లోనే నా డూటీ అని ఆయనకి తెలుసు. ఇటేపు ఏ పనీ లేకపోయినా ఇవాల నా బస్సుకే వచ్చాడంటే నాకోసమే అనుకోకుండా ఎలా ఉండగలనూ? చీకటి పడింది. రోడ్డుకి రెండు వేపులా జుట్లిప్పుకున్న బ్రమ్మరాక్షసుల్లాగ ఊడలు చాపుకున్న మర్రిచెట్లు, మా యెన్నుపూసల పట్టు తేల్చీలాగ అక్కడక్కడా రాల్లు దేలిన గతుకుల దారి, బస్సు మొత్తానికి పట్టుమని పదిమంది ఉంటారేమో పాసింజర్లు. అంతగా పరిచయం లేని ఆ డ్రైవరు అరిగిపోయిన డెక్కులో పాత సినిమా పాటలింటంలో మునిగిపోయాడు. బస్సంతా కాలీగా ఉన్నా ఎల్లి 'అతని పక్కనే' కూచున్నానని అనుకోడానికి, నాకు తెలిసినోలెవరూ లేరు. పొద్దున్నుంచీ ఈ రూట్లో తిరిగి తిరిగి ఒల్లు పచ్చిగా ఐపోయిందేమో, కిటికీలోంచి మంచుగాలి మొకాన్నొచ్చి కొడుతుంటే జీవుడు లేచొచ్చినట్టనిపించింది. గాలికి ఎగురుతున్న అతని జుత్తు వంక అలాగే చూసా కాసేపు. ఆ మినుకు వెల్తుర్లో కూడా అతని ముకం ఎలిగిపోతుంది.

"కిటికీ వేసెయ్‌నా వేదా?" అంటూ నా ముందుకొచ్చి అనుకోకుండా నన్ను తగిలిన అతని చేయి ఓ పెద్ద పాపమే చేసిందారోజు. మొగ మనిషి ఊసు తేకుండా ముడుసుకు పడుకున్న నా ఆడతనాన్ని రెక్క పట్టుకు లేపింది. చేతిలో ట్రేబాక్సుని

గట్టిగా అదిం పట్టుకోడం తప్ప సత్తువ చాలని యింతిని, ఇంకేం చేయగలను నేను. "బాగా లేటైంది, ఇంటివరకూ వచ్చి, దిగబెట్టమంటావా?" అడిగాడు నన్ను చూస్తూ. ఇది కలకాదు, నిజంగానే నా బుజమ్మీదనో చెయ్యుందని తెలివి వొచ్చి తుల్లిపడ్డాను. "పర్లేదు, నేను వెల్తాలెండి, మీ అమ్మగారు ఎదురు చూస్తారేమో, మీరు ఇంటికి వెటల్లండి "మొగమాటం మా చెడ్డదని తెలిసే పడ్డాను. "ఈ వారంలో మంచి రోజు ఉందేమో కనుక్కొని, అమ్మను అక్కల్ని తీస్కొస్తాను. మీ అమ్మగారికి చెప్పు" అంటూ నా చెవిలో పెళ్లి మంత్రాలు చదివాడు కాసేపు.

నేనంటే ఇష్టమేనా అని తెలుగులోనో, ఐలవ్యూ వేదా అని ఇంగ్లీషులోనో ఓ ముక్కన్నా అనకుండా ఏకండిగా పెల్లే అనీసాడేటీ అని అలగాలనిపించింది. కానీ నా ఒంటినంటిన కోటు యెనకాల మిన్నకుండా కూచున్న నా వయసుకంత ఓపికేదీ? ఎప్పుడెప్పుడు ఇరుగుదామా అని ఎదురు చూసే నా కన్నెగోరుకి అంత సమయమెక్కడిదీ?! "వచ్చీ బుదవారం ఏకాదశి, మంచిదే" సిగ్గు దాటిన నా నోటి మాట, టకీమని ఇనపడీసరికి అతని బుగ్గ సొట్టలు కల్లజోడుని పైకెత్తాయి. రేపు కలుద్దామన్నట్టు సైగ చేస్తా ముద్దుగా మూసాడా కళ్ళని.

• • •

అతనికిస్టమైన రామనీలం చీర, తల పొడుగుతా జాజిపూలు, చేతుల నిండా చంకీ గాజులు. అద్దంలో నన్ను నేను తనివిదీరా చూస్కున్నాక అమ్మని రమ్మని పిలిచాను. "సాయంత్రం గంట ముందు పర్మీసన్ తీస్కోనొస్తా, డాక్టరు దగ్గరికి వెల్దాం, రెడీగ ఉండమ్మా" అంటూ అమ్మ చేతిలో ఉన్న బోజనం బాక్సు అందుకున్నా. ఎప్పుడూ లేనంత మెరుపేదో నా కల్లల్లో కనపడినట్టు మాయమ్మ నన్నే చూస్తా నిలబడింది.

హేండుబాగులో దువ్వెన, పౌడరు, జెల్సిల్ టాబ్లెట్టూ, జండూబామ్ సీసా ఉన్నాయో లేవో సరిచూస్కున్నా. అన్నీ ఉన్నాయ్. ఆరుగంటల షిఫ్టుకి ఇవాల కోటిబాబు రాలేనన్నాడు. చకచకా డిపోకి పోయి నా ఫోర్ హండ్రెడ్ సిటీ బస్సెక్కి కూర్చున్నా. పొద్దుటి మంచు ఇంకా పూర్తిగా రోడ్డుని ఇడవలేదు. చల్లగాలికి నా గుండెలు చివురుటాకుల్లాగ వొనక్కుండ నా కాకీ యూనిఫారం నన్ను చుట్టేసింది. ఇవాల, బహుసా ఇకపై ఈ శీలానగరు మలుపుకాడ నాకింక ఏ కుదుపూ ఉండకపోవచ్చన్న తనువుకి దుక్కం ఉబికొచ్చింది.

• • •

"నువ్వు మా అమ్మకు బాగా నచ్చావు. కాకపోతే..."

నిన్న అతను నవిలిన నీరు ఇంకా నన్ను ఎక్కిరిస్తానే ఉంది. "నువ్వు ఈ కండక్టరు ఉద్యోగం చేయడం మా అమ్మకూ, అక్కలకూ అంతగా నచ్చడం లేదు

వేదా. నా వరకూ ఐతే పెద్దగా ఏ ఇబ్బందీ లేదనుకో! ఆడవాళ్ళు, తమకాళ్ళ మీద తాము నిలబడాలి, ఉద్యోగాలు చెయ్యాలని కోరుకునే వాళ్ళలో నేను ముందుంటా. అది నీకు తెలిసిన విషయమే కదా. కాకపోతే ఆ చేసేదేదో కాస్త గౌరవప్రదమైన ఉద్యోగమైతే బాగుంటుందని."

పంచింగ్ మిషన్ మద్దిన చిటికెనేలు పెట్టి కొట్టినట్టు చివుక్కుమన్నాది ప్రాణం.

"గౌరవప్రదమైన ఉద్యోగమా? అంటే ఈ ఉద్యోగం గౌరవం లేందా?" అడిగాన్నేను.

"అహా, అలా కాదు... మిగతా ఉద్యోగాలంత మంచిదైతే కాదని."

"ఇందులో అంత గౌరవం లేనితనమేటుందండీ? ఆడవాళ్ళు ఎన్నెన్ని పనులు చేయటం లేదూ? నలుగురి మద్య నిలబడి చేయాల్సిన పని గాబట్టి, అది మగాళ్ళు మాత్రమే చేయాలని, ఆడది చేస్తే దానికి గౌరవం ఉండదని ఎలాగనేస్తారూ?" అలవాటైన గడుసుతనం నా మర్యాద జోలికొస్తే మౌనంగా ఉండలేకపోయింది.

"అలా కాదు వేదా... కారణాలేవైతే ఏంగానీ, ఇప్పటికే నీకు పెళ్ళి వయసు దాటిపోయింది! ఇందులో నువు సంపాయించేదెంతనీ?! ఈ ఉద్యోగం కోసం ఇంకా ఎందుకంత తాపత్రయం నీకు? నేనున్నాగా! నాది మంచి ఉద్యోగమే కదా, నా జీతం మనకి సరిపోతుంది. పెళ్ళయ్యాక ఎలాగూ మానేస్తుందిలే అని మా వాళ్ళకు చెప్పినా వాళ్ళు వినటంలేదు. అందుకే ఇప్పుడే ఈ పనేదో మానేసి, చక్కగా నన్ను చేస్కుని నా యింట్లో నాతో హాయిగా ఉండిపో! ఏమంటావ్?"

ఈ ఆర్నెల్లలో ఎప్పుడైనా ఇతని మనసులో నా పని మీద ఇలాటి చులకనతనం వుందని తెలిసుంటే ఇవాలిలాటి కోతలుండేయి కావేమో.

"నా గురించి అంతా తెలిసే నన్ను పెళ్ళాడతానని అడిగారనుకున్నా. కానీ ఇప్పుడిలా."

"నీ గురించి తెలిసే అడిగా. మనుషుల్ని ఎంచుకుని పెళ్ళిళ్ళు చేస్కునే వయసులు కావుగా మనవి! దొరికిన వారితో జాగర్తగా సర్దుకుపోవడం తెలివైనవారి లక్షణం. నేను సర్దుకుపోతా. నీ గురించి ఆలోచించుకో!"

గొంతులో కొరకంచి దింపి నీరు తాగిస్తానంటున్నాడా?! అతను నాతో సర్దుకుపోబోతున్నాడా?! నేనేం చెప్పేది?! నా సమాధానం కోసం కూడా అతను ఎదురుచూడడేమో. ఎందుకంటే అతను నాయెదట వుంచిన త్రాసుకి అవతలి పల్లెంలో వున్నయి నా బతుక్కో తోడునిచ్చే అతనితో పెళ్లీ, బంగారం లాంటి బ్యాంకు ఉజ్జోగస్తుడి బార్య హెూదా కాబట్టి, ఇవతలి పల్లెంలో ఉన్నది ఒంటరి ఆడ

బతుకూ, ఓ పనికిమాలిన, లేడీ కండక్టరు ఉజ్జోగం కాబట్టి. ఎలాగూ నేను బంగారంవైపే మొగ్గుతానన్న బలమైన అతని దీమా నా జవాబు కోసం ఎక్కువ సేపు ఎదురు చూడ్లేదు.

సిందూరం చెరగకుండా మొకం తుడుచుకుని జుట్టు సర్దుకున్నాడతను.

"ఎల్లుండ ఏకాదశి. నాతో పెళ్ళి నీకిష్టమైతే నాకిస్టమైన రామనీలం చీరతో నాకోసం ఎదురు చూడు. ఏ విషయం రేపు ఫోన్ చేసి మాటాడు. నాతో పెళ్ళికంటే నీకీ ఉద్యోగమే మేలని అనిపిస్తే ఇక ఫోన్ కూడా వొద్దు. వెళ్తా." చివరి మాటకు తోడు రాటానికి నవ్వు కూడా మొకం చాటేసిందావేల!

• • •

డిపో నుంచి అతనెల్లిన అరగంటకిగాని నాకు నేను గుర్తు రాలేదు. అతను నా ముందుంచిన తక్కెట్లో ఎడమ, కుడి పల్లేల్లో బరువులు నాకేవిధంగా సమానమనిపించ లేదు. ఉతికిన రామనీలం చీర సాక్షిగా ఇవ్వాల నేను అతనికి నా జవాబు చెప్పబోతున్నాను. మురిగిన నా ముప్పైరెండేళ్ల వయసూ, ఇంకా ఇరగని నా కన్నెగోరు ఊసూ, అతనితో పెల్లికి నా ఉజ్జోగమే అడ్డమని చెప్తే ఇనుకోనట్టే ఉన్నా, ఏదోరోజు ఇడమరిచి చెప్దామనే బయల్దేరా.

నిన్ననంతా నా ఫోన్ కోసం ఎదురుచూసిన మనిషి ఇవ్వాల పొద్దున్నే ఈ శీలానగరు మలుపుకాడ మల్లీ కనపడతాడని ఆస పడలేదు నేను. ఐనా కనపడ్డాడు. నేను కట్టుకున్న చీరను చుట్టేసిన నా యూనిఫారం అతన్ని చూసి జాలి పడింది. లోనికెక్కకుండానే రోడ్డు మీద నీరై నిలుచుండిపోయాడతను.

ఎంత రద్దీలోనున్నా అతన్ని చూడగానే యిప్పారుకునే నా పలువరస ఇవాల అతన్ని చూడనట్టుగా ఓ కొత్త ఈలకాయని కరుచుకుంట పదమన్నట్టు నాతో డబడబా నా బస్సుని రెండు దెబ్బలేయించడం అతను చూసే ఉంటాడు. మల్లీ నీ కద మొదలుకొచ్చిందన్నట్టు నా ఫోర్ హండ్రెడ్ బోర్డు నోరు మూసుకొని బుగ్గలు వుబ్బించుకుని నవ్వుతా అటేపు తిరిగిపోయింది.

ప్రేమలాంటి జాలిని నాపై కుమ్మరించి పేరుకి ఓ యింటివాడుగా నాతో సర్దుకుపోతే చాలనుకున్న అతని బుద్ధి నాకు ఇంకా అర్దం కాకుండా వుంటే బాగుండేదని నిన్నటి సాయంకాలంలాటి కొన్ని సాయంకాలాలు నన్ను మందలించాయి.

బుజాన జారబోయిన తోలు సంచీ సర్దుకున్నాన్నేను!

రైట్ రైట్ అంటూ, చేతులు సాచిన నా దారి నన్ను ముందుకు రమ్మంది.

# అస్పష్టపు గాలి



## వి.మల్లికార్జున్

నల్లగొండ పట్టణంలో సినిమా హాల్ గేట్‌కీపర్ కుమారుడిగా పుట్టి ఆ ఇంట్లో తొలితరం విద్యావంతుడిగా బి.టెక్ చదివి కథారచనలోకి వచ్చిన రచయిత. పుట్టింది 1992లో. చదువు ఇచ్చే ఉద్యోగాన్ని కాకుండా సృజనకు వీలయ్యే పాత్రికేయ రంగంలో పనిచేస్తూ సినిమా రంగంలో కూడా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికి పదమూడు కథలు రాశారు. ఈ కథలన్నీ 'ఇరానీ కేఫ్ – ఇంకొన్ని కథలు' పేరుతో పుస్తక రూపంలో వచ్చి పాఠకుల గుర్తింపు పొందాయి. లోపలి ప్రయాణాన్ని, ఏకాంత పరిష్వంగాన్ని కథనం చేయడం వీరి ఆసక్తి.

నివాసం హైదరాబాద్.

మొబైల్ : 9912460268

నేను వాడ్ని ఎంత మిస్సవుతానో మధ్యాహ్నాల్లో ఒంటరిగా కూర్చొని ఏదైనా పుస్తకం చదువుతున్నప్పుడో, సినిమా చూస్తున్నప్పుడో ఆలోచిస్తే అర్థమవుతుంది. ఆకులు రాలే ఈ కాలంలో రాత్రి పూట ఈ దారెంట నడుస్తుంటే, చల్లటి గాలేదైనా నా మెడను తాకి వెళ్లిపోతే, ఒళ్లంతా వణుకుపుట్టి, వాడు గుర్తొస్తాడు, ఇప్పుడు గుర్తొచ్చినట్టే.

కొన్ని నెలల క్రిందట జరిగిందే అయినా, వాడు గుర్తొస్తే వాడి చుట్టూ ఉన్నవన్నీ గుర్తొచ్చి, ఈ ఒక్కొక్కటీ జరిగి వందల సంవత్సరాలు గడిచిపోయిన ఫీలింగేదో వెంటాడుతూ ఉంటుంది. అంతే పాత పుస్తకమేదో చదువుతున్నట్టు.

మెట్రో రైలు మధ్య కోచ్‌లో... కోచ్ మధ్యలో ఉన్న సపోర్ట్ రాడ్ పట్టుకొని, చుట్టూ తిరిగి నన్ను చూసి కనుబొమ్మలెగరేశాడు.

“ఎయ్ పిచ్చా?” అన్నాన్నేను.

అంతెత్తుండే మనిషి. నాకు దగ్గరగా వంగి, “అవును. పిచ్చే!” అన్నాడు. నవ్వొచ్చింది.

“అటు చూడు... ఆ మెట్రో ఇట్లా కర్వ్ తీసుకుంటది చూడు. నాకప్పుడు ఏం గుర్తొస్తదో తెలుసా?” అన్నాడు.

“ఏం గుర్తొస్తది?”

నా చెవికి దగ్గరగా వచ్చి, “నేన్నీ మెడ మీద ముద్దు పెట్టినప్పుడు నీ బాడీ మొత్తం కదిలిస్తవు చూడు, అది గుర్తొస్తది” అన్నాడు.

‘ఎయ్’ అని వాడ్ని దూరంగా నెట్టి, చుట్టూ చూసి, అంతసేపు ఆపుకున్న సిగ్గును బయటపెట్టా.

“కానీ నాకెందుకో భయమైతుందిరా” అని నేనన్నప్పుడు, వాడు ఆ రోజు నా కళ్లలోకి చూసి చెప్పిన ఆ ఒక్క మాట నాకింకా గుర్తుంది –

"భయమెందుకు బేబీ! నేనేగా? నువ్వు నా దానివేగా?"

"నేను నీ దాన్నా?"

"కాదా?"

"కాదంటే?"

నవ్వాడు. "సరే, ఇక్కడ్నే మనం దిగేది. ఈ సందులోనే ఇల్లు" అన్నాడు.

మెట్రో దిగి ఆ సందులోకి నడుస్తుంటే, ఆ దారంతా నన్నే చూస్తున్నాడు వాడు.

"చెప్తున్నా, ఏం చేయవనే వస్తున్నా నీతోటి"

"ఏం చెయ్యనులే బేబీ!" అని దగ్గరికి తీసుకున్నాడు. వాడు ఎంత ఈజీగా దగ్గరికి తీసుకుంటాడంటే, వాడలా దగ్గరికి తీసుకోగానే వాడిలోకి ఒదిగిపోవాలనిపిస్తుంది.

వాడి చిన్న ఫ్లాట్‌కి తీసుకెళ్లాడు. ఫ్లాట్ నిండా వాడికిష్టమైన పెయింటింగ్స్, పుస్తకాలు. "బాగుందోయ్ నీ ప్లేస్" అన్నాను.

"అక్కడ బాల్కనీ చూస్తుండు. కాఫీ కలిపి తెస్తా" అని బాల్కనీకి దారి చూపించి కిచెన్‌లోకి వెళ్లాడు.

బాల్కనీ గోడను పట్టుకొని, ఏవేవో పాటలు పాడుకుంటున్నా. "అగర్ తుమ్ సాథ్ హెూ" అని పాడుకుంటుంటే,

"నేను ఇక్కడ్నే ఉన్న" అనుకుంటూ రెండు చేతుల్లో రెండు కప్పులు పట్టుకొచ్చాడు. ఇద్దరం బాల్కనీ గోడకు నిలబడి, ఏవేవో కబుర్లు చెప్పుకున్నాం. కొద్దిసేపు ఫిబ్రవరి మొదటివారం తర్వాత మళ్లీ పది నెలలకు గాని వినబడని గాలి చప్పుడు విన్నాం. ఆ మధ్యలోనే ఎప్పుడో, నా కళ్లలోకి చూశాడు.

"ఏంటట్ల చూస్తున్నవు?"

"ఐలవ్యూ" అన్నాడు.

"సర్లే.." అని వెటకారంగా నవ్వి, వాడి చేతిలోని కప్పు కూడా తీసుకొని, కిచెన్‌లో పెట్టి హాల్‌కి వచ్చేసరికి, పుస్తకాల షెల్ఫ్ పక్కన నిలబడి,

"చెప్పవూ..." అనడిగాడు.

"ఏం చెప్పను?"

"నేను చెప్పిందానికి!"

"మా నాన్నని ఒప్పించే దమ్ముందా నీకు?"

"లేదు."

"మూస్కో మరి.."

"పారిపోయి పెళ్లి చేస్కుందమా?"

నవ్వొచ్చింది.

"పారిపోయి?"

"పెళ్లి చేస్కొని బతుకుదం"

"పెళ్లి చేస్కొని ఏం చేస్తవు?"

"ఏం చెయ్యాలి?"

"నేనడుగుతున్నబే! ఏం చేస్తవు?"

వాడేదో గుర్తొచ్చిన వాడిలా కిచెన్ దగ్గరికెళ్లి నన్ను పిలిచాడు. రైస్ కుక్కర్ మూతతీసి, "ఆ వాసన చూడు..." అన్నాడు.

పొగ... అదేదో వాసన... అప్పుడే వండిన అన్నం వాసన కూడా కాదది.

"నువ్వు నాకు ఇంత దగ్గరున్నప్పటి నీ శ్వాస అనిపిస్తది ఇది" అన్నాడు, మా ఇద్దరి మధ్య ఉన్న దూరాన్ని చేతులతో చూయిస్తూ.

"పుస్తకాలెక్కువ చదువుతున్నవు..." అని నేనంటూనే ఉన్నా, నా మాట ఇంకా పూర్తవ్వనేలేదు, నన్ను దగ్గరికి లాక్కొని ముద్దు పెట్టాడు.

"ఏం చెయ్యనన్నవు..." అన్నాను సిగ్గుపడుతూనే.

"ఏం చెయ్యొద్దనే అనుకుంటున్నా"

"మరి ఇది?"

కొన్ని నిమిషాలు మేం ఏ భాషలో మాట్లాడుకున్నామా అని ఇవ్వాళ్టికీ ఆలోచిస్తా. రెండు దేహాలు పట్టేసుకుంటూ, వదిలేసుకుంటూ ఉంటే, అప్పుడు ఆ రెండు దేహాలు పలికే మాటల్ని ఎందుకు రికార్డు చెయ్యం మనం అని చాలాసార్లు అనుకున్నా.

ఇద్దరం పక్కపక్కన్నే వెల్లకిలా పడుకొని ఊపిరి తీసుకుంటున్నాం.

"నవ్ ఐ నో యువర్ స్కిన్. అండ్ నవ్ ఐ నో యువర్ బాడీ" శ్వాస చప్పుడంత గొంతుతో అన్నాడు. నవ్వాను.

"అండ్ థ్యాంక్యూ ఫర్ దిస్..." అన్నాను వాడివైపు తిరిగి.

వాడి ముఖంపై నేను, నా ముఖంపై వాడు, చూపుడు వేళ్లతో ఏవేవో రాసుకున్నాం.

"ఇంత దగ్గరగా నిన్నెప్పుడన్నా, ఎవరన్నా ముట్టుకున్నరా?" అనడిగాడు.

వాడి ఆలోచనల్లోంచి నన్ను బయటపడేస్తూ, నా మీదికొచ్చినంత పనిచేసిన కారు, అడుగు దూరంలో ఆగింది.

సరిగ్గా ఇదే వేగంతో వచ్చిన కారు ఒకటి, ఇలా అడుగు దూరంలో ఆగకుండా వాడి మీదికెక్కి వాడ్ని చంపే ఒక ఇమేజేదో మధ్యాహ్నాలు గుర్తొస్తుంటుంది. ఇది ఇలాగే జరిగి వాడెందుకు చనిపోలేదో కదా, అనుకుంటాను. సాడిజం అనిపిస్తుంది. నా మీదికైనా ఈ కారెందుకు ఎక్కలేదు? అనుకున్నా.

'సారీ' అని చెప్పి వెళ్లిపోయాడు కారతను.

అవును, వాడేం అడిగాడు?

అయినా ఈ మగాళ్లందరూ ఈ ప్రశ్న అడిగి, ఏం తెలుసుకోవాలనుకుంటారు? పెళ్లయ్యాక నన్ను కట్టుకున్న వాడు కూడా ఇదే ప్రశ్న అడిగాడు. అతను ఆ మాట అడిగినప్పుడు కోపమొచ్చింది.

వాడు అడిగిన రోజు మాత్రం చెప్పాలా, వద్దా అని చాలాసేపు ఆలోచించా.

ఏడుపొచ్చింది.

"ఐ యామ్ సారీ! ఐ డింట్ మీన్ ఇట్ దట్ వే" అన్నాడు.

"నో! దిసిజ్ జస్ట్...! ఐ యామ్ ఎంజాయింగ్ దిస్, మై లవ్" అన్నాను.

నవ్వి దగ్గరికి తీసుకున్నాడు. చెప్పానుగా, వాడలా దగ్గరికి తీసుకోగానే అన్నీ మరచిపోయి వాడిలోకి ఒదిగిపోవాలనిపిస్తుంది.

కానీ, నేను అదెలా మర్చిపోతా?

"మావయ్య...!" అని అమ్మ దగ్గరికెళ్లి ఎన్నిసార్లు ఆ మాటను పూర్తి చెయ్యాలనుకున్నా?

"ఎప్పుడూ మావయ్యా... మావయ్యా... మావయ్య పిచ్చిది..." అనేది అమ్మ.

అత్త ఎంత అందంగా ఉండేది! అమ్మ దగ్గర పూర్తి చెయ్యని మాట, అత్త దగ్గర చెబుదామన్నప్పుడల్లా, నా తల మీద చెయ్యేసి, "నీ జడ ఎంత బాగుందే" అనే అత్తే గుర్తొచ్చేది.

వాడి చేతులు నా ఒంటి మీద మళ్లీ కదుల్తుంటే, 'ఎయ్' అన్నా.

"ఇంకోసారి?" అనడిగాడు.

"రెడీనా?" వాడి కళ్లలోకి చూశా.

ఒకటి... రెండు... మూడు... రోజులు ముందుకు పోతుంటాయి. వాడి ఫ్లాట్‌కి

వెళ్లడం రొటీన్ అయిపోయింది. ఎప్పుడెళ్లినా ఈ డ్రామా అంతా చేసి చూపిస్తాడు. ఆ బాల్కనీలో కూర్చొని కబుర్లు చెప్తాడు. కిచెన్ బండ మీద నన్ను కూర్చోబెట్టి, ఏదో ఒకటి వండుతూ నన్ను తాకుతుంటాడు. నేను అలాగే వాడ్ని నా దేహం మీదికి లాక్కునేదాన్ని.

"నాకు నీ గాలి సోకింది" అని రోజూ వాడి దగ్గరికి రావడం గురించి అన్నప్పుడు, గట్టిగా నవ్వాడు.

మా అమ్మ అనేది ఆ మాట.

మావయ్యా వాళ్లు వచ్చి వెళ్లిన రోజు నుంచి మూడు రోజులు ఇంట్లోంచి బయటికి రాలేదు. నాలుగో రోజు అమ్మే గొడవ చేసి, "ఏం పుట్టిందే నీకు?" అని గట్టిగా కొట్టింది.

కోపమొచ్చింది నాకు. జుట్టు విరబోసుకోవాలనిపించేది. తలని అంత దూరం వెనక్కి లాక్కొని గోడకి కొట్టుకోవాలనిపించేది. చేతికి దొరికిన సామాన్లన్నీ విసిరికొట్టాలనిపించేది.

"గాలి సోకింది దీనికి." అన్నది అమ్మ.

"గాలి సోకితే ఏం చెయ్యాలి మరి?" అన్నాడు వాడు.

"ఏం చెయ్యాలో నీకు తెలియదా?" వాడికి దగ్గరగా జరిగి, వాడి కళ్లలోకి చూసి అడిగా.

గాలి సోకిందని నన్ను అమ్మ ఊరవతల గుట్ట మీద అయ్యగారి దగ్గరికి తీసుకెళ్లింది. నా కళ్లలోకి సూటిగా చూశాడతను. నేనూ అలాగే చూశా.

గట్టిగా అరిచి ఏదో మంత్రం చదివాడు. నా రెండు చేతులూ ఒక దగ్గరికి తెచ్చి గట్టిగా కొట్టుకున్నా. గాజులు పగిలి, పెంకులు కొన్ని రాసుకున్నాయి. రెండు చేతులకూ రక్తం. ఇంకా గట్టిగా చదివాడు మంత్రం. కూర్చున్నదాన్ని నిలబడమన్నాడు. గట్టి చర్నాకోల తీసి కొట్టుకున్నాడు. నేనతణ్ని చూస్తూనే ఉన్నా. ఆ చర్నాకోల నా మీద పడింది. ఒళ్లంతా దెబ్బలు. నేనింకా గట్టిగా అరిచా.

"వారం నించి ఇట్లనే చేస్తుందయ్యా! ఏం గాలిసోకిందో ఏమో" అన్నది అమ్మ.

నా మీద ఆ చర్నాకోల దెబ్బలు పడుతూనే ఉన్నాయి. అరవలేదు.

"దెబ్బకు పారిపోయింది." అన్నాడు అయ్యగారు. అమ్మ సంతోషంగా నవ్వింది.

ఆ తర్వాత ఎప్పుడు దుఃఖమొచ్చినా అలాగే అరిచేదాన్ని. అమ్మ అదే అయ్యగారి దగ్గరికి తీసుకెళ్లేది. అవే దెబ్బలు తినేదాన్ని. ఒళ్లంతా అచ్చులు పడేవి.

నాకెందుకో అమ్మ అన్నట్టు, ఇదంతా గాలి సోకినట్టే ఉండేది. ఆ గాలి మీదినుంచి పోగానే, ఒళ్లంతా దెబ్బలున్నా బాగుండేది.

నా ముఖం మీది నుంచి నా ఒంటి మీదికి వాడి వేళ్లు కదుల్తుంటే మాత్రం, నిజంగానే నా మీదున్న గాలి పోయినట్టనిపించింది. తేలికగా అనిపించింది.

"ఐ లవ్యూ టూ" అన్నాను.

"నాన్న?" అన్నాడు.

"పారిపోదమా?"

"చంపేస్తే?"

"చంపేస్తడా?"

ఈ మాటలు ఆ రోజు ఇంకొంచెం ముందుకెళ్లి ఉంటే బాగుండనుకుంటాను ఎప్పుడూ. వాడు వాడి పెదాలతో నా పెదాలు కప్పేసి, ఇంకేం మాట్లాడనివ్వలేదు.

ఒక నెలయిపోయింది. నా పెళ్లయిపోయింది.

ఆరు నెలలైపోయిందా, ఇతను నా మీద కదుల్తున్నప్పుడు, మావయ్య గుర్తొచ్చి అరుస్తాను. ఏడుస్తాను. చచ్చిపోవాలనుకుంటాను.

ఒక్కోసారేంటో, నేనే ఇష్టంగా ఇతని మీద కదుల్తుంటానా, అప్పుడు సరిగ్గా వాడు గుర్తొస్తాడు. కళ్లు మూసుకుంటాను.

"నీ బాడీలోని ప్రతీ పార్ట్‌ని ఎక్స్‌ప్లోర్ చేస్త" అని వాడు చెప్పిన మాటలు గుర్తొస్తాయి.

కళ్లు తెరిచి కింద వాడ్ని వెతుక్కుంటా. వాడు అక్కడ లేకపోవడం పెద్ద గిల్టీగా ఉంటుంది. పారిపోవాలనిపిస్తుంది.

రాత్రుళ్లు ఎప్పుడైనా ఇతని కోసం ఎదురుచూస్తూ, బాల్కనీలోంచి కిందికి చూస్తూ కూర్చుంటా.

ఇవ్వాళ వేరే ఊరెళ్లాడు. బాల్కనీ నుంచి చూస్తుంటే, కింద రెండు కుక్కలు ఆడుకుంటూ కనిపించాయి. ఒకదాని వెంట ఇంకొకటి పడుతూ అటూ ఇటూ పరిగెడుతున్నాయి. చిన్న బట్టను నోట్లో కరుచుకొని పట్టుకుంటూ, విడుస్తూ ఆడుతున్నాయి. ఒకటి దూరంగా పోతుంది. తిరిగొస్తుంది. మళ్లీ ఆ బట్టను అందుకుంటుంది. అలాగే జంట కుక్క మూతిని.

కొద్దిసేపటికి ఒక కుక్క కారు కిందికి పోయి దాక్కుంది. ఇంకొకటి అలాగే నిలబడి చూస్తోంది. దూరం నించి వీటిని గమనిస్తున్న ఇంకో కుక్క దీనికి దగ్గరగా వచ్చి నిలబడింది. దగ్గరికొచ్చి మూతి అందించింది.

నేను నా బాల్కనీ నుంచే ఒక చిన్న రాయిని తీసుకొని వాటి మీదికి విసిరా. రెండు కుక్కలూ దూరంగా పరిగెత్తాయి.

కాసేపటికి రోడ్డు మీదికొచ్చి నడుస్తున్నా.

ఆకులు రాలే కాలంలో ఇలా ఈ దార్లో నడుస్తూ పోతుంటే, చల్లగాలి మెడను తాకితే వాడు గుర్తొస్తాడు. వాడొక్కటే గుర్తొస్తే ఎంత బాగుంటుంది!



# తీపి చావు



## పెద్దింటి అశోక్ కుమార్

తెలుగు, తెలంగాణ కథకుల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న రచయిత. 1968లో భీమిడి మల్లారెడ్డిపేట్‌లో పుట్టారు. సిరిసిల్లలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వీరు, గత ఇరవై ఏళ్లుగా కథలు రాస్తున్నారు. దాదాపు 200లకు పైగా కథలు, 6 నవలలు, 8 నాటికలు రాశారు. కథలు రాయడాన్ని ఒక ఒక గొప్ప అవసరంగా చెబుతారు. సినిమా రంగంలో పని చేశారు. మనుషుల కోసం, సమాజం కోసం కథలు రాసినట్టు చెప్పినా, ముందైతే కథ రాస్తే మనసులో ఉండే బాధ, బరువు దిగిపోతుందని చెబుతారు. 'పాఠశాలే నా ప్రయోగశాల' అని చెప్పే ఈ పాఠకుల రచయిత, కథ రాయడం ఎంత ఇష్టమో, చదువు చెప్పడమూ అంతే ఇష్టమని అంటున్నారు.

నివాసం : సిరిసిల్ల.

మొబైల్ : 94416 72428

ఈ మధ్య నాకు కొత్తగా ఓ అలవాటు వచ్చింది. వచ్చిందా చేసుకున్ననా అన్న విషయాన్ని పక్కన పెడితే దానితో లాభాలే ఎక్కువగా ఉన్నాయి. చిన్న చిన్న పనులు ఫోన్ కాల్‌తోనే జరిగిపోతున్నాయి. హడావుడిగా వెళ్తూ కూడా మిత్రులు నన్ను పలకరిస్తున్నారు. కనీసం నవ్వుతూ అయినా చెయ్యూపుతున్నారు. ఇంతకు ఆ అలావాటేమిటంటే పొద్దున్నే అందరికి గుడ్ మార్నింగ్ చెప్పడం. ఫోన్ చేసో ఇంటికి వెళ్లో కాదు వాట్సప్ గ్రూప్‌లో.

ఇంతకు ముందయితే ఓ మంచి కొటేషన్‌ను ఓ పువ్వును సెలక్ట్ చేసుకుని వరసగా అందరికి సెండ్ చేద్దుంటిని. ఈ మధ్య కొత్తగా ఐదుగురికి మాత్రమే అవకాశం ఉండడంతో కష్టమనిపించి నేనే మూడూ బ్రాడ్‌కాస్ట్ గ్రూపులను క్రియేట్ చేసుకున్నాను. 'నియర్ అండ్ డియర్స్' అని దానికో పేరు కూడా పెట్టుకున్నాను. రెండు నిమిషాల్లో ఏడువందల మందికి పైగా మిత్రులను పలకరిస్తున్నాను. వేరొకరు ఎంతమంచి కొటేషన్ స్వయంగా రాసి పెట్టినా ఎత్తిపోతలంటారు. కానీ నేను ఎక్కడిదో ఎత్తుకచ్చినా తెలుగు పంతులును, అందునా అప్పుడప్పుడు చిన్న చిన్న కవితలు రాస్తాను కాబట్టి నాదే అంటారు. నాకు అదో అడ్వాటేజి అయింది.

ఆరోజు ఎవరిని నమ్మాలి, ఎవరిని నమ్మకూడదు అనే అంశం మీద ఒక కోట్ రాసి గులాబి పువ్వును పెట్టి శివరాత్రి శుభాకాంక్షలు అని కూడా టైపు చేశాను.

రెండు నిమిషాల్లో ఫోను మోగింది. చంద్రం పేట పెద్దసారు రవి. అప్పులిస్తుంటారు. ఒక్కరోజు లేటయినా దులిపేస్తుంటారు. నేనేం బాకీలేను కదా అని గుర్తు చేసుకున్నాకే ఫోన్ ఎత్తాను.

ఎలాంటి పలకరింపు లేకుండా 'మీరు చెయ్యవట్టి నాకు లక్ష లాసు...' అన్నాడు.

నాకు భయమైంది. పొద్దుపొద్దున ఇదేంటి అనుకుని 'ఎందుకు' అన్నాను. 'ఈ కొటేషన్ ఏదో నిన్న పెట్టినా అయిపోతుండె. వానికి అప్పు ఇయ్యక పోదును. ఇంతకు చింతకింది రమణకు నువ్వేమన్నా అప్పు ఇచ్చినావా...' అడిగాడు. లేదన్నాను.

'నువ్వంతేలే... ఎవలతో దోస్తు చేసినా చెనిగెలు బుక్కి చెయ్యి కడిగినట్టే ఉంటది. నాదే... మాలువోతది మాటత్తది...' అన్నాడు.

నా మార్నింగ్ కొటేషన్ అతడిని కదిలించినందుకు సంతోషమనిపించింది. అతడు అప్పు ఇచ్చినట్టు కూడా అర్థమయింది. 'ఏ... ఎటువోతయి... వాడు నియ్యతు మనిషి' అన్నాను.

'వాడుంటే గదా.. నియ్యతు బే నియ్యతు...' అంటూ ఫోన్ పెట్టాడు.

నేను షాక్. తిరిగి రవికి కాల్ చేశాను. ఎంగేజ్. రమణకు కాల్ చేశాను. స్విచ్చాఫ్. ఏదైనా సమాచారం ఉంటుందని మా ఇల్లంతకుంట టీచర్స్ వాట్సాప్ గ్రూప్ ఓపన్ చేశాను. పాణం జల్లుమంది. పూలతో ఊదుబత్తీలతో ఎడిట్ చేసిన రమణ ఫొటో. 'చిన్న లింగాపూర్ పాఠశాలలో అటెండర్‌గా చేరిన నెలకే గుండెపోటుతో మరణించిన చింతకింది రమణకు శ్రద్ధాంజలి' అన్న వాక్యాలు తర్వాత పదిరులై వరకు రిప్ మెసేజ్‌లు.

వెంటనే చిన్నలింగాపూర్ పెద్ద సారుకు ఫోన్ చేశాను. ఎత్తాడు.

'అయ్యో!.. నిన్ననే సార్... మొదటి జీతం ఎత్తుకున్నని స్వీట్ తీసుకుని ఇంటికి వచ్చిండు'. 'ఆ స్వీట్ వాని కొంపముంచింది' అన్నాడు బాధగా. నాకు అర్థం కాలేదు. 'మీరు ఎవలతో అనకుండ్రి గనీ అది హార్ట్ ఎటాక్ కాదు. సూసైడ్... షుగర్ పేషెంట్లు చెక్కరి బుక్కుతే ఏమయితదని రెండు మూడుసార్లు అడిగితె ఎందుకో అనుకున్న. చెరుకు పాలు గూడానట...' బాధగా అన్నాడు. నాకు కళ్లు బైర్లు కమ్మాయి.

ఎందుకో నమ్మబుద్ధి కాలేదు. వాళ్ల దగ్గరి బంధువుకే చేశాను. నిజమే అన్నాడు.

రమణ గంభీరమైన మనిషి. ఎడ్డార్యం లేదు. కలుపుగోలుగా ఉంటాడు. ముఖ్యంగా జీవితం పట్ల అవగాహన ఉన్నవాడు. ఎన్నో ఆటు పోట్లు తిన్నవాడు. పోరాడి ఉద్యోగాన్ని సాధించుకున్నాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నాడంటే నమ్మబుద్ధి కావడంలేదు.

రమణ నన్ను ఎప్పుడు కలిసింది నాకు బాగా గుర్తు. టీచర్స్ ఫెడరేషన్ తరపున ఆ రోజు ప్రైవేట్ స్కూల్ టీచర్స్ జీతాలు పెంచాలని కలెక్టరేట్ ముందు దర్నా చేస్తున్నాం. మందిలోంచి నా దగ్గరికొచ్చి 'మీకు అందరి శ్రమ దోపిడి కనిపిస్తుంది గనీ మాదే కనిపిస్తలేదు' అన్నాడు.

వివరాలు తెలుసుకున్నాను. గవర్నమెంట్ స్కూల్లో నూట యాభై రూపాయల జీతంతో ఐదేండ్లుగా పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ అని తెలిసి బాధగా అనిపించింది.

'ఏండ్ల కేండ్లు ఎట్టి జేస్తున్నం సార్... మీరెంత సేపు సమాజము సమస్యలే అంటరు. ముందు మా సమస్య గురించి మాట్లాడుండ్రి' అన్నాడు.

లెక్క తీస్తే జిల్లాలో మూడు వందల యాభై మంది అలాంటివాళ్లు ఉన్నట్టు తేలింది. వెంటనే ఒక యూనియన్ ఏర్పాటు చేసి రమణనే అధ్యక్షున్ని చేశాం. 'ఒకలు పోరాడుడుగాదు... ఎవలది వాల్లే పోరాడాలె. ఇప్పుడు మీకో యూనియన్ ఉంది. మా మద్దతు ఉంది' అన్నాను.

అప్పటి నుంచి పోరాడుతూనే ఉన్నాడు రమణ. అప్పుడు మా ఉపాధ్యాయ సమస్యలు యాన్యువల్ ఇంక్రిమెంటుకైనా మెడికల్ లీవుకైనా ఆఫీసు చుట్టూ తిరగాల్సిందే. ఆ సమస్యలతో పాటు మేము ప్రజాసమస్యల గురించి కూడా పోరాడేవాళ్లం. మద్దతు దరలు తునికాకు రేట్ల గురించి కూడా నిరసన తెలిపే వాళ్లం. చిన్న పిలుపు ఇస్తే వందలమంది జమకూడే వారు.

క్రమంగా ఉపాధ్యాయుల అన్ని సమస్యలు తీర్చింది ప్రభుత్వం. సమస్యలు తీరాయని సంతోష పడ్డాం కాని దాని ఫలితాలు ఇప్పుడు తెలుస్తున్నాయి. ఫెడరేషన్‌ల ఉనికి లేకుండా పోయింది. ప్రజల గురించే మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. రమణ మాత్రం పట్టు విడువలేదు. స్వంత ఖర్చులతో కోర్టు మెట్లెక్కాడు. యూనియన్‌కు నాయకత్వం వహిస్తూ పోరాడుతూనే ఉన్నాడు.

అప్పుడు నేను బస్వాపూర్‌లో పనిచేస్తున్నాను. రమణ రామన్న పల్లెలో స్వీపర్. అది సింగిల్ టీచర్ స్కూల్. మేడం మెటర్నిటీ లీవు పెట్టినప్పుడు హయ్యర్ స్టడీస్‌కు, డైట్ ట్రేనింగ్‌కు వెళ్లినప్పుడు బడంతా తానై పిల్లలకు చదువు చెప్పాడు. ఊరు ఊరంతా రమణను 'సార్' అనే అనేవారు.

'నీళ్లు కాగినయి మరి... బడికిపోతరా లేదా...' శ్రీమతి అన్నది వంటిట్లోంచి. ఆలోచనల్లోంచి లేస్తూ 'లేదు... సావుకు పోత' అన్నాను సీరియస్‌గా. ఆమెకు తదాస్తు దేవతల మీద నమ్మకం ఎక్కువ. నొచ్చుకున్నట్టుగా చూసింది. నేను వివరంగా చెప్పాను.

'అయ్యో... నిన్ననే గదా వచ్చింది. ఇప్పడన్న గడ్డకు వడ్డడనుకున్నం ఇట్లైట్లాయె...' బాధ పడ్డది సుధ.

'అదే సుధా... అర్థం కావడం లేదు. వాడు ఆత్మహత్య చేసుకునుడేంది...' అన్నాను.

'తప్పు ముచ్చట... మనం చూసినంతల ఎన్ని కష్టాలు ఈదుక రాలేదు... కొడుకప్పుడు, బిడ్డప్పుడు, భార్యప్పుడు, కాలిరిగినప్పుడు... ఆయినెప్పుడు భయపడలేదు. ఇప్పుడెందుకు సత్తడు నౌకరచ్చినంక' అన్నది కరాకండిగా.

స్కూల్‌కు వెళ్లాలనిపించలేదు. లీవు పెట్టాను. అంత్యక్రియలు ఎప్పుడో తెలుసుకున్నాను.

మధ్యాహ్నమే అన్నారు. బండిమీద వాళ్ల ఊరు దాచారం బయలు దేరాను.

రమణకు కొడుకు. ఓ బిడ్డ. పదేళ్ల కిందనే ఎవరినో ప్రేమించింది. చెప్పాపెట్టకుండా వెళ్లిపోయింది. ప్రేమించింది ఓ భూస్వామి కొడుకును కాబట్టి ఎవరు ఏమనలేదు. బంధువులు రమణ మాత్రం చాలా బాధపడ్డారు.

'నేనిష్టపడ్డానంటే వద్దంటానా సార్... నా తాకతు కొద్ది పెండ్లి జేద్దునుగదా.. అయినా వాళ్లెక్కడ మేమెక్కడ. వియ్యమైనా కయ్యమైనా సమఉజ్జీలు గావాలె సార్. లేకుంటే నిలువది" అన్నాడు. అన్నట్టుగనే యడాదికి వాళ్లు తిరిగి వచ్చిండ్రు. కొట్లాటలు మొదలైనయి. ఇంట్లోంచి తరిమి కొడితే బిడ్డ చావబోయింది. చావు పరిష్కారం కాదని ధైర్యం చెప్పి ఇంటికి తెచ్చుకున్నాడు. అప్పటికి బిడ్డ చంటి పిల్ల తల్లి. చస్తే మరో పెళ్లి చేయవచ్చని చూసాడు కొడుక్కు భూస్వామి. రమణ భయపడలేదు. విడాకుల కాగితం విసిరి కొట్టి వచ్చాడు.

రమణ ఒకనాడు ఏదో పెళ్లిలో కలిసాడు. తిన్న ప్లేట్లు ఎత్తుతున్నాడు. కూతురు కథంతా నాకు చెప్పి, 'బతుకుదెరువు కోసం ఎదురైన కూలి చేస్తున్న సార్... మొన్న మినిస్టర్‌ను కలిసినం. నెల రోజులల్ల పర్మినెంటు చేస్తనన్నడు సార్... అప్పుడే కష్టాలుండయి. ఎంతసార్. పదహారు వందలేనాయె. ఎటు సాలుతయి' అన్నాడు.

తర్వాత చాలా రోజులు కనిపించలేదు. తెలంగాణ ఇస్తనని ప్రకటించి ఇవ్వకపోవడంతో ఉద్యమం ఊపందుకున్నది. ఎవరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి దాచారం వెళ్లాను. అప్పుడు నేను ఇల్లంతకుంట మండల

జేఏసీ అధ్యక్షునిగా ఉన్నాను. చనిపోయిన విద్యార్థి పేదవాడు. చావుముల్లెకు కూడా డబ్బుల్లేవు. ఎక్కడ దొరుకుతుందా అని వెళ్తే వాటిని అమ్మేది రమణ.

'ఏం జెయ్యాలె సార్... నౌకరి ఇచ్చిరిగనీ రెగ్యులర్ జెయ్యకపోయిరి... జీతం పెంచకపోయిరి. కొట్లాడుతున్నం, కోర్టుల పెట్టినం... ఇయ్యాల్లనో రేపో తీర్పు వత్తది. ఏం జెయ్యాలె సార్... ఆఖరుకు గీ సావుముల్లెలు అమ్ముకని బతుకుతున్న... గా పోరడు గట్ల సత్తడ సార్... కొట్లాడాలెగనీ...' అన్నాడు.

జేబులోని సెల్ మోగింది. ఆలోచనల్లోంచి తేరుకున్నాను. బండిని ఆపి సెల్ తీసాను. రమణ కొడుకు దినేష్. నాకు తెలియదనుకుని విషయం చెప్పాడు.

"అదే.. తెలిసింది. అదెట్ల అయింది దినేష్.. మంచిగనే ఉండెగదా...' అడిగాను.

దినేష్ బాధగా 'ఎక్కడ సార్... హై బీపి... హై షుగర్... రెండేండ్లాయె... దవాఖాన్లో తిరుగుతున్నం. ఇంతకష్టపడి నౌకరి తెచ్చుకుంటే మొదటి జీతం కూడా తినకపాయె. మబ్బుల నాలిగింటికి గుండెల నొత్తందన్నడు. డాక్టరును పిలుసుకచ్చేవరకే పాణం బోయింది...' అన్నాడు.

'బి.పి. షుగర్... బాగనే ఉందా' ఆరా తీసిన.

'అంత నార్మలే సార్... అనుమాన మచ్చి షుగర్ టెస్ట్ కూడా చేసిన నార్మలే ఉంది' అన్నాడు.

'నేను అటే బయలు దేరిన వత్తున్న... అంటూ బండిని ముందుకు కదిలించాను.

దినేష్ గురించి కూడా చాలాసార్లు చెప్పాడు రమణ. 'ఏం జెయ్యాలె సార్... సదువు కొమ్మంటే సదువుకోక పాయె. లంగల సోపతులు వట్టి మస్కట్ పోతనని లక్షమునిగె. ఏదో దుకాణం పెడతనని లక్ష మునిగె. లక్షలకు లక్షలు యాడతెత్త సార్... ఫైలు సెక్రటరీ దగ్గరుందట. వారం పది రోజులల్ల పనైతదన్నడు మనిషికి లక్ష ఇచ్చినం సార్...' అన్నాడు ఒకనాడు.

నాకు బాధగా అనిపించింది. 'ఏంది రమణ... అది అయింది గాదు. పోయింది గాద. లక్షలకు లక్షలు పెడుతున్నవు... ఇరువై ముప్పైయేండ్లాయే... ఇగేమైతది' అన్నాను.

'అయితది సార్... ఏనుగెల్లింది తోక జిక్కింది. మనిషి ఆశ మీద బతుకాలె. ఎంత... వారం పది రోజులు ఆగనా...' అన్నాడు నమ్మకంగా.

గుర్తుంచుకుని పదిహేను రోజుల తర్వాత ఫోన్ చేశాను. విషయం చెప్పకుండా 'సార్... మీ వద్దకే వస్తననుకుంటున్న సాయంత్రం ఉంటరా' అన్నాడు. నేను సరే అన్నాను.

సాయంత్రం వచ్చి “ఏడో తరగతి సర్టిఫికెట్ కావాలెనట సార్... ఉన్నొల్లందరికి అయితుంది...” అన్నాడు.

“అదేమన్నా జిరాక్స్ కాఫీనా వెంటనే తీసుకోడానికి ప్రైవేట్లో ఫీజు కట్టాలి. పరీక్ష రాయాలె. పాస్ కావాలె. ఇప్పుడు ఫీజు కడితే ఆరు నెలలు అయితది.” అంటూ తెలిసిన టీచర్‌కు పరిచయం చేశాను. పేపర్లు రాయించడానికి అతడు పెద్ద మొత్తంలోనే గుంజి నట్లున్నాడు. సర్టిఫికెట్లు చేతికొచ్చేసరికి ముఖ్యమంత్రి మారిండు. మంత్రులు మారారు. మళ్లీ కొత్తగా ఆట మొదలయింది.

ఒకనాడు సిరిసిల్ల లేబర్ అడ్డా మీద కనిపించాడు. మనిషి కొద్దిగా వాడిపోయినట్టున్నా మాట గంభీరత తగ్గలేదు. ‘ఏం జెయ్యాలే సార్... బడిలేన్నాడు కూలి జేస్తున్న’ అంటూ చూట్టూ చూసి ఎవలు లేరని నిర్ధారించుకుని బడికి కొత్త సారచ్చిండు సార్... మంచి ఉపాయం జెప్పిండు. జీతం తీసుకొని హాజిరేత్తనన్నడు. నన్ను ఏదన్నా పని చేసుకొమ్మన్నడు. ఎట్లన్నా ఇయ్యల్లనో రేపో తెలంగాణ ఇత్తరు. అంత మనోల్లేనాయె. అప్పుడు సూసుకోవచ్చు’ అన్నాడు.

జీవితం మీద అతనికున్న ఆశకు ఆశ్చర్యమేసింది. తర్వాత ఉద్యమంలో చాలా సార్లు కనిపించాడు. తన ఫైలు ఎటెటు తిరుగుతుంది. ఎందరు చనిపోయింది, ఎందరికి ఎజ్‌బారయింది లెక్కలతో సహా చెప్పేవాడు. నాకు విసుగొచ్చేది. అయినా వినేవాడిని. లాంగ్‌స్టాండింగ్‌తో నేను బస్వాపూర్ నుంచి మంథని వెళ్లాను. రెండేండ్లు రమణతో నాకు కాంటాక్ట్ లేదు. మళ్లీ ట్రాన్స్ఫర్లో బస్వాపూర్కే వచ్చాను. అదేరోజు కళాసాగర్ సార్ హౌజ్ ఓపనింగ్. అంతా హడావుడిగా ఉంది. ముందు నాలుగు బఫూన్ బొమ్మలు అటు ఇటు తిరుగుతున్నాయి. నేను కటింగ్ కోసమని సెలూన్ వెళ్తుంటే ఒక బొమ్మ ‘సార్... సార్...’ అంటూ నా వద్దకు పరుగెత్తుకొచ్చింది.

నేను ఆశ్చర్యంగా నిలబడ్డాను.

‘సార్... నేను రమణను బొమ్మ లోపల ఉన్న’ అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చి నవ్వాడు. అందరు నా వైపు విచిత్రంగా చూస్తున్నారు. కొంత ఇబ్బందిగా ‘రమణా... బాగున్నావా’ అన్నాను. “ఇగోసార్... ఇట్లున్న మా భార్య బాగలేదు సార్... కోడలు పొల్ల సచ్చిపోయింది. అన్నట్టు మాకు ఉద్యోగాలియ్యమని కోర్టు తీర్పు ఇచ్చింది సార్. గవుర్మెంటు ఇయ్యలే.. మేము ఊకుంటమా... కంటెంట్ ఆఫ్ కోర్టు స్ట్రైక్ కింద కేసేసినం. ఎజుకేషన్ సెకరెటీనే కోర్టుకు గుంజినం రేపు ఏదో ఒకటి అయితది..’ అన్నాడు.

నేను పొడిపొడిగా మాట్లాడి వెళ్లిపోయాను. ఎందుకో రమణను చూస్తే జాలేసింది. మనిషి ఇన్ని కష్టాల్లో కూడా ఎలా నిలబడి నవ్వుతున్నాడు అనిపించింది.

ఎలా ఉన్నాడో చూద్దామని ఓసారి ఇంటికి వెళ్లాను. పరిస్థితి చూసి కళ్లకు నీళ్లు వచ్చాయి. వెంటనే సిరిసిల్లకు వచ్చి రెండు క్వింటాళ్ల బియ్యం పంపించాను. ఏమనుకున్నాడు... కాని రెండు నెలల తర్వాత నేను లేనప్పుడు ఇంట్లో డబ్బులు ఇచ్చి వెళ్లాడు.

కావాలని దాచిందో గుర్తుకు లేదో కాని చాలా రోజుల వరకు చెప్పలేదు సుధ.

బండి గుర్‌గుర్ మంటూ ఆగిపోయింది. ఎండ కన్ను తెరిచింది. ఆలోచనల ప్రవాహం ఆగిపోయింది. ఒంటిపూట బడి. ఆసమయంల వేగంగా వెళ్తున్నాడంటే అతడు టీచర్ కిందే లెక్క. ఆటో ఆగకుండా వెళ్తుందంటే అందులో లేడీ టీచర్స్ ఉన్నట్టే లెక్క. చెయ్యి ఊపడాలు తప్ప బడి ఆపడాలు ఉండవు.

బండికి ఏమైందా అది చూస్తుంటే "ఏమైంది సార్' అంటూ ఆగాడు ఓ మిత్రుడు. బండిని చూసి' రిజర్వులో పడ్డది సార్ 'అంటూ ఆయిల్ టాంక్ కిందున్న రిజర్వ్ బటన్ తిప్పి స్టార్ట్ చేశాడు.

నేను వెళ్తుంటే 'ఇటెటు సార్... మీ బడి అటుకదా...' అన్నాడు.

'పాపం... రమణ చనిపోయిండు సార్...' అన్నాను. ఏ రమణ అన్నట్టు చూసినాడు. అటెండర్ రమణ అంటూ వివరంగా చెప్పాను.

అతను తేలిగ్గా తీసుకుంటూ... 'ఓ.... వాడా... మందిని ముంచి సచ్చిండా... ఊరన్ని అప్పలే... నాకు జూడ వాడు అప్పుల బాధ ఎక్కువై ఉరేసుకుని ఉంటాడు.. కొందరంతే... మంది గోస పోసుకోడానికే పుడతరు...' అంటూ వెళ్లి పోయాడు.

నా మనసు చివుక్కుమంది. ఇతనేం మనిషి అనుకుంటూ బండిని కదిలించి దాచారం చేరుకున్నాను. బంధుమిత్రులు అప్పటికే చేరుకున్నారు. ఒకరిద్దరు లోకల్ టీచర్స్ తప్ప నాకు తెలిసిన వారెవరు లేరు. భార్య, కొడుకు, కూతురు ముగ్గురు బాగా ఏడుస్తున్నారు. కొడుకైతే నా మీద పడి బోరుమన్నాడు. నాకు కూడా ఏడుపొచ్చింది,

'నౌకరి పాడుగాను... నౌకరి నౌకరని సంసారమంత నాశినం జేసుకునే. వచ్చేం శింగారం. రాకేం శింగారం... ఇంక రెండు నెలలే ఉందట. ఈ మూడు నెల్ల కోసం ముప్పయి ఏండ్లు కొట్లాడె... 'వెనక నుంచి ఎవరో అన్నారు.

"అది రాకున్నా బతుకుతుండె గావచ్చు... వచ్చేం పాయిదా... రెండు నెల్లల్ల దిగిపోవుడు అనంగనే హైబత్ తిన్నట్టున్నడు..' ఇంకెవరో అమ్మలక్కల ముచ్చట్లు.

'చావుకు ఇదా కారణం... అరెపాపం.. నిజమే రంది పడ్డటున్నాడు'

అనుకున్నాను. అంత్యక్రియలు అయ్యే వరకు ఉండి ఇంటికి వచ్చేసరికి మధ్యాహ్నం దాటింది. సుధ వివరాలన్ని ఆసక్తిగా అడిగింది. చెప్పిందంతా విని నెపాన్నంతా కోర్టుల మీద వేసింది.

'వాళ్లంతే... సంపేటోన్ని ఏండ్ల కేండ్లు కేసులు పెండింగుల పెట్టి బతికిస్తరు. బతికేటోన్ని అట్లనే చేసి చంపేస్తరు...' అన్నది.

"తప్పు కోర్టులది కాదు. పాలకులది. మోచేతికి బెల్లం రాసి నాకమంటరు. అది అందక, అందుకోకుండా ఉండక మనం పిల్లి మొగ్గలేస్తుండాలె...' అంటూ అన్నం తినడానికి కూర్చున్నాను.

అప్పుడే పోస్ట్ అన్న కేక గేటులోంచి ఓ ఉత్తరం నా ముందు పడింది. అన్నం కలుపబోతూ ఆగి కవరును చూసాను. వెనుక వైపు తెలుగులో స్పష్టంగా ఫ్రం... చింతకింది రమణ అ నిరాసి ఉంది. ఉలిక్కిపడ్డాను. గబగబా కవరు విప్పాను. ఓ కాగితం బయట పడింది. చదవడం మొదలెట్టాను.

'సార్... నమస్తే. నేను రమణను. ఇప్పటికే మీరు నా కాడి మీద కట్టేసి వచ్చి ఉంటరు నాకు తెలుసు సార్... విషయం తెలవంగనే మీరు వస్తరని అక్కడ నా మీద ఏదేదో మాట్లాడి ఉంటారు కదా... అది మీరు వినే ఉంటారు. అప్పులెక్కువై సచ్చిండని ఇరుగు పోరుగు, గుండె ఆగి సచ్చిండని మా పిల్లలు, రిటైర్మెంటు దగ్గరుందని బెంటిల్లిందని ఊరోళ్లు... ఇలా రకరకాలు. ఇప్పటికి మీరు నేనెందుకు సచ్చిన్నో నిర్ణయానికి వచ్చి ఉంటరు. నాకు మీకంటే ఆత్మీయులు ఎవలు లేరు సార్... నిజాన్ని కనీసం మీకన్న చెప్పాలని ఈ ఉత్తరం రాస్తున్న...'

అప్పుడే మంచి నీళ్ల సీసాతో సుధ వచ్చింది. నేను తినడం ఆపి ఉత్తరం చదవడం చూసి నా పక్కన కూర్చుంది. నేను ఓసారి ఆమె వైపు చూసి ఉత్తరం చదవడం మొదలు పెట్టాను.

... ఇన్ని రోజులు కుటుంబం కోసమే దొరికిన పని చేసి బతికిన. ఇప్పుడు కుటుంబం కోసమే చస్తున్న. ముప్పయేండ్లు పోరాడింది ఈ మూడునెల్ల కోసమేనా అని భార్య అడిగినప్పుడు, ముప్పయేండ్లు తిరిగినా నీ బతుక్కు విలవలేదు. మూడు నెలలు దాటితె నీ సావుకు విలువలేదు... అని కొడుకు అన్నప్పుడు వారి మనసులో ఏముందో కాని నేను మాత్రం ఈ నిర్ణయానికి వచ్చిన. పోరాడినందుకు మొదటి జీతం కళ్ళ జూసుకొన్న, రోజులు గడిస్తే నిర్ణయం మారతాదో వాళ్ల ప్రేమ పెరుగుతదోనని భయపడి వెళ్లిపోతున్న...'

'మిమ్మల్ని కోరుకునేది ఒక్కటే సార్... సర్వీసులో సచ్చిపోతున్న గదా... నా కొడుక్కు ఎట్టన్న నౌకరచ్చేతట్టు చూడుండ్రి. నాలెక్కవానికి గూడా లేటయితే వాని

కొడుకు ఎదురు సూతడు మరి... కొందరి చావులు చేదుగుంటయి. నాది తీపి చావు. నా కొడుకుది అలా కాకుడది...'

కళ్లల్లో నీటి పొర అడ్డుతగిలి అక్షరాలు అల్లుకపోయాయి. బాధగా సుధ వైపు చూసాను.

'త్యాగం ఇలా కూడా ఉంటుందా...' ఆమె కళ్లలోనూ నీళ్లు.

# ఫ్యామిలీ ఫోటో



## పూడూరి రాజిరెడ్డి

సాహితీరంగభూమిపై భిన్నదారిని స్థిరపరుచుకుంటున్న రచయిత. స్వస్థలం రాజన్న సిరిసిల్ల జిల్లా నరసింగాపురం గ్రామం. పుట్టింది 1977. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ చదివారు. పాత్రికేయునిగా 'ఈనాడు'లో రంగప్రవేశం చేసి 'సాక్షి' ప్రారంభం నుంచి పని చేస్తున్నారు. మగవాడికి వకాల్తా ఇస్తూ రాసిన వ్యాస సంకలనం 'మధుపం', ఆత్మ కథాత్మక ఖండికలు నిండిన 'పలక–పెన్సిల్', భిన్నమైన స్థలాలను విజిట్ చేసి రాసిన 'రియాలిటీ చెక్' పుస్తకాలుగా వెలువడ్డాయి. కథలను 'చింతకింది మల్లయ్య ముచ్చట' పేరుతో వెలువరించారు. మనిషికి అందాల్సిన తాత్త్వికత తాలూకు అన్వేషణ వీరి కథలో కనిపిస్తుంది.

నివాసం : హైదరాబాద్.

మొబైల్ : 99123 47926

అతడు ఇళ్లల్లోకి నేరుగా షూ వేసుకెళ్లే అలవాటు ఉన్నవాడు కాదు. ఓ మగమనిషి ఎవరో ఆ సమయంలో ఉన్నట్టుగా ఆనవాళ్లు ఎందుకు విడవటమని అలాగే వచ్చేశాడు. పశ్చాత్తాపపు మందహాసంతో సోఫా మీద కూలబడి, సాక్సు కూడా విప్పి, కొనసాగింపు ఏమిటా అని ఆమెను చూపుతో వెతుకుతూ ముఖం ఎత్తినప్పుడు హాల్లో ఎదురుగోడకు తగిలించివున్న ఫొటో మీద అతడి చూపు పడి జారిపోయింది. ముగ్గురు ఉన్నారని మసగ్గా తెలుస్తోంది. నాలుగు అడుగులు ముందుకు వేస్తే కానీ వివరాలు కనబడనంత చిన్న ఫ్రేమ్ అది. అతడికి స్పేస్ ఇవ్వడానికి వెనక్కి జరిగినదల్లా, "ఎలా వచ్చారు? రండి, లోపలికి" అంది.

తోచనితనంతో ప్యాంటును నడుము దగ్గర పైకి లాక్కుంటూ లేచాడు. "ఇక్కడికా? ఆటో."

"చాలా రోజుల్నుంచి అడగాలనుకుంటాను, మీరో బైక్ ఎందుకు తీసుకోరు?"

"ఊమ్, వెహికిల్ అంటే బాధ్యత, బస్సో ఆటోనో అయితే కండ్లు మూస్కొని ఊహల్లో కొట్టుకపోవచ్చు."

"ఎట్లాంటి ఊహలేమిటి?"

'రెండు వందల డెబ్భై రెండవసారి అదే కాలనీలో నడిచిపోతుంటానా– దుమ్ము రోడ్డు, మురికి వాసన, నా కాళ్లను నేను ఈడ్చుకుపోతున్నట్టు తప్ప ఇంకేమీ ఉండదందులో. నన్ను నేనే ఒక కెమెరాలోంచి చూసుకుంటున్నట్టు ఊహించుకోగానే– నా నడక, ఆ ఇండ్లు, ముందెక్కడో చెట్ల కొమ్మలు కలవడం వల్ల ఏర్పడిన తోరణం, వెనకెక్కడో పాడుతున్న పక్షిపాటతో కలిసిపోయి ఈ మొత్తం దృశ్యం మరింత అర్థవంతమవుతుంది.'

బదులివ్వకుండా నవ్వి ఊరుకున్నాడు.

దగ్గరి మనిషి అనుకున్నప్పుడు ఇల్లంతా చూపించినట్టుగా చిన్న ప్రదక్షిణ చేయించింది. ఆమె చిన్న పూవుల లేతాకుపచ్చ నైటీలో ఉంది. తర్వాత మొత్తంగా చూడటానికి ఆ దేహాన్ని మిగుల్చుకుంటున్నట్టుగా, చూపును మరీ లోపలికి దించకుండా చూస్తున్నాడు. ఆమె మరీ ముందుకెళ్లినప్పుడు మాత్రం ఆ నైటీ దాయలేని వెనకటి గుండ్రాల నీడలు, రెండు బుజ్జి కుందేలు పిల్లలు పక్కపక్కన కూర్చుని మాట్లాడుకుంటున్నట్టుగా తోచాయి. వాటి చెవులు పట్టుకుని ఎత్తితే బాగుండు.

ఆఫీసు నుంచి బయలుదేరి, ఈ క్వార్టర్స్ అడ్రస్ వెతుక్కుంటూ వచ్చి, ఈ ఫ్లాట్ బెల్ మోగించడానికి ముందు భయమూ ఉద్విగ్నతా కలిసిన స్థితిలో ఒక క్షణం అలా నిలబడినప్పుడు, ఒంటిరెక్క తలుపు అవతలున్న మనిషి ఎలా ఎదురు పడుతుందా అన్న తలంపు వచ్చి, ఏ చీరలో బాగుంటుందా అని ఒంటికి నప్పే రంగుల్లో ఆమెను ఊహించే ప్రయత్నం చేశాడు. ఆమెను ఎక్కువగా ముదురు నీలంరంగు చీర, గళ్ల లేతనీలం బ్లౌజు యూనిఫారంలోనే చూడటం వల్ల ఎక్కువ కాంబినేషన్స్ కదలాడలేదు. లోపలికి వెళ్లాకే, ఆశ్చర్యపడదాంలే అనుకున్నాడు. బ్యాగు తెరిచేదాకా ఆశ్చర్యం ఉండాలని లంచు కోసం భార్య ఏం పెడుతుందో తెలియొద్దనుకుంటాడు. కానీ ఎప్పుడూ తెలిసిపోతూనే ఉంటుంది. ఈమె నైటీలోనే ఉండటం తనకు ప్రత్యేకత ఇవ్వనితనంగా కనబడి నిరాశ కలిగింది. మరీ దూరం చేయనితనంగా కనబడి బానే ఉందనిపించింది. తన భార్య నైటీలో కనబడినట్టుగా మాత్రం అనిపించలేదు. అలవాటైన చూపుకు భిన్నంగా కనబడేది ఆకర్షణేమో. పైగా ఒక సంసారిగా అతడికి తెలుసు, ఇట్లాంటప్పుడు నైటీ ఎంత ప్రాక్టికలో.

ఇల్లు వసతిగా ఉంది. తన మగ కలీగ్స్ కోరుకునే సౌకర్యాలన్నీ ఉన్నాయి. ఫ్రిజ్, ఫ్లాట్ టీవీ, వాషింగ్ మెషీన్, ఏసీ, విశ్వదర్శనం చేయిస్తున్న చిన్నికృష్ణుడి పెయింటింగ్... అతడు అద్దెకుండేది కూడా మాటవరుసకు డబుల్ బెడ్రూమ్ ఇల్లే కానీ డబుల్ బెడ్రూమ్ సౌకర్యం ఉండదు. ఇంకో జంటను అందులో ఉంచి వారికి ప్రైవసీ కల్పించలేము. ఇది మాత్రం నిజంగా డబుల్ బెడ్రూమ్. లేడీ కలీగ్స్‌తో ఉన్న సమస్య ఇదే. మగవాళ్ల కేడర్లోనే పనిచేస్తారు, మగవాళ్లకంటే విలాసంగా బతుకుతారు. బెడ్రూము, ఎటాచ్డ్ టాయ్లెట్... 'ఊఊ' అని వేలితో అటు చూపించింది. పరాయి ఇళ్లల్లో టాయ్లెట్ వాడటానికి అతడు ఇబ్బంది పడతాడు. బొటనవేళ్లు మడిచి పాదాలు పూర్తిగా ఆన్చకుండా ప్రాణం మీద నిలబడతాడు. పైగా ఈమెకు తెలిసేట్టుగా. 'ఆఆ' అని తల అడ్డంగా ఊపాడు. ఆడపిల్లదని తెలిసేట్టుగా ఉన్న మరో రూము. పుస్తకాలేవో పెట్టిన టేబులూ, 'హేపీ బర్త్‌డే నాన్నా' అని గట్టి కాగితం మీద ఒక మగమనిషి బొమ్మ వేసి గోడకు అతికించిన గ్రీటింగ్ కార్డూ

కనబడ్డాయి. ఆమెకు ఒక పాప అని అతడికి తెలీదు. ఆ టాపిక్ ఎందుకొస్తుంది? ఎప్పుడోసారి పాప బర్త్‌డే అని స్వీట్ ప్యాకెట్ తెచ్చి ఆఫీస్‌బాయ్ పంచాడు. స్వీట్ తీసుకుంటూ– 'ఎవరిచ్చిన్రు?' అని అడిగినట్టు గుర్తు. బాయ్ వెనక్కి ఆ మూల ఎక్కడికో చేయి చూపించాడు, వాళ్ల పెద్ద నూరు మంది పనిచేసే అసెంబ్లీలో. ఆ విధంగా ఆమె తనకో పాప ఉందని చెప్పినట్టే. తన భార్య ఏ శారీరక స్థితిలో ఉందో ఈమె కూడా అలాగే ఉండదు కదా– సాగి, ఉడుకు తగ్గి.

అది చతురస్రాకారంలో ఉన్న ఫ్లాట్. ఎటు నుంచి ఎటు వచ్చినా హాల్లోని ఫొటో కనబడుతూనే ఉంది. ఆమెతో పాటు భర్త, కూతురు. తండ్రి ఒళ్లో పాప కూర్చునుంది. తెల్లగౌను. ఆయనకు కళ్లద్దాలు. వెనుక ఆమె నిలబడి ఉంది, అతడి మీదకు కొంచెం వంగుతూ రెండు భుజాల మీద చెయ్యి వేసి. ఇంకెవరైనా అయితే ఆ ఫొటో ఎక్కడ తీసుకున్నారని అడుగుతారు, కనీసం ఇల్లంతా తిప్పి చూపించినప్పుడైనా.

ఆమె కిచెన్ వైపు నడుస్తూ, "ముందు కొంచెం టీ తాగుతారా?" అని అడిగింది. 'మరి భోజనం?' ఈమధ్య టీ పెద్దగా తాగడం లేదు, కడుపులో మంట వస్తున్నప్పటి నుంచీ. ఏదో ఒకటి ముందుకు పోవడానికి అది ఊతం అవ్వగలదు కాబట్టి, "ఆ తాగుదం" అన్నాడు. వద్దు అంటే ఆమె కారణం అడగొచ్చు. జ్యూస్ ఏదైనా చేస్తాననొచ్చు. ఏదో ఒకటి అయినప్పుడు టీయే రొమాంటిక్‌గా ఉంటుంది.

కిచెన్లోకి వెళ్లాలా లేదా అని సందేహిస్తున్నట్టుగా హాల్లో ఉన్న ఫ్రిజ్ పక్కనే నిలబడ్డాడు. పక్కనే ఉన్న స్టూల్ మీద తడకబుట్టలో కూరగాయలున్నాయి. లేత పొడవాటి సొరకాయకు గిచ్చు కనబడుతోంది. ఆ గిచ్చు లేకపోతే బాగుండు. నిమ్మకాయలు, కరివేపాకు, లేత కొత్తిమీర, ఏ వాసనల కోసం పడిచస్తాడో అవే వాసనలు. ఒక నిమ్మకాయను చేతిలోకి తీసుకున్నాడు.

పొయ్యి మీద గిన్నె పెట్టి, స్టవ్ ముట్టించి, "భయపడకండి, ఇప్పుడేం మొదలుపెట్టను." అని అతడి లోపలి ప్రశ్నకు జవాబు ఇస్తున్నట్టుగా గిన్నెలు మూత తీసి చూపించింది. వేడి పొగలు లేచాయి. సిగ్గుగా నవ్వాడు. అతడు ఆఫీస్ క్యాంటీన్లో దాదాపుగా తినడు. బర్త్ డే ట్రీట్ అని చెప్పి లంచ్ బ్యాగ్ తెచ్చుకోలేదు. ఐదేళ్లుగా చేస్తున్న ఉద్యోగం, పైగా ఏదో సంభాషణలో దొర్లుతూనే ఉంటాయి కాబట్టి చాలామంది పేర్లు అతడి భార్యకు తెలుసు. కాబట్టి ఎవరి పుట్టినరోజో చెప్పడానికి తడుముకోవలసి వచ్చింది. అన్ని ప్రశ్నలు ఎదుర్కొనే బదులు, బ్యాగ్ తెచ్చుకుంటే పోయేదనిపించింది. తర్వాత ఎవరికైనా ఇవ్వడమో, ఎక్కడైనా పడేయడమో చేస్తే పోయేది. అట్లా పడేయడానికి మనసొప్పక అబద్ధం ఆడటమే సబబుగా తోచింది.

"పంచదార ఫర్లేదు కదా? మా ఆయనకు బీపీ, షుగర్ అందుకని." తెలియకుండానే అతడి మెడ ఫొటోవైపు తిరిగింది. వీళ్లకు మాట్లాడే ఔచిత్యం తెలియదు. మనుషుల వివరాలు ఇంతగా తెలియడం మొదలుపెడితే ఉన్న రసం ఇగిరిపోతుంది. తోచిన ఆరోగ్య సలహా ఇవ్వబోయి తమాయించుకున్నాడు. ఆయనకు కూడా తనలాగే పలుచన అవుతున్న జుట్టు. కాకపోతే కళ్లద్దాలు ఎక్కువున్నాయి. పాప అచ్చం వాళ్లమ్మలాగే ఉంది, ఆమె నోట్లోంచి తీసి భూమ్మీద పెట్టినట్టుగా. ఆమె తనను భర్త లేనప్పుడు భోజనానికి ఆహ్వానించడానికి దారితీసిన కారణాలేమిటో అతడికి తెలియదు. అతడూ భార్యకు తెలియకుండా ఇక్కడికి రావటానికి ఉన్న కారణాలేమిటో చెప్పలేదు. ఆమె తన భార్య కన్నా బాగుంటుందా? ఆ కళ్లు, ఆ చూపు, కాళ్లను నిగడదన్ని నడిచే తీరు– ఉన్నపళంగా చూస్తే వెనక్కి నడవడానికి సాధన చేస్తున్నదేమో అనిపిస్తుంది. ఇంకెవరైనా అయితే నవ్వొచ్చే విషయమే. కంపెనీలో అందగత్తెలు అనదగినవాళ్లు చాలామంది ఉన్నారు. వీళ్లు అతి మేకప్తోనో, నిరాడంబరంగా ఉండటం కూడా అలంకరణలో భాగమేనన్న స్పృహతోనో చీదర పుట్టిస్తారు. సాలార్జంగ్ మ్యూజియంలో అద్భుతమైన కళాఖండాలను చూసిన కళ్లు ఒక సంతృప్త దశకు వచ్చాక, ఉత్త దీర్ఘచతురస్రాకారం చూడబుద్ధేసినట్టుగా ఆమె నచ్చింది.

"ఊళ్లో మిమ్మల్నే తలుచుకున్నాను తెలుసా? మీ మాటల్లో కొన్ని భలే పడతాయ్. దారి అనకుండా తొవ్వ అంటున్నావేంటే అంది అక్క" అని నవ్వింది.

మీరు కూడా నాకు గుర్తొచ్చారని చెబుదామనుకున్నాడు. ఎదుటివాళ్లు ఒకటి విశేషంగా చెప్పినప్పుడు, 'నాక్కూడా' అనడం ద్వారా దానిదైన ప్రత్యేకతను పోగొడుతాననిపించి మిన్నకున్నాడు.

"నాది కూడా చెడిపోయిన తెలుగే?"

"కానీ నా అంత బుకిష్గా మాట్లాడరు కదా మీరు?"

"ఊర్లో ఏదో ఫంక్షన్ అన్నారు, బాగా జరిగిందా?"

"ఏం జరగడం? చిన్న వ్రతం! అందరం కలుస్తాం కదాని పోవడం. మా నానమ్మ గుండెపోటొచ్చినంత హడావుడి పెట్టింది..."

'అయ్యో' అని అతడికి అవకాశం ఇవ్వకుండానే, "తీరా వెళ్తే కడుపుబ్బరం" అని పూర్తి చేసి, "సెలవు కోసం మా ఇన్ఛార్జ్‌కు నానా అబద్ధాలు చెప్పివెళ్తే... " అని వదిలేసింది.

ఆమె షిఫ్ట్ ఇన్చార్జ్ ఎంతోకొంత మెత్తటివాడే అని ఇతడి అభిప్రాయం. అలాంటివాడు సెలవు ఎందుకు ఇవ్వనన్నాడనే వైపు సంభాషణను తిప్పడం ఇష్టంలేక, ఆమె మాటలనే అల్లుతూ "వ్రతం చెడ్డా ఫలం దక్కలేదంటారు" అన్నాడు.

"ఫలం దక్కనప్పుడు వ్రతం చెడకపోతే బాగుండేదని..."

ఆ స్పాంటేనిటీకి ఇరువురి కళ్లూ పరస్పరం అభినందించుకున్నాయి.

అతడామెను మొదటిసారి గుర్తించేట్టుగా ఎప్పుడు చూశాడో గుర్తులేదు. ఏదో పండుగ రోజు అందరు ఆడవాళ్లు యూనిఫారాలు కాకుండా పట్టుచీరలు కట్టుకుని, ఉద్యోగినుల బూట్లు వేసుకోకుండా చెప్పులతో వచ్చారు. వాళ్ల ప్రింటర్ ఏదో చెడిపోతే తన సీటు సమీపంలో ఉండే మరో ప్రింటర్ దగ్గరికి వచ్చినప్పుడు, తెలియకుండానే ఆమె పాదాల వైపు చూశాడు. రెప్పపాటులో జరిగిపోయిందంతే. మట్టెల కోసం అతడి చూపు వెతికిందని ఆమె నవ్వుకుంది. ఆడవాళ్లు ఇట్టే పసిగట్టేస్తారు. ఇద్దరి మధ్యా తెలియని కెమిస్ట్రీకి రూపం పోయడానికి ఈ సన్నివేశం కారణమైంది.

"ఇంకో రోజుండాలి. మూడ్ పోయింది. పైగా ఈ సాయంత్రం వన్ నాట్ టూలో బర్త్ డే పార్టీ ఉంది. అసలే మా బుజ్జిపార్టీకి వొచ్చారు వాళ్లు. వరుసగా మూడ్రోజులైతే ఈఎల్ పెట్టేసుకోవచ్చు కదా అని ఇంట్లోనే ఉండిపోయాను... పైగా సారును భోజనానికి పిలవొచ్చు కదా అని".

'మరో బర్త్ డే' అనుకుని, "నేను తెమ్మన్నది తెచ్చిన్రా?" అని అడిగాడు.

ఏంటన్నట్టుగా ముఖం పెట్టింది.

"మీ ఊరి గాలి."

అతడిని అనుకరిస్తూ, "ఓ అదా, తెచ్చిన" అని, చిన్నపిల్లలా ముక్కు కొసను లేపి చూపించింది.

ఇప్పుడా ప్రాణవాయువును ముక్కురంధ్రాల్లోంచి పంపుకోవడానికి వీలుగా అతడు కిచెన్లోకి వెళ్తాడు. ఆమె శ్వాస వదులుతుంది, అతడు పీల్చుకుంటాడు. ముక్కుల రాపిడిలో, శ్వాసల బదలాయింపులో ఒక ఉరవడి వస్తుంది, పెదవులను అందుకోవడానికి. నెమ్మదిగా ఒంటిని చుట్టుకొని, పొయ్యి మీద టీలా మసిలి, పొంగి...

కప్పుల్లోకి టీ వడగట్టి, అతడు తన వెంట వస్తుంటాడన్న స్పృహతో ముందుకు నడిచింది. ఆమెను అనుసరించడానికి అనువుగా పాదాల దిశను మార్చి, మరోసారి పీల్చుకోవడానికి నిమ్మకాయను చేతిలోకి తీసుకుని, 'ఇదింత పెద్దగుందా?' అనుకున్నాడు. సోఫా వైపు నడుస్తూ తెలియకుండానే గోడవైపు చూశాడు. ఫొటో ఏదో గుడి దగ్గర తీసినదై ఉండాలి. వెనక కొంత చెరువు కూడా కనబడుతోంది. అతడి చేతికి కప్పు ఇచ్చి, తన కప్పును సోఫా అంచు మీద పెట్టుకుని, విరామంగా, ఆ క్షణాన్ని ఒక డిఫైనింగ్ మూమెంట్‌కు ముందులాగా ఆస్వాదించే వీలుగా "ఇంకా" అంది, తన గాలి జవాబుకు తదుపరి స్పందనేదో ఆశిస్తున్నట్టు, అతడిని తియ్యగా ఇబ్బంది పెట్టడంలో ఏదో చిన్నపాటి ఆనందం ఉన్నట్టు.

ఉద్యోగరీత్యా రెండు మూడు సార్లు అతడితో ఫోన్లో మాట్లాడినప్పుడు ఆమె నంబర్ సేవ్ చేసుకోలేదు. ఆమెకు తను కూడా చేయాల్సిన సందర్భాలు తటస్థించినప్పుడు పేరు ఫీడ్ చేసుకున్నాడు. ఎప్పుడైనా ఆమె నుంచి రింగ్ అవగానే ఆమెనే చేతిలోకి తీసుకుంటున్నంత కంపనం పుట్టేది. కొన్ని సంభాషణల కొనసాగింపుగా ఆగిన ఒక సంభాషణ ఫలితంగా, ఇంక ఇది ఎట్లైనా దారితీయగలదేమో అని స్ఫురణ కలిగి, ఆమె పేరు మార్చి 'విజయ్' అని పెట్టుకున్నాడు, భార్యకు తెలియొద్దని. అదే ఎందుకో చెప్పలేదు. అది ఆమె భర్త పేరు అయినా చేయగలిగింది లేదు. తీరా పేరు మార్చిన తర్వాత వచ్చిన పొద్దుటి మెసేజ్ అతడిని చేయాల్సినంత ఉద్వేగానికి గురి చేయలేదు. అది ఇంకెవరిదో అనిపించింది. అసలైన పేరు పెట్టుకోకుండా ఆ క్షణాల సాంద్రతను కోల్పోయినందుకు తిట్టుకున్నాడు.

"మీరు కవిత్వం ఏదో రాస్తారంట."

స్త్రీ కేంద్రంగా ఏవో రాయాలని అతడి ప్రయత్నం. స్త్రీ ఒక స్థిరపరుచుకోగలిగే అభిప్రాయం కాదు. ఆమెను పట్టుకోవడానికి శక్తీ చాలడం లేదు, దాన్ని కవిత్వం అనగలిగే ధైర్యమూ లేదు. అయినా తను బతికే వాతావరణంలో 'ఏదో రాస్తారంట' అనడం కూడా దానికదే ప్రశంస కిందే లెక్క. దాన్ని నేరుగా స్వీకరించడానికి తడబడి, గోడవైపు వేలెత్తి, "ఆ ఫొటో ఎక్కడ దిగింది?" అని అడిగాడు. ఏది అన్నట్టుగా తలతిప్పి, "అదా... ఇక్కడే..." ఆమె భర్త నీలంరంగు ప్యాంటు వేసుకున్నాడు. పాదాలకు ఉన్న బ్రౌన్ కలర్ షూ ఈ సోఫా మీదే కూర్చుని వేసుకునుండవచ్చు. కాటన్ది అవడం వల్ల కావొచ్చు, వైట్ హాఫ్ షర్టుకు కుడిచేయివైపు ఇస్త్రీ మడత లేచినట్టుగా కనబడుతోంది. పాప గౌను తెలుపుకూ, తండ్రి చొక్కా తెలుపుకూ తేడా పోల్చుకుంటున్నాడు...

అప్పటికి సాయంత్రం చాయ్ తాగారు. 'నేను అన్నతోటి పొలంకాడికి పోతున్నా' అని ఇంట్లోకి కేకేసింది. 'ఈ మాపటిజాముల ఎందుకే' అన్న వాళ్ల నాన్న అరుపును పట్టించుకోకుండా బయల్దేరింది. హాస్టల్లో పెరగడం వల్ల కొన్ని బంధుత్వాలు వెంటనే అతడు పోల్చుకోలేడు. ఏ వరుసలో తను అన్నయ్యో ఆలోచిస్తూ చేయి అందించాడు. కోమలచర్మపు స్పర్శ. తెల్లరంగు జాకెట్టు, నీలంరంగు పొట్టి లంగా వేసుకుంది. అక్క ఎంగేజ్మెంట్ ఫంక్షన్ ఉంటే బంధువులంతా వచ్చారు. అక్క తర్వాత అతడి పెళ్లి ఎంత కాలానికి అన్న చర్చలు లేవనెత్తిన అత్తలు అతడి కౌమారానికి చక్కిలిగింతలు పెట్టారు. మధ్యాహ్నం భోజనంతో కార్యక్రమం ముగిసింది. తిరిగి వెళ్లినవాళ్లు పోగా కొందరు మాత్రం రాత్రికి ఉండిపోయారు.

ఎంతో ఉత్సాహంతో అడుగులు వేసుకుంటూ వచ్చింది కాస్తా, ఆ ఎత్తయిన పత్తిచెట్లలో మునిగిపోయి జడుసుకుని, వెనక్కి పోదామని గొడవ పెట్టింది. ధైర్యం చెబుతూ మెల్లిగా తీసుకెళ్లాడు. ఒడ్డు మీద పచ్చి గరిక ఉన్న చోటు చూస్తూ కూర్చున్నాడు. లంగాను మోకాలి దాకా ముందుకు లాక్కుని అతడికి ఆనుకుని కూర్చుంది. ఎదురుగా గుట్ట మీద పొద్దు గుంకుతోంది. సీతాకోకచిలుకలు ఆడుతున్నాయి. దూరంగా ఆవుల మంద, మేత నుంచి తిరిగి వస్తోంది. 'నువ్వు ఎన్నోది జదువుతున్నవే?' చేతివేళ్లు అతడి కళ్ల ముందు ఆడించింది. పలుచటి పసుపురంగు ముఖం, సన్నటి ముక్కుపుటాలు, వెలిగే కళ్లు, కొత్తగా మొగ్గ తొడుగుతున్న ముందు చర్మం, చిన్నపిల్ల అనుకోలేనంత బలమైన జడ. చల్లటి గాలి వీస్తోంది. నియంత్రణలోకి తెచ్చుకుంటున్నట్టుగా జడను ముందుకు వేసుకుని, అతడి కుడిభుజాన్ని రెండు చేతులతో బిగించి పట్టుకుని వెనక్కీ ముందుకూ ఊగసాగింది, అమిత సంతోషాన్ని అనుభవిస్తున్నట్టుగా. 'గాలి ఇంత మంచిగొస్తుంటే రాళ్లను కూడా కొరికి తినబుద్ధయితది కదన్నా.' పొట్టిలంగా అంచుల్లోని కాళ్లు కొత్త  మెరుపును సంతరించుకుంటున్నాయి. మెడకింద వెన్నురేఖ మొదలయ్యే తెల్లటి వంపు కనబడుతోంది. జడలోకి ఇమడకుండా మిగిలిన మెడ కింది రేగిన జుట్టును కుడి బొటనవేలితో లేపి వదిలాడు. చక్కిలిగిలి పెట్టినట్టయి నడుమును ముందుకు వంచుకుంటూ జడను వెనక్కి వేసుకుంది. నవజీవంతో తొణికిసలాడుతున్న ప్రాణి. ఆ క్షణంలో కామరూపంలో ఉన్న యువతిలాగా తోచింది. 'నాకు నిన్ను కొరికి తినబుద్ధయితుందే' అంటూ ఎత్తి ఒళ్లో కూర్చోబెట్టుకున్నాడు. పారిజాత పువ్వు వాసన. మామూలుగా కూర్చోబెట్టుకోవడమే. కానీ ఆ తేడా ఏదో స్త్రీ జన్మకు తెలిసిపోతుంది. 'నేను ఇంటికి పోతా' అంటూ చటుక్కున లేచింది. వస్తున్నప్పుడు పత్తిచాళ్లలో మునిగి భయపడింది, చిటచిటా నడవసాగింది.

అతడు ఇంటికి భయంభయంగానే పోయాడు. అప్పటికి రాత్రి భోజనాలు వండుతున్నారు. ఎప్పుడు ఎవరు పిలుస్తారో అని ప్రాణం మీద తిరిగాడు. భోజనాలయ్యాక కొందరు పత్తాలు ఆడుకుంటూ కూర్చున్నారు, కొందరు చలిమంట కాగారు. వాళ్ల నాన్న ఎదురైనప్పుడు తల ఎక్కడో పెట్టుకున్నట్టు అనిపించింది. తెల్లారి అంతా వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు. మాట్లాడుకున్న జీపు వచ్చింది. అందరితో పాటు ఎక్కింది. అతడి వైపు ముఖమే తిప్పలేదు. టాటా చెప్పడానికి కూడా సరిగ్గా ఒక అర్ధవృత్తం మేరకు సరిపోయేలా రెప్పలు పైకెత్తి, రవ్వంత చూపు ముందుకు జరిపినా అతడు అక్కడ ఉంటాడన్న స్పృహతో చూపు కొలతను నిర్దేశించుకుని మరీ చేయి ఊపింది.

మళ్లీ వాళ్ల ఊరికి చాలా ఏళ్లదాకా రాలేదు, తెగేసినట్టు. ఇద్దరి మధ్య ఉన్న

ఒక సున్నితమైన హద్దు చెరిగిపోయింది. రహస్యం ఏదో బయటపెట్టుకున్నట్టు అయిపోయింది. జీవితాలు సమాంతరంగా నడుస్తూనే ఉన్నాయి. ఏవో సందర్భాల్లో విధిగా ఎదుర్కోవాల్సి వస్తూనే ఉంది. కానీ మనసుల్లోకి పారదర్శకంగా ప్రవేశించుకోగలిగేదేదో లేకుండా పోయింది. ఇద్దరే మిగిలిపోవాల్సి వచ్చిన ప్రతిసారీ ఆమెను ఎదుర్కోలేక మూడో మనిషి కోసం వెతుక్కుంటాడు. దోమలను ఎవరైనా బ్యాటుతో పటపటమని చంపుతూవుంటే పుట్టే వెగటు వాసనలాంటిదేదో కడుపులోకి చొచ్చింది.

హాస్టల్లో ఉన్నప్పుడు మంచి ఆకలి మీద డైనింగ్ హాల్‌కు వెళ్లేవాడు. ఒక్కోసారి అన్నంలో లక్కపురుగు కనబడేది, కాళ్లు ముడుచుకుపోయి. ఆ మొత్తం అన్నం మీద అంత చిన్న పురుగు వికారం పుట్టించేది. పడెయ్యడానికి పోతే వార్డెన్ ఆపేవాడు. చెప్పే కారణం ఆయనకు నవ్వు తెప్పించేది. 'ఇంతమందికి లేని ఇబ్బంది నీ ఒక్కడికే ఎందుకయితుందిరా? తీసేసి తిన్లేవా?' ఇతడు అట్లాగే గుడ్లప్పగించి కదలకుండా నిలబడేవాడు. తమాషా స్థాయిని దాటాక, ఆయన నవ్వు ముఖం తొలగిపోయి, 'ఛీ పో' అని కసురుకునేవాడు. ఒకటే ఉరుకు.

"అంతేం ఆలోచిస్తున్నారు?"

జడంగా నవ్వాడు. కళ్లు కలపకుండా టీ కప్పు చేతికి ఇచ్చాడు. తీసుకుని కిచెన్లోకి వెళ్లింది. వెంటనే వచ్చేయలేదు. కప్పులు కడుగుతున్న చప్పుడు, తర్వాతైనా తనే కడుక్కోవాలి అన్నట్టుగా. ఈ క్షణాల విలువను అంచనా వేయలేని అశక్తురాలా?

అతడి మొబైల్ రెండు రింగులు వచ్చి కట్ అయింది. టైమ్ చూసుకున్నాడు. తనే కాల్‌బ్యాక్ చేయాలి. రోజూ రెండు, రెండుంపావుకు ఫోన్ వస్తుంది. 'తిన్నవా?' ఏడేళ్ల కాపురంలో తెలియకుండానే ఒక క్రమం అలవాటైపోయింది. కూర ఈరోజు బాగుందనో, కారం ఎక్కువైందనో చెబుతాడు. సాయంత్రం వచ్చేటప్పుడు, రైతుబజార్లో ఇరవై రూపాయలకు అద్ద కిలో చిక్కుడుగాయ, పదిరూపాయలకు ఐదు మెంతెం కట్టలు ఇస్తారు తెమ్మంటుంది. పని ఒత్తిడిలో లేకపోతే, 'పిల్లికి ఆ పేరు ఎవరు పెట్టింద్రు? మనకు చలివెడితే వేడినీళ్లతో స్నానం చేయాలని ఎవరు చెప్పింద్రు? ఉత్తరం, దక్షిణం ఇందులో ఏది నీకు ఎక్కువ అనబుద్ధవుతుంది నానా?' అని పొద్దున చిన్నోడు అన్న విషయాల్ని అపురూపంగా గుర్తు చేసుకుంటారు. ఇంకా టైముంటే, కాలనీలో తెల్లకుక్కతో ఎదురయ్యే దొడ్డుటమ్మాయికి సంబంధం కుదిరిందనో, లేదా ఇదివరకే ఆమె పెళ్లయి భర్త ఏ విదేశంలోనో ఉన్నాడనో చెప్పుకుంటారు. వీటన్నింటితోపాటు ఈ రోజు అదనంగా బర్త్‌డే విషయాలు చెప్పాలి. ('సారీవే, నీతోటి అబద్ధం చెప్పిన. పార్టీ అంతా ఉత్తదే, ఒకామె పిలిస్తే లంచ్‌కొచ్చిన.' 'నీ పేచుకు నిన్ను కూడా లంచ్‌కు పిలుస్తున్నారా?')

ఇవేవీ లేకుండా, గోడగడియారం సెల్ తెమ్మంటే ఎందుకు మరిచిపోయావని దెప్పడం ఉండొచ్చు. పొద్దున బాత్రూములో కుంకుడుకాయలు తట్టుకుని నీళ్లుపోకపోవడం గురించి వల్లించుకోవడం ఉండొచ్చు. పాసుబుక్కు కోసం మీ–సేవలో ఆ వేలిముద్రలేవో ఇవ్వడానికి తాత్సారం ఎందుకు చేస్తున్నావని నిలదీయడం ఉండొచ్చు. చిన్న విషయాన్ని, అది ఎంత పట్టించుకోనక్కరలేనిదైనా సరే చించి పెద్దది చేయగలిగే నేర్పు వీళ్లకు ఎలా వచ్చిందో అర్థం కాదు. పని మానుకుని దీని గురించి ఆలోచించడానికి శక్తిని ఖర్చు చేయాలి. బీపీ పెరుగుతుంది, శ్వాస మందగిస్తుంది. పారిజాత పువ్వులు కాస్తా పారిజాత ఆకుల్లా మారిపోతారు. సమస్య చెబుతారు, పరిష్కారం ఆశించరు. అయినా ఎంతో ముఖ్యమైనదన్నట్టుగా వినాలి. అలాగని వినడమే చాలన్నట్టుగా ఉండకూడదు, పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్టు కనబడాలి, మళ్లీ ప్రయత్నించడం ఉత్తిదే అని తెలియకూడదు. ఏమి డ్రామారా భగవంతుడా! ఈ జిడ్డుముఖపు ప్రాణులు కూడా ఆలోచించదగినదిగా కనబడటమే విడ్డూరం. మళ్లీ, గుత్తొంకాయ కూర ఫొటో పంపి రెస్పాన్స్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంటారు. ఎందుకింత ఎమోషనల్గా డిపెండ్ అవుతారు వీళ్లు? ఈ వగలాడులు ఎందుకు వశం చేసుకోవాలి? ఎందుకు పశ్చాత్తాపానికి గురి చేయాలి? సూర్యోదయానికి ఎదురుగా నిలబడి కళ్లుమూసుకున్నప్పుడు కదలాడే రకరకాల వర్ణచిత్రాలు.

ఆమె తిరిగి వచ్చేప్పటికి అతడు అరచేతుల్తో కనురెప్పల్ని రుద్దుకుంటున్నాడు. కాసేపు మౌనంగా ఆగి చూసింది. “తిందామా, ఆకలౌతోందా?”

తలెత్తి చెప్పాడు: “అదే, పోవాలిగదా ఆఫీస్కు.”

ఫోన్ ఎక్కడుందో కళ్లతో వెతుకుతూ అంది: “అదదే శ్రీధర్ రావాలని చూస్తున్నా.”

దవడలు చిన్నగా బిగుసుకున్నాయి. ‘చెప్పనేలేదే.’ అంత కవ్వించినట్టుగా కనబడిన తీరుకు ఆ ముగింపు నిరాశపరిచేది. కానీ ఆ క్షణంలో ఏదో బరువు తొలగినట్టయి తేలికపడ్డాడు. సోఫాలోంచి లేచి, ముందు డోర్ వైపు నడిచాడు. ఆమె కంగారుగా అడిగింది: “ఏమైంది, ఏమైనా అయిందా?”

“అదేం లేదు, షూ బయట విడుద్దామని.”

“ఫర్లేదు ఉండనీయండి. చేతులెందుకు పాడు చేసుకుంటారు తినేముందు?”

అయినా వినకుండా షూ బయటకు పట్టుకెళ్లి, గోడ పొంట నీటుగా పెట్టాడు. కాల్బ్యాక్ చేశాడు.

“పార్టీ మంచిగ జరిగిందా పటేలా?”

"ఇప్పుడే కిందికి దిగుతున్నం."

"ఎంతమందేంది?"

"ఐదారుగురం ఉన్నం. హరీషు, భాస్కరు, మధు... శ్రావణి..."

"ఆమెందుకొచ్చింది, మీ సెక్షన్ కాదేమో?"

"నాకేం తెలుసు? వాడు రమేషుగాడు పిలిచిండు."

"సరేగనీ శ్రావణి అనేటప్పుడు నోరంత చక్కెర పోసుకున్నట్టు వస్తుందేంది మాట?"

"నీ మొఖం తియ్యి."

"అవుగనీ లేటైతదా సాయంత్రం?"

"ఏంది, ఏమన్న విశేషమా?"

"గంజప్ప వోసుకుంటున్నం. నువ్వు తొందరగ రాకపోతే నేనూ చిన్నోడూ పొతం బట్టిస్తం."

గాలి నిండుగా పీల్చుకున్నాడు. ఆలోచనను తిరిగి దారి మళ్లించాడు. తమాషాగా తలుపు తట్టాడు. ఇంతలోనే ఎవరొచ్చారన్నట్టుగా ఆమె తలుపు తెరిచింది. ఓరగా చూశాడు. ఆమె కంగారుగా సిగ్గుపడి, తోవ ఇస్తున్నట్టుగా వెనక్కి జరిగింది. లోపలికి వస్తూనే గోడకు వేలాడదీసిన పెద్ద ఫొటో అతడి కంటబడింది. ముగ్గురు ఉన్నారందులో. ఆమెతో పాటు ఆమె భర్త, ఆమె కూతురు. తండ్రి ఒళ్లో పాప కూర్చునుంది. వెనుక ఆమె నిలబడి ఉంది, అతడి మీదకు కొంచెం వంగుతూ రెండు భుజాల మీద చెయ్యి వేసి. ఆమెను చుట్టుకొని ఇంకో ప్రపంచం ఉంటుందన్న ఉనికికి తొలిసారి మేల్కొంటున్నట్టుగా అలాగే నిలబడి చూస్తూ వున్నాడు. ఏదో గుడి దగ్గర తీసిన ఫొటో. వెనక చెరువు కూడా కనబడుతోంది. ఇదెక్కడ దిగారని అడగబోయినవాడల్లా, ఫొటో బ్యాక్‌గ్రౌండ్లోకి చూపును ఆనించి అడిగాడు: "వెనకేంటి హంసల్లా ఉన్నాయి?"

"హంసలా? హంసలు ఉండవంటారు కదా?"

"అవి హంసలే అయివుండాలి. వాష్రూమ్?"

"అయ్యో, అటు వెళ్లండి" అంటూ చేయి చూపించింది.

టాయ్లెట్ నీట్‌గా ఉంది. కాకపోతే విడిచిన బట్టలు కొన్ని కడ్డీ మీద వేలాడుతున్నాయి. నైటీ, తువ్వాల, ఆడమనిషి లోదుస్తులు, డ్రాయరు అడుగున గట్టిపడినట్టుగా ఉన్న లేత పసుపురంగు మచ్చ. గాఢమైన సృష్టిస్రావపు వాసన. ఏ పరిచయంతో నిమిత్తం లేకుండానే ఐక్యం పొందగలిగేదేదో, ఎప్పటికీ

మాట్లాడకపోయినా పంచుకోగలిగే ఉమ్మడితనమేదో శ్రావణికీ తనకూ మధ్య ఉండగలిగితే బాగుండనిపించింది. పాదాలు పూర్తిగా ఆనించి ఒంటిని ఖాళీ చేసుకునేందుకు ప్రయత్నించాడు.

# థనియావర్తనం




## రిషి శ్రీనివాస్

తెలుగు కథల్లో కట్టు తప్పని కథనాలను సాధన చేస్తున్న రచయిత. స్వస్థలం విజయనగరం. పుట్టింది 1989లో. బి.టెక్ చదివి ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో టీమ్ లీడర్‌గా పని చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా కథలు రాస్తూ కొత్తతరం కథకుల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పటికి 15 కథలు వెలువడ్డాయి. 'క్రౌంచ కంఠం', 'అడగని ప్రశ్న', 'ప్రవాసం' కథలు గుర్తింపు పొందాయి.

నివాసం : హైదరాబాద్.

మొబైల్ : 76808 21010

వాళ్ళ అపార్ట్‌మెంట్లో అందరి వంటిళ్ళలోనూ కుందేళ్ళున్నాయి... ఒక్క ఆమె ఇంట్లో తప్ప!

ఆమెకు ఎందుకో కుందేలు నచ్చలేదు. అందుకే పెంచలేదు.

కుందేలును పెంచకపోవడం అభ్యుదయమనుకుంటుంది.

అభ్యుదయమా వల్లకాడా తెంపరితనం కాకపోతేనూ... అని ఎవరెవరో అనుకుంటారు. ఆమె మాత్రం చలించదు.

ఆవిడ పేరు ఏ (వే. ఉలేయ్. ఉసేయ్.)

అతనికి కోపంగా ఉంటే లంజ ముండ.

అదే ఆవిడ పేరు బుజ్జి వాళ్ళమ్మ. లేదా చంటిగాడి అమ్మ. ఫలానా ఇంటి పేరు వారి కోడలు. అందరికీ సౌకర్యంగా ఆంటీ. సహస్రనామ తత్తుల్యం.

పోనీ ఏదో ఒక ఉద్యోగం చేస్తే తనకంటూ ఓ పేరు ఉంటుంది కదా అనుకుని ఆమె ఉద్యోగంలో చేరితే అక్కడ ఇంతకన్నా గొప్ప పేర్లే దొరికాయి. హిందీ వాళ్ళకి రండీ, కుర్రాళ్ళకి పాప, వెధవలకు స్లట్... పోష్ వెధవలకు బిచ్.

ఆమె నడిచే తోలు తిత్తి. ఎన్ని సేర్ల మాంసం ఎక్కడెక్కడ పొదుగుకుందో ఎందరైనా చూడనీ... వెతికే కళ్ళు నిర్బంధించుకున్న పరిమితుల గిరిలో ఇముడుతానా లేదా అన్న ఇంగితం లేకుండా షంషేర్‌గా తిరుగుతుంది.

ఆమె పదేళ్ళ వయసులో బాబాయ్ వరసయ్యే వ్యక్తి తన ఒళ్ళో కూర్చొనబెట్టుకుని తడిమినప్పుడు మొదటిసారి చనిపోయింది.

చనిపోవడమే తడవుగా మళ్ళీ పుట్టింది ఇక్కడేదో ఉద్ధరించే పని ఉందని. అది మొదలు ఆమె నిత్యం చనిపోతుంది.

మళ్ళీ అవసరంగా పుడుతుంది.

ఆమెను చంపడానికి పెద్ద పెద్ద కత్తులో బరిసెలో అక్కర్లేదు....

ఇది నా అరచేతిలో పడుతుందా అని ఆమె మెడ మీద నుంచి మూడించీలు కిందకు జారే చూపులు చాలు. షేర్ ఆటోలో పక్కన కూర్చున్నప్పుడు అప్రయత్నంగా తగిలించినట్టు డొక్కలో నిమిరే మీసం మొలిచిన మోచెయ్యో, గ్లుటెల్ మజిల్ దొరికినా ఇంజక్షన్ చేసే నెపంతో పిర్రంతా కనిపించేలా పేంట్ కిందకి లాగిన డాక్టర్ వేలో, కిరాణా తెచ్చుకునేందుకు వెళ్తున్నప్పుడు వినబడే కారుకూతో...

ఇలా ఏదో ఒకటి చాలు. చిన్నది.

చనిపోయిన ప్రతిసారి పార్సీగుట్ట బావిలో శవాలను పోగేసినట్టు తనలో తానే తన విగత గతాన్ని పూడ్చుకుంటూ మళ్ళీ పుడుతుంది... ఈసారి మరింత రాటుదేలి!

పోనీ శవాలే కదా అని అతడు ఊరుకోడు. అక్కరకొచ్చినప్పుడల్లా ఒక్కో శవాన్ని బైటకి లాగి పోస్ట్‌మార్టం చేస్తాడు.

శవమే కదా నొప్పుండదులే అని ఎనస్థీషియా కూడా ఇవ్వడు.

కానీ అది విల విలలాడుతుంది.

రాణీ రంగు పిట్టల్ని నీట్లో వేసి అవి గిలగిలలాడితే చూసి చప్పట్లు చరిచే చిన్న పిల్లాడి పైశాచికత్వం అతడిది.

ఆ రోజు ఆమె మార్చురీలో ఉన్న తన కన్నెనాటి శవమున్న ట్రే బయటకి లాగాడు.

“నీకు నన్ను చేసుకోవడం ఇష్టంలేదు కదా... నువ్వు ప్రేమించినోడితో మీ నాన్న పెళ్ళి చెయ్యకపోతే గతిలేక నన్ను చేసుకున్నావ్ కదా...” కన్నె శవానికి ఇంకా ఏం అవ్వలేదు.

ఇష్టమైనవాడ్ని వదులుకున్నప్పుడు వాడు హక్కుగా లాక్కున్నది ముద్దే కాదు ఊపిరి కూడా.

వాడితో వెళ్ళిపోయిన ఊపిరిని పట్టించుకోకుండా వెంటిలేటర్ పెట్టి వేదికనెక్కించారు.

"నిజం చెప్పవే శోభనం వాడితో పెళ్ళి నాతో" నెమ్మదిగా ఛిసెల్‌తో యూ షేప్డ్ ఇన్సిషన్‌గా చర్మం చీరే అనుభవం శవానిది. నొప్పి తనది. అర్థం చేసుకునే అర్థంతో నడిచే త్రోవ పుణ్యాత్ములకు తప్ప దొరకని కులశేఖర పడి.

వాడే మరో రూపంలో ఆఫీస్‌లో ఉంటాడు. సూట్ వేసుకుని.

పనికి వచ్చే కుందేళ్ళన్నీ పనికొచ్చే కుందేళ్ళనుకుంటాడు. దువ్వే ప్రయత్నం చేస్తాడు.

లేదా చెవులు పట్టుకుని పైకి లేపుతాడు.

ఆమె కుందేలు కాదని అతనికి తెలియదు. ఆమెలో ఏ స్పోర్ట్స్ సెలక్షన్స్ కోసమో వెళ్ళినప్పుడు పి.ఈ.టి చంపేస్తే చనిపోయిన క్రీడాకారిణి బాడీ మరలా పుడుతుంది. నొప్పిని భరించడానికే సుమా !

ఇలాంటి వాళ్ళతో పని చేసేదేంటిలెమ్మని ఉద్యోగం మానేసింది.

ఆమెకు భరతనాట్యం తెలుసు.

మనుషులందరి నడుములు ఒక ప్లేన్‌లో ఉన్నాయనుకుంటే అంతకు కొన్ని ఇంచీలు కిందకు దించి ఆడించే ఆ కళంటే గౌరవం. ఎనో ఏళ్ళగా అరికాళ్ళ కింద తొక్కి పెట్టుకున్న వేధింపులు, మొహమాటాలు, అవమానాలు, హేళనలు ఇత్తడి పళ్ళెపు అంచులపైకెక్కించి నెత్తుటి చారలు కట్టించే కూచిపూడి కూడా నేర్చుకుందామనుకుంది గానీ కుదర్లేదు.

డాన్స్ కోచింగ్ సెంటర్ పెట్టింది.

కొందరు శ్రద్ధగా నేర్చుకునేవారు. కొందరు కొన్నిరోజులకే మానేసేవారు.

ఆసక్తి లేక మానేసిన వారి పట్ల పట్టింపు లేదు ఆమెకు. కానీ కొందరు రాలేమని జీరగా చెప్పే ఆంగికంలో వారు తమ అంతరంగాన్ని దాచలేకపోయినప్పుడు ఆమె ఎంత గొప్ప గురువో ఆమెకు తెలిసేది.

అలాంటి వారు క్లాస్ మానేసే ఆఖరిరోజు వారి ముఖాలను ట్రేల్లో ఊహించుకుని బాధపడేది.

వారి నిస్సహాయతని చేతకానితనంగా కట్టి భూతకాలంలోకి ట్రిప్ అయ్యి శుశృతుడి జమానా పనిముట్లతో ఎముకలు గుండ చేసే ఆటవిక చేతులు గుర్తొచ్చి ఒకింత గగుర్పాటుకు గురయ్యేది.

ముప్పై రెండేళ్ళగా పగిలిన పాదాలతో దస్కత్ బరుకుతూ గీదరపెడుతూ ఆమె పైనుంచి నడిచెళ్ళిపోయిన కాలపు మరకలు విచిత్రంగా ఆమె చర్మాన్ని సాపుదీసాయి. నాట్యమాడేవేళ నట్టువాంగం శృతులన్నీ ఆ చర్మపు నునుపుతో రిసొనేట్ అయ్యేవి.

అతడికిది తైతక్కలాట. ఏగాణీకి కొరగాని ఛాందసం చట్టుబండల పాలీగమీ.

ఆమెకది అభ్యాసం... అవమానాలను ఎండ్యూర్ చేసే మనోస్థితి... కూసువిద్య. ముదితల్ నేర్వగరాని విద్యగలదె? కానీ ముద్దార నేర్పించెడి విభులెవ్వరు... అందరూ ముద్దాడాలని చూసే వెధవలైతే!

“మానెయ్యి”

మానేసి?

“ఇంట్లో కూర్చో. వంటింటికో కుందేలు కొనిస్తాను పెంచుకో.” ఆమె నిరాకరించింది. అతడు డిసెక్ట్ చెయ్యబోయేది ఏ జ్ఞాపకాన్నోనని ఆలోచిస్తూ తనను తాను సంసిద్ధపరుచుకుంటుండగా అటువంటి ప్రయత్నమేమీ చెయ్యకుండా వెళ్ళిపోయాడతను.

అప్పుడప్పుడు అతను కూడా మంచివాడేమోనని అనుమానపడుతుంది. కొన్ని నిజాలు నిష్టూరంగా ఉండవనుకుని నవ్వుకోడం మినహా చేసేదేముంది ?

మంచివాడేమోనేంటి? మంచివాడే. కానీ అది సబ్జెక్టివ్ మంచితనం.

ఒక ప్రవృత్తేంటంటే ఆమె సౌకుమార్యపు మనోఫలకపు బుల్స్ ఐకి గురిపెట్టి వదిలే పరుష పురుష పదాల డార్ట్స్‌ని గొప్ప లాఘవంగా విసరగలడు. అంతే... అంతకుమించి ఎంచడానికేం లేదు. బండికున్న రెండు చక్రాల్లో ఒకటి గుంతలో దిగినప్పుడు సహచరి చక్రంపై బురద తుళ్లదా? ఇదీ అలాంటి బండి ప్రయాణమే! వారిద్దరూ తొమ్మిదేళ్ళుగా చేస్తున్న యాత్రలో ఎక్కువ సార్లు రొంపిలోకి దిగింది అతడి చక్రమే.

ఇక  మిగిలింది థనియావర్తనం... సోలో పెర్ఫార్మెన్స్.

బృంద గతులలో పెప్ లేదు. అరంగేట్రం చేసి ఒక్కర్తే గోడు వెళ్లబోసుకోవడం మజా.

కొందరు చూసారు. ప్రోగ్రాంస్ ఇవ్వమని అడిగారు.

పరపతి పెరిగింది. నేర్పమని అడిగేవారి తాకిడి పెరిగింది. అవకాశాలు బాగానే ఉన్నాయి... ఒళ్ళు తగ్గితే ఇంకా అవకాశాలు రావొచ్చునన్నారు. అదొక యజ్ఞంలా నోరు కట్టుకోవడం ఒళ్ళు తగ్గించుకోడం అనవసరమని భావించింది.

తెలియకుండానే పెరిగిపోయింది.

గజ కైవారం.

స్టేజ్ గట్టిగా ఉందా? అని గేలి చేసిన కేతిగాళ్ళ కేకల మధ్య యతిరాజు కైంకర్యాలు కిక్కురనుకుండా మిన్నకున్నాయి.

"ఇప్పుడేంటి?"

రాత.

"అదే నీ తలరాతేంటి?"

రచన అంటే అర్థమౌతుందా?

మీరేం రాస్తారు? అబ్బో వంటింటి కథలు.

అటోప్సీ స్పెసిమన్స్ భ్రమరల తేనెతుట్టె కదిలింది.

సలపరింత.

నొప్పి అలవాటైపోయింది ఆమెకు. ఆమె ఏం రాసినా వాడు నవ్వుతాడు.

సాధికారతా? లిబరేషనా? ఇంకేం కావాల్ట? రిజర్వేషన్లిచ్చాం... పురాణాల్లో శిఖరస్థానం ఇచ్చాం... అంతేనా... కడగండ్లిచ్చాం... ఇస్తినమ్మా వాయినం పుచ్చుకున్నాక పుచ్చిపోయెనమ్మా వాయినం.

ఏంటి ఈమె? నచ్చిన బట్టలేసుకోవచ్చునంటుంది! నచ్చింది తినవచ్చునంటుంది! నచ్చినట్లు అనుగమించొచ్చట... రమించొచ్చట! ఈమె భూతభవిష్యత్ వర్తమానాలేమిటి? అదా చరిత్ర!

సోహం సోహమటంచు తత్వమసి... తిరుగుంపడి నడకదారి నిశి... తమోనుసి...

అంతవరకు బాగానే ఉంది...

దేవుని జోలికొచ్చింది. రుద్రాళిక నయనజ్వాలిక... కలకత్తా కాళిక నాలిక కావాలోయ్ నవకవనానికి!

ఈ జంబూక వనం నవకవనాన్ని వింటుందా? చాలామంది ప్రయత్నించి చెయ్యలేకపోయిన పని... ఆమె నోరుమూయించడం. తర్కం చెయ్యలేని పని

తూటా చేస్తుందని ఆమెకు తెలుసు. వెరపు లేదు ఆమెకు. చిన్నప్పటి నుండీ చచ్చే ప్రాణమే. కొత్తగా ఇంకో ట్రే చేరుతుంది. అంతేగా! ఆ తెగువ ఆమెకు అనుచరగణాన్ని సంపాదించి పెట్టింది.

ఇంకా రాసింది. విచ్చుకత్తులు కక్కే పాళీ... పుటలపై నెత్తుటేర్లను కాలువ కట్టించింది.

బుజ్జి, చంటి వాళ్ళు బుజ్జి... చంటి... అని పిల్లల్ని పిలుచుకునే వయసుకొచ్చారు.

ఓనాడు అతడు చనిపోయాడు. కానీ అనేక రూపాల్లో బ్రతికే ఉంటాడని ఆమెకు తెలుసు.

అమ్మ పోలికలు రాని చంటి, బుజ్జి వాళ్ళ నాన్న నిర్యాణానంతర పితృకర్మల కార్యక్రమాల్లో గోదానం చెయ్యాలని సంకల్పం చేసారు.

మర్నాటి పేపర్లో శ్రద్ధాంజలి ఏడ్ కూడా ఇచ్చారు. నాన్న లేడని లోకానికి ప్రకటించడానికి పదివేలయ్యింది.

డేట్ మారాక ఆ శ్రద్ధాంజలి ప్రకటన పక్కన మూడు కాలంస్‌లో ఇంకో వార్త.

శీర్షిక... ఆవుని తప్పించబోయి ఆమెను ఢీకొన్న మారుతి వ్యాన్.

ఆమె ప్రముఖ నర్తకి, రచయిత్రి. పూర్వాశ్రమంలో జర్నలిస్ట్. వయసు యాభై అయిదు. బాయ్ క్రాఫ్. గౌర వర్ణం.

ఆమె అక్కడికక్కడే చనిపోయింది.

ఆమె పార్థివ దేహాన్ని ఆమె ఒకప్పటి కోరిక మేరకు మెడికల్ కాలేజ్‌కి డొనేట్ చేశారు. ఎంత డాక్టర్లైనా వాళ్ళకి ఆమె గుండెలో ధైర్యం ఎక్కడ దాచుకుందో వెతికినా దొరకలేదు.

మళ్ళీ పుట్టలేదు. పుట్టి ఉంటే... రెండు ఆప్షన్స్ ఉన్న మల్టిపుల్ ఛాయిస్ క్వశ్చన్‌లో తనను టిక్ కొట్టిన మారుతిని నడిపేది వాడేనా అని చూసేది.

ఆమె నిష్క్రమణ గురించి తెలుసుకున్న కుందేళ్ళన్నీ కోపంతో కుతకుతలాడాయి. వంటగది విడిచి రోడ్డెక్కాయి. అద్వైతం నేర్చిన నేల... రెండుకోట్ల కాళ్ళ కుందేళ్ళ హారం.

• • •

ఈ కుందేలుకు నాలుగు కాళ్ళే.

అది సమర్థవంతంగా వంటగది దాటగలిగింది.

గడపదాటే ముందు తనను కట్టి పడేసిన వంటగదిలో ఉచ్చ పోసింది.

కొన్ని గంటల నిరసన తరువాత మరలా ఇంటికొచ్చి చూస్తే తను పోసిన ఉచ్చ అలాగే ఉంది. అలవాటుగా పొడి బట్ట కోసం వెతికబోయింది. ఆ వెతుకులాటలో కన్నీరు కారింది.

తన కన్నీటి కంపు, ఉచ్చ కంపుకంటే అసహ్యకరమైన గబ్బుగా ఉంది.

# ముఖం



## రిషిత గాలంకి

ఇటీవలి రచయిత. ఆరు కథలదాకా రాశారు. పాండిచ్చేరి యూనివర్శిటీలో ఎంఎస్సీ ఎలక్ట్రానిక్ మీడియా చదివిన వీరి సొంత ఊరు గుడివాడ. 1995లో జన్మించారు. కరీంనగర్, విజయవాడ, పాండిచ్చేరి ఇలా వేర్వేరు ఊళ్లలో ఉండి చదువుకోవడం వల్ల భిన్న ప్రపంచాన్ని చూశారు. సినిమాలంటే ఆసక్తి. తల్లిదండ్రులు ఇద్దరూ టీచర్లు కావడంతో చిన్నప్పట్నుంచే చదవడం అలవాటయిందని చెప్తారు. దూరదర్శన్ కోసం కొన్ని టీవీ కార్యక్రమాలు చేశారు.

నివాసం : విజయవాడ.

మొబైల్ : 94931 65868

పొద్దున్న లెగడంతోనే దేవుడికి దండం పెట్టుకునే అలవాటును కొనసాగిస్తూ లేచా. ఫోన్‌లో సమయం సరిగ్గా ఐదున్నర అయింది. అదేంటి అలారం మోగడానికి ఇంకా అరగంట ఉంది కదా, అప్పుడే ఎలా మెలకువొచ్చింది అని ఆలోచించేలోగా పై ఇంటి నుండి ఏవో భజన పాటల మోత వినపడింది. ఓ ఇందుకన్నమాట అనుకొని ఆరింటి అలారం ఆఫ్ చేసి ఇంకొంతసేపు పడుకుందాం అనుకున్నా. ఊహు... నిద్రపట్టడం లేదు. 'ఇట్ ఈజ్ ఏ గుడ్ డే' అనుకుంటూ పైకి లెగిశాను. ఆ నిద్రమత్తులో అడుగులో అడుగు వేసుకుంటూ హాల్‌లోకి వచ్చి టైం చూస్తే సరిగ్గా ఆరు అయింది. సూర్యుడికి తొందరెక్కువ అనుకుంటూ గబగబ పిల్లల గదికి వెళ్లి పెద్దోడ్ని లేపాను. వాడు నిద్రలెగిసాడని నిర్ధారించుకొని వంట గదిలోకి వెళ్లి కళ్ళ మీద నీళ్లు జల్లుకొని, నోరు పుక్కిలించి వంట పని ప్రారంభించాను. పాల ప్యాకెట్టు కత్తిరించి ఇంకో స్టవ్ మీద పెట్టాను.

సోఫాలో కూర్చోని రిలాక్సడ్‌గా కాఫీ తాగడం నాకిష్టమైన వ్యాపకం. పేపర్ చేతికందుకుని అందులో నిమగ్నమైపోయి టైం చూద్దును కదా, సరిగ్గా 7:50 అని చూసి నా గుండెలో పిడుగు పడింది. రోజూ ఈ సమయానికి స్నానం కూడా అయిపోయుండేది అని కంగారుగా ఇంకో కప్ కాఫీ కలిపి ఆయన మంచం దగ్గరపెట్టి లేపాను. ఆయన ఆలస్యం అయిందని గ్రహించి వెంటనే స్నానానికి పరుగందుకున్నారు. పిల్లల గదికి వెళ్ళాను. పెద్దోడు స్నానానికి దూరినట్టున్నాడు. చిన్నోడిని లేపి బ్రష్ చేతికందించాను. చిన్నోడు పొద్దున్న లేవగానే ముద్దు పెట్టడం, తర్వాత మెల్లగా స్కూల్‌కి వెళ్ళను అని మారాం చెయ్యడం, నేను స్కూల్ గురించి వాళ్ల ఫ్రెండ్స్ గురించి, మధ్యాహ్నం వాడి కోసమే ఎగ్ ఫ్రైడ్ రైస్ చేసానని చెప్పి మెల్లగా స్కూల్‌కి రెడీ చెయ్యడం మా దినక్రీడలో భాగం.

వంట అయిపోగానే స్నానానికి వెళ్ళిపోయాను. బాత్రూం తలుపుతట్టి మావారు 'ఆఫీస్‌కి వెళ్తున్నా సీ యూ!' అని అరిచారు. నేను నీళ్ల శబ్ధంలోనే 'ఒకే ఒకే జాగ్రత్త!' అని అరిచాను. స్నానం చేసొచ్చేటప్పుడికి చిన్నా ఇంకా రెడీ అవ్వకుండా అలాగే కూర్చున్నాడు. 'రేయ్! టై బెల్ట్ పెట్టుకో' అని అందించి ఇద్దరం టిఫిన్ చేసాం. పెద్దోడే పాలు కలుపుకొని 'స్కూల్‌కి బయలుదేరుతున్నా అమ్మా' అంటూ వెళ్ళిపోయాడు. 'నాన్నా! లంచ్ బాక్స్' అని అరిస్తే 'పెట్టుకున్నా' అన్నాడు. వంటగదిలోకి వెళ్లి చూస్తే వాడి బాక్స్ ఇంట్లోనే వుంది. అయ్యో అనుకుంటూనే, చిన్నోడికి, నాకు లంచ్ సర్దాను. ముందుగా వచ్చే ప్రళయాన్ని అర్థం చేసుకొని, బాస్‌కి 'ఐ యామ్ కమింగ్ లేట్ టుడే, డ్యూ టు సిక్ హెల్త్' అని ఒక సందేశం పంపించి పడేసాను. పౌడర్ తెల్లగా అతుకులతుకులుగా రాసుకొని చిన్నోడిని పట్టుకొని ఇంటికి తాళం వేసాను. వాడిని బండి మీద ఎక్కించుకునే సమయానికి బ్యాగులో వున్న ఫోన్ మోగుతోంది. ఇష్టంగా రింగ్ టోన్‌లా పెట్టుకున్న పాట మీద కూడా కోపం వచ్చింది. బ్యాగ్ వెతికి ఫోన్ దొరికే సరికి కాల్ అయిపోయింది. చిన్నా బస్సు డ్రైవర్ నుంచి వచ్చింది. వెంటనే కాల్ బ్యాక్ చేసి, 'ఒక్క రెండు నిమిషాలు బస్సు ఆపండి' అని చెప్పాను. వాడు తిట్ల దండకం మొదలు పెట్టకముందే ఫోన్ కట్ చేసి బ్యాగులో పడేసి బండి ఆన్ చేసి బయల్దేరాను.

* * *

ఆఫీస్‌కి చేరే సమయానికి 10:30 అయింది. లిఫ్ట్ ఎంతసేపటికీ రాకపోడంతో రెండు అంతస్తులు వేగంగా ఎక్కి, చివరికి ఫ్లోర్‌కి చేరేటప్పటికి, రొప్పుతున్న కుక్కలాగా వున్న నన్ను చూసి, అటెండర్ 'ఏంటి మేడం? హెల్త్‌కి మంచిది, కరెంటు ఆదా... చాలామంచి వారు మేడం మీరు!' అన్నాడు. రొప్పుతూనే నవ్వుతో బదులిచ్చా. ఆఫీస్ అప్పటికే నిండిపోయి వుంది. బాస్ 'ఎక్కడా ఆమె?' అని నా గురించే అటు ఇటు తిరగడం చూసి, మెల్లగా నడుచుకుంటూ బ్యాగ్ నా ప్లేసులో పెట్టి నన్ను ఎవరూ గమనించలేదనుకొని చిన్న బాస్ వైపు వెళ్ళాను. నన్ను చూడగానే 'ఏంటి మేడం మీరు, ఇలా లేట్ అయితే ఎలా, ముందుగా చెప్పారా?' అని అన్నాడు.

'సారీ సర్' మెసేజ్ పంపించాను సర్. కొంచెం హెల్త్ ప్రాబ్లెమ్ సర్ అని నా డెస్క్‌కి పోయి కూర్చున్నాను. వెళ్ళగానే పెద్ద బాస్ ఫోన్ చేసి కేబిన్‌కి రమ్మన్నారు. రెడీ అయిన ప్రాజెక్ట్ ఫైల్ చేత్తో, మరో చేత్తో ఫోన్ పట్టుకొని బయలుదేరాను.

'సర్!'

'రామ్మా! సిట్' అన్నారు.

'నీ పెర్ఫార్మెన్స్ చాలా బాగుందమ్మా, ఐ యాం రియల్లీ ఇంప్రెస్డ్' అన్నారు.

'ఇంకా ఫైల్ కూడా చూడకుండా ఇదేంటి' అనుకున్నాను.

'ఏది ఫైల్ ఇవ్వు' అన్నారు.

ఆయన చేతిలో పెట్టి భయపడుతూ చూస్తున్నాను. ఆయన ముక్కు మీద వున్న కళ్ళజోడు నుంచి తల ఎత్తి చూస్తూ, 'నీకు రమ్య పెళ్లి సంగతి తెలుసుగా' అన్నారు.

'తెలుసు సర్! నిన్నే వచ్చి కార్డ్ ఇచ్చెళ్లింది సర్.' అన్నాను.

'అదేనమ్మ, లీవ్‌లో వుంది ఫోన్ చేసి వర్క్ కంప్లీట్ చెయ్యమందాం అంటే తను పెళ్లి చేసుకుంటోంది, ఎలా అమ్మాయికి వర్క్ చేయమనలో అర్థం కావట్లేదు. వర్క్ అంతా పెండింగ్‌లో ఉండిపోయింది. నాకా ఎవరికి చెప్పాలో అర్థం కావట్లేదు' అని చేతులు నలుపుకుంటున్నారు.

నేను క్షణం ఆలోచించకుండా 'ఐ విల్ డు ఇట్ సర్' అన్నాను.

ఆయన ఉబ్బితబ్బిబై 'నాకు తెలుసు మా, నీ అంత మంచి, డెడికేటెడ్ అమ్మాయిని నేను చూడలేదు' అన్నారు. నేను ఆ మాటలకి పొంగిపోయి, బయటకు నడిచాను. నా డెస్క్ దగ్గర కూర్చొని మనసులో అనుకున్న మొదటి మాట, ఛ! ఈ మోహమాటంతోనే నేను చచ్చిపోతానేమో.

స్కెచెస్ మీద వర్క్ ఔట్ చేస్తూ వుండగానే దీపికా వచ్చింది. చేతిలో కాఫీ పట్టుకొని, 'ఏంటి? రమ్య పని మొత్తం నీ మీద వేసినట్టున్నారు. ఎక్కడి నుంచి వస్తుందే నీకు ఇంత ఓపిక' అని ఆశ్చర్యపడ్డట్టు కళ్ళు పెద్దవి చేసింది. నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను. 'నీ దగ్గర నుంచి కొంచెం అయినా ఓపిక అప్పు తీసుకోవాలోయ్' అని భుజం మీద కొట్టింది. అది అదిల్చిన ఊపుకి దాని కాఫీ, నా కాఫీ కలిసి నా స్కెచెస్ మీద నాట్యం చేయసాగయ్. అది భయపడుతూ, 'సారీ సారీ' అని , వర్కర్‌ని పిలిచి క్లీన్ చెయ్యమని పురమాయిస్తూ వుంది. నేను నవ్వే సమాధానంగా 'పర్వాలేదులే సాఫ్ట్ కాపీ ఉంది. ఇంకో ప్రింట్ తీసుకుంటే పోయే.' అని మళ్ళీ ప్రింట్ ఆప్షన్ కోసం వెతుకుతున్నాను. ఆఫీస్ పనులతో టైం తెలియలేదు.

మధ్యాహ్నం లంచ్ చేసేటప్పుడు బాక్స్ తెరవగానే చిన్నోడు గుర్తొచ్చాడు. 'హమ్మయ్యా! ఈరోజు లంచ్ బాక్స్ ఖాళీగా ఇంటికొస్తుంది' అని చేతిలో చూడగానే బాక్స్ లేదు. ఒక్కొక్కరిగా బాక్స్ తీస్కొని వారెవ్వా అంటూ తింటున్నారు. నా దగ్గరకు వచ్చేటప్పుడికి బాక్సులో నాలుగు స్పూన్ల అన్నం ఉంది. 'అయ్యో! అన్నం లేదుగా మీకు' అన్నారు కొల్లీగ్స్ అందరూ. 'ఎందుకు లేదు ఇది సరిపోద్ది' అని తింటున్నా. తిన్నాక  అందరూ వారి వారి క్యాబిన్లలోకి పోయి పని ప్రారంభించారు. హేమా మాత్రం నన్నే చూస్తుండిపోయింది. 'ఏంటి?' అని కళ్ళతోనే సైగ చేశా. 'అసలెంత మంచిదానివో నువ్వు! ఎంత మంచి మనసో అంతే చక్కటి రూపం. చక్కటి కళ్ళు,

దానికితోడు తీర్చిదిద్దినట్టు కాటుక పెడతావ్. వన్ అఫ్ ది బెస్ట్ విమెన్ ఐ హావ్ ఎవర్ సీన్ ఇన్ మై లైఫ్' అంది. 'మరీ పొగిడేస్తున్నావ్' అంటూ రెస్ట్ రూంకి వెళ్ళాను. అద్దంలోకి చూడగానే నాకు నేనే ముద్దొచ్చేట్టుగా వున్నా. కాళ్ళ దగ్గర కాటుక చెరిగింది. టిష్యూతో మిగతా మేకప్ అంతా చెదరకుండా సరిచేసుకుని, లిప్‌స్టిక్ వేసుకొని ముఖం ఇంకోసారి చూసుకున్నా. చక్కని వర్ణం, పెదాల మీద చెరగని చిరునవ్వు, కళ్ళకి కాపలా కాస్తున్న కాటుక మరోసారి సరి చూసుకొని ఆఫీస్ పనిలో నిమగ్నమైయ్యాను.

సాయంత్రం ఐదు అవ్వగానే బాగ్ సర్దుకున్నాను. బాస్ అప్పుడే ఆయన కేబిన్ నుంచి నా దగ్గరకి వచ్చి, 'ఏంటమ్మా బ్యాగ్ సర్దేసుకున్నట్టున్నావ్' అన్నారు!

'లేదు సర్, టీ తాగుదమని' అన్నాను తడబడుతూ.

'ఒకేమా, ఈరోజు ఎంత లేట్ అయినా వర్క్ మొత్తం ఫినిష్ చేసేద్దాం' అన్నారు.

'ఓకే ఖచ్చితంగా సర్' అని చతికిలపడ్డా.

'వెరీ గుడ్' అని వెళ్లిపోయారు.

'నా బొంద గుడ్, ఇక్కడ ఏం మంచి జరిగిందని' అనుకుంటూ సర్దేసిన బ్యాగ్‌ని తెరిచి వర్క్ మొదలెట్టాను.

• • •

ఇంటికి చేరేటప్పడికి తొమ్మిది అయింది. అన్నం పొయ్యి మీద పెట్టి స్నానానికి వెళ్ళా. వంట అయ్యి అంతా పడుకునేసరికి 12 అయింది. వెళ్లి బెడ్ ఎక్కగానే శ్రీధర్ ఏదో వెతుకుతున్నట్టు అనిపించి, 'ఏం వెతుకుతున్నారు' అన్నాను. 'గోల్డ్ చైన్ కనపడట్లేదోయ్. స్నానానికి వెళ్ళేటప్పుడు ఇక్కడే ఎక్కడో పెట్టాను' అన్నారు. 'అబ్బా!' అని బెడ్‌కి బబుల్ గమ్‌లా అతుక్కుపోయిన నడుముని లేపి, వెతకడం ప్రారంభించాను. అలా 12:45 కి ఇల్లు ఊడుస్తుంటే టేబుల్ కింద నుంచి వచ్చింది. హమ్మయ్య అని బెడ్ మీద పడిపోయా. 'అసలు నీకింత ఓపిక ఎక్కడిదోయ్' అని పడుకుండిపోయారు. 'ఏమండీ ఈ వీకెండ్ అమ్మ వాళ్ళింటికి వెళ్తాను' అన్నాను. 'సరే వెళ్ళొచ్చెయ్' అన్నారు.

ముఖం ఎంతో భారంగా అనిపించింది. కానీ అలాగే ఉంచుకొని రెప్ప వాల్చాను.

• • •

చూస్తూ వుండగానే శనివారం వచ్చేసింది. బస్ కోసం దాదాపు గంట నిల్చోవాల్సివచ్చింది. చివరికి రద్దీగా ఉన్న బస్ ఒకటి ప్రత్యక్షం అవ్వగానే కప్

గెలిస్తే ఆటగాళ్లందరు మైదానంలోకి దూసుకువచ్చేట్టు, చేతి రుమాలుతో అందరూ బస్ చుట్టూ మూగారు. చాలాసేపు ఇంకో బస్ కోసం ఆగుదామా వద్దా అనే సంశయంతో చివరగా బస్ ఎక్కడానికి నిశ్చయించుకున్నాను. బస్ అంతా చెమట కంపుతో పెరపెరలాడుతోంది. ఎక్కిన కొద్దిసేపటికే నాకు కూర్చోడానికో సీట్ దొరికింది. అయితే ఒక పెద్దావిడ నిల్చోలేనమ్మా అని దీనంగా మొహం పెట్టి అడిగే సరికి, కూర్చోమని పక్కకి తప్పుకున్నాను. మరికొంతసేపటికి ఆ పెద్దావిడ పక్కనే సీట్ ఖాళీ అవ్వడంతో ఆత్రంగా వెళ్లి కూర్చోబోతే, ఆ పెద్దావిడ ఆమె కోడలిని పిలిచి అక్కడ కూర్చోపెట్టింది. తరవాత నన్ను చూసి 'అయ్యో, నువ్వింకా నించోనే ఉన్నవామ్మా? నేను చూసుకోలేదు' అంటూ ఒక నవ్వు నవ్వింది. 'పర్లేదులేండి' అని నేను నవ్వాను. కొంతసేపటికి కాళ్ళు లాగేస్తూ పడిపోతానేమో అనిపించింది. చివరికి ఎలాగైతేనేమి బస్ దిగి నడుచుకుంటూ వెళ్లి ఇంటిని చేరుకున్నాను. అప్పటిదాకా భారంగా ఉన్న మొహాన్ని ఇంటి బయట తగిలించి ఇంటి లోపలికి అడుగుపెట్టాను.

అడుగుపెడుతూనే, 'ఎన్నిసార్లు వచ్చినా ఇంతేనా నాన్న, బస్ దిగగానే నన్ను తీసుకెళ్లడానికి రావొచ్చుగా' అని అరిచాను. నాన్న భయపడుతూ 'మీ అమ్మ టీ తాగి వెళ్ళండి అందమ్మా. ఈ లోపు నువ్వే వచ్చేశావ్' అన్నారు.

'సరే, ఏదో ఒకటి చెప్తూనే వుంటారు.' అని కూర్చీలో కూలపడ్డా, చేతిలో ఉన్న బ్యాగ్‌ని మంచం మీద పడేస్తూ.

కూర్చోగానే అమ్మ కాఫీ చేతికందించింది.

'ఆ టీవీ సౌండ్ ఏంటి అంత పెట్టుకుని. మీకు వినపడితే చాలు. పక్కింట్లోవాళ్ళకి ఊర్లో అందరికి వినపడక్కర్లేదు, కొంచెం తగ్గించండి.'

'అమ్మా! రవ్వలడ్డులు పట్టుకురామ్మా, చేసి ఉంచమన్నా కదా.'

'అది.. అది.. మరీ మొన్న మీ గీతా పిన్ని ఇంటికొస్తే పెట్టి పంపించాను. ఒక రెండుంటే నిన్న నేను మీ నాన్నగారు రుచి చూశాం.'

'ఛ! ముందే చెప్పాలిగా అమ్మా, వాటి మీద ఆశతో వచ్చా.'

'బూరెలున్నాయ్ తల్లి, అవి పట్టుకెల్దువులే ఈసారికి.'

'సరే, చిరాకుగా వుంది. నేను కొంసేపు పడుకుంటా' అని బెడ్రూమ్‌లోకి వచ్చాను.

• • •

అద్దం ఎదురుగా నిలబడి వున్నాను. ముఖం లేకపోవడం వల్ల చాలా తేలికగా వుంది. బరువు ఎదో తగ్గినట్టుగా వుంది. కనుబొమ్మలు రెండు అతుకున్నట్టుగా ఉన్నాయి. నుదురు చిట్లుతుందేమో అని భయమేసింది. కళ్ళ కింద నల్లటి వలయాలు తమ పుట్టుకను గురించి అడుగుతున్నాయి, ఆ కిందనే అర అంగుళం మేర గుంటలు. ఎండిపోయిన పెదాలు ఇక తాను ఆ ప్లాస్టిక్ నవ్వులు నవ్వలేనని ఢీలా పడ్డట్టున్నాయి. ముఖం మీద ముడతలు వయసుని ఆపలేమని చేతులెత్తేశాయి. కళ్ళను చూద్దాం అనిపించింది. అవి జీవచ్ఛవంలా నన్నే చూస్తున్నాయి. వాటిని చూసి నవ్వొచ్చింది.

"మనుషుల కోసం వేసిన ముఖం
దానికి మంచే తప్ప చెడు తెలీదు
నవ్వే తప్ప కోపం తెలీదు
బాధ్యతే తప్ప బరువు తెలీదు
దాని పుట్టుచావులు నిజం వెలిసేదాకే
దాని వినికిడి మనుషుల మెప్పు పొందేదాకే!"

కానీ దాని వెనుకున్న మనసు నాది కదా, ఎక్కువ సేపు ఈ మంచి ముఖాన్ని మోయలేదు. బరువుగా ఉంటుంది. ఎప్పుడెప్పుడు తీసేద్దామా అన్నట్టుంటుంది. భర్తకి మంచి భార్యగా, పిల్లలకి మంచి తల్లిగా ఉండాలి. మంచి ఉద్యోగిగా బాస్ మెప్పు పొందాలి. అందంతో కొల్లీగ్స్ మతి పోగొట్టాలి. కానీ అది నేను కాదే, సమాజానికి అలాంటి నేను మాత్రమే కావాలి.

అలాంటి నేను మాత్రమే కావాలి.

• • •

సోమవారం ఆఫీసులో

'వావ్ నిన్ను చూస్తే ఇద్దరి పిల్లల తల్లంటే నమ్మరు తెలుసా. లుకింగ్ టూ యంగ్, టూ బ్యూటిఫుల్.'

'థ్యాంక్ యూ లతా!'

'హేయ్ మర్చిపోయా, నీకిష్టమైన పెన్ పోయింది యా, ఐ యామ్ సో సారీ. ఎలా మిస్ అయిందో తెలియట్లా!'

పట పట కోపం వచ్చింది. ముఖం అడ్డుపడింది.

'పర్వాలేదులే లతా. నో ప్రాబ్లెమ్, దీనికేనా?'

'ఓ మై గాడ్! నీలాంటి మంచిదానిని నేనింతవరకు చూడలేదు. అసలు ఎలా వుంటారు ఇంత మంచివాళ్ళు.'

వెంటనే ప్లాస్టిక్ నవ్వు ఒకటి తీసి మొహం మీద వేసి పని చూస్కోడం ప్రారంభించా.

# చలిచీమల కవాతు



ఉణుదుర్తి సుధాకర్

వర్తమానంలో నిలబడి చరిత్రను పరామర్శిస్తూ అందులో నుంచి మనం అర్థం చేసుకోవాల్సిన విషయాలను కథనం చేస్తున్న రచయిత. స్వస్థలం విశాఖపట్టణం, పుట్టింది 1954. మెరైన్ ఇంజినీరింగ్ చేసి ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తూ సముద్ర యానంలో జీవనం గడిపారు. 1994లో రచన మొదలు పెట్టినా సుదీర్ఘ విరామం తర్వాత 2013 నుంచి కథలు రాస్తున్నారు. ఈ కథలన్నీ 'తూరుపు గాలులు' పేరుతో పుస్తక రూపంలో వచ్చి పాఠకుల గుర్తింపు పొందాయి.

నివాసం : హైదరాబాద్.

మొబైల్ : 90006 01068

మాధవన్. అతడొక విద్యార్థి నాయకుడు. తన ముఖ్య అనుచరులతో సునీతారెడ్డి ఫ్లాట్‌లో కూడి, ఆనాటి కీలక సమావేశాన్ని నిర్వహిస్తున్నాడు. దట్టంగా పెరిగిన గెడ్డాన్ని నిమురుకుంటూ, సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ కళ్లజోడుని నెత్తి మీదికీ ముక్కు మీదికీ మారుస్తూ విద్యార్థి సంఘం తలపెట్టిన సమ్మెకు తుది సన్నాహాలు చేస్తున్నాడు. అనుచరులకు ఆదేశాలు జారీ చేస్తున్నాడు. మధ్యమధ్యలో జోకులు పేలుస్తూ, అక్కడ పేరుకున్న ఉద్రిక్తతని సడలింపజేస్తూ అందర్నీ ఒకే త్రాటిన నడిపిస్తున్నాడు. ఎవరైనా సందేహాలు వ్యక్తం చేస్తే మాత్రం బలంగా, నిర్ద్వంద్వంగా బల్లగుద్ది మరీ తన అభిప్రాయాలను తెలియజేస్తున్నాడు.

ఇదే మాధవన్ పరిచయం అయిన కొత్తలో – అంటే రెండు మూడేళ్ల క్రితం అయితే – సునీతారెడ్డి అతనివంక ఆరాధనా భావంతో చూస్తూ పరిసరాలను మరచిపోయేది. ఆ అమాయకపు తొలి రోజుల్లో ఆమె కళ్లకు అతడు చే గువేరాలా కనిపించేవాడు. ఇప్పుడు అతని బయటి, లోపలి స్వభావాలు విడివిడిగా కనిపిస్తున్నాయి. ఎవరైనా అంతేనేమో?

మాధవన్ వెంట ఉండేవాళ్లకు విప్లవం కనుచూపు మేరలో ఉందనే ఆశ, భ్రాంతి కలుగుతాయి. సునీత ఒక్కర్తే కాదు, చాలామంది ఈ మాట అంటారు. ఫైజ్, గాలిబ్, బోదిలైర్, డిలాన్ థామస్, సార్త్ర్, నెరూడా... వీళ్లందరినీ అలవోకగా కోట్ చేస్తూ సంభాషణలను ఉన్మత్త ఉద్రేకంతో నింపుతాడు. 1968నాటి పారిస్ విద్యార్థుల తిరుగుబాటు ఏ క్షణాన్నయినా తమ యూనివర్సిటీలో మొదలు కాబోతున్నది అనే భావన కలిగిస్తాడు. ఈ మధ్య అతను తరచూ ఉదహరిస్తూన్న ఆనాటి స్లోగన్ – 'ప్రొఫెసర్లూ, మీరు ముసలాళ్లైపోయారు!'

అతనికి ఎదురుగా ఉన్న ఏష్ ట్రే నిండిపోయింది. అతని పక్కన కూర్చున్న పూజా శర్మ లేచి దాన్ని ఖాళీ చేసి తీసుకొచ్చింది. హ్యాండ్ బ్యాగ్ తెరిచి తను కూడా ఒక సిగరెట్టు తీసి వెలిగించింది.

మాధవన్ పూజా కేసి తిరిగి,

"చెక్ లిస్టు తియ్యి. ఫైనల్‌గా మరోసారి చూసుకుందాం," అన్నాడు.

"ఆల్ రైట్," అని పూజా తన సిగరెట్టుని ఏష్ ట్రేకి ఆనించి టేబిల్ మీద ఉన్న కాగితాన్ని తీసి,

"మాధవ్, నువ్వు టిక్కులు పెడుతూండు," అని చదవనారంభించింది. ఆమె మాధవన్‌ని 'మాధవ్' అని ఎందుకు పిలుస్తుందా అని సునీతకి ఇరిటేషన్, చిరాకు.

"సమ్మె నోటీసు, బ్యానర్స్, జెండాలు, ప్లకార్డ్స్, వాలంటీర్ల జాబితా, వాళ్ల ఫోన్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీలు, మన లోకల్ కాంటాక్టుల ఫోన్ నెంబర్లు, గేట్ వద్ద మంచి నీళ్లు, భోజనం, కాఫీ, టిఫిన్ ఏర్పాట్లు, నిరాహార దీక్షకి కూర్చొనే వాలంటీర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, విరాళాల స్టేటస్, కాష్ బాలెన్స్, ప్రెస్‌నోట్..."

మాధవన్ సునీత వైపు చూస్తూ,

"ప్రెస్‌నోట్‌ని తెలుగులోకి అనువదిస్తానన్నావు, పూర్తయిందా?" అన్నాడు.

సునీత నోరు విప్పేలోగా పూజా –

"నాకు ఈ-మెయిల్ చేసింది," అంది.

"ఓకే, గుడ్. అంతా సిద్ధంగా ఉంది. సమ్మె నోటీసు మీద ఆఫీసు బేరర్ల సంతకాలు తీసుకో పూజా. రేపు పొద్దున్నే వెళ్లి మేనేజిమెంటుకి అందజేస్తాం. అంతవరకూ ఈ విషయం బయటకి పొక్కకూడదు," అంటూ లేచాడు, మాధవన్.

ఇప్పుడైనా తనని మనసారా పలకరిస్తాడేమోనని ఆశ పడింది సునీత. రెండు రోజుల నుండీ ఫ్లాట్‌కి రాకుండా బయటే తిరుగుతున్నాడు.

ఆమె ఆశించినట్లుగానే,

"హాయ్, సునీతా! మీటింగులో ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు? టెన్స్‌గా ఉన్నావు. ఇవన్నీ నీకు కొత్త, అవునా? మరేమీ భయం లేదు. జయం మనదే. స్ట్రైకు నోటీసు చూడగానే మేనేజిమెంటు షాకవుతుంది చూస్కో, వాళ్ల దిమ్మ తిరిగిపోతుంది. నా సామిరంగా, తిన్నగా కాళ్ల బేరానికి వచ్చేస్తారు. నిరాహారదీక్ష కూడా అవసరం ఉండదు. ఈ దెబ్బకి రాబోయే స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో మరోసారి ఘన విజయం మనదే," అని బిగ్గరగా ప్రకటించాడు.

తనతో మాట్లాడుతున్నట్లుగా కనిపిస్తూనే నిజానికి అందరినీ ఉద్దేశించి ధైర్యం చెప్పే ఉపన్యాసం ఇస్తున్నాడని సునీతకి అర్థం అయింది. అతనిలో ఆత్మవిశ్వాసం పాలు మితిమీరిందని కూడా అనిపించింది.

అందరూ బయలుదేరుతున్నారు.

అతనికి స్వభావసిద్ధమైన నాటకీయతతో –

"ఆగండి. ఒక విషయం చెప్పాలి," అన్నాడు. అంతా ఆగారు. అతని కేసి చూస్తున్నారు.

సిగరెట్టు తీసి తాపీగా ముట్టించాడు.

"స్ట్రైకు కమిటీ సభ్యులంతా అర్ధరాత్రి ఒకసారి, ఉదయం ఆరులోపు మరోసారి – నాకుగాని, పూజాకిగాని – ఫోన్ చెయ్యాలి. లేదా వాట్సాప్ మెసేజి పెట్టాలి. ఎటువంటి సమాచారం లేకపోతే, లేదా మేము కాంటాక్టులోకి రాకపోతే అరెస్టు అయినట్లుగా ఊహించుకొని ప్లాన్ 'బీ'ని అమలు చెయ్యాలి,"

"ఆగండాగండి. మరో ముఖ్యమైన విషయం," అంతా నవ్వారు. 'ఇప్పుడు బాంబు పేలుస్తాడు' అనుకుంది సునీత. అలాగే జరిగింది.

"ఒక ముందు జాగ్రత్త చర్య. స్ట్రైకు నడుస్తున్నంత కాలం ఆఫీసు బేరర్లు ఎవరూ రాత్రిపూట హాస్టల్స్‌లో ఉండకూడదు. బయటెక్కడో ఉండాలి,"

"మాధవన్, నువ్వు ఇక్కడే, నా ఫ్లాట్‌లోనే ఉంటావు కదా?" అనేసింది సునీత – కాస్త కంగారుగా.

పూజా అందుకుంది –

"మాధవ్‌ని అరెస్టు చెయ్యాలనుకుంటే పోలీసులు మొదట నీ ఫ్లాట్‌కే వస్తారు. అతనిక్కడ దొరుకుతాడని వాళ్లకీ తెలుసు,"

మాధవన్‌తో సహా అంతా నవ్వేశారు.

సునీత మొహం మాడ్చుకుంది. మాధవన్‌కీ తనకీ ఉన్న సంబంధం అందరికీ తెలిసిన సంగతే అయినా దాన్ని బహిరంగంగా ప్రస్తావించడం ఆమెకు బొత్తిగా నచ్చలేదు. 'దీనికి అక్కర్లేని విషయం అంటూ లేదు. ప్రతీదీ తన డేగ కళ్లతో గమనిస్తూ ఉంటుంది. పైగా అధిక ప్రసంగం' అనుకుంది.

అంతా వెళ్లిపోయారు. మాధవన్, సునీతలు మాత్రమే ఫ్లాట్‌లో మిగిలారు. ఖాళీ అయిన టీ కప్పుల్ని వంటింటి సింకులోకి తరలించసాగింది సునీత. మాధవన్ ఆమెను వెనుక నుండి వాటేసుకొని,

"తలనెప్పిగా ఉంది. ఒక కప్పు స్ట్రాంగ్ ఫిల్టర్ కాఫీ తాగితే ఎలా ఉంటుందంటావు?" అన్నాడు.

"వొదులు. చేస్తానులేగానీ నువ్వు సిగరెట్లు తగ్గించు. వాటి మూలంగానే ఈ తలనెప్పులు,"

"అరె! విచిత్రం ఏమిటంటే కాఫీ చెయ్యమన్నప్పుడల్లా మా అమ్మ కూడా ఇలానే అంటుంది!" అని ఆమె బుగ్గ మీద చిటికె వేసి డ్రాయింగు రూంలోకి నడిచాడు.

సునీత వంటింట్లో కాఫీ ఏర్పాట్లు చేస్తూ ఆలోచనల్లో పడింది.

ఆమెకు మొదటి నుండీ కూడా పూజాశర్మ అంటే సదభిప్రాయం లేదు. ఎందుకో తెలియదు. పైగా పూజా మాధవన్‌తో మరీ అంత క్లోజ్‌గా ఉండడం నచ్చలేదు. ఆమె లెస్బియన్ అని ఎవరో చెప్పాక సునీత మనసు కొంత కుదుట పడింది. ఇదే మాట మొన్న మాధవన్‌తో అంటే,

"నీకెవరు చెప్పారు? ఆమె బైసెక్సువల్," అన్నాడు.

"అంటే?"

"అంటే ఒక రూటు మూసుకుపోతే మరో రూట్లో ముందుకి పోతుంది," అని కిసుక్కుమని నవ్వాడు. అతని నవ్వులో సునీతకు లేకితనం ధ్వనించింది.

"అంటే నీతో కూడా...?"

రానున్న ప్రమాదాన్ని పసిగట్టాడు మాధవన్. ఎందుకు నోరు జారానా అని తనను తాను తిట్టుకుంటూనే, మళ్లీ మళ్లీ తమ ఇద్దరి మధ్యా ఈ సమస్య తలెత్తకుండా మొగ్గలోనే త్రుంచి వెయ్యాలనుకున్నాడు.

"అదంతా గతం. నువ్వూ నేనూ కలసి ఉంటున్నప్పటి నుండీ మా మధ్య అలాంటిదేమీ లేదు. ఆ సంగతులన్నీ మర్చిపో,"

"నిజంగా?"

"నిజం!"

"ఒట్టు?"

"ఒట్టు!"

• • •

తెగిపోతుందనుకున్న వాళ్లిద్దరి బంధం ముడివేసుకొని నిలదొక్కుకుంది. అయితే సునీతలో నాటుకున్న అనుమాన బీజం అలాగే కొనసాగింది.

ఆ రోజు ఉదయాన్నే ఇంకోటి జరిగింది.

మాధవన్ అమ్మాయిలను, ముఖ్యంగా మొదటి సంవత్సరంలో ఉండే అండర్–గ్రాడ్ అమ్మాయిలను బలంగా ఆకర్షిస్తాడని సునీతకు తెలుసు. తను కూడా – ఇప్పుడంటే పీజీలో ఉందిగానీ – ఆ దశలోనే అతని పట్ల మోహం పెంచుకుంది.

ఆనాడు బాత్‌రూం అద్దం మీద తనదికాని స్టిక్కర్ బొట్టు ఒకటి కనబడింది. తన అభిమానులుగా మారిన అమ్మాయిలను చాటుగా తన ఫ్లాట్‌కి తీసుకొస్తున్నాడేమో అని ఆమెకు కలిగిన అనుమానం మరికాస్త బలపడింది. మాధవన్‌ని నిలదీద్దామా అనుకుందిగానీ సరి అయిన ఋజువు లేకుండా అనుమానం వ్యక్తం చెయ్యడం మరీ సిల్లీగా ఉంటుందేమో అనిపించింది. అతని ఫోన్ కాల్స్‌నీ, మెసేజిల్నీ చెక్ చేసే అవకాశం లేదు. పాస్‌వర్డ్‌తో కాపాడుకుంటున్నాడు.

• • •

యూనివర్సిటీ లోపల ఉండే ప్రతీఘాత శక్తులు బయటి రాజకీయ నాయకుల అండతో రెచ్చిపోయి, పోలీసుల సహకారంతో సమ్మెను భగ్నం చేసాయి. రెండు వారాలపాటు కొనసాగిన నిరాహారదీక్ష కోసమని నిర్మించిన తాత్కాలిక శిబిరాన్ని కూల్చివేశారు. మాధవన్, పూజాలతో సహా నాయకులందరినీ నిర్బంధించారు. మాధవన్ కస్టడీలో ఉన్నప్పుడు సునీత చాలా ఆందోళన చెందింది. కొంతమంది స్నేహితుల్ని కూడగట్టుకొని పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగింది. హక్కుల సంఘాల్నీ, లాయర్లనీ సంప్రదించింది. వేళకి నిద్రాహారాలు లేక చిక్కి సగం అయింది.

బెయిలు మీద విడుదల అయ్యాక కూడా సమ్మెకారులంతా దేశద్రోహులని సోషల్ మీడియాలో ప్రచారం కొనసాగింది. విద్యార్థి నాయకులపై బురద జల్లారు. వాళ్లను అప్రతిష్టపాలు చేశారు. మాధవన్‌ని చిట్టచివర విడిచిపెట్టారు. నేడో రేపో బయటకు వస్తాడనగా డీఎస్పీ మేడం స్టేషన్‌కి వచ్చి కలవమంటున్నారని సునీతకి ఫోన్ వచ్చింది.

పోలీసు స్టేషన్లో మహిళా డీఎస్పీ టీ, బిస్కెట్లు ఇప్పించి చాలా సౌమ్యంగా మాట్లాడింది.

ఇదీ ఆమె మాటల సారాంశం: మాధవన్ ఆమెను లైంగిక దోపిడీకి గురి చేస్తున్నట్లు, శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నట్లు ఫిర్యాదు ఇవ్వాలి. సునీతకి అర్థం అయిపోయింది. ఇది మాధవన్ క్యారెక్టర్‌పై దాడి చెయ్యడానికీ, అతన్ని వేరే కేసుల క్రింద బుక్ చేసేందుకూ జరుగుతూన్న ప్రయత్నం. అటువంటిదేదీ చెయ్యబోనని సునీత ఖరాఖండీగా చెప్పేసింది. పోలీసాఫీసరు తన రూటు మార్చింది. స్వరం పెంచింది.

"నువ్వు గత ఆరు నెలలుగా ఇతనితో కలిసి ఉంటున్నావు. ఈ విషయం మీ పేరెంట్స్‌కి తెలుసా? లేకపోతే మమ్మల్ని చెప్పమంటావా? నీ భద్రత కోసమే సుమా!"

"మా పేరెంట్స్‌కి అన్నీ తెలుసు. వాళ్లు లండన్‌లో ఉంటున్నారు. కావాలంటే చెప్పండి. వాళ్ల ఈ–మెయిల్ ఐడీలు, ఫోన్ నెంబర్లు ఇస్తాను,"

డీఎస్పీ ముఖం కోపంతో ఎర్ర బడింది.

సబ్–ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగి, "ఈ రోజుల్లో పేరెంట్స్ కూడా ఇలాగే బాధ్యతారహితంగా తయారయ్యారు. పిల్లల్ని అని ప్రయోజనం లేదు... ఆ ఫైలు ఇలా ఇవ్వు," అంది.

ఒక ఫైలుని తీసి సునీత ముందుంచింది. తెరిచి చూస్తే – మాధవన్ ఫోన్ నుండి వెళ్లిన కాల్స్‌కి, మెసేజిలకి సంబంధించిన రికార్డులు, వివరాలు... ముగ్గురు బియ్యే అమ్మాయిలతో సాగిన సుదీర్ఘ సంభాషణలు, సరసమైన ఉత్తర ప్రత్యుత్తరాలు, తన ఫ్లాట్‌కి రమ్మని పంపిన ఆహ్వానాలు, వాటికి అందిన ఆమోదాలు.

సునీతకి బుర్ర తిరిగిపోయింది.

ఆమె కళ్లల్లోకి నిశితంగా చూస్తూ, ప్రతీ మాటనూ వొత్తి పలుకుతూ డీఎస్పీ అన్నది –

"నువ్వు కంప్లయింటు ఇవ్వకపోయినా, వీళ్లు ముగ్గురూ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మంచి ఫేమిలీ నుంచి వచ్చావని బయట పడిపోవడానికి మొదట నీకు అవకాశం ఇస్తున్నాం. ఆలోచించుకో, బలవంతం ఏమీ లేదు. ఇక నువ్వు వెళ్లచ్చు,"

సునీత మారు మాట్లాడకుండా బయటకు నడిచింది. ఆమె వెనకాతలే ఒక మహిళా కానిస్టేబుల్ వచ్చింది. ఆటో ఎక్కిస్తూ,

"మేడం మీకు ఇమ్మన్నారు. రాత్రయినా, పగలైనా – ఏ టైములోనయినా మీరు ఫోన్ చెయ్యవచ్చు అని చెప్పమన్నారు," – అని డీఎస్పీ విజిటింగు కార్డు ఇచ్చింది.

ఆటోలో ఉన్నంతసేపూ సునీత ఏడుస్తూనే ఉంది. ఆటో డ్రైవరు, గెడ్డం నెరిసిన ముస్లిం పెద్దాయిన – కాసేపు చూసి, ఉర్దూలో,

"మన పోలీసులు అంతేనమ్మా, మంచివాళ్లని ఏడిపిస్తారు. దుర్మార్గుల్ని విడిచిపెడతారు. చదువుకున్నదానిలా ఉన్నావు. నీ పరిస్థితే ఇలా ఉంటే, ఇక మాలాంటి వాళ్ల గతేంకావాలి? భయపడకు. మనబోటి వాళ్లను ఆ అల్లాయే కాపాడతాడు." అన్నాడు.

నేపథ్యం తెలియకపోయినా ఒక అపరిచితుడు సముదాయింపుగా మాట్లాడడంతో సునీత దుఃఖం కట్టలు తెంచుకుంది. ఆటో అతని కొడుకు

కువాయిట్‌లో టాక్సీ నడుపుతాడట. అక్కడ చట్టవ్యతిరేకమైన పనులు చేస్తే పోలీసులు చాలా కఠినంగా వ్యవహరిస్తారటగానీ అమాయకులను ఇబ్బంది పెట్టరట. ఇలా ఏవేవో చాలా చెప్పుకుపోయాడు. అతడు తన మనసుని మళ్లించడానికే అవీ ఇవీ మాట్లాడుతున్నాడని సునీతకి అర్థం అయింది. ఎలా థాంక్సు చెప్పాలో తెలియక,

"షుక్రియా, చాచా!" అంది, దిగుతున్నప్పుడు.

"నీ వద్ద ఉన్న దాంట్లో కొంతైనా పేదలకు పంచిపెట్టు, అల్లా నిన్ను చల్లగా చూస్తాడు," అని వెళ్లిపోయాడు.

ఎంచేతనోగాని ఈ చిన్న సంఘటన సునీతలో గొప్ప ధైర్యాన్ని కలిగించి బలంగా నాటుకుపోయింది. అతని నిర్మల దరహాసం, దయాభరితమైన స్థైర్యం ఆమెకు చాలాకాలం గుర్తుండిపోయాయి. అతను ఎన్నో కష్టాలను ఎదుర్కొని నిలబడ్డ యోధుడిలాగా, జీవితాన్ని దగ్గరగా చూసిన దయాళువులాగా ఆమె కళ్లకు కనిపించాడు.

• • •

మాధవన్ బెయిలు మీద బయటకు వచ్చిననాడు పెద్ద హడావుడి జరిగింది. పూజా, మిగతా మిత్ర బృందం అతనికి ఘనంగా స్వాగతం పలికారు. మాధవన్‌లో మాత్రం మునపటి ఉత్సాహం కనబడలేదు – సునీత కళ్లకి. పాతికేళ్లు కూడా నిండకుండానే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ఒక వెలుగు వెలిగి అటు ప్రొఫెసర్లనీ, ఇటు స్టాఫ్‌నీ తారెత్తించిన మాధవన్, ఊహించని విధంగా సమ్మె విఫలం కావడంతో ఆ పరాజయం నుండి కోలుకోలేక పోయాడు. డిప్రెషన్‌కి లోనయ్యాడు. తాగుడు ఎక్కువయింది. తాగాక ఎక్కువయ్యే అతని వాగుడు సునీతకి చిరాకు తెప్పించేది. ఏ రోజుకారోజు తన ఫ్లాట్ ఖాళీచేసి వెళ్లిపొమ్మని అతనికి చెప్పాలని అనుకుంటూనే సునీత ఆ నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది.

మాధవన్‌ని తిరిగి మామూలు మనిషిని చెయ్యడానికి పూజా, సునీత – ఇద్దరూ తమకు చేతనైనంతా చేశారు. వాళ్లిద్దరి మూలంగానే తను ఈ మాత్రం కోలుకోగలిగానని అతనే స్వయంగా చెప్పేవాడు. తాగుడు మాత్రం మాన్పించలేక పోయారు.

ఒకసారి మాధవన్‌కి మందు బాగా ఎక్కువైన రోజున బెడ్‌రూంలో పూజా ప్రవర్తించే తీరును గురించి వివరించసాగాడు.

"ఎంతైనా ఢిల్లీ పంజాబీ కదా! మంచం మీద ఉన్నప్పుడు కూడా డామినేట్ చేస్తుంది," అంటూ పూజా ఆ సందర్భంలో ప్రకటించే ఇష్టాయిష్టాల గురించి వివరించసాగాడు.

సునీత నిర్ఘాంతపోయింది. "ఏమిటలా మాట్లాడుతున్నావు? ఆమె ప్రైవేసీని గౌరవించడం నేర్చుకో!" అని గద్దించింది.

అతని చేతిలో ఉన్న గ్లాసుని లాక్కొని విస్కీని సింకులో పారబోసింది. బెడ్ రూంలోకి వెళ్లి, ధడేల్మని తలుపు వేసుకొని గొళ్లెం పెట్టింది. అతనికి కిక్కు దిగిపోయింది.

మర్నాడు – మొదటి కప్పు కాఫీ తాగుతూ – సారీ చెప్పాడు. అంతా విని, సునీత నిలకడగా అంది –

"ఒకటి గుర్తుంచుకో. ఇవాళ మన మధ్య ఉన్నది ఒక ప్రత్యేకమైన సంబంధం, ఎక్స్‌క్లూజివ్ రిలేషన్‌షిప్. దీనిలోకి పై వాళ్లెవరూ జొరబడకూడదు – ఆఖరికి మన పేరెంట్స్‌కి కూడా ఆ అవకాశం ఇవ్వకూడదు,"

"పెళ్లైన వాళ్లలాగానే అన్నమాట," అన్నాడు మాధవన్ – వెటకారంగా.

'పెళ్లి అనేది ఒక కుళ్లిపోయిన బూర్జువా వ్యవస్థ' అని అతని దృఢమైన అభిప్రాయం. దాన్ని తరచూ వ్యక్తం చేస్తూంటాడు. అలాగే లైంగిక స్వేచ్ఛ విషయంలో తనకున్నంత స్పష్టత వేరెవ్వరికీ లేకపోవడం అతన్ని ఆశ్చర్యపరుస్తూంటుంది.

ఆ సమయంలో అతని అభిప్రాయాలను వివరంగా చర్చించే ఆసక్తి లేకపోవడంతో,

"పోనీ అలానే అనుకో." అంటూ సునీత ఆ సంభాషణను అంతటితో ముగించింది.

ఆనాటి నుండీ తన గురించి కూడా అతడు ఎవరికి ఏం చెప్తాడో అని సునీతకి టెర్రర్ పట్టుకుంది. అంత గొప్ప మేధావి, అంత ఆరితేరిన ఆర్గనైజర్ – ఇంత ఫూలిష్‌గా ఎలా ప్రవర్తించగలడా అని ఆశ్చర్యపోయింది కూడా.

• • •

విద్యార్థి సంఘం ఎన్నికలలో తానింక పోటీ చెయ్యనని మాధవన్ మొండికేసాడు. పూజా కార్యదర్శి పదవికీ, సునీత సహాయ కార్యదర్శి పదవికీ పోటీ చేసి కొంచెం తేడాతో ఓడిపోయారు. మాధవన్ కనీసం ప్రచారంలో కూడా పాల్గొనలేదు. ప్రత్యర్థులు పదవుల్లోకి రాగానే మాధవన్ మీద లైంగిక వేధింపు ఆరోపణలు, వాటికి సంబంధించిన విచారణ ఊపందుకున్నాయి. సోషల్ మీడియాలో అతనికి 'ఎర్ర ప్లేబాయ్'గా ముద్ర పడింది. 'మీటూ' ప్రకటనలు కూడా వెలువడ సాగాయి. ఆ ఆరోపణల్లో చాలా వరకూ నిజం ఉందని సునీత, పూజా– ఇద్దరూ భావించారు.

మరో మార్గం లేక, ఎంతో అయిష్టంగా పూజా చొరవ తీసుకొని మాధవన్‌ని తమ సంస్థ నుండి తొలగించింది. సునీతకి ఇది బాధ కలిగించిందిగానీ ఏమీ అనలేక పోయింది.

ఉన్నట్టుండి ఒక రోజున అతడు ఫ్లాట్ ఖాళీ చేసి వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ –

"అంతా ఒకేసారి నా మీద కక్ష కట్టారు. ఇప్పుడు మీకు అర్థం అయిందా, నేనెందుకు ఎన్నికల జోలికి పోలేదో? మీరిద్దరూ పాపం ప్రయత్నించారుగానీ మీవల్ల కాలేదు. నేనే గనక పోటీచేసి ఉంటే ఫలితాలు ఇంకోలా ఉండేవి," అన్నాడు.

"నువ్వు చేసిన నిర్వాకం మూలాన్నే మేము ఓడిపోయాం," అనేసింది పూజా – నిర్మొహమాటంగా.

సునీత మౌనం వహించింది. అతని అహం దెబ్బ తిన్నదేగానీ అది అతన్ని ఇంకా వీడలేదని ఆమెకు అర్థం అయింది. ఏం జరిగినా మనుషులు మారరు అని ఆమెకు అనిపించి విచారం కలిగింది.

లైంగిక వేధింపుల విషయంలో మాధవన్‌పై వచ్చిన ఆరోపణలు విచారణలో ఋజువయ్యాయి. యాజమాన్యం అతన్ని సస్పెండ్ చేసింది. అతను స్వగ్రామానికి వెళ్లిపోతున్న సంగతి సునీత, పూజాలకు అతడి స్నేహితుల ద్వారా తెలిసిందిగానీ స్టేషన్‌కి వెళ్లడానికి వాళ్లకు మనస్కరించలేదు. వాళ్లిద్దరూ వస్తారని మాధవన్ ఎంతో ఆశతో ఎదురు చూశాడు. నిజానికి అతని స్నేహితులు ఏ ఒక్కరూ రాలేదు. తనకు వీడ్కోలు చెప్పేందుకు స్టేషన్‌లో ఎవరూ లేకుండా ఒంటరిగా ఊరు వదిలి వెళ్లిపోతున్నందుకు – అతనికి పట్టరాని దుఃఖం వచ్చింది. రైలు కదులుతూండగా టాయిలెట్‌లోకి వెళ్లి వలవల ఏడ్చాడు.

* * *

మాధవన్ వెళ్లిపోయాక తమ విద్యార్థి సంఘపు పరపతిని పునరుద్ధరించడానికి పూజా విశ్వప్రయత్నం చేసింది. కొంతవరకూ విజయవంతం అయింది. ఆ ప్రయత్నాలలో సునీత భాగస్వామ్యం కూడా ఉండాలని పూజా ఆశించింది. పాత స్నేహానికి కొనసాగింపుగా సునీత సహకరించిందిగానీ విద్యార్థి సంఘపు రోజువారీ కార్యకలాపాలలో పాల్గొనడానికి ఇష్టపడలేదు.

"మీరంటే నాకు గౌరవం ఉంది గానీ, మీ రాజకీయాల మీద నమ్మకం లేదు. సమస్య ఎక్కడో ఉంది. ఇంకెక్కడో పరిష్కారం కోసం వెతుకుతున్నారు" అని సునీత అన్నప్పుడు మాటకారి అయిన పూజా కూడా మౌనం వహించింది.

ఇది జరిగిన కొద్ది రోజులకే కేవలం విద్యార్థినుల సమస్యలపైనే దృష్టి పెట్టాలని సునీత నిర్ణయించుకుంది. అందుకు సమిష్టి అధ్యయనం అవసరం అనిపించి సోషలిస్ట్ ఫెమినిస్ట్ స్టడీ సర్కిల్ అనే సంస్థని స్థాపించింది. తన ఫ్లాట్‌లోనే చర్చలూ, తరగతులూ నిర్వహించనారంభించింది. ఒక బ్లాగుని కూడా సృష్టించింది. పూజా ఆమెకు తన పూర్తి సహకారాన్ని అందించింది.

మాధవన్ జాగాలో ప్రత్యర్థి శిబిరం నుంచి ఎన్నికైన విద్యార్థి సంఘం నాయకుడు మానస్ సింగ్ గురించిన వివరాలు పూజా ద్వారా సునీతకు తెలియ వచ్చాయి. అతడు తీవ్రమైన ఆడపిల్లల కొరతతో సతమతమవుతూన్న హర్యానా రాష్ట్రానికి చెందిన వాడు. అగ్రకులస్తుడు. మానస్ తండ్రి కుల్దీప్ సింగ్ ఒక జాతీయ రాజకీయ పార్టీలో జిల్లాస్థాయి నాయకుడు, భూస్వామి, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం లిక్కర్ డాన్. ఖరీదైన కార్లు, స్నేహితులతో బీర్లు, నైట్ క్లబ్బుల్లో డాన్సులు, తండ్రి ఆశీర్వచనాలతో విద్యార్థిగానే రాజకీయ రంగ ప్రవేశం – వీటి మధ్య మానస్ బియ్యే పూర్తయింది. తండ్రి ప్రోత్సాహంతో రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి కేంద్రస్థాయి చేరుకోవాలనేదే అతని ఆశయం. అందుకు మొదటి మెట్టు–ఒక ప్రముఖ యూనివర్సిటీలో విద్యార్థి నాయకుడిగా విజయం సాధించడం. ఈ విషయంలో తండ్రికి పూర్తి స్పష్టత ఉన్నది. అందుకే 'ఎంత ఖర్చయినా ఫరవాలేదు' అని కొడుకుని ముందుకి నడిపించాడు.

తన కజిన్ పెళ్లి రిసెప్షన్‌కని పూజా ఢిల్లీ వెళ్లినప్పుడు అక్కడ మానస్, అతని తండ్రి కనిపించారు. మానస్ పూజాని తన తండ్రికి పరిచయం చేస్తూ –

"ఇదిగో, ఈ అమ్మాయే మొన్నటి స్టూడెంట్ యూనియన్ ఎన్నికలలో మనకి గట్టి పోటీ ఇచ్చింది," – అన్నాడు, ఛార్మింగ్‌గా, నవ్వుతూనే.

"మీ తరం వాళ్లే మన రాజకీయ అజెండాను ముందుకి తీసుకెళ్లాలి," అన్నాడు కుల్దీప్, పంజాబీలో. ఆ తరువాత జరిగిన సంభాషణ చాలా వరకూ పంజాబీలోనే నడిచింది.

"ఆమె రాజకీయాలు వేరు, నాన్నా! వాళ్లది ఎర్ర పల్టన్,"

కుల్దీప్ నొచ్చుకున్నాడు. "అయ్యో, అలాగా! పెద్దవాడిని కాబట్టి చెబుతున్నాను. అలాంటి పనికిమాలిన అలగాజనంతో తిరగొద్దు. నష్టపోతావు. వాళ్లకి భవిష్యత్తు లేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మా మానస్‌తో కలిసి పనిచెయ్యి. నీకు కూడా మంచి అవకాశాలు ఉంటాయి."

"వినియోగించుకోవాలేగాని మాకు కూడా అవకాశాలకు లోటు లేదు." అంది, పూజా కొంచెం చిరాగ్గా. ఈ ముసలాడిని ఎలా వదిలించుకోవాలా అని అటూ ఇటూ చూసింది. కుల్దీప్ చెప్పుకుంటూ పోతున్నాడు –

"మా మానస్‌కి నీలాంటి వాళ్ల సలహాలు అవసరం. ఎమ్మే చెయ్యడానికి అంత దూరం ఎందుకు పంపాననుకుంటున్నావు? మా ఊళ్లో లేకనా?"

"నిజమే. మీ ఊళ్లోనే చదివించి ఉంటే సరిపోయేది"

మానస్ కేసి తిరిగి ఇంగ్లీషులో "మాకు సమస్యలు తగ్గేవి," అంది.

"నువ్వు భలే జోకులు వేస్తావు. సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉన్న ఆడవాళ్లు నాకు నచ్చుతారు" అని పూజాని ఇంప్రెస్ చెయ్యడానికి అన్నాడు గానీ, తెలివైన అమ్మాయిలు – ముఖ్యంగా మేధావంతులైన స్త్రీలు ఎదురైనప్పుడు మానస్‌కి కాస్త సంకోచం అనిపిస్తుంది. అతని సహజసిద్ధమైన డాషింగ్ హీరో స్టైలుకి వాళ్లు అడ్డు తగులుతారు.

'వీడప్పుడే మీరు లోంచి నువ్వులోకి వచ్చేశాడు. వీడికో డోసు ఇవ్వాలి,' అనుకుంది పూజా.

కుల్దీప్‌కి ఇవేవీ పట్టినట్టు లేదు. "మా బాగా అడిగావు! మా తరం వరకూ కులస్తులూ, ఊళ్లో వాళ్లూ చెప్పుచేతల్లో ఉంటే సరిపోయేది. ఇప్పుడు అలా కుదరదు – ముఖ్యంగా దిల్లీ స్థాయికి ఎదగాలంటే. (ఇక్కడ రెండోతరం యువ నాయకుల పేర్లు కొన్ని చెప్పాడు)... వీళ్ల మాదిరిగా ఇంగ్లీషు బాగా రావాలి. టీవీలో మాట్లాడాలి. మీడియాని మేనేజ్ చెయ్యాలి. జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారవేత్తలతో వ్యవహారాలు నడపాలి. ఈ వయసులో ఇవన్నీ నేర్చుకోవాలంటే మావల్ల అవుతుందా? మేము చూస్తూండగానే ప్రపంచం బాగా చిన్నది అయిపోయింది. వ్యాపార, రాజకీయ అవకాశాలు ఊహించనంతగా పెరిగిపోయాయి."

అకస్మాత్తుగా కుల్దీప్ మాటల్లో పూజాకి ఆసక్తి కలిగింది. "మీ నాన్న ప్రపంచీకరణ గురించి మాట్లాడుతున్నాడు" అన్నది మానస్‌తో.

"అవేవీ ఆయనకు తెలియదులేగానీ – అనుభవం మీద చెబుతున్నాడు."

"నువ్వూ మీ నాన్నా కలిస్తే ఒక గొప్ప అర్ధ–వలస, అర్ధ–భూస్వామ్య రాజకీయ కుటుంబం అవుతారు."

పూజా తమను పొగుడుతున్నదని మానస్ అనుకున్నాడు.

"థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్! అంతకన్నా కావాల్సింది ఏముంటుంది? కాక్‌టెయిల్స్ సెర్వ్ చేస్తున్నారు. నీకేం తెమ్మంటావు?" అంటూ ఆమె మోచేతిని అనవసరంగా తాకాడు.

'ఈ వెధవని ఒక కంట కనిపెడుతూ ఉండాలి' అనుకుంది. ఇంతలో పూజాకి పరిచయస్తులెవరో ఎదురయ్యారు. వాళ్లని పలకరించి అక్కడి నుండి జారుకుంది.

• • •

మానస్ అసలు స్వరూపం క్రమేపీ బయటపడ సాగింది. పూజా ఊహించినదాని కన్నా కూడా అతడు పూర్తిస్థాయి దిగజారుడు లుంపెన్ మనిషి. తన ఆరడుగుల ఎత్తు, మెలితిప్పిన మీసాలు, హేండ్ సమ్ ఆకృతితో, డాషింగ్ స్వభావంతో అమ్మాయిల్ని తన వెంట తిప్పుకుంటాడు. డబ్బుపోసి వాళ్ల సరదాలు తీరుస్తాడు. తన సరదా తీర్చుకుంటాడు. అలాగని ఎవరితోనూ దీర్ఘకాలిక సంబంధాలు పెట్టుకొనేటంత వెర్రివాడు కాదు. ప్రత్యేకించి – 'అనుభవ శూన్యులైన కన్యలను దారిలో పెట్టడం' అతనికి మహదానందాన్ని ఇస్తుంది. ఎల్లప్పుడూ గూండాలను, చెంచాలను వెంటబెట్టుకొని తిరుగుతూంటాడు. ఇటీవలే ఒక స్నేహితుని ఫాంహౌస్‌లో జరిగిన పార్టీలో నాలుగవ రౌండులో అడుగుపెడుతూ మానస్ తన లైంగిక అభీష్టాన్ని ఈ విధంగా ప్రకటించాడు: "సీల్ తోడ్నే మే మజా హీ కుఛ్ ఔర్ హై!" (సీళ్లను ఛేదించడంలోఉండే ఆనందమే వేరు!). అది ఈనోటా ఆనోటా పూజా, సునీతల దాకా పాకింది. అవకాశం దొరకగానే దెబ్బ తీయాలని వాళ్లిద్దరూ కూడబలుక్కున్నారు.

ఆ తరుణం రానే వచ్చింది. నిజానికి మానస్, అతని వెంట ఉండే గూండాలు ఆ అవకాశాన్ని స్వయంగా అందించారు. తమ రాజకీయ పెద్దల ఆదేశం మేరకు అమ్మాయిలు జీన్సు వేసుకొని యూనివర్సిటీకి రాకూడదనే నిబంధనను ప్రవేశపెట్టాలని మేనేజిమెంట్‌ని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఆ డిమాండ్‌ను వెంటనే ఆమోదించి, మితిమీరిన ఉత్సాహంతో అమలు చేయబూనింది. అమ్మాయిల హాస్టల్స్‌లో, కేంటీన్లలో, తరగతి గదుల్లో విస్తృతమైన చర్చలు జరిగాయి. అన్ని చోట్లా తీవ్రమైన నిరసన వ్యక్తమైంది. పూజా, సునీతా ఈ పరిణామాలను శ్రద్ధగా పరిశీలించారు. స్వతహాగా మంచి ఆర్గనైజర్ అయిన పూజా, ఇదొక తిరుగులేని అవకాశం అని తొందరగానే గ్రహించింది. సునీత సహకారంతో, తమ సంస్థ సభ్యుల తోడ్పాటుతో కార్యాచరణకు పూనుకుంది. సునీత ఫ్లాట్‌లో చర్చలు జరిగాయి. రాత్రికి రాత్రే పోస్టర్లు వెలిసాయి. బ్యానర్లు, ప్లేకార్డులు తయారయ్యాయి. కేంపస్ అంతటా ఎక్కడికక్కడ ఉద్రేకభరితమైన ఉపన్యాసాలు, చర్చలు, నినాదాలు. రాజకీయాలంటే ఆసక్తి చూపనివాళ్లూ, విద్యార్థి సంస్థలకు దూరంగా ఉండేవాళ్లూ పెద్ద సంఖ్యలో, ఉత్సాహంగా నిరసన సభల్లో పాల్గొనడం ఆర్గనైజర్లకే ఆశ్చర్యం కలిగించింది. రాత్రనక, పగలనక పూజా, సునీతల ఫోన్లు మ్రోగుతూనే ఉన్నాయి. మెసేజిలు వస్తూనే ఉన్నాయి. యూనివర్సిటీ లోపలే కాకుండా బయటి నుండి, ఇతర విద్యా సంస్థల నుండీ కూడా ఎంతో మంది మిత్రులూ, పరిచయం లేని వాళ్లూ నిరసనోద్యమానికి తమ మద్దతుని తెలియజేసారు. సహకారాన్ని అందించారు. సానుభూతిని ప్రకటించారు. ఇందుకుగాను సోషల్ మీడియా బాగా ఉపయోగపడింది.

రోజురోజుకీ ఉధృతమవుతూన్న ఉద్యమాన్ని ఎలా నియంత్రించాలో, ఏమి చెయ్యాలో యాజమాన్యానికి తోచలేదు. విద్యార్థి సంఘ నాయకుడైన మానస్‌నీ అతని అనుచరులనీ పిలిపిస్తే ఈ ఉద్యమంతో తమకెలాంటి సంబంధమూ లేదనీ, కొన్ని అరాచకశక్తులు దీని వెనుక ఉన్నాయనీ వాళ్లు స్పష్టం చేశారు. తమ నాయకత్వంగానీ, ప్రమేయంగానీ లేనట్టి ఉద్యమం అంతగా విస్తరించడం, వాళ్లకి అవమానకరంగా తోచింది. యాజమాన్యం గనక సహకరిస్తే తాము ఉద్యమకారుల అంతు చూస్తామని కూడా తెలియజేసారు. 'మీరు చెయ్యగలిగింది మీరు చెయ్యండి, మా వంతు మేము చేస్తాము' అన్నది యాజమాన్యం.

అంతే! మానస్ అనుచరులు ఉద్యమాన్నీ, ఉద్యమనాయకుల్నీ టార్గెట్ చెయ్యడం మొదలు పెట్టారు – ముఖ్యంగా సోషల్ మీడియాలో. కేంపస్ అంతటా పోస్టర్లు వెలిసాయి. గోడల మీద నినాదాలు కనిపించాయి. ఉద్యమకారులను దేశద్రోహులన్నారు. సరిహద్దులలో మన సైనికులు ఎముకలు కొరికే చలిలో నానా అవస్థలూ పడుతూంటే ఇక్కడ డ్రెస్ కోడ్ మీద ఈ రచ్చంతా ఏమిటన్నారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ ఎదురుదాడి అశ్లీలంగా, అసభ్యంగా తయారైంది. బెదిరింపులు, వ్యక్తిగత దాడులు మొదలయ్యాయి. పూర్తిస్థాయి నైతిక నియంత్రణ అవతరించే సూచనలు కనిపించాయి. తమకు ప్రధాన లక్ష్యాలుగా పూజానీ, సునీతనీ ఎంచుకున్నారు.

సునీతని 'తక్కువ కులం వాళ్లతో తిరిగే బజారు లం...'గా, పూజాని 'ఆడా మొగా కాని వింత మనిషి'గా ప్రచారం చేస్తూ ట్విట్టర్‌లో పోస్టులు అవతరించాయి. మాధవన్‌తో వాళ్లిద్దరికీ ఉండిన సంబంధాలపై అవాకులు చెవాకులు సృష్టించారు. మొదట్లో విస్తుపోయిన ఉద్యమకారులు తగిన రీతిలో జవాబు చెప్పాలని నిశ్చయించుకున్నారు. 'సీళ్లను ఛేదించడం' గురించి మానస్ చేసిన అసభ్యకరమైన ప్రకటన తాలూకు వీడియో రికార్డింగుని సంపాదించి సోషల్ మీడియాలో పెట్టారు. కొద్ది గంటలలోనే అది వైరల్ అయిపోయింది. అది చూసి అతడినీ, అతడి మిత్ర బృందాన్నీ అంతా అసహ్యించుకున్నారు.

అంతేకాదు, ఈ వాగ్యుద్ధం ఊహించని పరిణామానికి దారి తీసింది. దళితులూ, బహుజనులూ, ఎల్జీబీటీ (లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్ జెండర్) సమూహాలూ ఉద్యమానికి పూర్తి మద్దతుని ప్రకటించడమే కాకుండా నాయకత్వ శ్రేణిలో అగ్రభాగాన నిలిచారు. పరిస్థితి చెయ్యి జారిపోతున్నదని యాజమాన్యం గ్రహించింది. ఉద్యమ నాయకులపై భౌతిక దాడులు చేయించడానికి పూనుకున్న మానస్‌ని నివారించింది.

* * *

రాత్రి బాగా పొద్దు పోయే వరకూ చర్చలు జరిగాయి. దళిత, బహుజన విద్యార్థి నాయకులు పూజా, సునీతలతో బాటుగా తమ వాదనలను వినిపింపజేశారు.

యాజమాన్యం తన పట్టును వీడింది. అమ్మాయిల దుస్తులకు సంబంధించి ప్రవేశపెట్టిన నియమ నిబంధనలను బేషరతుగా వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఆ చలికాలపు ఉదయాన, తమ నాయకులు ఏ వార్తను మోసుకొస్తారో అని ఆతృతగా ఎదురుచూస్తున్న విద్యార్థులంతా హర్షధ్వానాలు చేశారు.

కేంపస్ అంతటా ఎర్ర జెండాలతో బాటు అంబేద్కర్ వాదుల నీలం జెండాలే కాకుండా ఎల్జీబీటీల ఇంద్రధనుస్సు రంగుల జెండాలు కూడా రెపరెపలాడుతున్నాయి.

"ఇంక్విలాబ్, జిందాబాద్!" నినాదం మిన్నుముట్టింది.

విజయోత్సవ సమావేశ వేదికకు చేరుకున్న పూజా, సునీతలిద్దరూ ఉద్వేగానికి లోనయ్యారు. అక్కడ గోడపై వెలసిన ఒక నినాదం వారి దృష్టిని ఆకర్షించింది.

'ఖబడ్దార్! మీ దయాధర్మ భిక్ష మాకు అవసరం లేదు. మా ప్రపంచాన్ని మేమే గెలుచుకుంటాం'

అది ఆర్గనైజర్లు తయారు చేసుకున్న నినాదాల జాబితాలోనిది కానేకాదు. ఎవరి మేధస్సు నుండో, లేక హృదయాల నుండో వెలువడిన నూతన ఆర్తనాదం. అది ఉద్యమకారుల మానసిక స్థితికీ, అకాంక్షలకూ ప్రాణప్రతిష్ట చేసింది. అట్లాంటి నినాదాలు ఇంకా మరికొన్ని కనిపించాయి.

పూజా సునీతతో అన్నది –

"దీని అర్థం ఏమిటో తెలుసా? ఉద్యమం మన జనాల జీవనాడిని పట్టుకున్నది. స్వయంచాలకంగా రూపు దిద్దుకుంటున్నది,"

సునీత అంగీకరించింది. "నిజం! మొన్నటి వరకూ శత్రువు ఎవరనేది నాకే స్పష్టంగా తెలియలేదు. ఇప్పుడు అందరికీ తెలిసిపోయింది,"

ఆనందంతో పూజా కళ్లు మెరిసాయి.

"మంచి మాట చెప్పావు. మాధవ్ ఉండి ఉంటే '1968నాటి పారిస్ విద్యార్థుల తిరుగుబాటు పునరావృతమవుతోంది' అనేవాడు."

"మీరింక తప్పుకోవచ్చు' అని కూడా అనేవాడు." అన్నది సునీత.

'అన్నిరకాల ఉద్యమాలకూ అగ్రవర్ణాల నాయకత్వం గుదిబండగా తయారవుతున్నది. వాళ్లు తప్పుకోవాలి. లేదా తప్పించాలి' అని ఒక్కోసారి హాస్యంగా, ఒక్కోసారి సీరియస్‌గా మాధవన్ అంటూండేవాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు. ఈ మహత్తర సందర్భంలో మాధవన్ తమ వెంట ఉండి ఉంటే బాగుండేదని ఇద్దరికీ ఎంతగానో అనిపించింది. అతడు తోడుగా లేనందుకు ఇద్దరికీ విచారం కలిగింది. ఉద్వేగంతో ఒకరినొకరు హత్తుకున్నారు.

* * *

నిరసన ఉద్యమం విజయవంతమైన కొద్దిరోజులకే కేరళ నుండి ఒక దుర్వార్త వెలువడింది. బైక్‌మీద వెళుతూ మాధవన్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తాగి ఉన్నాడని మరణించాక జరిపే వైద్య పరీక్షలలో తెలిసింది. వివిధ సంఘాలు ఏకమై కేంపస్‌లో సంతాప సభను నిర్వహించారు. పూజా, సునీతలు అతన్ని ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకున్నారు. ఆ రోజు రాత్రి పూజా, సునీత ఫ్లాట్‌కి వచ్చింది. వాళ్లిద్దరూ మాధవన్‌తో తమకు ఉండిన వ్యక్తిగత సంబంధాన్ని తలచుకున్నారు. అప్పుడు పూజా ఒక మాట అన్నది –

"గొప్ప స్వేచ్ఛ అంటే గొప్ప బాధ్యత అని మాధవ్‌కు మేధాపరంగా తెలుసుగానీ ఆచరణలో బాధ్యతారహితంగా ప్రవర్తించాడు."

"నిజమే గానీ ఇక్కడ మరో అంశం కూడా ఉంది. మనకెవ్వరికీ కూడా ఈ విషయాల్లో పూర్వానుభవం లేదు. ఆ మాటకొస్తే మన సమాజానికే లేదు. అన్నీ అందరికీ కొత్తే. అలాంటప్పుడు చాలా పొరబాట్లు జరుగుతాయి. మాధవన్ తరచూ అంటూ ఉండేవాడు – 'మునుపెన్నడూ సాధించని లక్ష్యాలను చేరుకోవాలని కోరుకొనేవాళ్లు ఇంతవరకూ ఎవరూ నడవని మార్గంలో ప్రయాణించడానికి సాహసించాలి' అని.  నీకు గుర్తుందా?" అన్నది సునీత.

పూజా ఏదో అనబోయింది. భావావేశంతో ఆమె గొంతు పెగల లేదు. సునీతని దగ్గరకు తీసుకొని ఆమె భుజంపై తన తలను వాల్చింది.

# పూవై పుట్టి



## వనజ తాతినేని

కథలను విరివిగా రాసే రచయితలలో ఒకరు. కథలు రాయడాన్ని ఎంత ఇష్టపడతారో, చదవడాన్ని కూడా అంతే ఇష్టపడతారు. మ్యాగజైన్స్‌లో వచ్చే ఇతరుల కథలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తెలుగు కథను ఎక్కువ మందికి చేర్చాలన్న ఇష్టాన్ని కనబరుస్తుంటారు. 1967లో విజయవాడకు దగ్గర్లోని తాడిగడపలో జన్మించారు. గత పదిహేనేళ్లుగా వందకు పైగా కథలు రాశారు. 'రాయికి నోరొస్తే...', 'కులవృక్షం' వీరి పుస్తకాలు. 'సమాజంలో నాకు కనిపించే జీవితాలే నా కథలు' అని చెబుతారు.

నివాసం : విజయవాడ.

మొబైల్ : 99859 81666

“రచయితలను నేరుగా స్వర్గానికి కదా తీసుకు వెళ్ళాల్సింది. విచారణకు ఇక్కడకెందుకు తీసుకొచ్చారు?” అని అడిగింది పెద్ద వెలుగు.

“ఈమె స్వర్గానికి వెళ్ళడానికి గింజుకుంటోంది. తనకు అర్హత లేదంటోంది. అందుకే మీ ముందుకు విచారణకు తీసుకుని వచ్చాము” అని చెప్పింది చిన్న వెలుగు.

పెద్ద వెలుగు బూడిద రంగు సూక్ష్మ శరీరంగా ఉన్న ఆమె వైపు తిరిగింది.

“యిక్కడ స్వర్గం, నరకం మాత్రమే నిజం. స్వర్గమంటే వెలుగు. నరకమంటే చీకటి. రచయితంటే తను సృష్టించే యే పాత్ర పైనా పక్షపాతం లేకుండా ధర్మదేవతలా నిలబడే వాడనికదా అర్థం. అందుకే మీరు చేసిన పాపాలతో నిమిత్తం లేకుండా సూక్ష్మ శరీరంతో ప్రయాణిస్తూ వెలుగులోకి చేరుకున్నారు. వెళ్ళండి. వెళ్లి ఈ వెలుగును మరింత అనుభవించండి” అంది పెద్ద వెలుగు.

“లేదు లేదు నాకొక కోరిక వున్నది. అది తీరువరకూ నన్ను ఆ లోకంలోనే సంచరించే అవకాశం ఇవ్వండి” అభ్యర్థించింది బూడిద రంగు సూక్ష్మ శరీరం.

“అలా ఎందుకు కోరుకుంటున్నారో మీరు విన్నవించుకోగల్గితే ఆలోచిస్తాం” అంది పెద్ద వెలుగు.

బూడిద రంగు సూక్ష్మ శరీరం తన వేదనను యిలా వినిపించసాగింది.

“రచయిత సృష్టించిన పాత్రలలో తమను చూసుకుని లీనమవుతూ లేదా తమకు తెలిసిన వారినెవరినైనా స్ఫురణకు తెచ్చుకుంటూ పాఠకులు రచనలో మమేకమై పోతుంటారు. రచయితకి యిలా జరిగే ఉండొచ్చు అని కూడా వూహిస్తారు.

అది నాకు ఎప్పుడూ ఇబ్బంది కాదు. కానీ యిప్పుడక్కడ నన్నెవరూ అభిమానంగా చూడటం లేదు.  కనీసం వేడుకలు, పూలదండలు యేమీలేవు. దుర్మార్గురాలు, ద్రోహి అని నిందలు. సమస్తం మాధవమయం అని మధుర భక్తితో వూరేగినన్నాళ్లు వూరేగి తర్వాత హఠాత్తుగా నల్లముసుగు వేసుకుంటుందా... అని తిట్టిపోస్తున్నారు. నన్నెవరూ అర్థం చేసుకోవడం లేదు, పత్రికల వాళ్ళు కొందరైతే నా గురించి యిష్టం వచ్చినట్లు వండి వడ్డిస్తున్నారు. నేను యెంతో బాగా వ్రాస్తానని మెచ్చుకుని అభిమానంతో వూగిపోయిన పాఠకజనం కూడా నా చిత్రాన్ని చూసి ముఖం తిప్పేసుకుని మరలా ఆపుకోలేని వుత్సాహంతో ఆ రాతల్ని ఆసక్తిగా చదువుతున్నారు. ఏ వొక్కరూ కూడా నను అదివరకటిలా మనఃస్ఫూర్తిగా హృదయానికి హత్తుకోవడం లేదు. ఎవరికి వారు నువ్వు ఇంకో దేవుడి తాలూకా అన్నట్టు అనుమానంగా చూస్తున్నారు. మీరన్నట్టు చదువరి కూడా న్యాయదేవతలా నిలబడి నన్ను ఇష్టా ఇష్టాలున్న మనిషిగా గుర్తించి నా వ్యక్తిగత జీవితంతో సంబంధంలేని ఒక రచయితను మాత్రమే ఆ రచనల్లో చూసినప్పుడు నాకు మనఃశాంతి వుంటుంది. అప్పుడే యీ వెలుగు లోకంలోకి వస్తాను. అప్పటిదాకా నన్ను సూక్ష్మరూపంలో ఆ లోకంలోనే సంచరించడానికి అనుమతి ఇప్పించండి." అని వేడుకుంది ఆ బూడిదరంగులో కనబడుతున్న సూక్ష్మ శరీరం.

"సరే! మీ వేదన జాలి గొలుపుతోంది. అనుమతి ఇచ్చాము వెళ్లిరండి." అంది పెద్ద వెలుగు.

అలా ఈ భూమిపై చేరుకొని సంచరిస్తూ వుంది బూడిదరంగు సూక్ష్మశరీరం. వెతుకుతూ వుంది. ఆ శరీరానికి రోజులే, కానీ ఈ లోకంలో యేళ్ళుకేళ్ళు గడిచిపోతున్నాయి. ఆమె సూక్ష్మశరీరం సహస్రాక్షుడిగా మారి భూమిపై తాను సృజించిన అక్షరాలను చదువుతూ తన చిత్రాలను చూస్తూ వున్న వారి మెదడునూ మనసునూ పట్టిపట్టి చూస్తుంది. కొందరు అభిమానంగా తల్చుకుంటున్నారు. కొందరు మంచిగానూ, చెడుగానూ, మధ్యస్థంగానూ తల్చుకుంటుంటే సంతోష పడుతూనే, తనకు కావాల్సిన అభిప్రాయం కోసం సహనంగా ఎదురుచూస్తోంది.

ఇప్పుడు ఆ సూక్ష్మశరీరం ఓ కార్పొరేట్ హాస్పిటల్లో టీవీ చూపిస్తున్న దృశ్యాల ముందు ముగ్గురి మనుషుల మధ్య జేరి ఆసక్తిగా చూస్తోంది. ఆ సూక్ష్మశరీరానికి సంతోషంగా కూడా వుంది– అక్కడ కొన్నేళ్ళు తనతో మెలిగిన మున్నీని చూసి.

• • •

సెలైన్ బాటిల్‌లో కలిసిన డ్రగ్ చుక్కలు చుక్కలుగా రాలి శరీరంలోకి ఎక్కుతోంది. మగతగా కళ్ళు మూసుకున్న భర్తను చూస్తూ, టీవీ ఆన్ చేసి ఛానల్స్ మార్చుతుంటే, ఓ చానల్లో ఆ ప్రఖ్యాత రచయిత గురించి సంస్మరణ కార్యక్రమం వస్తోంది.

అక్కడ ఆగిపోయింది పద్మ.

నర్స్ మున్నీ వచ్చి పేషంట్‌ని సెలైన్ బాటిల్‌ని చూసి "అవసరమయితే బజర్ నొక్కండి. ఇంకొక బాటిల్ యెక్కించాలి" అని చెపుతూ, యధాలాపంగా టీవీ వంక చూసి కొన్ని నిమిషాలు అక్కడే అలాగే నిలబడిపోయి "కొన్ని సత్యాలు అసత్యాలుగా అసత్యాలు సత్యాలుగా చెలామణి అవుతూ ఆ ప్రేమమయి చరిత్రకు మసి పూస్తుంటే బాధ కలుగుతోంది" అంది.

"ఆమె గురించి మీకు తెలుసా, ఆమె రచనలు చదువుతారా?" ఆసక్తిగా అడిగింది పద్మ.

"ఆమె నా ఆలోచనల్లో ఇరవయ్యేళ్ళకు పైగానే ప్రయాణిస్తూ ఉంది. ఆమె అనంత ప్రయాణం ముగిసి తొమ్మిదేళ్ళు. ఆమెతో కొన్నేళ్ళు కలిసి వున్నాను కూడా" అంది...

"నిజంగా" మరింత ఆశ్చర్యం పద్మ ముఖంలో.

"అవును" అంది బలవంతంగా నవ్వుతూ. అప్పటికే  ఆ నర్స్ ముఖంపై నీలినీడలు.

"భోజనం చేసి త్వరగా వచ్చేయండి. మీ దగ్గర ఆమె గురించిన విషయాలు చాలా వినాలి. ప్లీజ్ చెపుతారు కదా!" అంది పద్మ  వొకింత ఉద్వేగంగా.

"తప్పకుండా. కొన్నేళ్ళుగా యెవరితో పంచుకోవాలో తెలియని బాధని మీతో పంచుకుంటాను" అంటూ తెరపై వో మూలగా కనబడుతున్న ఆమె ఐకాన్‌ని చేతితో ప్రేమగా ఆత్మీయంగా తడిమి చిప్పిల్లిన కళ్ళతో బయటకి వెళ్ళిపోయింది.

తనంటే ఇంత గాఢాభిమానం వుందా మున్నీకి. ఆమె ఏమి చెపుతుందో తప్పక విని తీరాలి అనుకుంది సూక్ష్మశరీరం. అంతలోనే అసలు తన కొడుకు లేమనుకుంటున్నారో తెలుసుకోవాలి. ముందు చిన్న కొడుకింటికి వెళితే బాగుంటుంది అనుకుని అక్కడికి చేరుకుంది.

అక్కడ చిన్న కొడుకు ఆదిత్య పత్రికలో తల్లి గురించి  వ్రాసిన విషయాలని చదివి ఆవేశపడుతున్నాడు. భార్య ఉషతో "మా అమ్మ గురించి యేమి చెప్పాలనుకుంటుందీమె? అమ్మని ప్రపంచం ముందు చపలచిత్తురాలిగా చిత్రించడం నాకసలు నచ్చలేదు. అమ్మది  యెంత దృఢ సంకల్పం. ఒకసారి నిర్ణయం తీసుకుంటే యెన్నటికీ మార్చుకోదు. మతం మార్చుకునే ముందు అన్నయ్య, పిల్లలు, బంధువులు యెందరు అభ్యంతరం చెప్పినా ఆమె అనుకున్నదే చేసింది. ఆమె పట్టుదలే నాకూ వచ్చింది. కాబట్టే ఆఖరి క్షణాలలో ఆమె చెవిలో నారాయణ నారాయణ అంటూ

మంత్రాన్ని జపించాను. నాది కాని మతాన్ని ఆవహింపజేసుకుని ఆమెకి సాంత్వన కల్గించలేదు. నీకు తెలుసు కదా యిదంతా. నువ్వేమనుకుంటున్నావు వీటి గురించి?" అని అడిగాడు తీవ్రంగా.

"నిజమేనండీ. ఎవరి యిష్టాలు వారివి. అత్తయ్యగారు జీవితంలో వందలమంది పురుషులని చూపులతోనే వొడపోసి వుంటుంది. ఇప్పుడీ అపవాదులని మోస్తోంది. నాక్కూడా అమితమైన కోపం వస్తోంది" అంది ఉష.

"జీవన నాటకంలో అందరూ పాత్రధారులేనట. ఆమె జీవితంలోనూ అతనొక పాత్రధారుడట. శుక్లపక్ష తదియ లాంటి అతని నవ్వులో ఆకర్షణ వుండటం నిజమే కావచ్చు. నాలుగు మెరమెచ్చు మాటలు చెప్పి కొన్ని గజల్స్ వినిపించి సంతోషం కల్గించి వుండుంటాడు. అంతమాత్రానికే తన కొడుకుల వయసు కన్నా చిన్నవాడైన అతనితో అలాంటి బంధంలోకి వెళుతుందా? అని రాసింది. అసహ్యంగా వుంది. తమ జీవితాలను యెలా తీర్చిదిద్దుకోవాలో, సంతోషంగా యెలా వుండగలమో తెలుసుకోలేని మూర్ఖులు యితరుల జీవితాల్లో జోక్యం చేసుకోవడం పరిపాటి అయిపోయింది. కల్పనకి కూడా హద్దూ పద్దూ వుండొద్దూ" అని విసుక్కున్నాడు.

చిన్నకొడుకు కోడలు మాటలు విని నవ్వుకుంది సూక్ష్మ శరీరం.

పెద్దన్నయ్య భాస్కర్‌తో మాట్లాడాలని కాల్ చేస్తున్నాడు ఆదిత్య. లైన్ ఎంగేజ్లో వుంది. భార్యతో మళ్ళీ తల్లి గురించిన మాటల్లో పడ్డాడు.

"ఆమెకి దొరకనిదీ వెతుకుతున్నదీ వొకటే. అది సుసాంగత్యం. అమ్మ అన్ని మతగ్రంధాలను చదివేది కదా! బైబిల్ ఖురాన్ బౌద్ధ గ్రంధాలను యెన్నింటిని చూడలేదు మనం ఆమె బల్ల మీద?" అన్నాడు తన అభిప్రాయాన్ని బలపరుచుకుంటూ.

"అవునండీ. మన తోటలో ఒక మొక్క నాటి అత్తయ్యా గారి విగ్రహం పెడదాము. అలా చేస్తేనన్నా ఆమె ఆత్మ శాంతిస్తుంది" అంది ఉష.

"వద్దొద్దు. ఆ పని చేస్తే మళ్ళీ మనం పత్రికల నోళ్ళలో మరికొన్నాళ్లు నానుతాము. పొరుగురాష్ట్రంలో మరణించితే స్వరాష్ట్రానికి తీసుకెళ్లి అధికార లాంఛనాలతో ఆమెను సాగనంపడం ఎంతైనా అమ్మకి దక్కిన అపురూప గౌరవం కదా" అన్నాడు గొప్పగా.

"లోకానికి వెరవకుండా నీ మనసుని అనుసరించు అనే కదా అత్తయ్యా వ్రాసినది. ఆమె వ్రాసిన రాతలతో అతికొద్ది సత్యం అప్రమేయమైన వూహలు మాత్రమే యెక్కువగా వుండేవి. సంచలనం కోసం యేవేవో రాస్తే వొకప్పుడు ఆమెని నిందించింది కుటుంబం. ఆమె మతం మార్చుకున్నాక ఆమె తోడబుట్టిన వాళ్ళు

కూడా యేదో వొక వ్యాఖ్యానం చేస్తున్నారు. బాధగా వుంటుందండి" అంది కోడలు.

"అన్నయ్య యేమి ఆలోచన చేస్తున్నాడో. తన గౌరవానికి భంగం కల్గుతుందని విసుక్కున్నవాడు యిలాంటి సమయాల్లో ఖండించవద్దూ. మా అమ్మకి అలాంటి వుద్దేశ్యం విచారమూ వుండేది కాదు. ఆమె మనఃస్ఫూర్తిగా ఆ మతాన్ని ప్రేమించింది ఆలింగనం చేసుకుంది అని చెపుతాడా? చెప్పడా?" అని ఆదిత్య అనుకుంటుండాగానే పెద్ద కొడుకు భాస్కర్ నుండి కాల్ వచ్చింది.

"అన్నయ్యా అసలు ఏమనుకుంటున్నావ్ నువ్వు" అని అడిగాడు ఆదిత్య.

"అమ్మ మనసులో యేముందో నాకు మాత్రం యేమి తెలుసు. నీ దగ్గరేగా యెక్కువ కాలం వుంది. మంచిగానో, చెడుగానో మనకి ఒక ఖ్యాతిని ఆర్జించి పెట్టిన అమ్మని అగౌరవపరచడమెందుకు? నువ్వన్నట్టుగానే నేను ఒక ట్వీట్ చేస్తాను" అని ఫోన్ పెట్టేసాడు.

ఉస్సూరుమంది సూక్ష్మ శరీరం. వీడికెప్పుడూ హడావిడే. తమ్ముడితో యెక్కువసేపు మాట్లాడితే వాడికి అనుమానాలు తీరిపోయేవిగా అనుకుంది. ఇక రెండవ కొడుకు కిరణ్ యింటికి వెళ్ళింది.

అక్కడ ఒక పత్రికలో వున్న అమ్మ ఫోటోని చూసి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నాడు కిరణ్. మా అమ్మ మహారాణిలా యెంత అందంగా వుంది. ఈమె కడుపున కదా తానూ జన్మించినది. ఆమె ప్రేమ మధ్య వాడైన తనపైన కూడా యెంతో వుండేది. ఆ యిద్దరిని వదిలేసి తన రచనలపై పూర్తి హక్కుని నాకే వ్రాసి యిచ్చింది. ఆమె మనసుని నాకన్నా యెక్కువ చదివినవారు యెవరుంటారని? ఆమె ప్రాణ స్నేహితులు సెన్సేషన్ కోసం ప్రపంచానికి యేదైనా చెప్పవచ్చు, యేమైనా సృష్టించవచ్చు. ఎవరినీ నమ్మడానికి వీలులేదు– అసహనంగా అనుకుంటూ యింకొక పత్రిక వైపు చూసాడతడు. ఆ పత్రికలో మారిన మత సంప్రదాయ వస్త్రాలు ధరించి మార్చుకున్న పేరుతో వున్న చిత్రం ఒకటి.

తానిప్పుడు నట్టింట్లో యే ఫోటో పెట్టుకోవాలి? అన్న చిన్న సందేహం వచ్చింది. దాంతో పాటు ఆమె గురించి బాగా తెలిసిన సహాయకురాలు పత్రికలవారికి వున్నవీ లేనివీ చెపుతూ వుండవచ్చు అని అనిపించింది. ఆమె నెంబర్ కోసం చూసాడు. దొరకలేదు. అప్పటికప్పుడు ఇద్దరు ముగ్గురిని వెతికి వారిని అడిగి ఆమె నెంబర్‌ను అడిగి తీసుకుని వెంటనే ఆమెకి కాల్ చేసాడు.

"మున్నీ, మీరు పత్రికల వారికి అమ్మ గురించి యే విధమైన సమాచారం యివ్వడం అంత మంచిది కాదు. కుటుంబానికి యెంత గర్వకారణంగా ఆమెని మోసామో అంతకన్నా యెక్కువ అపకీర్తినిపుడు మోయాల్సి వస్తోంది. దయచేసి

మా బాధని అర్థం చేసుకుని పత్రికలవాళ్ళని దగ్గరకి రానీయకుండా వుంటే మంచిది." అని హెచ్చరిస్తూనే "యిది ఆమె అభిమానిగా మీ కర్తవ్యమ్ కూడా" అంటూ చిన్నపాటి ఎమోషన్‌ని జతచేసాడు మాటల్లో.

"కిరణ్ బాబూ ఆ మాత్రం నాకూ తెలుసు. అయినా నేనెక్కడో రెండు రాష్ట్రాల అవతల వున్నాను. మీరు నిబ్బరంగా వుండండి. కానీ అమ్మ గురించి మీకు తెలియని విషయాలుంటాయి కదా, పోనీ అవేంటో మీకైనా చెప్పనీయండి" అంటూండగానే "వద్దు, అలాంటివి వినే ఆసక్తి, అవసరం నాకు లేదు. నాకే కాదు యింకెవరికి చెప్పే ప్రయత్నం చేయొద్దు" నిష్కర్షగా చెప్పి అని ఫోన్ పెట్టేసేడు.

సూక్ష్మ శరీరం విరక్తిగా నవ్వుకుంది. ఇంతకన్నా తన కుటుంబం నుంచి యేమి కోరుకున్నాను గనుక అనుకుంటూ అక్కడి నుంచి తప్పుకుంది.

కిరణ్ మాటలు విన్న మున్నీ రాయిలా నిలబడిపోయింది కాసేపు.

ఎంత చెడ్డదీ లోకం. సత్యాన్ని మరుగుపర్చడమే దాని నైజం. దేనినైతే ఆమె అమితంగా ద్వేషించేదో అదే నిజమవుతోంది. తనవాళ్లు పరాయి వాళ్ళు యెవ్వరూ దానికతీతులు కారు అంటూ వుండేది. అదే నిజమవుతుంది.

ఏడెనిమిదేళ్లపాటు ఆమెతో కలిసి వుంది. ఆమెని, ఆమె ద్వారా లోకాన్ని చదవగల్గింది ఆమె. ఈ పాపిష్టి లోకపు మాటలు అంటని సుదూర తీరాలకేగిపోయాక కూడా అప్పుడు పొడిచి చంపిందికాక, తీరికగా మళ్ళీ పొడిచి పొడిచి చంపుతున్నారిపుడు. అప్పటికప్పుడు జ్ఞాపకాల గుట్టలని తవ్విపోస్తూ తనకిష్టమైన ఆమె కవిత్వాన్ని గుర్తు తెచ్చుకుంది.

మర్నాడు ఆ కవిత్వాన్ని చదివి వినిపించింది హాస్పిటల్‌లో పద్మకి.

• • •

బ్రతికుండగానే ఆత్మని సమాధి చేసి

పవిత్రత ముసుగేసుకునే ప్రపంచానికేమి తెలుసు ప్రణయబాధ.

కురిసి కురవక మరలి వెళ్లే మేఘాలను చూస్తూ

ఇసుక తుఫాన్‌గా మారిన ఎడారి యెదబాటు కథ

హృదయాలను కెలకకండి ఆలోచనలను త్రుంచ ప్రయత్నం చెయ్యకండి.

భూతద్దాలతో అంతరంగాలను శోధించే పని మొదలెట్టకండి.

బడబాగ్నులు దాచుకున్న మహాసముద్రం వాళ్ళు

యేదో వొకనాడు దావానలంలా చుట్టేస్తారు వాళ్ళు

• • •

వింటున్న బూడిదరంగు సూక్ష్మశరీరం ఆనందంతో నాట్యం చేసింది.

“అక్షరాలా ఈ విస్ఫోటనం ఆమెది కాక మరెవరిది. అభిమానులు ఆమె వాక్యాన్ని చప్పున పోల్చుకోగలరు, వెనువెంటనే హారతి యివ్వగలరు. శీర్షికల క్రింద పేరు చూసి పాఠకులు ఆత్రుతగా చదువుకునే సంచనల రచనలు చేసేది. స్త్రీల కోరికలు, దుఃఖం మరియు నిరాశ గురించి నిజాయితీగా మాట్లాడేది ఆమె. గజగామిని వీపు ప్రదర్శన, చాందిని నడుము ఒంపులు, టబు కటినాట్యం చూసే రసిక ప్రేక్షకులున్న దేశంలో కళని, స్త్రీ అంతరంగ వేదనని యెగతాళి వ్యాఖ్యలతో వొంకర నవ్వులతో లెక్కించే సమాజంలో ఆమె స్త్రీల గురించి యేమి వ్రాసినా అబ్బురంగా చదివిన పాఠకులు లక్షలమంది. ఆమె అభిమానిని అని చెప్పుకోవడమూ నాకు గర్వంగానే వుంటుంది. ఆమె దగ్గరే నాకు వుద్యోగం దొరుకుతుందంటే సంతోషం కాదు. ఇష్టంగా వుద్యోగంలో చేరాను. ఆమె భర్త చనిపోయిన రోజులవి. బిడ్డలు యెవరి దారిన వాళ్ళు యెగిరిపోతే తోడు కోసం నన్ను నియమించుకుంది. ఆమె మంచి హాస్యప్రియురాలు. చీటికీ మాటికీ పెద్దగా నవ్వేది. ఆ నవ్వులో అమాయకత్వమే కనబడేది. ఆశగా వుత్సాహంగా చైతన్యంగా వుండేది. ఏ విషయాన్నైనా నిర్భయంగా ధారాళంగా తార్కికంగా మాట్లాడే ఆమె దగ్గరకి నిత్యం యెందరో మిత్రులు పత్రికా రంగం వారు అనేకులు వచ్చిపోతుండేవారు.

అభిమానిని అంటూ ఫోన్ చేసిన అతనికి అపాయింట్మెంట్ కూడా కుదిర్చి పెట్టింది నేనే. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం. వేళ్లల్లో వేళ్ళు జొనుపుకుని మంచంపై కూర్చున్న ఆమెని సమీపిస్తూ ఆమె గోరింట గోళ్లని చూస్తూ నా హృదయ రుధిరంతో

వీ ు

గోళ్లు ఎర్రబారినట్టున్నాయి. అంతగా మీ భావాలతో నన్ను గుచ్చి చంపారు అంటూ ఆమె పాదాలకు కొంచెం ఎడంగా వినయంగా నేలపై కూర్చున్నాడు.

ఆమె బిగ్గరగా నవ్వింది.

ఇచ్చిన రెండు గంటల సమయం దాటి మరో మూడు గంటలు పైగా అతని ఆకర్షణీయమైన కబుర్లతో రచనలపై అభిప్రాయాలతో గడిచిపోయాయి. ఆకలవుతుందని అడిగిన అతనికి అప్పటికప్పుడు స్వయంగా వొండి వడ్డించింది. వెళ్ళేటప్పుడు తాను వ్రాసిన పుస్తకాలన్నింటిపైనా ఆటోగ్రాఫ్ యిచ్చి బహూకరించింది.

అది మొదలు ఆమెకి ప్రతిరోజూ అతని నుండి ఫోన్ కాల్స్ వస్తూ వుండేవి. విదేశాలు వెళ్ళినప్పుడు అక్కడి నుండి కూడా ఆమెకి కాల్స్ వచ్చేవి. గంటల తరబడి

ఆకలి దప్పికలు మరచి అతనితో సంభాషిస్తూ వుండేది. అతని సంభాషణలన్నీ గ్రీష్మపు గాలిలో మొగలి పూల వాసనని మూటగట్టుకుని వచ్చి మొహంపై కొట్టినట్లు వుండేవని వ్యాఖ్యానించేది .

ఆమె ఊహలన్నింటిని ఊసులుగా మార్చి అందమైన భాషలో సంభాషించేవాడు. ఆమె డిజైర్స్‌ని ఆకళింపుజేసుకుని యెలా మాట్లాడితే ఆమెకి నచ్చుతుందో గ్రహించి అలాగే సంభాషించి ఆమె మనసుకి దగ్గరైపోయాడు. అతను సమ్మోహనంగా నవ్వినప్పుడల్లా నేరుగా వచ్చి హృదయానికి దిగబడినట్లుంటుందని తనకి కల్గిన భావాలని సంకోచం లేకుండా చెప్పేది.

ఒకరకంగా సునామీలా ఆమె జీవితంలోకి వచ్చాడతను. నిప్పుని వొడిలో దాచుకున్నట్లు అసంతృప్తిని యాభై ఏళ్ళు దాచుకుని బ్రతికింది ఆమె. తాను సుఖించడం ఆదేశించడమూ తప్ప తన మనసులోకి తొంగి చూడలేకపోయిన భర్తను తృణప్రాయంగా తుడిచేసిందనే అనిపించేది.

కొన్నాళ్లతర్వాత అతని ఆహ్వానం మేరకు అతని అతిధి గృహానికి వెళ్లాం. ఆ ఇల్లు నది వొడ్డునే వుంది. మసక చీకట్లో నది వొడ్డున కూర్చున్న ఆమె వద్దకు వచ్చి ఆలస్యానికి చింతించమని అడుగుతూ నదిలో కాళ్ళు జాపుకుని కూర్చున్న ఆమె పాదాలపై దోసెళ్లతో నీళ్లు వొంపుతూ “ఎచట నీ పదాంకముల నీక్షింతు నచట అడవి దారియు నందన వనమట్లు తోచు” గజల్ వినిపించాడు.

ఆమె నవ్వుతూ అతని వంక చూసింది.

అతని కళ్ళల్లో ఆరాధనకి చలించిపోయినట్లయింది. అతి తేలికగా అతని బాహువుల మధ్య ఆమె. నేనొకదాన్ని వున్నాననే స్పృహ కూడా లేకుండా నదిలో స్నానాలు, చేతిలో చెయ్యేసి తిరగడాలు కొసరి కొసరి తినిపించుకోవడం అలా మూడు రోజులపాటు వారిద్దైన సామ్రాజ్యంలో విహరించారు. రచనలలో స్త్రీల ఆలోచనల గురించి రచయితగా యెంత స్పష్టమైన ప్రతిబింబమో వ్యక్తిగా అంత అస్పష్టమైన ఆలోచనలతో అమాయకంగా అతని మోహంలో చిక్కుకుంది. తన ఆలోచనలతో యేకాభిప్రాయం గల, తన మేధని మెచ్చుకోగల స్నేహితుడిని ఆకాంక్షించిందేమో. వయసు పెరిగేసరికి జ్ఞానం తెలిసేకొద్దీ సంస్కారం పెరిగేకొద్దీ కొత్త అభిరుచులు మేల్కొని కోర్కెలు బలపడతాయేమో అనిపించేది నాకు.

వీడ్కోలు తీసుకుని వచ్చిన కొన్నాళ్ళకి ఆమె యింట్లోనే కొద్దిమంది మత పెద్దల మధ్య ఆమె మతం మార్చుకుని పేరు కూడా మార్చుకుంది. వారు ఆమెకి కొత్తగా మారిన మత సంప్రదాయ దుస్తుల్ని బహూకరించారు. ఆమె నిర్ణయం నన్నే కాదు లక్షల ఆమె అభిమానులని గాయపరిచింది. సంప్రదాయాల ముసుగులో

మనిషిని అవమానించే మత విశ్వాసాలపై వెగటు పుట్టిందని తనకి కావాలనుకున్నది స్వల్పంగానైనా దక్కించుకున్నానని సంతోషంగా చెప్పేది. ఇదే విషయాన్ని ఆమె మిత్రురాలికి ఫోన్‌లో చెబుతూ వుండేది.

ఆమెని బంధువులందరూ వెలి వేశారు. ముఖ్యంగా వృద్ధురాలైన తల్లిని చూడలేకపోవడం ఆమెకి అమిత బాధ కల్గించింది.

స్త్రీ అంతరంగం సముద్రం లాంటిది. లోతుపాతులు చెలియలికట్టలు తెలుసుకొనుట మానవమాత్రులకి అసాధ్యం. ఆ కాలంలో పత్రికలలో వచ్చిన గూఢ చిత్ర కవితలు కూడా ఆమె మనసుని తెలియజేసాయి.

మనుషులని మతాల వారీగా విడదీసే మనుషులకేమి తెలుసు? మతాలకి అతీతమైనది మానసిక ప్రేమ. దశాబ్దాలపాటు తన మానసిక ఆధారమైన మాధవుడ్ని మరిపించే ప్రేమ నాకు లభ్యమైనప్పుడు ఆ మతాన్ని తృణప్రాయంగా విసర్జించానని లోకం కోపగించుకుంటోంది. ఆ మాధవుడే ఈ మానవుడై తనకి తటస్థించి మధుర ప్రేమని రుచి చూపించి మతమెందుకు మారకూడదు అని సూటిగా నన్ను నా ద్వారా సమాజాన్ని ప్రశ్నించినప్పుడు అవును యెందుకు మారకూడదు అని నాకూ అనిపించింది. జీవన పర్యంతం ప్రేమరాహిత్యాన్ని అనుభవించి ద్రోహాన్ని, బంధాలలో మోసాన్ని మోసిన నాకు రవ్వంత వుపశమనం కల్గితే యీ లోకానికి యేమి నష్టం అనేది పదే పదే. అవును వొకరి అంగీకారాలతో ఆమెకి యేమి అవసరం ఆమె జీవితం ఆమెది అనుకునేదాన్ని నేను కూడా. ప్రణయం అంటే ఆమె దృష్టిలో దైవత్వం. పలుకులో చూపులో స్పర్శలో అనుభూతిని పొందుతూ యిరువురూ మమేకం చెందటం.

అతను బహుమతిగా యిచ్చిన మొబైల్ ఫోన్‌ని యెప్పుడూ జాగ్రత్తగా నడుముకి బిగించుకున్న బెల్ట్‌లో పెట్టుకుని అతని పలకరింపుకై ఆశతో యెదురు చూసేది.

కానీ అతను మళ్ళీ యెప్పుడూ ఆమె యింటి వైపు తిరిగి చూడలేదు. ఇప్పటికే మన గురించి లోకం కోడై కూస్తోంది. నా రాజకీయ జీవితానికి వ్యక్తిగత జీవితానికి చాలా నష్టం అంటూ ముఖం చాటేశాడు.

అప్పటికే రెండు వివాహాలు చేసుకున్నతను మళ్ళీ వివాహం అనే పదం వినడం నచ్చక ముఖం చాటేసాడని ఆమెకి అర్థమయ్యింది.

ఆమె అతని నుంచి స్పర్శను ప్రేమను కోరుకుంది. కోరికను కాదు. మోసపోయానని ఆమెకి తెలిసిపోయింది. కానీ వొప్పుకోవడానికి ఆభిజాత్యం అడ్డువచ్చేదనుకుంటాను. ఘర్ వాపసీగా వెనక్కి వచ్చేయమని హితుల వొత్తిడిని కూడా ఆమె తిరస్కరించింది. ఒకోసారి ద్వైద్వీ భావనలో వూగిసలాడేది. అలాంటప్పుడు

ఆమె ఆలోచనలను నాతోనూ దాపరికం లేకుండా పంచుకునేది. అంతరంగంలో ఆమెకి భయం. అల్లరి మూకలు తనపై దాడి చేస్తారని పసికట్టింది. తన పిల్లలు, వారి పిల్లలపై దాడి చేస్తారని భయపడి మౌనంగా వుండిపోయింది. నిజానికి మతాల రంగు పులుముకున్న మనుషులని కాకుండా మనసు విప్పుకుని మాటలు కలబోసుకునే స్నేహాన్ని ప్రేమని ఆకాంక్షించింది. మనిషికి మతం చిరునామా కాదని ప్రేమే అన్ని మతాలకి చిరునామా అని తాననుకున్నది నిరూపించాలని నిమిషకాల వ్యవధిలోనే మరో మతాన్ని యిష్టంగా హత్తుకుంది. అతను మాత్రం చిన్న చిన్న చేపలని వలవేసి మత మార్పిడిలోకి లాగడం కన్నా తిమింగలానికే వలవేసి విజయం సాధించాడని అనిపించేది.

సంప్రదాయ కుటుంబాలలో పురుషులు, పిల్లలు ఆఖరికి తోటి స్త్రీలు కూడా పితృస్వామ్య భావజాలంతో నోళ్ళు నొక్కేస్తారు. నిజాలను కూడా కల్పనలుగా, సెన్సేషన్ కోసం వ్రాసిన వ్రాతలుగా కొట్టిపడేస్తారు. డబ్బు కోసమే రాతల్ని ప్రోత్సహించినా ఆ రాతలు నిజమని అంగీకరించడానికి ధైర్యం చాలదు. పవిత్రత ముసుగులో తెలియనట్లు నటిస్తారు. అరవై ఐదేళ్ల వయసులో సిగ్గుమాలిన పని చేసిందని తలలు బాదుకునే బదులు ఆమెని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేసి వుంటే బాగుండేది అనిపించింది. కుటుంబమంతా వెలివేసినా అభిమానులు,మత సమాజం ద్వేషించినా ఆమె నిబ్బరంగా ఆత్మ వంచన లేకుండా జీవిస్తూనే వియోగాగ్నిలో మండీ మాడిపోయింది. ఆశాభంగాలని జీర్ణించుకుంటూ మౌనాన్ని ఆశ్రయించింది. ప్రేమ పవిత్రయుద్ధంలో ఆమె ఒక సమిధ. అతనిలో ఆమెకి తన ప్రియసఖుడు కృష్ణుడే కనిపించాడు. ఆమె అప్పటి బ్రతుకంతా విరహరాత్రుల మరకలే. ప్రేమను ఆరాధనను కలవరించి పలవరించింది. ఆమె రాధ. కృష్ణుడికై తపించిన రాధ. ప్రేమని ఆశించి కొంత అనుభవించి తనివితీరక ఇంకా ఇంకా ప్రేమించి శుష్కించి క్షీణించి మరణించింది. రోగం కాదు ఆమెని బలి తీసుకుంది ప్రేమ. దుఃఖవిషం మింగి ఆమె చావుని ఆమె కొనితెచ్చుకుంది అని యెందరికి తెలుసు?

సాహిత్య సంద్రంలో ఒక నదిలా స్వేచ్ఛగా ప్రవహించింది. పూవై పుట్టి అక్షర పరిమళాల్ని పంచిన ఆమెకి యేమివ్వగలను. ఆశలు ఆలోచనలు ఆకాశంలో మెరిసే నక్షత్రాల్లాంటివని అవి ఎప్పుడూ చేతికందవు అన్న సత్యాన్నిగ్రహించి ఒక స్త్రీ అంతరంగాన్ని అర్థం చేసుకున్న మనసుతో యిలా కన్నీటి అక్షరాల మాలని గ్రుచ్చి ఆమె జ్ఞాపకాలకు అలంకరించడం తప్ప" అని బరువైన మాటలతో ఆమె కథను ముగించింది మున్నీ.

బాగ్‌లో దాచిన గులాబీని తీసి ఆమె వ్రాసిన పుస్తకానికి ముఖచిత్రంగా వున్న ఆమె ఫోటోపై ఉంచింది అభిమానంగా.

బూడిదరంగు సూక్ష్మశరీరం మున్నీ చెప్పిన తన కథను వింటూ కన్నీళ్ళు తుడుచుకుంది.

పద్మ కూడా భారమైన మనసుతో ఆలోచిస్తూనే ఆ పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంది. లోపలి పేజీల్లో వున్న పూల చిత్రాలను చూపిస్తూ ఆమెకి యిష్టమైన పూలు ఇవేనా అని అడిగింది...

“అవును. మా ప్రాంతంలో వుండే అరుదైన పూలివి. ఆమె వ్రాసుకున్న ఆత్మకథ పుస్తకం యిది. నేను చెప్పిన కథకు ఎన్నో సంవత్సరాలు ముందు జరిగిన కథ. ఇందులో నేను చెప్పిన కథ వుండదు” అంది మున్నీ.

“ఇప్పుడు మీరు చెప్పిన కథ ఆత్మకథ పార్ట్ టూగా రావాల్సిన కథ అనిపిస్తోంది నాకు. ప్రేమ పవిత్ర యుద్ధంలో దగా పడిన స్త్రీల జాబితాలో యిలాంటి ప్రఖ్యాత రచయిత వుండటం ఆశ్చర్యమే కానీ అసాధారణమేమి కాదు కదా. ఆమె ఒక స్త్రీ యే కదా! ఆమె ఒక మైనం ముద్దలాంటింది. అభిమానులు, పాఠకులు సమాజమూ యే మచ్చులో పోసుకుని చూసుకుంటే ఆ విధంగానే కనబడుతుంది అంతే కదా” అంది పద్మ.

“పాపపుణ్యాల భీతిని జయించిన ఆమె మతం దేవుడు అనే విశ్వాసాన్ని మట్టుకు గుడ్డిగా పట్టుకుని వేలాడింది. మాములు మనుషులు లాంటి వారే ఈ రచయితలు కూడా”

తన జీవితంలో జరిగిన ముఖ్యమైన ముగింపు ఘట్టాలకు ప్రత్యక్ష సాక్షి అయిన మున్నీ పాఠకురాలైన పద్మకి చెప్పడమూ ఆమె ఓ న్యాయదేవతలా వ్యాఖ్యానించడమూ చూసిన బూడిద రంగు సూక్ష్మశరీరం సంతోషంతో తబ్బిబ్బై పోయింది. ఇదిగో ఇలాంటి ఆలోచనలున్న మనిషి కోసం తన రచయిత మనసు ఆరాటపడింది. ఇక ఈ భూమి పైన సంచరించాల్సిన పని లేదనుకుంటూ వెలుగు లోకము వైపు ప్రయాణించింది.

# ఒజామా–షిమాసు



## వెంకట్ శిద్దారెడ్డి

ఈతరం కథకులలో గుర్తింపు పొందిన కథకుడు. స్వస్థలం నెల్లూరు జిల్లా ఆత్మకూరు సమీపంలో గుడిపాడు గ్రామం. పుట్టింది 1976. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ నుంచి ఎంసీఏ చేసి కొంతకాలం యూరప్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేశారు. సినిమాలపై ఉన్న ప్రేమతో హైదరాబాద్ తిరిగొచ్చి ప్రస్తుతం సినిమా రంగంలో పని చేస్తున్నారు. 'సినిమా ఒక ఆల్కెమీ' శీర్షికతో వచ్చిన సినిమా వ్యాసాలు పుస్తకంగా విడుదలై పాఠకాదరణ పొందాయి. 'రాయడం దైనందిన చర్యలో ఒక భాగం' అని చెప్పే ఈ యువ రచయిత, సొంతంగా ప్రచురణ సంస్థ కూడా మొదలుపెట్టారు. వీరి కథలన్నీ 'సోల్ సర్కస్' పేరుతో ఈ మధ్యే పుస్తక రూపంలో వచ్చాయి. 'సినిమా కథలు' మరో పుస్తకం.

నివాసం : హైదరాబాద్

మొబైల్ : 98498 88773

ఇప్పుడు మీకొక కథ చెప్పాలి.

ఈ మధ్యే తెలుసుకున్న ఒక విషయం. కథ చెప్పడం ఒక బాధ్యత.

తినడానికి తిండి, ఉండడానికో గూడు, కట్టడానికో బట్ట ఉంటే సరిపోదు. చెప్పుకోవడానికి కథలు కూడా కావాలి. ముందువన్నీ బతికుండడానికి. కానీ బతకడానికి కథలు కావాలి. కాబట్టి కథలు చదవడం ఒక అవసరం.

అందుకే ఇది పెద్ద బాధ్యత.

కానీ రాజకుమారిని ఎత్తుకుపోయే మాంత్రికులు, ఆమెను రక్షించే రాజకుమారులు ఇప్పుడు లేరు. ఇప్పుడిక హీరోలు లేరు. విలన్స్ లేరు. చెడుపై మంచి చేసే పోరాటాలు లేవు. మృగాలు రూపాలు మార్చుకున్నాయి. మనిషి తోలు కప్పుకుని ఇక్కడే ఎక్కడో తిరుగుతున్నాయి. ఇప్పుడు వాటిని గుర్తించడం కష్టం. మనుషులూ మారిపోయారు. గుండెలు బండలుగా మారుతున్నాయి. ప్రగతిశీల అదర్శాలు చెప్తే నవ్వుకుంటున్నారు. సమస్యలు ఒకటి కాదు. ప్రతీదీ సమస్యే. ఇంతకుముందులా కథలో పరిష్కారాలు సూచించలేము. ఏ కథకీ ఇప్పుడు హ్యాపీ ఎండింగ్ ఇవ్వలేము. అసలు కథకి ముగింపు ఉంటుందా? కావాల్సిందల్లా కొనసాగింపే అని ఈ మధ్యనే తెలుస్తోంది. మీ కథ మీది కాదు. మీ కథ నా కథలోకి వచ్చి చేరుతుంది. ఆ కథ మీ స్నేహితుని కథలోకి ఆవరిస్తుంది. ఆ స్నేహితుడి కథ ఇంకొందరి కథల్లోకి ఓవర్లాప్ అవుతుంది. ఇలా ఒక్కోకథ ఎక్కడెక్కడికో దారితీస్తుంది. అందుకే ఇక ఆ పాత కథలు చెల్లుబాటుకావు.

బహుశా కథ రాసేముందు రచయితలందరూ ఇలానే ఆలోచిస్తారేమో! కానీ

ఆ గజిబిజిని అక్షరాల్లోకి మార్చలేక చివరికి స్త్రీ–పురుష సంబంధాలు, లేటెస్ట్ హెడ్ లైన్స్, నీతి కథలు, అవు కథలు – ఇలాంటివే కథావస్తువుగా మారుస్తుంటాము. కానీ ఇవాళ నేను ఆ దారిలో ప్రయాణించదలుచుకోలేదు. ఇవాళ నేను చెప్పబోయే కథ ఒక పర్వతం గురించి. ముఖ్యంగా చెప్పాలంటే ఆ పర్వతం బరువు గురించి.

మనిషి తన స్వరతంత్రులను బిగించి వివిధ తరంగదైర్ఘ్యాలలో శబ్దాలను విడుదల చేయగలడు. ఆ శబ్దాలను ఒక పద్ధతి ప్రకారం నిర్వహించబడినప్పుడు, వాటిలో కొన్నింటికి అర్థాలు ఏర్పడతాయి. అలాంటి అర్థం ఉన్న శబ్దాలను పేర్చితే వాక్యాలవుతాయి. ఆ వాక్యాలు ఇతరులు విన్నప్పుడు ఆసక్తి కనబరిస్తే అవి టాపిక్స్ ఫర్ డిస్కషన్ అవుతాయి. అలాగే చదువుకున్న ప్రతి వ్యక్తీ ఎంతో కొంత రాయగలడు. అతను పిచ్చి గీతలూ గీయగలడు. పదాలనూ పేర్చగలడు. కొన్ని పదాలను పేర్చితే అవి వాక్యాలవుతాయి. కానీ ఆ వాక్యాల గురించి పాఠకులు ఆసక్తి కనబరచినప్పుడే అవి ఇంట్రెస్టింగ్ స్టోరీస్ అవుతాయి. అక్షరాలతో అమృతం కురిపించినట్టవుతుంది.

నేను పర్వతపు బరువుని ఎలా కొలవాలి అనే విషయం మీద ఇంట్రెస్టింగ్ కథ రాస్తున్నానని ఎక్కడైనా చెప్పగానే, వింటున్నవారి మొహంలో కండరాలు వంకర తిరగడం, వారి కళ్లు పెద్దవి కావడం, నా వైపు అదోలా చూడడం జరుగుతుంది. వెంటనే నేను ఆ విషయం గురించి మాట్లాడడం ఆపేయాల్సి వస్తుంది. కానీ ఈ రోజు మాత్రం ఆ విషయం గురించే కథ చెప్పదలుచుకున్నాను. ఇక మీ ఇష్టం.

ముందు ఈ కథకు పెట్టిన శీర్షిక గురించి కొంత చెప్పనివ్వండి.

జపాన్‌లో ఎవరైనా అతిధిని ఇంటికి అహ్వానించినప్పుడు, ఆ అతిధి ఇంట్లోకి అడుగుపెట్టేముందు ముందుగా పలికే మాట, ఒజామా–షిమాసు. లిటరల్‌గా చెప్పాలంటే, నేను మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాను అని అర్థం. ముఖ్యంగా మనం ఒక సమూహంలో సభ్యులు కానప్పుడు, ఆ సమూహంలోకి ప్రవేశించేముందు కూడా ఈ పదబంధాన్ని ఉపయోగిస్తారు. అలాగే, వారి ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఒజామా–షిమాసితా అని అనడం కూడా ఒక ఆనవాయితీ. అంటే మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను అని అర్థం.

నా కథ ద్వారా ఎవరైనా ఇబ్బంది పడతారేమోననే ఈ కథకి నేను ఆ టైటిల్ పెట్టాల్సివచ్చిందని చెప్పాల్సిన అవసరం లేదు.

ఇక కథలోకి వద్దాం.

ఒక పర్వతం యొక్క బరువుని ఎలా కొలవాలి?

ఈ ప్రశ్నకి చాలాసార్లు సమాధానం దొరక్కపోగా, చాలామంది ప్రత్యుత్తరంతో స్పందించడాన్ని నేను ఎక్కువసార్లు గమనించాను.

ఉదాహరణకు: నీకు ఆత్మ బరువు తెలుసా? అని ఒకరు నన్ను ప్రశ్నించారు. 21 గ్రామ్స్ అని నాకెవరో చెప్పారు. అది ఎంత నిజమో నాకు తెలియదు.

ఒక ప్రశ్నను మరొక ప్రశ్నతో సమాధానం ఇవ్వడం లాంటివి ఎక్కువగా మనం తర్కశాస్త్ర సంబంధిత చర్చల్లో ఎక్కువ చూస్తాం.

దేవుడున్నాడా?

అసలు నువ్వున్నావా?

నేను ఉన్నాను. నీతో మాట్లాడుతున్నాను కదా?

అని నువ్వనుకుంటున్నావు. కానీ మనిద్దరం ఆ దేవుడి కలలో సృష్టించబడ్డ పాత్రలమయ్యుండొచ్చుగా?

ఈ విధమైన చర్చల్లో ఎప్పటికీ సమాధానం దొరకదు. ప్రశ్నకు ప్రశ్నే సమాధానం.

లేదంటే మరొక విధంగా కూడా ఈ చర్చ కొనసాగొచ్చు.

ఒకడు: నాకు చెట్టు ఊగుతున్నట్టుగా అనిపిస్తోంది.

ఇంకొకడు: నాకు గాలి ఆ చెట్టుని ఊపుతున్నట్టుగా అనిపిస్తోంది.

మరొకడు: ఊగుతున్నది గాలి కాదు, చెట్టు కాదు. మీ మనసు.

నేను ఈ కథలో ఎంచుకున్న కథా వస్తువు, పైన ఉదహరించినటువంటి తర్క సంబంధిత విషయం కాదు.

పర్వతం, తర్కం ఒకే శ్వాసలో చర్చించబడే అంశాలు కాదని నా అభిప్రాయం. వీటి రెండింటి మధ్యా ఏదో ఒక నిర్దిష్టమైన సంబంధం ఉండి ఉండొచ్చేమో కానీ – నేను గత కొన్ని నెలలుగా రాత్రీ పగలూ ఆలోచిస్తున్న విషయం మాత్రం, కేవలం పర్వతపు బరువుని ఎలా కొలవాలనే సాధారణ విషయం గురించే!

ఈ ప్రశ్న నన్నే ఎందుకు కలవరపెడుతుందో అర్థం కాలేదు. సమాధానం కోసం ఎవరిని అడగాలో కూడా తెలియలేదు. పర్వతాలకు సంబంధించి ఏదైనా ప్రభుత్వ సంస్థ ఉందేమో కనుక్కున్నాను. భూగర్భ గనుల శాఖకి ఫోన్ చేశాను. జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకీ ఫోన్ చేశాను. చివరికి డిపార్ట్మెంట్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్మెంట్స్‌కి ఫోన్ చేశాను.

ఎవరో అమ్మాయి ఫోన్ లేపింది.

మీరు పర్వతాల బరువుని ఎందుకు కొలవాలనుకుంటున్నారు? అని అడిగింది.

నాకు తెలుసుకోవాలనిపిస్తోంది అన్నాను. ఈ విషయం గురించి ఎవరో ఒకరు పట్టించుకోవాలి కదా!

మీరేం మాట్లాడుతున్నారో నాకర్థం కావటం లేదు. తప్పుడు కొలతలు, తూనికలతో ఎవరైనా మిమ్మల్ని మోసం చేసుంటే చెప్పండి. మేము కంప్లైంట్ రాసుకుని, తగిన చర్యలు తీసుకుంటాం అంది ఆమె.

అయ్యో, అలాంటిదేమీ జరగలేదండీ. నాకు పర్వతాల బరువుని కొలిచే విధానమేదైనా ఉంటే చెప్పండి అన్నాను.

అలాంటి పరికరాలేవీ ఇంకా అందుబాటులో ఉన్నట్టు నాకు తెలియదు. క్షమించండి.

అయ్యో, ఉదయాన్నే ఫోన్ చేసి ఇబ్బంది పెట్టినందుకు మీరే నన్ను క్షమించాలి. ఈ ప్రశ్నకు సమాధానం దొరికినప్పుడు నేనే మీకు ఫోన్ చేసి చెప్తాను. ధన్యవాదాలు అని ఫోన్ పెట్టేశాను.

ఈ దేశంలో చుట్టూ చూస్తే మనకి కనుచూపుమేరలో ఒక గుట్టో, కొండో, పర్వతమో కనిపించకమానదు.

మన కళ్లముందే ఉంటూ మనకంటే ఎంతో ఎత్తుగా నిలబడి ఉన్న ఆ పర్వతాల బరువు తెలుసుకుందామని ఇంతవరకూ ఎవరికీ ఎందుకు అనిపించలేదు?

ఇదే విషయం గురించి నాలాగే చాలా మంది ఆలోచించి ఉంటారు. బహుశా నేను అడుగుతున్న ప్రశ్న సరిగ్గా అర్థమవుతున్నట్టులేదని అనిపించింది. అందుకే దాని ప్రాముఖ్యత ఎవరికీ అర్థమవుతున్నట్టు లేదు. అందుకే నేను ఈ కథని మొదట్నుంచీ మొదలు పెట్టాలనిపించింది.

• • •

పదిహేను సంవత్సరాల క్రితం మేము మొదటిసారిగా పర్వతం బరువు కొలవాలనుకున్నాము.

మేము మొత్తం ఐదు మంది.

ఆ రోజు మేము ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి టౌన్ నుంచి మా ఊరికి వచ్చాము. మా నాన్న ఒక రైతు. నేను చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించాలని మా నాన్న కోరిక. ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ రాకపోయినా చెన్నైలో మంచి కాలేజ్‌లో డబ్బులు కట్టి నన్ను ఇంజనీరింగ్‌లో జాయిన్ చేపించారు.

ఇంజనీరింగ్ అవగానే నాకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత నేను అమెరికా వెళ్లాను. అమెరికాలో ఉండగా ఖాళీ సమయాల్లో కథలు రాద్దామని ప్రయత్నించాను. నేను  రాసిన ఒక కథ వెబ్ మ్యాగజైన్లో ప్రచురితమైంది కానీ ఎవరికీ నచ్చలేదనుకుంటాను. ఒక్క కామెంట్ కూడా రాలేదు. ఆ తర్వాత ఇండియాకి

తిరిగొచ్చాక రెండు మూడు కథలు రాశాను కానీ, ఎక్కడా ప్రచురరణకి నోచుకోలేదు. కానీ ఒక గౌరవనీయమైన రచయితగా పేరు తెచ్చుకోవాలని నేను తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నాను.

ఆ రోజు నాతో పాటు ఉన్న వాళ్లలో ఖాజావలి నా బెస్ట్ ఫ్రెండ్. నేను చెన్నై వెళ్లాక వాడు హైదరాబాద్ వెళ్లాడని విన్నాను. కానీ ఆ తర్వాత వాడేమైపోయాడో ఎవరికీ తెలియదు.

సుధాకర్ ఇంటర్మీడియట్ ఫెయిలయ్యాడు. వాళ్ల ఇంట్లోవాళ్లు అప్పులు కట్టలేక ఊరు వదిలి వెళ్ళిపోయారని నాన్న చెప్పాడు.

బాలరాజు చనిపోయాడు.

రాధాకృష్ణ ఒక్కడే ఇంకా టచ్‌లో ఉన్నాడు. నేను అమెరికా నుంచి తిరిగొచ్చిన కొన్ని రోజులకు ఫేస్‌బుక్‌లో మా ఫ్రెండ్స్ గురించి వెతుకుతుంటే రాధాకృష్ణ ప్రొఫైల్ కనిపించింది. వాడు పూర్తిగా మారిపోయాడు. బక్కగా ఉండేవాడు అప్పట్లో. ఇప్పుడు చాలా లావయ్యాడు. మేము టౌన్లో చదువుకోడానికి వెళ్లేటప్పుడు మా అందరికీ వాడు వాళ్ల కిరాణ కొట్టు నుంచి చాక్లెట్లు, బబుల్ గమ్‌లు తెచ్చిచ్చేవాడు. ఫేస్‌బుక్‌లో చూసిన దాని ప్రకారం వాడేదో హొటల్లో పని చేస్తున్నాడని అర్థమైంది. ఆ హొటల్ వద్దకు వెళ్లి వాడి గురించి అడిగాను. ఆ హొటల్ ఓనర్ వాడే అని తెలిసి నేను ఆశ్చర్యపోలేదు.

నన్ను చూడగానే వెంటనే గుర్తుపట్టాడు.

ఆ రోజు సాయంత్రం బార్‌కి తీసుకెళ్లాడు. మిగిలిన వాళ్లతో ఎవరితోనైనా టచ్‌లో ఉన్నావా అని అడిగాడు. మా మిగిలిన ముగ్గురి ఫ్రెండ్స్ గురించి నాకు తెలిసింది చెప్పాను.

మా నాన్న చనిపోయాక కిరాణా షాప్ మూసేసి, ఆస్థులన్నీ అమ్మేసి హైదరాబాద్‌కి వచ్చేశాను. కొన్ని రోజులు కష్టపడ్డా, ఇప్పుడు హొటల్ పెట్టి బాగానే సెటిల్ అయ్యానని చెప్పాడు రాధాకృష్ణ. నువ్వేం చేస్తున్నావ్? అని అడిగాడు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నానని చెప్పాను. మా అమ్మానాన్న ఎలా ఉన్నారు? ఊర్లో పొలాలు ఏమయ్యాయి? లాంటి కొన్ని ప్రశ్నల తర్వాత అడిగాడు రాధాకృష్ణ – ఇందాక హొటల్లో ఉన్నప్పుడు మన ఊర్లో కొండ గురించి అడిగావు కదా? ఆ కొండ ఎందుకు గుర్తొచ్చించి ఇప్పుడు?

నీకు గుర్తు లేదా? మనం ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఊరికి వచ్చిన తర్వాత రోజు మనందరం కొండమీదకి ఎక్కాం. అప్పుడు మనం ఈ కొండ బరువు ఎంతుంటుందో అని మాట్లాడుకున్నాం. గుర్తుందా?

కొండ బరువా? ఏమో నాకు సరిగ్గా గుర్తు రావటం లేదు అని ఒక్క గుక్కలో తన పెగ్ తాగేశాడు అతను.

• • •

మేము కొండ బరువుని తూచాలనుకున్నది మా ఇంటర్మీడియట్ పరీక్షలు అయిపోయిన తర్వాత రోజు.

వాస్తవానికి ఈ కథ చెప్పడం ఇప్పుడు మొదలుపెట్టాను కానీ, ఆ రోజు నుంచీ ఈ కథ నాలో రహస్యంగా అభివృద్ధి చెందుతూ వస్తోందని నాకు ఇప్పుడే అర్థమవుతుంది.

అందువల్లనే అ రోజు గురించి మీకు వివరంగా చెప్పాలి.

ఆ రోజు సాయంత్రం అందరం పార్టీ చేసుకుందామని ప్రపోజల్ పెట్టాడు ఖాజావలి. వాడు టౌన్‌లో ఒకటీ రెండుసార్లు బీర్ తాగాడని, ఆ రుచిని మాకూ పరిచయం చేద్దామని వాడి ప్లాన్. అందరం తలో పాతిక రూపాయలు తీసుకొస్తే టౌన్‌కి వెళ్లి ఖర్జూర్ బీర్ తెచ్చుకుని కొండ దగ్గర కూర్చుని తాగాలనుకున్నాం. సాయంత్రం అందరం కలుసుకున్నాం. బాలరాజు, సుధాకర్ డబ్బులు తేలేకపోయారు. నేను మా నాన్నకి అబద్ధం చెప్పి పాతిక రూపాయలు సంపాదించగలిగాను. రాధాకృష్ణ అడిగినదానికంటే ఎక్కువగా యాభైరూపాయలు తెచ్చాడు. ఖాజావలి సైకిల్ మీద టౌన్‌కి బయల్దేరాడు.

వాడు వచ్చేవరకూ అక్కడ కూర్చుని మేము మాట్లాడుకుంటున్నాం.

టెన్త్‌క్లాస్ వరకూ మనం పిల్లలం. ఇంటర్మీడియట్ అయ్యాక పెద్దవాళ్లమయిపోతాం. పిల్లలుగా ఉన్నప్పుడు మనకి ఆటలు పాటలు తప్ప ఇంకేవీ పట్టవు. పెద్దయ్యాక బరువు బాధ్యతల్లో మునిగిపోతాం. ఈ రెండింటికీ మధ్యస్తంగా ఉన్న ఇంటర్మీడియట్ రెండేళ్లలోనే మన ఆలోచనలకు పునాదులు ఏర్పడతాయి. ఆ సమయంలోనే సమాజపు నిజమైన రంగులు మనకి తెలిసొస్తాయి. మన చుట్టూ ఉన్న సమస్యలు మనకి ఫ్లడ్ లైట్ వెలుగులో కనిపించినంత స్పష్టంగా కనిపిస్తాయి. ఈ సమస్యలకు ఎన్ని లైట్లు వేసి వెతికినా ఎక్కడ పరిష్కారం దొరకదని కూడా మనకి కొంచెం కొంచెం తెలుస్తూ ఉంటుంది.

ఖాజావలి వచ్చేవరకూ కొండ కింద కూర్చుని మాట్లాడుకుంటుండగా బాలరాజు ఈ విషయాలు మాకు చెప్పాడు. వాడు పుస్తకాలు బాగా చదివేవాడు. మమ్మల్నందరినీ కూడా చదవమని ప్రోత్సాహించేవాడు.

ఖాజావలి వచ్చాక వాడు తెచ్చింది ఖజురహో బీర్ అని అర్థమైంది. వాడికి తప్ప మా అందరికీ అదే మొదటిసారి. సుధాకర్ అంతకుముందు కొన్నిసార్లు కల్లు

తాగిన అలవాటు ఉండడంతో పెద్ద కష్టపడకుండానే బీర్ తాగేశాడు. మిగిలిన ముగ్గురూ చాలా కష్టపడాల్సి వచ్చింది.

మొదటిసారి కావడం వల్లనేమో నాకు ఒక్క బీర్ కే కళ్లు తిరిగాయి. చచ్చిపోతానేమో అన్నంత భయమేసింది. ఇంకో కొన్ని రోజుల్లో ఎమ్సెట్ పరీక్షలు. బీర్ తాగానని నాన్నకి తెలిస్తే చంపేస్తాడు. బాలరాజు దగ్గరుండి వాంతి చేపించాక కొంచెం స్థిమితపడ్డాను. నా అవస్థలు చూసి అందరూ నవ్వుకున్నారు. ఇంటికెళ్దాం అన్నాను. ఈ అవతారంలో నువ్వు ఇంటికెళ్తే మీ నాన్న చితగ్గొడతాడు. కొంచెం తగ్గాక వెళ్దాం అన్నాడు ఖాజావలి.

చీకటి పడుతోంది.

ఇంటర్ తర్వాత ఎవరెవరు ఏమేం చేస్తాం అనే విషయం గురించి చర్చ మొదలైంది. నేను ఎమ్సెట్ రాసి ఇంజనీరింగ్ చేస్తానని చెప్పాను. నాకు చదువు మీద పెద్ద ఇంట్రెస్ట్ లేదు అని తేల్చేశాడు రాధాకృష్ణ. ఏమో ఇంకా ఆలోచించలేదన్నాడు సుధాకర్. నేను పాస్ అయితే అప్పుడు ఆలోచిస్తాను అన్నాడు ఖాజావలి. చాలా చెయ్యాలని ఉంది. చెయ్యగలననే నమ్మకం కూడా ఉంది. కానీ పరిస్థితులు అందుకు సహకరించవేమోనని అన్నాడు బాలరాజు.

ఎందుకురా? నువ్వుకూడా మాతో పాటు సిటీకొచ్చెయ్. అందరం ఒకే కాలేజ్‌లో చదువుకుందాం.

రాలేనురా! వస్తే నాతోపాటు చాలామందిని తీసుకురావాలి. వాళ్లందరినీ వదిలేసి రాలేను.

అందరం సరదాగా కొండెక్కుదామా అన్నాడు రాధాకృష్ణ.

బరువుని మోస్తూ పర్వతాలను ఎక్కలేనేమో అన్నాడు బాలరాజు.

ఏంట్రా నువ్వు మోసే బరువు? అడిగాడు రాధాకృష్ణ.

అది నీకు ఎప్పటికీ అర్థం కాదు.

చెప్తే కదా అర్థమయ్యేది. అయినా ఎంత బరువు మోస్తున్నావేంటి నువ్వు?

ఈ కొండంత బరువు.

అవునా? ఎన్ని కిలోలుంటుందో?

ఇది ఎప్పటికీ ఎవ్వరూ కొలవలేనంత బరువు.

మా షాప్‌లో తక్కెడుంది. తెస్తాను. కొలుద్దాం అన్నాడు రాధాకృష్ణ.

తక్కెడలో పర్వతం ఎలా పడుతుంది? అన్నాడు బాలరాజు.

మరి నువ్వు ఒక పర్వతాన్ని ఎలా మోస్తున్నావు? అన్నాడు రాధాకృష్ణ.

చొక్కావిప్పి చూపించాడు బాలరాజు.

ఆ చీకట్లో బాలారాజు వీపు మీద మోస్తున్న పర్వతాన్ని చూశాను. మా ఊర్లో కొండకంటే ఎన్నో రెట్లు పెద్దగా ఉంది. ఆ పర్వతంపై చిక్కగా శబ్దం లేకుండా రక్తంలాంటిదేదో పారుతోంది. పర్వతం నిండా ఏవేవో రాతలు. ఎక్కడా పచ్చదనం లేదు. శతాబ్దాలుగా పేరుకున్న చీకటిలా నల్లగా ఉందది.

ఆ రోజు ఆ పర్వతం నాకొక్కడికే ఎందుకు కనిపించిందో ఇప్పటికీ అర్థం కాదు.

అమెరికాలో ఉండగా నేను ప్రేమించిన ఒకమ్మాయికి ఈ విషయం చెప్పాను. ఆమె నన్ను నమ్మలేదు. అంత పెద్ద పర్వతాన్ని మోయడానికి అతనేమైనా దేవుడా? అని నాతో గొడవపడింది. కృష్ణుడు చిటికెన వేలితో ఎత్తింది గోవర్ధనగిరి, హనుమంతుడు అరచేతిలో ఎత్తుకొచ్చింది సంజీవని పర్వతం. ఇక మీ ఫ్రెండ్ ఎత్తిన పర్వతం పేరేమిటో? అని నన్ను వెక్కిరించింది. నేను చెప్పిందంతా తనను ఇంప్రెస్ చెయ్యడానికి నేను అల్లిన కట్టుకథ అని ఆమె అభిప్రాయం.

నువ్వు మరీ ఎక్కువ మ్యాజిక్ రియలిజమ్ పుస్తకాలు చదివేస్తున్నావీ మధ్య.

నేను తమాషాకి చెప్పడం లేదు. ఆ రోజు నేను చూసింది నిజం.

నాన్సెన్స్.

(ఈ గొడవ జరిగిన మూడు నెలల తర్వాత మాకు బ్రేకప్ అయిపోయింది. ఆమె నన్ను వదిలి వెళ్లేముందు అంది – నువ్వు చెప్పే ఫిలాసఫీ అంతా ఫేక్. నన్ను ఏమైనా అనొచ్చు గానీ ఫేక్ అంటే మాత్రం నాకు చాలా కోపమొస్తుంది. మిగతా విషయాల్లో క్షమిస్తాను కానీ నేను నమ్మే ఫిలాసఫీని ఏమైనా అంటే క్షమించలేను. అందుకే నా ఊపిరి ఆగిపోయేవరకూ ఆమెను క్షమిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ ఆమె గురించి రాసిన ఈ క్షణంలో, అకస్మాత్తుగా నేనామెను క్షమించాను. దీన్ని బట్టి ఒక కథ రాయడమంటే వస్తువు, శిల్పమూ, సమస్య, పరిష్కారం, ఇజాలూ, నిజాలూ – ఇవేవీ కాదు. మోస్తున్న ఒక భారాన్ని కాసేపైనా దించి సేదతీరడమని నాకిప్పుడే అర్థమైంది. అంతేకాదు కథా రచనలో ఉన్న బలమైన శక్తిని ఇవాళే నేను గమనించాను. నావరకూ ఈ కథలో అత్యంత ఉద్విగ్నభరితమైన ఘట్టం ఇదే.)

విచిత్రంగా అనిపించవచ్చుగానీ చాలా ఏళ్ల తర్వాత బార్‌లో కూర్చుని రాధాకృష్ణతో మాట్లాడినప్పుడు కానీ పర్వతాల బరువు ఎలా తూచాలి అనే విషయం గురించి నాకు జ్ఞాపకం రాలేదు. ఆ రోజు బార్‌లో మందు మత్తులో మేమిద్దరం

మాట్లాడుకుంటుండగా రాధాకృష్ణ చెప్పాడు – ఆ రాత్రి తన కిరాణా షాప్ నుంచి దొంగలించిన తక్కెడ విషయం.

తక్కెడలో దేన్నైనా సమానం చెయ్యవచ్చు. ఒకవైపు దూది పెట్టినా, మరో వైపు రాయి పెట్టినా ఎక్కడో దగ్గర సమానమవుతుంది. తక్కువ బరువు ఉన్న చోట అదే రకమైన పదార్థాన్ని జోడిస్తూ పోవడమే! అయితే ఇక్కడో సమస్య ఉంది. తక్కెడలో ఆ పదార్థం పట్టకపోవచ్చు. అలాంటి సమయాల్లో మన తక్కెడ పెద్దది కావాలి. లేదంటే అవతలి వైపున్న బరువుని తగ్గించాలి, ఆలోచిస్తే ఇలాంటి పరిష్కార మార్గాలు దొరుకుతాయి.

ఇక్కడొక పిట్టకథ.

ఒకడు: కేజీ దూది బరువా? కేజీ రాయి బరువా?

ఇంకొకడు: రెండూ సమానమే కదా!

ఒకడు: సమానమేనా? అయితే కేజీ రాయి నీ తలమీద వేద్దాం. ఆ తర్వాత కేజీ దూది నీ తల మీద వేద్దాం. అప్పుడు కూడా రెండూ సమానమేనంటావా?

ఇంకొకడు: కాదు. ఎందుకలా?

ఒకడు: అది నీ కర్థం కావాలంటే ఫిజిక్స్ పాఠాలు చెప్పాలి. మాస్ అంటే ఏంటో చెప్పాలి. ఫోర్స్ అంటే ఏంటో చెప్పాలి.

ఏదైతేనేం. ఆ రాత్రి మేము ఒకరికొకరు చేతులందించుకుంటూ కొండపైకి ఎక్కగలిగాం. అంత చీకటిలోనూ నేను బాలరాజు మోస్తున్న పర్వతాన్ని గమనిస్తూనే ఉన్నాను.

• • •

ఇక్కడ ఒక విషయం చెప్పాలి.

కొండెక్కి చూసినప్పుడు మా ఊరు నాకు విచిత్రంగా అనిపించింది. మా ఊరు ఒక ఊరిలా అనిపించలేదు నాకు. మూడు ఊర్లులా అనిపించింది. కొండెక్కి చూసినప్పుడు మొదట కనిపించేది మా ఊరి చెరువు. ఆ చెరువు దాటి కొంచెం ముందుకు చూస్తే గుడి. ఆ గుడి చుట్టూ కొన్ని ఇళ్లు. పెంకుటిళ్లు. డాబా ఇళ్లు. అలా కొంచెం ఎడం వైపు చూస్తే కొంచెం ఖాళీ స్థలం. ఆ తర్వాత అక్కడ ఇంకొన్ని రేకులిళ్ళు, గుడిసెలు. ఖాజావలి వాళ్ల ఇళ్లు మొదట్లో గుడి దగ్గరే ఉండేది. కొన్నాళ్లకు వాళ్ళు ఊరికి ఎడం వైపుకి తరలి వెళ్లారు. గుడికి కుడివైపు ఉన్న ఇళ్లు దాటి చూస్తే, చెరువు నుంచి పారుతున్న ఒక కాలువ. ఆ కాలువ తర్వాత చెట్లు, పొలాలు. పొలాల్లో మధ్యలో ఒక రైస్ మిల్లు. అలా కుడి వైపు చూసుకుంటూ వెళ్తే ఊరికి

ఒక కిలోమీటర్ దూరంలో అక్కడ ఇంకొన్ని ఇళ్లు. చిన్న చిన్న ఇళ్లు. పక్కా ఇళ్లు. ఒక విధంగా అది ఇంకొక ఊరని కూడా చెప్పొచ్చు. మా ఊరితో ఏ సంబంధం లేకుండా దూరంగా. నిజానికి అది వేరే ఊరే. ఈ మధ్యనే ఒక సారి ఊరికెళ్లినప్పుడు ప్రభుత్వం అక్కడ ఒక కొత్త బోర్డ్ కూడా పెట్టింది.

ఇది ఇలా పదాల్లో చెప్పడం కంటే బొమ్మగా గీసి చూపిస్తే మేలని నా అభిప్రాయం.

• • •

(పైన సూచించిన ఖాళీ లైన్లకు అర్థం. ఆ సమయంలో నేను బొమ్మ గీస్తున్నట్టు. బొమ్మ గీశాను. గీశాక నాకు రెండు విషయాలు అర్థమయ్యాయి. ఒకటి: నాకు బొమ్మ గీయడం అసలు రాదని. రెండు: ఈ దేశంలో ప్రతి గ్రామం కూడా ఇలా రెండు మూడు ముక్కలుగా ఉంటుంది. ఒకటిగా ఎప్పుడూ ఉండదని. సరే ఇక కథలోకి వెళ్దాం.)

కొండెక్కి నేనలా చూస్తున్నానా? మా ఇల్లు అదే అని చెయ్యిపెట్టి ఊరికి కుడి వైపుగా ఉన్న చిన్న ఇళ్లల్లో ఒక దాన్ని చూపించాడు. మీరెప్పుడూ రారు కదరా మా ఇంటికి అన్నాడు బాలరాజు.

నిజమే మేమెప్పుడూ బాలరాజు ఇంటికి వెళ్లలేదు. వెళ్లాలనీ ఎప్పుడూ అనుకోలేదు.

బాలరాజూ నువ్వు కూడా సిటీకి రావొచ్చు కదా? అడిగాను.

అంతే ఇక్కడే ఉందిరా. సిటీకొచ్చి ఏం చెయ్యాలి? ఇక్కడ్నుంచే ఏమైనా చెయ్యగలం. నువ్వు కూడా ఇక్కడే ఉండొచ్చు కదరా? మనమంతా కలిసి ఏమైనా చెయ్యొచ్చు అన్నాడు బాలరాజు.

అమ్మో అలా ఎలారా? మా నాన్న చంపేస్తాడు. నేను చదువుకుని అమెరికా వెళ్లాలనేది ఆయన కల.

• • •

కథలో ఈ సమయంలో చాలామంది పాఠకులకు ఈ కథ ఎక్కడికి వెళ్తోందో అనే అసహనానికి గురయ్యే అవకాశం ఉంది. ఒబామా–షిమాసు. అలా ఫీలయ్యే పాఠకులకు కొన్ని సూచనలు:

1. ఇంతటితో ఈ కథను చదవడం ఆపేసి, ఇప్పటివరకూ చదివినదాన్ని మర్చిపోయే మార్గాలు వెతుక్కోవడం.

2. కథ సంగతి తర్వాత. అసలు పర్వతం బరువుని కొలిచే మార్గం నేను కనుక్కున్నానా లేదా అని తెలుసుకోవాలనే ఆత్రుత కలిగిన పాఠకులు, ఈ క్రింది రెండు పారాగ్రాఫ్‌ల వరకూ చదివి ఆపెయ్యవచ్చు.

తక్కెడలో పట్టదని పర్వతం బరువు కొలవడం ఆపనక్కర్లేదు. పర్వతం అంచులో ఉన్న ఒక పెద్ద రాయిని ముందుగా చిన్న చిన్న ముక్కలు చేశాను. ఆ ముక్కల బరువుని విడిగా చూసుకుని, కలుపుకుంటూ వెళ్తే ఆ పెద్ద రాయి బరువు తెలుస్తుంది. ఆ విధంగా ఆ పర్వతాన్ని ముక్కలు ముక్కలు చేసి కొలుచుకుంటూ వెళ్తే దాని బరువు కొన్ని రోజుల్లో తెలిసే అవకాశం ఉంది. అలా కాకుండా ఒకేసారి పర్వతం బరువు ఎంతో తెలుసుకోవాలంటే ఎప్పటికీ తెలియదని ఒక నిర్ణయానికి వచ్చాం. సమస్య పెద్దదే కావచ్చు. దాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించి పరిష్కరించవచ్చని అనిపించింది.

ఇంత వరకే వదివి వెళ్ళిపోతున్నవారికి వెలితిగా అనిపించకుండా ఉండడానికి ఈ ఒక్క లైన్ మాత్రం చదవండి. ఐన్‌స్టీన్ ఏమన్నాడంటే – ఏ ఆలోచనా విధానం వల్లనయితే ఒక సమస్య సృష్టించబడిదో అదే ఆలోచనా విధానంతో పరిష్కారం కోసం వెతక్కూడదు.

3. పై రెండు సలహాలతో అసంతృప్తి చెందిన పాఠకులు ఎవరైనా ఉంటే, ప్రస్తుతానికి పర్వతం బరువు ఎలా కొలవాలనే విషయాన్ని పక్కన పెట్టి ఓపిగ్గా మిగతా కథ చదవండి.

నాకు పర్వతాన్ని ఎలా కొలవాలో అనే ఐడియా వచ్చాక మరొక సారి తూనికలు, కొలతల శాఖకు ఫోన్ చేశాను. అంతకుముందు ఫోన్ ఎత్తిన అమ్మాయే మాట్లాడింది. మీ దగ్గర అందుబాటులో ఉన్న అతి పెద్ద తక్కెడ ఏది? అని అడిగాను. ఎందుకు అని అడిగింది ఆమె. నాకు పర్వతం బరువుని ఎలా కొలవాలో అనే విషయంలో కొంత క్లారిటీ వచ్చింది. అది ఆచరణలో సాధ్యమా కాదా అని తెలుసుకుందామని అన్నాను.

మీరు చాలా ఇంట్రస్టింగ్‌గా మాట్లాడుతున్నారు అంది ఆమె.

నేనా? ఇది మీకు ఇంట్రస్టింగా అనిపించిందా?

అవును. మాకు ఎప్పుడూ కంప్లైంట్స్ తప్ప వేరే ఏ మాటలూ ఉండవు. మేము ఫలానా షాప్‌లో రెండు కిలోల పప్పు కొంటే కేవలం ఒకటిన్నర కిలోనే వచ్చింది. నా బైక్ ఫుల్ ట్యాంక్ ఐదు లీటర్లు, కానీ ఫలానా పెట్రోల్ బంక్‌లో ఆరు లీటర్లు పోశారు. ఇందులో ఏదో మోసం ఉంది. ఇలా ఉంటాయి మా ఫోన్ కాల్స్ రోజూ.

అద్సరే. నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. మీ దగ్గర ఉన్న అతి పెద్ద తక్కెడ ఎంత సైజుంటుంది? నేను కొనుక్కోవచ్చా? అడిగాను.

అది ఇప్పటికిప్పుడు చెప్పలేను. కనుక్కుని చెప్తాను. అవును. మీకు కొండల బరువు తెలుసుకోవాలని ఎందుకనిపించింది?

ఆ అమ్మాయి మాట్లాడుతుంటే అనిపించింది. ఆ అమ్మాయి గొంతు చాలా బావుంది.

అది ఇప్పటికిప్పుడు చెప్పలేను. మనం కలిసినప్పుడు ఆ విషయం చెప్తాను అన్నాను.

మనమెలా కలుస్తాం. మీరెవరో నాకు తెలియదు. నేనేవరో మీకు తెలియదు.

తెలుసుకోవడానికే కలుసుకోవచ్చు. మనం పుట్టినప్పుడు ఎవరూ తెలియకుండా పుడ్తాం. చనిపోయేటప్పుడు చాలామందికి తెలిసినవాడిగా పోతాం. మధ్యలో ఈ బతికున్నప్పుడేగా ఒకర్నొకరు తెలుసుకోగలం. సో, ఎక్కడైనా కాఫీకి కలుద్దామా?

లేదు. నాకు పరిచయంలేని వాళ్లతో కలవడం అలవాటు లేదు అంది ఇబ్బందిగా.

ఫర్వాలేదు. మీ ఆఫీస్ అడ్రస్ చెప్పండి. నేనే అక్కడికి వస్తాను.

వద్దు. సండే రోజు అబిడ్స్ బుక్ మార్కెట్‌లో కలుద్దాం. మా ఫ్రెండ్ కూడా వస్తుంది అని ఫోన్ పెట్టేసింది.

ఇప్పుడు, ఆ అమ్మాయిని నేను అబిడ్స్‌లో కలిసానా? కలిస్తే ఏమయింది. ఆమెతో నేను ప్రేమలో పడ్డానా? అని చాలామంది పాఠకులు తెలుసుకోవాలానే ఉత్సాహంతో ఉండి ఉంటారు.

కానీ ఆ ప్రశ్నలకు నేను అవునని చెప్పలేను. కాదనీ చెప్పలేను.

ఆ అమ్మాయితో జరిగిన సంభాషణ, సంఘటనలు ఈ కథకి సంబంధించినవి కావు. ఈ కథ చదువుతున్న మీలాగే, ఆ అమ్మాయి కూడా మన జీవితంలోకి అలా వచ్చి వెళ్లిపోయే కొందరిలో ఒకరు. ఈ కథ చదవడం ద్వారా మీరూ నా జీవితంలోకి వచ్చి వెళ్లినట్టే. లేదా నేనే మీ జీవితంలోకి వచ్చినట్టు. కానీ మీకూ ఆ అమ్మాయికి ఒక తేడా ఉంది. "మీరు" ఒక నిర్ధిష్టమైన నిర్వచించబడిన పాత్ర కాదు. కానీ ఆ అమ్మాయిలాగే మీరు ఒక నిర్ధిష్టమైన పాత్రగా ఈ కథలో ఉండాలనుకుంటే, ఈ కథ చదివిన తర్వాత నాకు ఫోన్ చేసినట్లయితే, ఈ కథని తిరిగి ఇంకోచోట ప్రచురించినప్పుడు మిమ్మల్ని కూడా ఈ కథలో పాత్రని చేసే అవకాశం ఉంది.

ప్రేమ కథలతో ఇదే ఇబ్బంది ఎప్పుడూ. ఆ అమ్మాయి వల్ల కథ దారి తప్పింది. వాళ్లని కాసేపు పక్కన పెట్టి మళ్లీ కథలోకి వద్దాం.

• • •

ముందుకెళ్లే ముందు ఒక విషయం చెప్పుకోనివ్వండి:

ఇంద్రియ జ్ఞానంతో మనం బాహ్యప్రపంచాన్ని అర్థం చేసుకోగలుగుతాం. కానీ దైనందిన జీవితంలో మన ఇంద్రియాలు కూడా మొద్దుబారి కొత్తవిషయాలను ప్రాసెస్ చెయ్యడం మానేస్తాయి. కానీ ఏదో ఒక క్షణంలో దైనందిన జీవితంలో గమనింపుకి రాని ఏదైనా కొత్త విషయాన్ని మనం గ్రహించామంటే అందుకు కారణం కాసేపు మన మెదడు, మనసు ప్రత్యేకంగా స్పందించి మనలో ఆలోచనలని ప్రేరేపించడమే! ఇలా జరిగినప్పుడు మనం గ్రహించిన ఆ విషయం, అప్పటివరకూ మన మనోఫలకంపై ముంద్రించుకున్న ఎన్నో విషయాలపై సరికొత్త వెలుగుని ప్రసరింపచేసి మనల్ని కొత్త వ్యక్తిగా ఆవిష్కరిస్తుంది.

మన దైనందిన జీవితంలో ఇలాంటివి జరగకుండా మనల్ని ఎన్నో విషయాలు అడ్డుపడుతూ ఉంటాయి. ఆఫీస్, ఉద్యోగం, ఇల్లు, బరువులు, బాధ్యతలు, డబ్బు, ఆస్తి, హెూదా ఇలా ఎన్నో విషయాల్లో తలమునకలైన మనలో మనసు, మెదడు స్పందించడం, ప్రేరేపించడం మానివేస్తాయి. అలా జరిగినప్పుడు మనిషి మన బాహ్య ప్రపంచాన్ని ఏ విధంగానూ అర్థం చేసుకోకపోగా, ఎవరో చెప్పిన వాటినే నిజమని నమ్ముతూ వాటినే గుడ్డిగా ఆచరిస్తూ ఉండిపోతాడు.

ప్రస్తుత సమాజం ఇలాంటి ప్రవర్తన కలిగిన వారితో నిండిపోయి ఉంది. అందుకే ఎన్నో సమస్యలు నేడు పరిష్కారం లేకుండా ఉండిపోతున్నాయి. అత్యవసరం కానప్పుడు, దాని గురించి ఇప్పుడెందుకు ఆందోళన, అని సమస్యలను వాయిదా వేసుకుంటూపోయే భావన ఇప్పుడు అందరిలో అలముకుని ఉంది. ఈ నిర్లక్ష్యం రేపు కొంపలంటుకునేవరకూ కొనసాగుతూనే ఉంటుంది.

కొన్ని తెలుగు సినిమాలు చూసి వచ్చాక, సినిమా ఎలా ఉంది అని అడిగితే – డైలాగ్స్ బావున్నాయని చెప్తారు. అలాగే సంబంధం లేకుండా ఏదో గొప్ప విషయాన్ని కథ ద్వారా తెలియచేసినట్టు భ్రమింపచేయడానికే పైన రాసింది ఈ కథలో చేర్చడమైంది.

కల్పనకు వాస్తవానికీ మధ్య జరిగిన సంగ్రామంలో ఊహించని మలుపులతో ఇప్పటివరకూ సాగిన ఈ కథ రాయడం చివరికి వచ్చింది. ఇదంతా రాయడం ద్వారా కొంత ఉపశమనంతో పాటు యదార్థ సంఘటనలను ఎదుర్కొనే ధైర్యం కూడా నాలో వచ్చింది.

అసలు ఆ రోజు సాయంత్రం కొండ దగ్గర ఏం జరిగిందో చెప్పాల్సిన సమయం వచ్చింది.

మేము ఒకరికొకరు చేతులందించుకుంటూ కొండపైకి చేరుకున్నాం.

వెన్నెలలో కొండపైన చెట్లు వింతరంగులో మెరుస్తున్నాయి. మేము కొండపైన బల్లపరుపుగా ఉన్న పెద్ద రాయిపై పడుకుని చుక్కల్ని చూస్తున్నాం.

మళ్లీ మనందరం ఇలా ఎప్పుడు కలుస్తామో? అన్నాడు ఖాజావలి.

వచ్చే సంవత్సరం శెలవుల్లో కలుద్దాం అన్నాడు రాధాకృష్ణ.

నేనీ ఊర్లో ఉండనేమోరా అన్నాడు సుధాకర్.

ఎందుకురా? అందరం ఎమ్సెట్ బాగా రాద్దాం, మంచి ర్యాంక్స్ తెచ్చుకుని ఒకే ఇంజనీరింగ్ కాలేజ్‌లో చదువుదాం అన్నాను నేను.

అలా కుదరదురా. మనమందరం ఒక్కొక్క చోటుకి వెళ్లిపోయి దూరమైపోతాం అన్నాడు బాలరాజు.

నీకు ఎలా తెలుసు? అన్నాను.

నాకు భవిష్యత్తు తెలుసు.

అందరం మౌనంగా ఉన్నాం.

మన భవిష్యత్తు గతంలోనే ఎప్పుడో రాసేశారు. ఎవరెవరు ఎంతెంత భారాన్ని మోయాలో చెప్పేశారు. నాపై పర్వతమంత భారముంది. ఆ భారాన్ని మోస్తూ నేను ఇంత దూరమే రాగలను. ఇకపై ఆ భారం కిందపడి నలిగిపోవడమే మిగిలుంది.

అంటే మనందరి ఫ్యూచర్ నీకు తెలుసా?

తెలుసు.

అయితే చెప్పు.

సుధాకర్‌గాడు ఊరు వదిలి వెళ్లిపోతాడు. ఖాజావలి ఊరుకాని ఊర్లో ఇటుకల బట్టీ పెట్టుకుంటాడు. రాధాకృష్ణ బాగా డబ్బులు సంపాదించి పెద్ద హొటల్ బిజినెస్ మొదలు పెడ్తాడు. నువ్వు అమెరికా వెళ్లి డబ్బులు సంపాదించి, టైం పాస్‌కి కథలు రాసుకుంటుంటావు. భవిష్యత్తులో ఇక్కడ జరిగిందంతా చెప్పాలనే ఉత్సుకతతో కథ రాయడం మొదలుపెడ్తావు. ఇక్కడ జరిగింది ఎలా చెప్పాలో తెలియక పర్వతం బరువును కొలవడం ఎలా? అనే విషయం గురించి కథ రాస్తావు.

మరి నువ్వు?

నేను ఏ మురిక్కాలవలోనో పడి చచ్చిపోతాను.

అందరం మౌనంగా ఉండిపోయాం. చందమామని కమ్ముకున్న మబ్బులు తొలిగాయి. ఆ వెన్నెల వెలుగులో మరొక్క సారి బాలరాజు మోస్తున్న పర్వతం

కళ్లముందు ప్రత్యక్షమైంది. ఆ పర్వతం బరువెంతో అని నేను ఆలోచనలో పడ్డాను.

రాయిపై పడుకున్న బాలరాజు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

ఒజామా–షిమాసితా!

ప్రత్యేకం

# తమిళ, కన్నడ కథలు

# తమిళ కథలు



## అరాత్తు

పాండిచ్చేరిలో పుట్టిన ఆర్. శ్రీనివాసన్ తమిళనాడులోని కడలూరు జిల్లాలో చదువుకున్నారు. అరాత్తు అన్న పేరుతో 2010 నుండి సోషల్ మీడియాలలో నేటితరం జీవితానికి అద్దం పట్టే విషయాలను తీసుకుని ప్రయోగాత్మకమైన మైక్రో కథలు, కవితలు రాయడం ద్వారా గుర్తింపు పొందారు. ప్రముఖ అరవ రచయితలు చారు నివేదితా, జయమోహన్, మనుష్యపుత్రన్‌ల మెప్పు పొందారు. ఇప్పటివరకు మూడు నవలలు, మూడుకథల సంపుటాలు, ఒక బాలల కథల సంపుటి, వాహనాలకు సంబంధించిన వ్యాస సంపుటి, ఒక కవితా సంపుటి ప్రచురించారు. క్లుప్తంగా, సటైరికల్‌గా రాయడం ఈయన శైలి. సొంతంగా ఒక ఐటి కంపనీ నడుపుతున్నారు. కొన్ని తమిళ సినిమాలకు కథా చర్చల్లో భాగస్వామ్యం వహించారు.

నివాసం : చెన్నై

మెయిల్ : araathu@outlook.com

# టెక్నిక్ అమ్మాయి

ఇప్పుడొక ట్రెండ్ నడుస్తోంది. మీరు గమనించారో లేదో తెలియదు. ఒక అలగా, అలా చెప్పకూడదు, ఒక సగటు అమ్మాయి అని పొలిటికలీ కరెక్టెడ్‌గా చెప్పుకుందాం. ఆమె ఫేస్బుక్‌లోకి వచ్చిందనుకుందాం. ఎవరయినా పట్టించుకుంటారూ?

ఆమె ఏం చేస్తుంది?

కొంచం ఆగండి, ఆమె ఏం చేస్తుందని చూసే ముందు, బతక్కనే చెడిన అగ్మార్క్ సాహితీవేత్తలు ఏం చేస్తారన్నది చూద్దాం.

వాళ్ళేం చెయ్యగలరూ? పనికిమాలినవి వాగుతూ, కొంత కీర్తి గడించిన సాహితీకారుల్ని తిట్టిపోస్తూ, అప్పుడప్పుడూ 100 కాపీలు వేసి పుస్తకాలను ఇంటిలో సర్దుకుంటూ ఉంటారు.

ఫేస్బుక్‌లో గర్ల్‌ఫ్రెండుతో చాట్ చేసే జనాలను చూస్తే చంపేయాలన్నంత ఆత్రం వస్తుంది వీళ్ళకు. క్వార్టరు లాగించి, 130 రూపాయలకు బేరమాడి కుదుర్చుకున్న వేశ్యతో ‘నువ్వు నాకు గర్ల్‌ఫ్రెండుగా ఉంటావా?’ అని తడబడుతూ అడగ్గా, కాలి పాదమ్మీద ఆమె ఊసి వెళ్లిన వక్కాకు ఎంగిలిని కవితగా రాసుకుంటారు.

వీళ్ళిలా ఉండగా, పొలిటికలీ కరెక్టెడ్ సగటు అమ్మాయి అనబడే ఆ అలగా అమ్మాయి వీళ్ళకు మెసేజ్ పంపితే ఏమవుతుందీ?

అందునా మొట్టమొదటిసారిగా “హాయ్” అని చూస్తున్నారు. ఇంతకాలం వీళ్ళు రాసిన కవితల కంటే, కథనాల కంటే, గ్రాటైన విమర్శల కంటే, చమత్కారమైన చలోక్తుల కంటే ఈ హాయ్ పలు భావాలను ఇస్తుంది, మనసు వికసిస్తుంది.

బతక్కనే చెడిన నలుగురు సాహితీవేత్తలకు ఈ ఒకే ఒక్క పొలిటికలీ కరెక్టెడ్ సగటు అమ్మాయి గర్ల్‌ఫ్రెండ్ అవుతుంది.

ఇక్కడే ఈ అలగా సాహితీవేత్తల పేరు, అధికారం పనికొస్తుంది. (సాహితీవేత్తలకు పొలిటికలీ కరెక్ట్‌నెస్ అక్కర్లేదు, అలగా అనే అనొచ్చు.)

మొత్తానికి, వీరి అండదండలతో ఆ పొలిటికలీ కరెక్టెడ్ సగటు అమ్మాయి ఎంతో ఎత్తుకు ఎదిగిపోతుంది. ఆమె ఒక ఐకాన్ అవుతుంది. రాజకీయ సాహితీ వేత్తల నుండి, ఆర్థిక సాహితీవేత్తల వరకు ఈమెను ధ్యేయంగా భావించి ఊడిగాలు చేసేస్తుంటారు.

ఆమె డొక్కు పెదవి, పొలిటికలీ కరెక్టెడ్, సహజమైన పెదవి, సాహితీయ ధరమవుతుంది.

ఆమె సడలిపోయిన రొమ్ము మాంసం, పొలిటికలీ కరెక్టెడ్, పాలిచ్చేరొమ్ము, సాహితీ చనుకట్టవుతుంది.

ఆమె ఒక దశలో వీరి కవితల్ని కాలికింద తొక్కుతుంది. వీళ్ళు సిగ్గులేక ఆమె కాలిని ముద్దు పెట్టుకుని పైకి పాకినపుడు, 60 వేలు అడుగుతుంది.

# వీక్ఎండ్

‘హనీ, వీకెండ్ మెసేజ్ చెయ్యకు. వీకెండ్లో నా మొగుడు లంజాకొడుకు నా మొబైల్ కెలుకుతూ ఉంటాడు’ అని మెసేజ్ పంపించి ఉంది హని నెంబర్ 26.

సరిగ్గా శనివారం రాత్రి హని నెంబర్ 26 రొమ్ములు గుర్తొచ్చాయి.

ఫోను తీశాడు, హని నెంబర్ 26 వెతికాడు.

మెసేజ్ టైప్ చేశాడు–

“ఒరేయి పుండాకోర్, పెళ్ళాన్ని గెలక్కుండా ఏంట్రా మొబైల్ గెలుకుతున్నావు? సారీ హనీ, కాల్ మీ వెన్ ఫ్రీ, ఐ నీడ్ టు ఫక్ యూ”.

# పిచ్చోడు

వేసవి సెలవులకు స్నేహితుడి ఊరికి వచ్చాను. బాల్కనీలో కూర్చుని మందు తాగుతూ ఉండగా, వీధిలో ఏవో అరుపులు. ఒకడు నగ్నంగా నడిసి వెళ్తున్నాడు. చేతిలో వాడి బట్టలున్నాయి. పిల్లా జల్లంతా వేళాకోళమాడుతూ, నవ్వుతూ వాడిని వెంబడించారు. ఆ నగ్న కుర్రాడు ఓ పెద్ద బంగ్లాలోనికి దూరాడు.

ఏంట్రా ఇదని అడిగాను స్నేహితుణ్ణి.

'పిచ్చోడు మామా. అయితే ఎవరికీ ఏ ఇబ్బందీ కలిగించడు. వాళ్ళ ఇంట్లో కూడా చెప్పి చూశాము, హాస్పిటల్లో చేర్పించనంటున్నారు. పోలీసులకీ కంప్లయింట్ ఇచ్చాము, వాళ్ళేం చర్యలూ తీసుకోలేదు.'

నాకు వింతగా అనిపించింది.

ఇంకేవో సరదా కబుర్లు చెప్పుకుంటూ నాలుగు రవుండ్లు ముగించాక, 'వాక్ కి వెళ్దాం' అన్నాను.

వీధి సద్దుమణిగి ఉంది. వీధి దీపాలు నిద్రలో వెలుతురును కురుస్తున్నాయి.

వీధి మొగదాల్లో ఒక పార్టీ జెండా స్థంబం ఉంది. ఆ దిమ్మె మీద కూర్చుని ఒక దమ్ము ముట్టించుకున్నాను. స్నేహతుడు కూడా.

ఆ నగ్న కుర్రాడు, ఇప్పుడు బట్టలతో నడిచొస్తున్నాడు.

స్నేహితుడు 'రారా వెళ్ళిపోదాం' అన్నాడు.

'ఉండరా,' అని వాడిని కూర్చోబెట్టి చూసేలోపే మా దగ్గర కొచ్చి చిరునవ్వు చిందాడు.

నేను చెప్పిన మందువాసన హాయ్‌కి వాడు కరచాలనానికి చేయి చాచాడు. పట్టుకుని, నెమ్మదిగా, 'ఏంటి బ్రో సాయంత్రం బట్టలిప్పుకుని నడిచెళ్ళారు' అంటూ ధీర్ఘంగా దమ్ములాగాను.

'అదేం లేదు బ్రో, కొన్నాళ్ళుగా బుర్రలో ఏదో తొలిచినట్టు ఉంటుంది. 10 నిముషాల తర్వాత చెయ్యాల్సిన పని ఇప్పుడే చేసేయాలనిపిస్తోంది. బయటకెళ్ళి ఇంటికి రాగానే బట్టలిప్పి స్నానం చేస్తాను. అది పదినిముషాలు ముందుగా, వీధిలోనే విప్పేస్తున్నాను. ఈ ప్రవర్తనని కంట్రోల్ చేసుకోవడం నా వల్ల కావటంలేదు. అయితే నేను పిచ్చోణ్ణి కాదు బ్రో.'

'అర్థమవుతోంది. ఇది చాలా సింపుల్ మేటర్ బ్రో.'

'దీన్నెలా బ్రో నయం చేసుకునేది? డాక్టర్ దగ్గరకు వెళ్తే చిలికి చిలికి దీన్ని ఇంకా పెద్దది చేసేస్తాడు' అన్నాడు.

'అయ్యో, ఇంతోటి దానికి డాక్టర్ ఏమీ అక్కర్లేదు. ఒక వారం రోజులు బట్టలేసుకునే స్నానం చెయ్యండి, నయమైపోతుంది' అన్నాను.

'సరే బ్రో. అలాగే చేస్తాను' అన్నాడు. 'దమ్ము కొడతారా' అనడిగాను. ఒకటి తీసి ఇచ్చాను.

నా నోట్లో ఉన్న దమ్ము తీసి కిందేసి కాలితో నలిపి వేసి, 'థేంక్స్ బ్రో, సారి బ్రో' అన్నాడు.

* * * * *

**అనువాదం: అవినేని భాస్కర్**

అనువాద కథకుల్లో తెలుగు సాహిత్యంలో అందరికీ పరిచయమున్న పేరు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు గ్రామంలో 1979లో జన్మించారు. మొదట్లో సొంత కథలే రాసినా, 2013 నుంచి అనువాద కథలవైపుకు మళ్లారు. తమిళంలో బాగా పేరున్న రచయితల కథలతో పాటు, తాను తెలుగులో చెప్పాల్సిన అవసరం ఉందని భావించిన కొత్త రచయితల కథలను కూడా అనువాదం చేస్తున్నారు. తెలుగుజీవికి తెలియాల్సిన తమిళ జీవితాలను పరిచయం చెయ్యాలని కృషి చేస్తున్నారు.

# డెవిల్ డాగ్



## వసుధేంద్ర

కన్నడ సాహిత్యంలో పాపులర్ రచయిత. వీరు అమ్మ గురించి రాసిన కథలు కన్నడ సాహిత్యంలో విశేష ప్రజాదరణ పొందాయి. 'మొహనస్వామి' పేరుతో వీరు తీసుకొచ్చిన పుస్తకం దేశంలోని ఎన్నో భాషల్లోకి అనువాదమై మంచి ఆదరణ పొందింది. ఒక గే జీవితం, అతడి చుట్టూ ఉన్న పరిస్థితులు ఎలా ఉంటాయన్నది చెబుతూ మోహనస్వామి కథలు సాగుతాయి. సున్నితమైన అంశాలను, భావోద్వేగాలను తన కథల్లో అందంగా చెబుతారన్న పేరు వీరికి ఉంది. 'నేను గే' అని ప్రకటించుకొని మోహనస్వామి కథలు రాశారు.

నివాసం : బెంగళూరు

మొబైల్ : 098444 22782

"నిమ్మి" అనే ఆ ముద్దులొలికే కుక్కపిల్లను మొదట్లో శ్రీనివాసరావుగారు ఇష్టపడలేదు. ఏ రోజూ కుక్కను పెంచుకునే సాహసాన్ని జీవితంలో చేయకపోవటం వల్ల ఈ డెబ్బయి ఏళ్ళు దాటిన సమయంలో ఆ కొత్త తలనొప్పి ఎందుకని ఆయన అభిప్రాయం. అయితే అమెరికా నుంచి వచ్చిన కొడుకు–కోడలు ఎన్నడూ లేనంతగా ఒత్తిడి పెట్టి తోడుగా కుక్కను ఉంచుకొమ్మని ఒప్పించి వెళ్ళారు. "ఇన్ని రోజులు అమ్మ తోడుగా ఉండేది. ఇకపై మీరు ఒక్కరే ఉండాలి. తోడు ఉండనీ. దాని బాధ్యత చూసుకోవడానికి కావాలంటే ఒక కుర్రవాడికి చెప్పి వెళతాం' అని కన్నీళ్ళతో వేడుకున్నారు. ఆ భావనాత్మకమైన బెదిరింపుకు రావుగారు బలయ్యారు..

భార్య పోయినవాడిగా ఎడబాటును ఎదుర్కోవటానికి ఆయన తగినంత సంసిద్ధత చేసుకున్నారు. భార్య ఆరోగ్యం తనంత దృఢమైన ఆరోగ్యం కాదని అర్థం చేసుకున్న రోజు నుంచీ ఆయన మనస్సులోనే భవిష్యత్తులో రాబోయే ఒంటరి జీవితం కోసం ఎదురుచూస్తూ ఉండిపోయారు. మొదట్లో కుమారుడు తమను ఇక్కడ వదిలి అమెరికాకు వెళ్ళటం బాధ కలిగించింది. ఇప్పుడు అతడి మీద కోపం లేదు. "తాను ఎలా పల్లెను వదిలి బెంగళూరు చేరుకున్నాడో, తన కుమారుడు బెంగళూరు వదిలి అమెరికా చేరుకున్నాడు. వృద్ధాప్యంలో ఎవరైనా ఒకరు సహాయంగా ఉండాలని కోరుకోవడం స్వార్థం. మన వృద్ధాప్యాన్ని మనమే ఎదుర్కోవటానికి సిద్ధం కావాలి. మన జీవితంలోని సోమరితనం వల్ల వృద్ధాప్యంలో అనారోగ్యం తెచ్చుకుని, ఆ శిక్షను పిల్లలకు బదిలీ చేయకూడదు" అని ఆలోచించసాగారు.

ఆ చిన్నారి పొమేరియన్ కుక్క మీద ఆరంభంలో కోపం ఉండటం వల్ల దానికి 'నిమ్మి' అనే పేరు పెట్టారు. రావుగారు హైస్కూల్ రోజులనాటి ప్రేమభిక్షను

క్రూరంగా నిరాకరించిన అమ్మాయి పేరు నిమ్మి. ఆమె కన్నడ మాష్టారుగారి అమ్మాయి. ఆమెను లోలోపలే ప్రేమించిన రావు ఒకరోజు ధైర్యం చేసి ఒక పేజీ పొడుగు ప్రేమలేఖను రాసి, నోటు పుస్తకంలో పెట్టి ఆమెకు ఇచ్చాడు. ఆ రాత్రంతా నిద్రలేక, తనకలాడి, మరుసటి రోజు పాఠశాలకు వెళ్ళినపుడు ఆమె ముఖాన్ని చూడటానికీ ధైర్యం చాల్లేదు. అయితే 'నిమ్మి' అనే ఆ అమ్మాయి ఎలాంటి కలవరం లేకుండా మరొక నోట్ పుస్తకంలో ఆ ఉత్తరాన్ని పెట్టి ఇచ్చింది. అతడి ఉత్తరంలోని అన్ని తప్పులను ఎర్రసిరాతో దిద్ది, చివరలో 'ఒక్క పుటలోనే 28 తప్పులు గుర్తించాను. ముందు కన్నడ బాగా రాయటం నేర్చుకో. తరువాత ప్రేమించడం నేర్చుకుందువు' అని రాసింది. అప్పటి నుంచి ఆయనకు ఏ వ్యక్తి విషయంలోనైనా కోపం వస్తే "నిమ్మి... నిమ్మి..." అని మనస్సులోనే తిట్టుకోవడం అలవాటైపోయింది.

వెండిలాంటి పట్టుజుత్తును ఒళ్ళంతా కప్పుకుని, అక్కడక్కడ గంధపు లేపనం చేసినట్టు బంగారురంగు జుత్తును కలిగివున్న, పనస గింజల్లాంటి చిన్నచిన్న కళ్ళు, వేలాడే చెవులతో, "కుయ్... కుయ్" అంటూ అనుసరించి వచ్చే ఆ ముద్దుల ప్రాణిని ఎవరు ద్వేషించగలరు? కొద్ది రోజుల్లోనే అది రావుగారి ఊపిరిలా మారింది. తప్పటడుగులు వేసేలా ఆయన నడిచిన చోటికంతా తోడుగా వచ్చే ఈ పిడికెడు ప్రాణి ఆయనకు ఎక్కడలేని సుఖాన్ని– ప్రశాంతతను ఇచ్చేది. 'కుక్కను పెంచటంలో ఇంత సుఖముందని ఇంతకు ముందు ఎవరూ నాకూ ఎందుకు చెప్పలేదు' అని విసుగుపడే స్థాయికి ఆయన అలవాటు పడ్డారు.

ఈ నిమ్మి సాధారణమైన కుక్క కాదు. తగినంత తెలివితేటలు కలిగినదని రావుగారికి చాలా తొందరలోనే తెలిసిపోయింది. ఇంతకు ముందు పాలు కాచడానికి పొయ్యి మీద పాలుపెట్టి, వసారాలో పేపర్ చదువుతూ కూర్చునేవాడు. ఆ చదువు మాయలోపడి పాలు పొంగిపోవటం గుర్తించక, పాత్ర నల్లబడేంత వరకు అది కాలిపోయేది. అయితే ఇప్పుడు వసారాలో వారి పాదాల దగ్గరలోనే కూర్చుంటున్న నిమ్మికి మాత్రం అదెలాగో పాలు పొంగే ఘడియలు తెలిసిపోయేవి. అరనిముషానికి ముందే "భౌభౌ" అని రావుగారిని గద్దిస్తూ వంటింటికి పంపేది. బహుశా పాలుపొంగే వాసన నిమ్మికి తెలిసిపోతుందని రావుగారు ఊహించారు. అదే విధంగా మొబైల్ ఫోన్ రింగ్ కావటానికి మునుపే నిమ్మికి పిలుపు వస్తుందని తెలిసిపోయేది. మొబైల్ దగ్గరికి వెళ్ళి మొరిగేది.

వారంలోని ఆరురోజుల కాలంలో ఉదయం అయిదున్నరకు నిద్రలేచే అలవాటు రావుగారికి ఉంది. ముఖం కడుక్కుని నిమ్మీని తోడు తీసుకుని వెళతారు. అయితే ఆదివారం మాత్రం కాస్త నెమ్మదిగానే గడిపే అలవాటు చేసుకున్నారు. అందువల్ల ఏడుగంటల వరకు పక్కలోనే దొర్లుతూ వుండేవారు. ఆయన దినచర్యను నిమ్మి బాగా అర్థం చేసుకుంది. అందువల్ల వారంలోని అయిదురోజులు వారిని

సరిగ్గా అయిదున్నరకే లేపినా ఆదివారం మాత్రం ఏడుగంటల వరకు ఆయన పక్కన సంచరించేది కాదు. వారాలను కచ్చితంగా గుర్తించే దాని జాణతనం ఈయనకు విపరీతమైన ఆశ్చర్యాన్ని కలిగించేది.

ఆయన ఉంటున్న కాలనీ చుట్టుపక్కల ఆనేక మురికి చెరువులు ఉండటం వల్ల దోమల బెడద విపరీతంగా ఉండేది. రాత్రి నిద్రకు తీవ్రమైన ఇబ్బంది కలిగిస్తున్న ఈ దోమలు సాయంకాలం సమయంలో ఇంట్లోకి ప్రవేశించేవి. ఆ సమయంలో తలుపులు వేసేస్తే, కొద్దిస్థాయిలో వాటి దాడులను భరించవచ్చు. అయితే రావుగారికి కొన్నిసార్లు తలుపులను వేయటం మరిచిపోయేవారు. ఈ పనిని అత్యంత సంతోషంతో నిమ్మి తన బాధ్యతగా తీసుకుంది. సరిగ్గా అయిదు గంటలకు తలుపులు వేయటం, ఉదయం ఆరుగంటలకు దాన్ని తెరవటం రెండింటిని మరిచిపోయేది కాదు..

వీటన్నిటికన్నా గొప్ప జాణతనం నిమ్మిలో చూసే అదృష్టం రావుగారికి కొద్దిరోజుల్లోనే కలిసివచ్చింది.

ఈయన గ్రౌండ్ ఫ్లోర్లో నివసిస్తుంటే, థర్డ్ ఫ్లోర్లో ఓ తమిళ కుటుంబం నివసిస్తుండేది. వాళ్ళకు ఇంజనీరింగ్ చదివే కొడుకు ఉన్నాడు. రావుగారు ఆ కుర్రవాడిని అప్పుడప్పుడు గమనించినప్పటికీ ఎన్నడూ పలకరించ లేదు. ఆ కుర్రవాడికి ఫ్లూటు వాయించే అలవాటు ఉండేది. రావుగారు బాల్కనీలో కూర్చుని పుస్తకాలు చదివేటప్పుడు ఆ కుర్రవాడు తనపాటికి తాను ఫ్లూటు వాయించుకుంటూ ఉండేవాడు.

దాని మధురమైన నాదం రావుగారి చదువుకు నేపథ్యంగా సంతోషాన్ని ఇచ్చేది. మనస్సుకు 'ఆహా' అనిపించేటటువంటి రాగాలాపన రూపొందినప్పుడు ఆయన పుస్తకాన్ని మూసేసి, కళ్ళు ముసుకుని నాదమాధుర్యాన్ని ఆస్వాదించేవారు. ఒకరోజు ఆ కుర్రవాడు ఇంటికి వచ్చి బెల్ కొట్టాడు.

“అంకుల్, నా పేరు స్వామినాథన్. థర్డ్‌ఫ్లోర్‌లో ఉంటాను. మీతో కాస్త మాట్లాడాలి” అని ముఖమంతా నవ్వు పులుముకుని ఆ కుర్రవాడు అన్నాడు.

లక్షణంగా తెల్లటి ధోవతి, జుబ్బా ధరించాడు. నుదుట విభూతి దర్పంగా పూసుకున్నాడు. సన్నగా ఉన్నాడు. చిన్నమీసంతో నల్లటి ఛాయ కలిగిన కుర్రవాడు. రావుగారికి నచ్చాడు. అయితే ఎన్నడూ లేనిది ఈ రోజు మాట్లాడే విషయం ఏముంటుంది? అనే అనుమానంతోటే ఆ కుర్రవాడిని లోపలికి ఆహ్వానించాడు. ఆ కుర్రవాడు లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. అతడి పక్కలోనే మరొక కుర్చీ ఎక్కి నిమ్మి అతడినే చూస్తూ తోక ఊపుతూ కూర్చుంది.

"మీ కుక్క పేరు ఏమిటి అంకుల్?" అని నిమ్మి తల నిమురుతూ అడిగాడు.

"నిమ్మి అని పిలుస్తాను" అని రావుగారు తెలియజేశారు.

"నిమ్మీ చాలా ఇంటలిజెంట్ అనిపిస్తుంది అంకుల్" అని ముఖంలో సంభ్రమాన్ని నింపుకుని చెప్పాడు..

నిమ్మి తెలివితేటలు ఇతడికి ఎలా తెలిశాయి? అని రావుగారు ఆశ్చర్యపోయారు.

"మీ నిమ్మికి చక్కటి సంగీతజ్ఞానం ఉంది ఆంకుల్. నేను ఇంకా ఫ్లూటు వాయించటం నేర్చుకుంటున్న విద్యార్థిని. అందువల్ల వాయించేటప్పుడు అప్పుడప్పుడు అపస్వరం దొర్లుతుంది. అప్పుడు వెంటనే నిమ్మి బాల్కనీలోకి వచ్చి మొరిగి నన్ను గద్దిస్తుంది. మళ్ళీ సరిగ్గా స్వరం ఎత్తుకంటే మౌనంగా ఉంటుంది" అని వివరించాడు.

విషయం విని రావుగారు కలవరపడ్డారు.

"అలాంటిదేమీ లేదయ్యా. ఇంట్లోనే ఉండి దానికి విసుగొచ్చి ఉంటుంది. అందుకే అప్పుడప్పుడు బాల్కనీకి వచ్చి మొరిగే అలవాటు చేసుకుంది. ఆలస్యమైతే మనం ఒళ్ళు విరుచుకుంటాం కదా. అలా నువ్వు ఏదేదో ఊహించుకున్నావు. అంతే" అని నచ్చజెప్పడానికి చూశారు. అయితే స్వామినాథన్ అంగీకరించలేదు. "నేను అబద్ధం చెప్పను అంకుల్. మొదట్లో నాకూ అనుమానం కలిగింది. అయితే చాలాసార్లు పరీక్షించిన తరువాతే ఈ మాట అంటున్నాను. ఏ రాగం వాయించినా, అందులో అపస్వరం దొర్లితే చాలు, బాల్కనీలోకి పరుగెత్తుకొచ్చి మొరుగుతుంది" అని అన్నాడు స్వామినాథన్.

అతడి మాటలకు ఎలా ప్రతిస్పందించాలో తెలియక రావుగారు మౌనం వహించారు. ఆయన తన మాటలు నమ్మటం లేదనే అనుమానం కలిగిన స్వామినాథన్ –

"మీ అనుమానం అర్థమైంది అంకుల్. ఒక పని చేద్దాం. మీ ఇంటికి ఫ్లూట్ తెచ్చి వాయిస్తాను. అపస్వరం పలికితే నిమ్మి ఎలా గొడవ చేస్తుందో మీరే చూడండి" అని ఉత్సాహంగా అన్నాడు.

"అది సరే స్వామినాథన్. కానీ మీరు ఎప్పుడు అపస్వరం పలికిస్తారో ఎలా తెలుస్తుంది? నాకు సంగీత జ్ఞానం లేదు" అని తన సమస్యను ముందు పెట్టారు.

"అంకుల్ అదేమంత కష్టం కాదు. సంగీతం మధ్యలో దొర్లే అపస్వరం గుర్తించటానికి గొప్ప సంగీత జ్ఞానం అవసరం లేదు. సహజ, అసహజాలను ప్రామాణికంగా గుర్తించగలిగేవారికి అపస్వరం తెలుస్తుందని మా గురువుగారు చెప్పేవారు. ఎదుటవున్న వారు మాట్లాడేటప్పుడు అబద్ధాలను చేర్చితే మనకు ఎలా అసహనంగా అనిపిస్తుందో అలా. రోజు ఉదయమే లేచేవారికి ఏదో ఒక రోజున

ఏదో సరిగ్గా లేదని అనిపిస్తుందే అలా. అయినా అపస్వరం వాయించటానికి ముందు నేను మీకు కనుసైగ చేస్తాను" అని చెప్పి ఉత్సాహంతో ఫ్లూటు, శృతిపెట్టెను తీసుకుని రావటానికి ఇంటికి పరుగెత్తాడు.

• • •

ప్రతి సంవత్సరంలాగే శ్రీరామనవమి పండుగ వచ్చింది. నెలల పొడుగునా జరిగే సంగీతోత్సవాల కోసం కోటీ హైస్కూలు మైదానంలో పెద్ద షామియానా వేశారు. ఆ రోజు ఆదివారం సాయంత్రం మంజులా నంబూద్రిగారు ప్రత్యేకమైన కచేరి చేయబోతున్నారు. మొత్తం దేశంలోనే తమ గానమాధుర్యానికి, రాగవిస్తారానికి, మనోధర్మ సంగీతానికి ఎంతో ప్రఖ్యాతి పొందిన ఆమె గాత్రం వినడానికి మైదానమంతా జనంతో కిక్కిరిసిపోవటంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. అయితే మొదటిసారి సంగీత కచేరికి రావుగారు తమ నిమ్మిని తీసుకుని పోవడం మాత్రం మరీ ప్రత్యేకంగా ఉంది.

ఈ మధ్యన స్వామినాధన్ నిమ్మికి చాలా దగ్గరయ్యాడు. రావుగారి ఇంటికి వచ్చి, నిమ్మి ఎదుటకూర్చుని ఫ్లూటు అభ్యాసం చేసేవాడు. "తప్పుదిద్దే చెప్పేవాళ్ళు విద్యార్థికి గురువుతో సమానమవుతారు అంకుల్. నాకు నిమ్మి గురువు అన్నట్టే." అని అత్యంత అభిమానంతో నిమ్మి గురించి చెబుతుండేవాడు. జనాదరణ పొందిన రాగాలైన కళ్యాణి, శంకరాభరణం, తోడి, కాంబోజి మొదలైనవి మాత్రమే కాకుండా, అత్యంత అపురూపమైన రాగాలైన సురుటి, బిందుమాలిని, కోకిలప్రియ, గానమూర్తి వాయించేటప్పుడు అపశ్రుతిని కనుక్కునే శక్తిని నిమ్మి ప్రదర్శించింది.

స్వామినాధన్ సహవాసం రావుగారికి ఇష్టమయ్యింది. తనపాటికి తాను ఇంటికి వచ్చి మధురంగా ఫ్లూటు వాయించే కుర్రవాడిని ఎవరు వద్దంటారు? అతడి ఫ్లూటు నాదాన్ని విని విని ఈ మధ్యన ఆయనకూ సంగీతం రుచి తగిలింది. రాగాలను గుర్తించటానికి ఇంకా సాధ్యం కాకపోయినప్పటికీ, అపస్వరం ఏదో తెలిసిపోయేది. సహజంగానే సాగిపోతున్నప్పుడు, ఓ రాయి తట్టుకుని పడిన భావన అపస్వరమని ఆయన అనుభవానికి వచ్చింది. అది బహిరంగ వ్యాఖ్యానం కన్నా అంతరంగ వ్యాఖ్యానానికి తెలిసే విషయమని వారు కనుక్కున్నారు. నిమ్మి మాత్రం అపస్వరాన్ని ఎలా గబుక్కున గుర్తిస్తుందోనని ఆయనకు చాలా ఆశ్చర్యం కలిగేది. ఇకపై ఎవరిని 'కుక్క బుద్ధివాడు' అని అనకూడదని నిర్ణయించుకున్నారు.

నిమ్మి బాధ్యతల్లో చాలా వాటిని స్వామినాధనే చూసుకునేవాడు. దాన్ని అప్పుడప్పుడు విహారానికి తీసుకునిపోయేవాడు. రావుగారు ఎన్నడూ తీసుకుని రాని, రుచి అనిపించే మాంసాహారాన్ని దానికి తెచ్చిపెట్టేవాడు. మిత్రుల ఇళ్ళకు పిల్చుకునిపోయి అక్కడి మగకుక్కతో ఆడుకోవటానికి వదిలేవాడు. ఇలాంటివన్నీ

ప్రేమతోటే చేసేవాడు. సంగీత ప్రియులైన స్నేహితులు ఎవరైనా వస్తే చాలు. వాళ్ళను రావుగారి ఇంటికి తీసుకొచ్చి నిమ్మి తెలివితేటలను చూపించి వాళ్ళంతా ఆశ్చర్యపోయేలా చేసేవాడు. అతడి స్నేహితులందరూ నిమ్మితో తప్పనిసరిగా సెల్ఫీ తీసుకునే వెళ్ళేవాళ్ళు.

మంజులా నంబూద్రి కచేరికి నిమ్మిని తీసుకుని రావలసిందేనని స్వామినాథన్ వొత్తిడి పెట్టాడు. "ఎన్నడూ నిమ్మీ లైవ్ కచేరి వినలేదు అంకుల్. ఒకసారి మంజులా నంబూద్రీ గానాన్ని వింటే చాలు, చాలా సంతోషపడుతుంది. మరో సభాంగణంలో అయితే కుక్కలను వదలరు. అయితే రామనవమి ఉత్సవం మైదానంలో జరుగుతోంది. చివరివరుస వెనుక కార్లను ఆపవచ్చు. అందువల్ల నిమ్మిని కారులో తీసుకునిపోతే ఎవరికీ సమస్య లేదు" అని రావుగారిని ఒప్పించాడు. రావుగారు కొత్త కొత్త అనుభవాలకు పరిచయం అవుతుండటం వల్ల ఈ సలహాను స్వీకరించారు. ఈ విధంగా కచేరికి వచ్చిన రావుగారిని, నిమ్మిని స్వామినాథన్ పలకరించి, తన సంగీత మిత్రులతో కలిసి తాళం వేసే పని మీద కచేరి ముందువైపు కూర్చోవటానికి వెళ్ళిపోయాడు.

సూర్యాస్తమయపు ఎరుపురంగు శరీరం, వెన్నలలాంటి పసుపురంగు జరీ కాంచీవరం పట్టుచీర కట్టుకుని, తలనిండా మల్లెలను ముడుచుకుని, బాగా పెద్ద కుంకుమ నుదుట పెట్టుకుని ఒంటినిండా ఆభరణాలను పెట్టుకుని, అలంకరించుకుని మంజులా నంబూద్రి వేదిక మీదికి వచ్చింది. మొత్తం సభాంగణమే లేచి నిలబడి చప్పట్లు కొట్టడం ద్వారా తమ సంతోషాన్ని వ్యక్తపరిచింది. వాళ్ళందరి మెప్పుదలను కొంచెం తలవంచుకుని, చేతులు జోడించి, స్వీకరించి తమ స్థానాన్ని ఆక్రమించింది. తన మైకును పరీక్షించుకుని, వెనుక కూర్చున్న పిల్లల తంబూరను శృతి చేసి ఇప్పి, పక్క వాయిద్యం వాయించే వాళ్ళను నవ్వుతూ పలకరించి, సలహా–సూక్ష్మాలను చెప్పి కచేరీని ప్రారంభించింది. రావుగారు రెండు కుర్చీలలో ఒకదాన్లో తాము కూర్చుని, మరొక దాన్లో నిమ్మిని కూర్చోబెట్టి సంగీత రసస్వాదనకు సిద్ధమయ్యారు.

అభోగి రాగంలో వర్ణం పాడి, తరువాత మాయా మాళవగౌళ రాగంలోని త్యాగరాజ కృతి 'మేరు సమాన'... పాడింది. రెండు అద్భుతంగా సాగాయి. మొత్తం సభంతా చప్పట్లు కొట్టింది. రావుగారికీ సంతోషం కలిగింది. ఒకసారి నిమ్మి వైపు చూశారు. అది కూడా సద్దు చేయకుండా సంగీతాన్ని ఆలపిస్తోంది. దాని కళ్ళను గమనిస్తే చాలా సంతోషం కలిగిందని రావుగారికి అర్థమైంది. మూడవ కృతిగా ఇరవైయవ మేళకర్త నఠభైరవి ప్రఖ్యాత కృతి, పాపనాసం శివంగారి 'శ్రీవల్లీ దేవసేనాపతి...' మొదలు పెట్టింది. అది రావుగారి ఇష్టమైన కృతి. పైగా నిమ్మికి అత్యంత ప్రియమైన రాగం. మునుముందు రాబోయే నాదాల పండుగను గుర్తు చేసుకున్న రావుగారు, ఒకసారి నిమ్మి తలను నిమిరి రసస్వాదనకు సిద్ధమయ్యారు.

హిమాలయ పర్వతసానులలో మనస్సుకు నచ్చిన దారులను పట్టుకుని స్వేచ్ఛగా అధిరోహిస్తే ఆ వెండికొండల లోతులను అర్థం చేసుకున్న అనుభూతిని ఆ నఠభైరవి రాగాలాపన కలిగిస్తోంది. ముంగారు మబ్బులు వివిధ ఆకారాలను ధరిస్తూ గగనమంతటా ఆక్రమించి జగత్తులోని సమస్త జీవరాశిని కమ్ముకున్నట్టు ఆ రాగవిస్తారం కొనసాగింది. ఆవగింజంత  విత్తనం ఒకటి నేలలోపడి, మొలకెత్తి మహావృక్షమై ఒళ్ళంతా పచ్చదనం నింపుకుని కళజళలాడే అందగత్తెలా నాదమొకటి విస్తరిస్తోంది. రావుగారు కళ్లు మూసుకుని రాగసుధను గ్రోలుతున్నారు.

రెండు మంచి నవలలు రాసిన ఓ రచయిత ఉన్నట్టుండి ఒక చెడ్డరచనను రాసినట్టు మంజులా నంబూద్రి రాగాలాపనలో అపస్వరం పలికింది. చక్కగా నడుస్తున్నవారు తట్టుకుని పడ్డట్టయి రావుగారు, “అయ్యో అపస్వరం’ అని అనుకుంటున్నంతలో నిమ్మి మొత్తం సభాంగణానికే వినిపించేలా గట్టి మొరగసాగింది. నిమ్మి ధ్వని అంత పెద్దగా ఎలా అయ్యిందని ఆశ్చర్యంతో రావుగారు పక్కకు తిరిగి చూశారు. నిమ్మి అక్కడ ఎక్కడుంది? కుర్చీ ఖాళీగా ఉంది. ‘అరే, నిమ్మి ఎక్కడికి పోయింది?” అని ఆలోచించేలోపే జరిగిపోయిన విఘాతం అందరికి అర్థమైపోయింది. ఆప్పటికే సభాంగణంలో కోలాహలం చెలరేగింది. మంజులా నంబూద్రి పాడటం ఆపేశారు. ఓ కుక్క మొరగటం అంత బిగ్గరగా వినిపించడం ఆలస్యం, ఊళ్ళోని ఆ ప్రాంతంలోని చాలా కుక్కలు ఉన్నట్టుండి కోటే హైస్కూలు మైదానంలోకి దూసుకొచ్చి ఒక్కసారిగా మొరగసాగాయి. తమ ధ్వనికన్నా పెద్ద ధ్వని ఉన్న ఆ మరొక కుక్క ఏదైవుండొచ్చని వాటన్నిటికి ఆశ్చర్యం వేసింది.

రావుగారు వేదిక దగ్గరికి పరుగెత్తారు. ఏ మాయలో నిమ్మి వేదికను ఎక్కిందో ఆయనకు అర్థం కాలేదు. చాలామంది జనం వేదిక వైపు వెళ్ళడం, అంతే భయంతో నిమ్మి మైకులో అరవటం ఆయనకు వినిపించి కాళ్ళు చేతులు వణకసాగాయి. తమ నిమ్మిని ఎక్కడ జనం కొట్టి చంపేస్తారోననే కలవరం ఆయనలో మొదలైంది. వేదిక ముందు భాగంలో కాపలాగా వున్న వాడు ఆయనను ఆపడానికి పోయినా వాడిని తోసి ముందుకు పరుగెత్తారు. మంజులా నంబూద్రి, పక్కవాయిద్యం వాళ్ళు ఏమి చేయాలో తోచక తెల్లబోయి నుంచున్నారు. కొంతమంది జనం తోసుకొచ్చి కుక్కను కొట్టడానికి ప్రయత్నించారు. ఆంతలో నిమ్మి వెంటనే పరుగెత్తి వేదిక కిందవున్న అరచేతియంత స్థలంలో దూరి, అక్కడినుంచి పిల్లల గుంపు ఉన్న వైపు  పరుగుతీసింది..

“నా కుక్కపిల్ల ఎక్కడికి పోయింది? దాన్ని ఎక్కడ తరిమేసారు?” అని వేదిక ముందుకు వచ్చి రావుగారు అక్కడున్నవారిని దీనంగా అడిగారు.

"ఆ కుక్క మీదా? ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు? కార్యక్రమానికి ఎందుకు ఇబ్బంది కలిగించారు?" అని ఒకరు దబాయించారు.

"మా నిమ్మికి సంగీతం అంటే చాలా ఇష్టం. అందుకే తీసుకొచ్చాను. అక్కడ వెనుక కూర్చోబెట్టుకుని కూర్చున్నాను. అది ఏ మాయలోనో వేదిక దగ్గరికి వచ్చేసింది. దానికి అపస్వరం పాడితే తెలిసిపోతుంది. అందుకే కోపంతో మొరిగింది" అని సంజాయిషీ ఇవ్వబోయారు.

"గొప్ప సంగీత విద్వాంసురాలి సంగీతంలో అపస్వరమంటారా? మీకెంత అహంకారం? ఎవరండి ఈ ముసలాయన?" అని జనం తమకు తెలియకుండానే గట్టిగా అరవసాగారు.

అంతలో అక్కడికి స్వామినాథన్ పరుగెత్తుకొచ్చాడు. అతను రావుగారి తరఫున అందరిని క్షమాపణ అడిగాడు. అక్కడున్న చాలామంది సంగీత ప్రియులు అతనికి పరిచయం ఉండటం వల్ల వాళ్ళు మౌనం వహించారు. రావుగారిని ఇంటికి పొమ్మని స్వామినాథన్ నచ్చజెప్పి పంపాడు.

రావుగారికి నిమ్మి తప్పిపోవటం అత్యంత దుఃఖాన్ని కలిగించింది. అందరూ కలిసి దాన్ని తరిమేశారు. ఇప్పుడు ఎక్కడ వెతకాలి? అది ఎంతగా భయపడి కంగారుపడిందో ఏమో? ఊరువాడా అంతగా తెలియని ఆ ముద్దుల కుక్కపిల్లను వీధికుక్కలు ఏమి చేస్తాయో అనే భయం మొదలైంది. దాన్ని అనవసరంగా ఇక్కడికి ఎందుకు తెచ్చాను? ఇంట్లోనే మంచి సీడీలను తెచ్చి సంగీతం వినిపించి వుంటే బాగుండేది. వందలాది జనం దాన్ని తిట్టేలా చేశాను. ఇంత గొప్ప విదుషి తమ ఆలాపనలో అపస్వరం పాడుతుందని నాకు ఎలా తెలుస్తుంది? అని పదేపదే తనను తాను తిట్టుకున్నారు.

కారులోనే కూర్చుని ఒకటి రెండు నిముషాలు దుఃఖించారు. "నిమ్మి ఎక్కడున్నా పరవాలేదు. వెదుకుతాను" అని నిర్ణయించుకుని కారు నడుపుకుంటూ బయటికి వచ్చారు.

పిల్లల కూటమి సిగ్నల్ దగ్గరికి వచ్చే సమయానికి, వెనుక సీటులో కూర్చున్న నిమ్మి సద్దు చేయకుండా ముందు సీటులోకి వచ్చి కూర్చుంది. తమ నిమ్మి పక్కనే కూర్చుని ఉండటం చూసి రావుగారికి ఆశ్చర్యం, ఆనందం, పులకరింతలు కలిగి కారును సైడులో నిలిపారు. కళ్ళ నుంచి ఆనందబాష్పాలు రాలాయి. "నువ్వెప్పుడు లోపలికి వచ్చి కూర్చున్నావు?" అని ఆశ్చర్యంతో నిమ్మిని అడిగారు. అది ఏమని సమాధానం చెబుతుంది? ప్రేమతో ఆయన చేతిని ఒకసారి నాకింది.

కారు అద్దాలను కిందికి దించి పార్కింగ్ చేసి వుండటం మంచిదైమది. ఆ గొడవ నుంచి సులభంగా తప్పించుకుని వచ్చి సద్దులేకుండా కారులోకి దూరి

కూర్చుంది. లేకపోయివుంటే ఈ రాత్రి సమయంలో తాను ఎక్కడెక్కడో దీని కోసం వెదకాల్సి వచ్చేదని సంతోషపడ్డారు. మనస్సులోని –ఉద్వేగాన్ని అదుపులోకి వచ్చిన తరువాత "అంత పెద్ద సంగీత విద్వాంసురాలు అపస్వరం పాడింది కదా?" అని ప్రేమగా నిమ్మిని అడిగారు. నిమ్మి నాలుకను పొడుగ్గా చాపి "హ... హ..." అంది.

* * *

మరుసటిరోజు నగరంలోని చాలా పత్రికలు నిమ్మి ఫోటో ప్రచురించాయి. భయపడి నిలబడిపోయిన మంజులా నంబూద్రి, పక్క వాయిద్యంవాళ్ళు, మైకు దగ్గర కూర్చుని మొరుగుతున్న నిమ్మి– ధగధగలాడే వెలుతురులో ఆ ఫోటోను చాలామంది ప్రతికా విలేకరులు వివిధ కోణాల్లో తీసుకున్నారు. జరిగిన సంఘటన వివరాలను రాశారు. ప్రత్యేకత ఏమిటంటే నిమ్మి గురించి మంజులా నంబూద్రి గొప్పగా పొగిడింది.

మంజులా నంబూద్రికి కుక్కల గురించి ఎలాంటి భయమూ లేదు. స్వయంగా ఇంట్లోనే ఒకటి రెండు కుక్కలను సాకింది. అందువల్ల నఠభైరవి రాగాన్ని పాడటానికి పూనుకున్న కొద్ది సమయానికే నిమ్మీ ఎక్కడి నుంచో పరుగెత్తుకొచ్చి వేదిక ఎక్కినప్పుడు ఎలాంటి భయం లేకుండా ఆలాపనను కొనసాగించింది. తన ఆలాపనను వింటూ ఆ ప్రత్యేకమైన కుక్క సంతోషపడుతోందని ఆమె అంతరాత్మకు అర్థమవుతోంది. ముద్దుగా రెండుకాళ్ళ మీద కూర్చున్న ఆ వెన్నముద్దలాంటి కుక్కను ప్రేమగా చూస్తూనే అలాపనను కొనసాగించింది.

రెండురోజుల నుంచి మంజులా నంబూద్రిగారికి సరిగ్గా నిద్రలేదు. రెండు రోజులు రాత్రిపూట ఆలస్యంగా ప్రయాణం చేసింది. మరీ ఆలస్యంగా వచ్చి, సమయం కాని సమయంలో అపరిచితమైన ఊరిని చేరి, అక్కడి హోటల్లో నిద్రపట్టక రాత్రంతా దొర్లి, సాయంత్రం మరొక కచేరి చేసి, మొత్తానికి అలసిపోయింది. ఆ కారణం వల్లనే విపరీతమైన తలనొప్పి, ఒళ్ళంతా భారం, అలసట– అన్నీ ఉన్నాయి. అందుకోసమే ఆమె అలాపనలో అనుకోకుండా అపస్వరం దొర్లిపోయింది. విశ్రాంతి కోరిన ఆమె శరీరం ఆమె మీద కోపం వచ్చి అపస్వరం ద్వారా తన కోపాన్ని ప్రదర్శించింది.

అయితే గొడవ చేసిన ఆ కుక్క తక్షణమే ఆమెకు తన దివంగత గురువును గుర్తుచేసింది. అభ్యాసం చేస్తున్న సమయంలో ఎప్పుడూ ఒక చిన్న బెత్తాన్ని పట్టుకుని తిరుగుతున్న గురువుగారు, అపస్వరం వచ్చిన వెంటనే ఆ బెత్తాన్ని నేల మీద తాటించి హెచ్చరించేవారు. ఈ రోజు నిమ్మి అలాగే మెరుపువేగంతో అపస్వరానికి మొరిగి ప్రతిస్పందించడం ఆమెకు గురువు బెత్తంతో నేలను తాటించి సద్దుచేసే చిత్రమే కళ్ళముందుకు వచ్చి ఒళ్ళు వణికించింది. డబ్బు ఆశకు తాను విపరీతంగా

కచేరీలను ఒప్పుకొని ఆ నాగదేవతకు అవమానం చేస్తున్నాననే భయం ఆమెలో ఉండేది. అందువల్ల నిమ్మీ రూపంలో గురువుగారే తనకు బుద్ధి చెప్పారని మనసుకు అనిపించి, పశ్చాత్తాపంతో ఆమె కళ్ళు చెమర్చాయి. అంతలో ఒక పెద్దాయన వచ్చి అది తమ కుక్కపిల్లనీ, దానికి అపస్వరాన్ని గుర్తించటం తెలుసుననీ చెప్పటం ఆమెను ఆశ్చర్యానికి గురిచేసింది. ఒంటి మీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

పదినిముషాల్లో గొడవంతా అదుపులోకి వచ్చి కచేరి మళ్ళీ ప్రారంభమైంది. పాటను మొదలుపెట్టడానికి ముందు మంజులా నంబూద్రి సభికులతో మాట్లాడింది. “కచేరి మధ్యలో జరిగిన అడ్డంకికి క్షమాపణ అడుగుతున్నాను. అయితే ఆ ప్రత్యేకమైన కుక్క ప్రతిభను చూసి ఆశ్చర్యపోతున్నాను. ఆ సమయంలో నా వల్ల అపస్వరం దొర్లటం నిజమని నేను సభికుల ముందు ప్రమాణం చేసి అంగీకరిస్తున్నాను. పదిహేను నిముషాలకంటే ఎక్కువసేపు తన్మయతతో సంగీతాన్ని విన్న ఆ చిన్నారి కుక్కపిల్ల అపస్వరాన్ని అంత తొందరగా ఎలా గుర్తించింది? ఇది నాకు నిజంగా ఆశ్చర్యం కలిగిస్తున్న సంగతి. జగత్తులో ఎలాంటి విస్మయాలున్నాయి? ఈ కుక్కపిల్ల నిస్సంశయంగా ప్రత్యేకమైన జీవి అని నేను ఒప్పుకుంటున్నాను” అని చెప్పి తరువాతి రాగాన్ని పాడటానికి పూనుకుంది..

ఇదంతా పత్రికల్లో వార్తగా వచ్చింది. ఎవరో ఒకరు ఆ సంఘటన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఆ వీడియోను లక్షలాది మంది చూశారు. వేలాదిమంది తమ ఫేస్‌బుక్లలో దాన్ని పంచుకున్నారు.

• • •

గ్రేగ్ జోన్స్ అమెరికాకు చెందిన యాభైమంది అత్యన్నత ధనవంతులలో ఒకడు. యాభై దాటినా పెళ్ళి చేసుకోకుండా ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. అతడి సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ తమ బ్రాంచీలను కలిగివుంది. విచిత్రమేమిటంటే హైస్కూల్లో అతడికి చదువు అబ్బలేదని పాఠశాల నుంచి ఇంటికి పంపేశారు.

డబ్బన్నది ఎంత అల్పమైనదంటే ఇప్పుడతడిని డబ్బుతో ఆకర్షించడం సాధ్యంకాదు. ఆ కారణం వల్లనే అతను తన అత్యధిక సొమ్మును సమాజసేవకు వినియోగిస్తాడు. ఆఫ్రికా దేశాలు, రష్యాలోని బీదరాష్ట్రాలు – మొదలైన చోట్ల తన డబ్బును పేదలకోసం ఖర్చు చేస్తాడు.

డబ్బుకు బదులుగా మరొక విభిన్నమైన అలవాటు అతడి అహంకారాన్ని పెంచి సంతోషాన్ని ఇస్తోంది. జగత్తులోని ప్రత్యేకమైన కుక్కలను అతను సేకరిస్తున్నాడు. తన యజమానిని హత్య చేసిన హంతకుడిని అయిదు సంవత్సరాల తర్వాత పోలీసులకు పట్టిచ్చిన చైనాకు చెందిన కుక్క, భూకంపం వచ్చే సూచనను గుర్తించి

ఇంటి సభ్యులనంతా బయటికి పంపించి రక్షించిన రష్యా కుక్క, వైద్యులందరూ చేతులెత్తేసిన తరువాత తననే అంటిపెట్టుకున్న చిన్న అబ్బాయికి ప్రత్యేకమైన ఆకుల రసాన్ని ఇవ్వడం ద్వారా రక్షించుకున్న కెన్యా కుక్క, కమోడును అందంగా ఉపయోగించి శౌచానికి వెళ్ళే ఇంగ్లాండు కుక్క... ఇలా ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన కుక్కలన్నీ అతడి సేకరణలో ఉన్నాయి. ప్రతి ఒక్కదాన్ని తన బిడ్డలా చూసుకుంటాడు. ప్రపంచంలోని ప్రఖ్యాత పత్రికలలో ఇంటర్వ్యూలు ఇచ్చినప్పుడు, తన కుక్కల గురించి మరవకుండా మాట్లాడుతాడు. తన ఫోటోతోపాటు తన ముద్దుల కుక్కలూ ఉండేలా చూసుకుంటాడు.

గ్రెగ్‌కు చెందిన క్యాలిఫోర్నియాలోని స్యాన్హోస్ కంపెనీ ఆఫీసులో పనిచేస్తున్న ఒక భారతీయుడు ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నాడు. ఆ వీడియోలో ఒక పొమేరియన్ కుక్క ఎలా సంగీతంలో అపస్వరాన్ని గుర్తిస్తుందో వివరంగా ఉంది. ఆ కుక్క తన తండ్రి దగ్గర ఉందనీ, దాన్ని తానే ఒంటరిగా ఉన్న తండ్రికి ఇప్పించాననీ చెప్పాడు. తన తండ్రి చాలాసార్లు ఈ విషయం గురించి ఫోన్లో చెప్పినప్పటికీ దాని గురించి తను అంతగా పట్టించుకోలేదనీ, ఇప్పుడు ఈ వీడియో చూసిన తరువాత తాను నివ్వెరపోయానని రాసుకున్నాడు. ప్రపంచంలో వేరువేరు చోట్ల బ్రాంచీలలో పని చేస్తున్న సహోద్యోగులందరూ అతడికి అభినందనలు తెలిపారు.

ఆ వీడియోను గ్రేగ్ యాభైసార్లు చూసి ఆశ్చర్యపోయాడు. కుక్కలకు సంగీతం అర్థమవుతుందని అతడికి తెలుసు. ఆయితే సంగీతంలో దొర్లే అపస్వరాన్ని గురించి హెచ్చరించే కుక్క విషయం అతడికి విపరీతమైన సంతోషం, కుతూహలం కలిగించసాగింది. ఇలాంటి ప్రత్యేకమైన కుక్క తన సేకరణలో ఉండాలని కచ్చితంగా అనిపించసాగింది. ఎవరో నివృత్త భారతీయ వృద్ధుడి దగ్గర ఆ కుక్క ఉందనే విషయం అపూర్వమైన వజ్రం ఎక్కడో మట్టిలో చేరిపోయినట్టు అనిపించి అతడికి దుఃఖం కలిగింది. ఎలాగైనా ఆ కుక్కను తన సేకరణలో చేర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. అతడు ఒక్కసారి నిర్ణయించుకుంటే అయిపోయింది. అది కచ్చితంగా అతడి సేకరణలో చేరుతుందని అతడి గత అనుభవాలు చెబుతాయి.

దాని మొదటి దశలో ఆ వీడియోను పంచుకున్న, తమ కార్యాలయంలో పని చేస్తున్న రమాకాంత్ కులకర్ణిని కలవమని చెప్పి పంపాడు.

• • •

"అంత గొప్ప శ్రీమంతుడు నాలాంటి బీదవాడి ఇంటి కుక్క మీద ఎందుకు కన్నువేశాడు" అని రావుగారు అప్పటికే మండిపడ్డాడు. రమాకాంత్‌కు ఈ విషయాన్ని తన తండ్రికి ఎలా అర్థమయ్యేలా చెప్పాలో తోచలేదు.

“అలా కాదు నాన్న, అతను గొప్ప వ్యక్తి. మన దగ్గర ఉన్న వస్తువొకటి తనకు కావాలని అతను అడగటమే గొప్ప విషయం. నువ్వు ఇప్పుడు కాదంటే నాకు ఇబ్బంది కలుగుతుంది. ఇంతకీ నేనే నీకు కుక్కను ఇప్పించాను. అప్పుడు వద్దన్నావు, గుర్తుందా లేదా?” అని రమాకాంత్ వాదించబోయాడు.

“అప్పుడు వద్దన్నాను. నువ్వు నా మాట వినివుంటే ఈ సమస్య వచ్చేదే కాదు. అప్పుడూ నా మాట వినలేదు. ఇప్పుడూ నా మాట విననంటే ఎలా? నాకు నిమ్మిని వదిలి ఉండటానికి సాధ్యం కాదు”

“నీకు కావాలంటే అలాంటిదే మరొక కుక్కను తెచ్చి ఇస్తాను నాన్న”

“నాలాంటి ఇంకొక నాన్నను వెదుక్కుని అతడి దగ్గర ఈ మాటలు చెప్పు”

“నువ్వు ఏమేమో మాట్లాడుతున్నావు. అది కాదు, ఆ కుక్కకు అలాంటి శ్రీమంతుడి ఇల్లు దొరికితే ఎక్కువ సుఖంగా బతుకుతుంది. అది నీకు ఇష్టం లేదా?”

“శ్రీమంతుడి ఇంట్లో కుక్క సుఖంగా ఉంటుందని ఎవరు నీకు చెప్పారు? కుక్క సుఖంగా ఉండటానికి కావలసింది ముద్ద అన్నం, ఒక పిడికెడు ప్రేమ. అదేమైనా బంగారు ఆభరణాలు కావాలంటుందా? డబ్బుల కొండను ఎక్కినా దాని మీద కాలెత్తి ఉచ్చ పోస్తుంది.”

“కుక్కను ఇప్పిస్తున్నప్పుడు వద్దన్నావు. ఇప్పుడు చూస్తే మొండిపట్టు పడుతున్నావు. నీకు నేనే కుక్కను ఇప్పించానన్నది మరవకు”

“ఆ విషయం ఎలా మరవగలను నాయనా? నువ్వే నాకు కుక్కను ఇచ్చావు. అందులో అనుమానం లేదు. అలాగే నేనూ, మీ అమ్మ కలిసి నిన్ను ఈ భూమికి తెచ్చామన్నాది ఎన్నడూ మరవద్దు”

రమాకాంత్ ఫోన్ కట్ చేశాడు. అంతకన్నా ఎక్కువగా వివరించి చెప్పటం అతనికి సాధ్యం కాదు.

ఇటు రావుగారికి కుమారుడి ఫోన్ వల్ల అసహనం కలిగింది. దాన్ని నిమ్మి ముందు ఆ రోజంతా చెప్పుకున్నారు.

“నిన్ను ఇచ్చేయాలంట చూడు నిమ్మి. ఎలా ఇవ్వడానికి సాధ్యం? నిన్ను కక్కసుకు తీసుకెళతాను. స్నానం చేయిస్తాను. జుట్టు దువ్వి పేలు కుక్కుతాను. భోజనం పెడతాను. ప్రేమ చూపిస్తాను. ఇప్పుడు ఉన్నటుండి ఇచ్చెయ్యమంటే ఏమిటి అర్థం? నువ్వే చెప్పు, ఈ కాలం కుర్రవాళ్ళకు బుద్ధి కాస్త తక్కువే కదూ” అని నిమ్మిని అడిగారు. దానికి నిమ్మి ఏమని చెబుతుంది? మౌనంగా నాలుకను పొడుగ్గా చాపి తన ప్రేమను చూపుతుంది. యజమాని ముందూ వెనుకలూ తిరుగుతుంది.

అయితే గ్రేగ్ జోన్స్ అంత సులభంగా ఓటమిని అంగీకరించేవాడు కాదు.

ఆ రాత్రి సుమారు పదిగంటల సమయంలో, ఇక రావుగారు నిద్రపోవాలనుకున్న సమయంలో సరిగ్గా రమాకాంత్ నుంచి మరొకసారి ఫోన్ వచ్చింది.

"నాన్నా..." అని అతడు పిలిచిన తీరులోనే కుమారుడు కుంగిపోయాడని రావుగారికి అర్థమైంది.

ఏమని బదులు పలకాలో ఆయనకు అర్థం కాలేదు.

"అతడికి కుక్క కావాల్సిందేనంట నాన్న. లక్ష డాలర్లు ఇస్తానంటున్నాడు. అంటే తెలుసుకదా? మన డబ్బులో ఏడు కోట్లకు సమానం"

"ఈ వయస్సులో డబ్బులు తీసుకుని నేను ఏ వ్యాపారం చేయాలి రమాకాంత్?" అని రావుగారు అన్నారు. అప్పటికే రావుగారు కూడా కొడుకు పరిస్థితికి మెత్తబడ్డారు. "నీకు డబ్బు అవసరం లేదని నాకు తెలుసు నాన్నా..." అని రమాకాంత్ నొక్కి చెప్పాడు.

"........"

"డబ్బుతోపాటు నాకు రెండు ప్రమోషన్లు ఇస్తానని ప్రామిస్ చేశాడు. వద్దు అని చెప్పేటంత మూర్ఖత్వం నాకు ఇంకా రాలేదు నాన్న. ట్రంప్ వచ్చిన తరువాత భారతీయులకు ఉద్యోగం నిబెట్టుకోవడంమే ఎంతో కష్టమైందో నీకు తెలుసు. ప్లీజ్ నాన్నా, కొడుకుకన్నా నీకు కుక్క ముఖ్యం అన్నట్టు ప్రవర్తించకు" అని రమాకాంత్ బాగా ఆలోచించి బాణం వదిలాడు. ఆ బాణం దెబ్బకు రావుగారు లొంగిపోయారు.

"అలాగే నాయనా, వచ్చి తీసుకునిపొమ్మని చెప్పు. భార్యనే దగ్గర పెట్టుకోవడానికి సాధ్యంకాలేదు. ఇప్పుడు ఈ కుక్కనెందుకు బాధపెట్టాలి?" అని అన్నారు.

"థాంక్స్ నాన్నా... థాంక్యూ వెరీమచ్..." రమాకాంత్ కంఠంలో సంతోషం, ఉత్సాహం, ప్రశాంతతల మహా ప్రవాహమే ఉంది. రావుగారు ఫోన్ కట్ చేశారు.

రావుగారి మాటలన్నీ వింటున్న నిమ్మి వారి తొడ మీద ఎక్కిపడుకుంది. దాని దట్టమైన వెండి జుత్తును నిమురుతూ "ఇక ఎక్కువ రోజులు నువ్వు ఇక ఇక్కడ ఉండవు నిమ్మి, నిన్ను తీసుకుని వెళతారు" అని అనేటప్పుడు ఆయన కళ్ళు చెమర్చాయి.

గ్రెగ్ జోన్స్ కంపెనీకి చెందిన అత్యంత పెద్ద డెవలపమెమట్ సెంటర్ భారతంలోనే ఉన్నప్పటికీ అతను ఎప్పుడు భారత్‌కు రాలేదు. తన చేతి కింది అధికారులకు వీడియో కాన్ఫెరెన్స్‌ల మూలకంగా ఉత్తర్వులు ఇస్తూ పని చేయించేవాడు. ఏ కారణంగానైనా భారతానికి వెళ్ళాల్సిన విషయం వస్తే అతను

బెదిరి వణికేవాడు. అక్కడ విపరీతమైన దోమలు ఉన్నాయనీ, ఒక చిన్నదోమ కరిచినా చాలు, మలేరియా రోగంతో చస్తామని అతనికి భయముండేది. ఈ భయం ఒక విధమైన ఫోబియాగా మారి అతడిని కలవరపరుస్తుండేది. భారత్‌ను ఎన్నడూ చూడని అతడి అమ్మమ్మ బాల్యంలో అతడికి భారత్ గురించి భయం కలిగించే కథలను చెప్పి పెంచింది. అక్కడ మనుష్యులను పట్టుకుని తినే జనం ఉన్నారనీ, మంత్రం ద్వారా మనుష్యులను చిలుక పంజరంలో బంధిస్తారని, జొన్నగింజంత దోమ ఒకటి కరిస్తే చావే వస్తుందనీ ఆమె కథ అల్లి చెప్పి, అతడిలో భారత్ పట్ల లేనిపోని భయం ఏర్పడేలా చేసేసింది. పెద్దవాడిగా పెరిగి, అవన్నీ అబద్ధమని అతడికీ అర్థమైనా భారత్ గురించిన అతడి ఫోబియా మాయం కాలేదు. చాలావరకు కట్టుకథలు అబద్ధమని అతని సహోద్యోగులు తెలియజేసినప్పటికీ, భారత్‌లో దోమలు ఆధికంగా ఉన్న విషయం అతనికి గూగుల్ ద్వారా తెలిసేది. “మస్కిటోస్ ఇన్ బెంగళూరు” అని సర్చ్ కొడితేచాలు, వేలాది పుటల సమాచారం కనిపించేది. వందలాది చిత్రాలు కంప్యూటర్ తెర మీద రూపుదిద్దుకునేవి. దోమలు ఉన్నాయన్న తరువాత అవి కచ్చితంగా కుడుతాయని, దానివల్ల మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ మొదలైన ప్రాణాంతకమైన రోగాలు వస్తాయని గూగుల్ తెలియజేసింది. అందువల్ల ఏ కారణానికి కూడా భారత్‌కు వెళ్ళ కూడదని నిర్ణయించుకున్నాడు. అయితే సంగీతంలో అపస్వరాన్ని కనుక్కునే నిమ్మి అతడి నిర్ణయాన్ని సడలించింది. ఇష్టంలేని మనస్సుతో భారత్‌కు వెళ్ళడానికి అంగీకరించాడు.

శ్రీనివాసరావుగారు పెట్టిన రెండు షరతులు గ్రేగ్ జోన్స్‌కు ఇబ్బందులు తెచ్చి పెట్టాయి. మొదటిది గ్రేగ్ జోన్స్ స్వయంగా తన ఇంటికి వచ్చి డబ్బిచ్చి కుక్కపిల్లను తీసుకునిపోవాలి. నా నిమ్మిని అమ్మకానికి నేను పెట్టలేదు. అతనే తన ఐశ్వర్యాన్ని, దర్పాన్ని ప్రయోగించి నా నుంచి దాన్ని కొనుక్కుంటున్నాడు. అందువల్ల అతనే నేను ఉన్నచోటికి రావాలని రావుగారు కొడుకుకు కచ్చితంగా చెప్పాడు.

మొదటి షరతును పాటించడం అంత కష్టమేమీ కాదు. ఉదయంపూట ఇంటికి వచ్చి నిమ్మిని తీసుకునిపోతే, దోమల పీడ నుంచి తప్పించుకోవచ్చు. అయితే రావుగారు పెట్టిన రెండవ షరతు మాత్రం అందుకు అవకాశం ఇవ్వలేదు. ఈ ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం అదేమున్నప్పటికీ సూర్యుడు మునిగిన తరువాతే జరగాలని చెప్పారు.

“కుక్కపిల్లను ఇవ్వాలనుకున్నప్పుడు పగలైతే ఏమిటి? రాత్రయితే ఏమిటి? ఎందుకు ఇలాంటి కష్టమైన కండిషన్ పెడతావ్ నాన్నా?” అని రమాకాంత్ తండ్రి మీద కోపగించుకున్నాడు. అయితే రావుగారు అతడి కోపాన్ని పట్టించుకోలేదు.

“ఇంట్లో పెంచిన ప్రియమైన జీవిని డబ్బుకు అమ్మటమంటే అది మురికి వ్యాపారం. అలాంటి వ్యాపారం ఏ మర్యాదస్తుడూ సూర్యుడి వెలుతురులో చేయడు. అలాంటి పాపాన్ని చేసిన మరుసటి రోజు మళ్ళీ సూర్యుడి వెలుతురును అనుభవించటానికి సత్యవంతులకే ఎలా ధైర్యం వస్తుందో చెప్పు? ఇలాంటి వ్యాపారాలంతా జగత్తులో చీకట్లోనే జరుగుతుంది. అందుకే మీ యజమానికి చీకటిపడిన తరువాత ఇంటికి రమ్మని చెప్పు” అని పుల్లవిరిచినట్టు చెప్పారు.

ఆయన నిర్ణయాన్ని మార్చే ధైర్యం లేక రమాకాంత్ ఆ విషయాన్ని గ్రేస్ జోన్స్‌కు తెలిపి, “మిమ్మల్ని ఇంత కష్టపెడుతున్నందుకు క్షమాపణ అడుగుతున్నాను” అని అంగలార్చాడు. గ్రేగ్ కోపగించుకోక శాంతంగానే ఆ షరతును స్వీకరించాడు. కోప్పడితే ఎన్నటికి వ్యవహారం కుదరదని ఆ తెలివైన వ్యాపారికి తెలుసు. ఎలాగైనా చేసి నిమ్మిని తన సేకరణకు చేర్చటం మాత్రమే అతడి ప్రస్తుతం లక్ష్యం. తరువాత మిగిలిన భౌతిక విషయాలను ఎదుర్కోవచ్చు.

శ్రీనివాసరావుగారి ఇల్లు బన్నేరుఘట్ట రోడ్డుకు దగ్గర్లో ఉండేది. అక్కడ అనేక మురికి చెరువులు ప్రాణాలు పట్టుకుని మురికి నీళ్ళతో వాసనకొట్టేవి. దగ్గరలో కార్ఖానాలు నిరంతరంగా అందులో వ్యర్థాలను చేర్చేవి. రియల్ ఎస్టేట్ వాళ్ళు ఆ చెరువులు నాశనమైతే చాలని పొంచి కూర్చున్నారు. అందరిచేత చేతులు తడుపుకున్న మునిసిపాలిటి వారు చేతులు కట్టుకుని కూర్చున్నారు. అందువల్ల సాయంత్రమైతే చాలు దోమలు ఆ ప్రాంతంలో దాడి చేసేవి. వాటిలో ఒక్కటీ గ్రేగ్ను కుట్టకుండా జాగ్రత్తపడటం ఎలా? అనే విషయాన్ని పెట్టుకుని కంపెనీ ముఖ్యులు అనేక మీటింగ్‌లను చేశారు. ఒంటికి ఎలాంటి దోమల నిరోధక లోషన్‌ను పూసుకోవటానికి గ్రేగ్ సిద్ధంగా లేడు. చర్మానికి ఏదైనా అంటువ్యాధి తగలవచ్చని అతడి భయం. భారతదేశంలో అమ్మబడే విద్యుత్ వేడికి ఆవిరై దోమలను తరిమే ద్రావణాన్ని నమ్మటం సాధ్యంకాదు. ఎందుకంటే రావుగారి అపార్ట్‌మెంట్లో ఎప్పుడూ విద్యుత్ పోతుండేది. అందుకు ప్రత్యామ్నాయంగా రావుగారి అపార్ట్‌మెంట్లో జెనరేటర్ లేదు. అనేక సభల్లో ప్రత్యేక చర్చలు జరిగిన తరువాత దోమల కాయిల్ వాడుతారనీ, దాన్ని ఏ సమయంలోనైనా గ్రేగ్ పక్కనే ఉంచాలని నిర్ణయించటం జరిగింది. అనేక దోమల కాయిల్ ప్యాకెట్లు గ్రేగ్ సెక్యూరిటీ గార్డుల గన్నులతోపాటు ప్యాక్ అయ్యాయి.

చివరికి తన సొంత విమానాన్ని ఎక్కిన గ్రేగ్ భారతకు బయలుదేరాడు.

• • •

గ్రేగ్ జోన్స్ రావుగారి ఇంటికి వచ్చేసరికి సాయంత్రం ఏడైంది. వ్యక్తిగతమైన విమానంలో దేవనహళ్ళి ఏర్‌పోర్ట్‌లో దిగి అక్కడి నుంచి మరొక వ్యక్తిగతమైన

హెలిక్యాప్టర్ తీసుకుని అపోలో ఆస్పత్రి హెలిప్యాడ్లో దిగి, అక్కడి నుంచి ఒక బీఎండబ్ల్యూ కారులో అపార్ట్‌మెంట్‌కు వచ్చాడు. అనవసరంగా జనం చేరకూడదనే కారణానికి తను వచ్చిన విషయాన్ని రహస్యంగా ఉంచమని చెప్పాడు. కేవలం రక్షణశాఖకు తన ఆగమన విషయాన్ని తెలియజేయమని ఆజ్ఞాపించాడు.

సాయంత్రం అయిదింటికంతా తలుపులు మూసి దోమలు రాకుండా రావుగారు జాగ్రత్తలు వహించారు. ఆయన కుమారుడు అప్పటికే తన యజమానికి ఉన్న దోమల భయం గురించి సూక్ష్మంగా తెలియజేశాడు. అతిధికి ఎలాంటి ఇబ్బంది కలగకూడదని రావుగారు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. సాయంత్రం నుంచే దోమల నిరోధకాన్ని వెలిగించారు. అదృష్టవశాత్తు ఇప్పటివరకు కరెంట్ పోలేదు. అలాంటి గొప్ప శ్రీమంతుడు ఇంటికి వస్తే ఏం పెట్టాలో అర్థంకాక తల పట్టుకున్నారు. “అతను నీ ఇంట్లో నీళ్ళు కూడా ముట్టడు నాన్నా. ఊరకే తలపాడుచేసుకోకు” అని కుమారుడు చెప్పాడు. నిమ్మిని తీసుకునిపోవటానికి ఇంటికి వచ్చినపుడు గ్రేగ్ ఒకసారి దాని తెలివితేటలను పరీక్షించాలని నిర్ణయించుకున్నాడనే విషయం తండ్రికి తెలిపాడు. రావుగారు దానికి తగిన ఏర్పాట్లు చేశారు.

సాయంత్రం పనులన్నీ పక్కన పెట్టి స్వామినాథన్ చక్కగా జుబ్బా-పైజామా ధరించి, తన ఫ్లూటు, శృతిపెట్టెలను తీసుకుని వసారాలో ఆసీనడయ్యాడు. ఈ రోజు హంసధ్వని రాగంలో కృతిని వాయించాలని నిర్ణయించుకున్నాడు. వస్తున్న వ్యక్తి అత్యంత గొప్ప శ్రీమంతుడని రావుగారు సూక్ష్మంగా తెలియజేశారు. అందువల్ల కాస్త కలవరపడ్డాడు. అయినా ఒక ధైర్యం అతడిలో ఉంది. వాయించేటప్పుడు అపస్వరం పలికినా ఇబ్బంది లేదు. అపస్వరం పలకాలనే తాను ఇప్పుడు ఫ్లూటు వాయించాలని నిర్ణయించబడినప్పుడు దానికి భయపడవలసింది ఏముంది? అని తనకు తాను నచ్చజెప్పుకున్నాడు. అయితే హంసధ్వని వాయించేటప్పుడు ఒక్క అపస్వరం కూడా పలకకపోతే అప్పుడెలా? అనే భయం అతనిలో కలగసాగింది.

జయ-విజయుల్లా ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఇరుపక్కల పెట్టుకుని గ్రేగ్ జోన్స్ వచ్చాడు. ఉత్సవమూర్తి ముందు ధూపపుపొగను వేసే శిష్యుడిలా మరొక చిన్నకుర్రవాడు చేతిలో మస్కిటో కాయిల్ వెలిగించుకుని గ్రెగ్‌జోన్స్ ముందు నడుస్తున్నాడు. విష్ణుచక్రాన్ని ఆయన చేతిలోంచి ఆ కుర్రవాడు లాక్కున్నట్టు కనిపిస్తోంది. దోమల మీద తమ పవర్‌ఫుల్ గన్నులను ప్రయోగించటానికి సాధ్యంలేదని గ్రహించిన ఇద్దరు సెక్యూరిటీ గార్డులు యజమాని దగ్గర ఒక్క దోమ కూడా రాకుండా కళ్ళు విప్పార్చుకుని చూస్తున్నారు. ఒక్క దోమ దగ్గరికి వచ్చినా ‘ఫట్... ఫట్’ అని చప్పట్లుకొట్టి వాటిని చంపేస్తున్నారు. ఏ.కె. 47 గన్నుకన్నా చప్పట్లు ఎక్కువ శక్తివంతమైన అస్త్రమయ్యే ఈ విస్మయం ఆయన్ను నివ్వెరపరిచింది.

రెండు గంటలకాలం భారత సాంప్రదాయాల పట్ల క్లాస్ తీసుకున్నాడు గ్రేగ్. రెండు చేతులనూ జోడించి “నమస్కారం” అని చెప్పాడు. అయితే దగ్గర్లోనే ముంగాళ్ళ మీద కూర్చున్న నిమ్మిని చూడగానే గ్రేగ్ సంతోషంతో పొంగిపోయాడు. “ఓ మై స్వీట్ హార్ట్’ అని దాని దగ్గరికి పరుగెత్తి దాని జుత్తులో చేయి కదిలించాడు. సుదర్శన చక్రం పట్టుకున్న కుర్రవాడు అతడి వెనుకే పరుగెత్తి పొగను అతనివైపు సాగేలా చేయి ఊపాడు. గ్రేగ్ తన కోటు జేబులో చేయి వేసి ఒక వజ్రాల గొలుసును తీసి నిమ్మి మెడలో వేసి “ఐ లవ్ యు హనీ” అని కన్నీళ్ళతో అన్నాడు. మెడ చుట్టూ ఏదో గుచ్చుకునే వస్తువొకటి ఉన్నట్టు అసహనంతో నిమ్మి ఒకసారి తన మెడను అటూ ఇటూ తిప్పింది. తరువాత రావుగారు గ్రేగ్‌ను గురించి అతను కూర్చోవాల్సిన ఆసనాన్ని చూపించారు. గ్రేగ్ అక్కడే ఆసీనుడయ్యాడు. అతడి పక్కనే ఉన్న టీపాయ్ మీద ఎర్రగా మండుతున్న సుదర్శన చక్రాన్ని పెట్టడం జరిగింది. అప్పుడు గుర్తుకొచ్చినవాడిలా గ్రేగ్ తన కోటు జేబులోంచి చెక్కును తీశాడు. బంగారు ఫౌంటెన్ ఇంకు పెన్నుతో రావుగారి పేరు, ఇవ్వవలసిన లక్ష డాలర్లు రాసి, సంతకం చేసి, దాన్ని రావుగారి చేతికి ఇచ్చాడు. రావుగారు దాన్ని చూడటానికి కూడా ఉత్సాహాన్ని చూపించకుండా మస్కిటో కాయిల్ స్టాండ్ కింద పెట్టాడు. కాయిల్ నుంచి కొంత బూడిద రాలి చెక్కు మీద పడింది.

“మొదలు పెడదాం” అని గ్రేగ్ అనుమతి ఇచ్చాడు. అందుకోసమే ఎదురుచూస్తున్న స్వామినాథన్ ఒక్కసారి చేతులు జోడించి గ్రేగ్ నమస్కరించి శృతిపెట్టెను సరిచేసుకున్నాడు. ఫ్లూటును పెదవుల దగ్గర పెట్టుకున్నాడు. గ్రేగ్‌ను కర్ణాటక సంగీతం తెలియదు. అయితే పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం తెలుసు. అతను చక్కగా పియానో వాయిస్తాడు. అందువల్ల సంగీతంలో అపస్వరం దొరితే కనుక్కోవటం ఆంతకష్టం కాదని అతనికి రమాకాంత్ చెప్పాడు. ప్రతీ సంవత్సరం లాభాలు సంపాదిస్తున్న ఓ కంపెనీ నష్టంలోకి మరలిన వెంటనే దాని అపస్వర ధ్వనిని గ్రెగ్ గుర్తుపడతాడు. అది ఎలా అని ఎవరైనా గ్రెగోను అడిగితే మాత్రం చెప్పటం కష్టమని అతడికీ తెలుసు. దీక్షితులవానికి ప్రసిద్ధ కీర్తన అయిన హంసధ్వని రాగంలోని “వాతాపి గణపతిం భజేహం’ కీర్తనను స్వామినాథన్ వాయించసాగాడు. అప్పుడే పవర్ కట్ అయింది. చీకటి ఆవరించింది. నిమ్మి తళుక్ తళుక్మనే తన రెండు కళ్ళను అటూఇటూ తిప్పసాగింది. మస్కిటో కాయిల్ చివర నిప్పు రవ్వ మరింత ప్రకాశవంతంగా కనిపించింది. అందులోంచి చిన్నగా ధూపం వెలువడుతోంది. సెక్యూరిటీ గార్డులిద్దరూ గదిని టార్చ్ వెలుగుతో నింపారు. రావుగారు లేచి వెళ్ళి కొవొత్తులు వెలిగించుకుని వచ్చారు. కీర్తన ఆరంభంలో కరెంట్ పోవడం అపశకునమని స్వామినాథన్‌కు అనిపించింది. అయితే అక్కడ చేరిన అంతమంది

జనంలో ఎవరికి ఆ అపశకునం వర్తిస్తుందో తెలియలేదు. స్వామినాథన్ హంసధ్వని రాగాన్ని కొనసాగించాడు.

ఒకటిరెండు క్షణాలు మౌనంగా ఉన్న నిమ్మీ తరువాత విచిత్రంగా ప్రవర్తించసాగింది. గ్రెగ్‌ను చూసి తీవ్రంగా ఆపకుండా మొరగసాగింది. ఆ సమయంలో స్వామినాథన్ అపస్వరాన్ని వాయించలేదు. గ్రెగ్ నిమ్మి పొరబడుతోందని అనుకున్నాడు. అయినా ఊరుకున్నాడు. తరువాత నిమ్మ రావుగారిని చూసి ఒకే విధంగా కోపంతో మొరగసాగింది. అప్పుడు కూడా స్వామినాథన్ మురళీవాదనలో అపస్వరం వెలువడలేదు. రావుగారికే దాని ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. స్వామినాథన్‌కు మాత్రం తన ఫ్లూటు నాదాన్ని నిమ్మీ వినటం లేదని అర్థమైంది. ఇలా నిమ్మి మొరగటం నిరంతరంగా సాగింది. ఒకసారి గ్రేగ్‌ను చూసి మొరిగితే, మరొకసారి రావుగారిని చూసి మొరగసాగింది.

“నిమ్మీ, గొడవ చేయకు. ఊరుకో” అని రావుగారు ఒకటి రెండుసార్లు చెప్పినా వినిపించుకోలేదు. అయితే దాని కోపం పెరుగుతూనే ఉంది. అందువల్ల మొరుగుతున్న ధ్వని ఎక్కువవుతూవుంది.

చివరికి తన కోపం తారస్థాయిని చూపించేసింది. మొరగటం నిలిపి ఒకటిరెండు ఘడియల్లో మొత్తం సన్నివేశాన్ని గ్రహించింది. వెంటనే గ్రెగ్ పక్కనున్న టీపాయ్ మీద ఎక్కింది. ఓ లక్షడాలర్ల చెక్కుమీద మస్కిటో కాయిల్ మండుతోందికదా? అక్కడ కాలు ఎత్తి ఉచ్చ పోసేసింది. మస్కిటో కాయిల్ ఆరిపోయింది. ఇంకు పెన్నుతో రాసిన చెక్కు పేపర్ తడిసిపోయి, దాని మీది అక్షరాలన్నీ తుడుచుకుపోయాయి. నిమ్మి దాంతో ఊరుకోలేదు. తలుపుల దగ్గరికి పరుగెత్తుకుని వెళ్ళి, పైకి ఎగిరి గడియ ఊడేలా తన శక్తినంతా కూడదీసుకుని తలుపులు తోసింది. కోట తలుపులు తెరిచిన వెంటనే తోసుకొచ్చిన శత్రుసైనికుల్లా వేలాది దోమలు ‘గుంయ్’మంటూ లోపలికి దూరాయి.

జరిగిన విషయాన్ని అర్థం చేసుకోవటానికి గ్రేగ్‌కు ఒకటి రెండు క్షణాలు పట్టాయి. దోమలు లోపలికి దూరి ఎప్పుడు అతని మీద దాడి చేయడం మొదలు పెట్టాయో, అప్పుడు భయంతో వణకసాగాడు.

‘డెవిల్ డాగ్... డెవిల్ డాగ్... నన్ను చంపటానికి కుట్ర చేసింది” అని అరుస్తూ ఇంటి నుంచి బయటికి పారిపోయాడు. అతడి వెనుకనే ఏ.కే. 47 పట్టుకున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులూ, మస్కిటో కాయిల్ పట్టుకున్న పనికుర్రవాడు పారిపోయారు. హంసధ్వని రాగం సగానికి ఆగిపోయింది. అయితే కాకతాళీయంగా అప్పుడే కరెంట్ వచ్చింది.

• • •

మరుసటిరోజు ఉదయమే రమాకాంత్ తండ్రి మొబైల్‌కు ఫోన్ చేశాడు.

"ఏం నాన్నా ఇది... నిమ్మి ఇలా మోసం చేయొచ్చా?"

"అది మోసం చేసిందని ఎవరు చెప్పారు?"

"మా బాస్ ఫోన్ చేసి అంతా చెప్పారు. అపస్వరాలకు మొరుగుతుందని ఊరకూరకే తనను ఏమార్చారని కోప్పడ్డాడు"

"అరే... మొద్దుముండాకొడకా... అపస్వరం అన్నది కేవలం సంగీతంలో మాత్రమే ఉండదు. జీవితంలోనూ ఉంటుంది. డబ్బు ఇచ్చి విద్వత్తును కొనాలనుకునే నీ యజమాని, డబ్బుకు విద్వత్తును అమ్మాలనుకునే నీ తండ్రి– ఇద్దరి వ్యక్తిత్వాల్లోనూ అపస్వరం ఉందని నిమ్మి గుర్తించింది. సంగీతంకన్నా జీవితం ముఖ్యమన్నది దానికి తెలియదని అనుకోవద్దు. అందుకే ఫ్లూటు ధ్వని వినటం మాని, మీ యజమానినీ, నన్నూ చూసి ఆపకుండా మొరిగింది. ఆ మాత్రం అర్థం కాలేదేంరా?"

రమాకాంత్ ఫోన్ కట్ చేశాడు !

• • •

(కథకులు సత్యజిత్‌రే గారికి ఈ కథను ప్రేమతో అంకితమిస్తున్నాను–వసుధేంద్ర)

అనువాదం: రంగనాథ రామచంద్రరావు

తెలుగు సాహిత్యంలో అందరికీ చిరపరిచితులైన రచయిత. అనువాద కథకుడిగా పాఠకుల్లో మంచి గుర్తింపు ఉన్న వీరు రాయలసీమలోని ఆదోనిలో 1953లో జన్మించారు. కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల నుంచి కథలు, నవలలు అనువాదం చేశారు. ఇప్పటి వరకు వీరి సొంత కథలు, అనువాదాలు కలిపి 27 పుస్తకాలు వచ్చాయి.

రైటర్స్ మీట్, మార్చి 2018 – హిడెన్ క్యాసిల్, మెట్‌పల్లి, మెదక్ జిల్లా, తెలంగాణ.




**నిల్చున్నవారు:** రిషిత గాలంకి, మిథున ప్రభ, కూనపరాజు కుమార్, మానస ఎండ్లూరి, ఝాన్సీ పాపుదేశి, కుప్పిలి పద్మ, రిషి శ్రీనివాస్, పెద్దింటి అశోక్ కుమార్, కృష్ణమోహన్‌బాబు, మహమ్మద్ ఖదీర్‌బాబు, మెర్సీ మార్గరేట్, పూడూరి రాజిరెడ్డి, కె. సురేష్, అజయ్ ప్రసాద్, కరుణ కుమార్, చందు తులసి.

**మధ్యలో కూర్చున్నవారు:** మధుసూదన్‌రావు, ఉణుదుర్తి సుధాకర్, డానీ, వేమూరి సత్యం, ముక్తవరం పార్థసారధి, రాజారామ్మోహనరావు, అల్లం రాజయ్య, అనిల్ అట్లూరి, వనజ తాతినేని, దాసరి అమరేంద్ర, అరుణ పప్పు

**కింద కూర్చున్నవారు:** దేవిరెడ్డి రాజేశ్వరి, వి. మల్లికార్జున్, నాగేంద్రకాశి, వెంకట్‌శిద్దారెడ్డి, మోహిత, మహి బెజవాడ, కడలి, ఇంద్ల చంద్రశేఖర్, అక్కిరాజు భట్టిప్రోలు, జ్యోతిరాదిత్య.

రైటర్స్ మీట్, డిసెంబర్ 2018 – కూడలి లెర్నింగ్ సెంటర్, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.



**మొదటి వరుస:** కరుణ కుమార్, మహీ బెజవాడ, కొట్టం రామకృష్ణారెడ్డి, పూడూరి రాజిరెడ్డి, పెద్దింటి అశోక్ కుమార్, కుప్పిలి పద్మ, వేంపల్లె షరీఫ్, వసుధేంద్ర, జయశ్రీ నాయుడు, నాగేంద్రకాశి, అపర్ణ తోట, ఉణుదుర్తి సుధాకర్, కృష్ణమోహన్‌బాబు, వాసవి పైడి, ఝాన్సీ పాపుదేశి, చరణ్య, -------.

**రెండవ వరుస:** కె. సురేష్, అక్కిరాజు భట్టిప్రోలు, రిషి శ్రీనివాస్, కూడలి మధుసూదన్, దాట్ల దేవదానంరాజు, ఎన్. వేణుగోపాల్, అల్లం రాజయ్య, అవినేని భాస్కర్, అనిల్ అట్లూరి, మహమ్మద్ ఖదీర్‌బాబు, లక్ష్మీ నర్సయ్య, శ్రీనివాస్ గౌడ్, కుమార్ కూనపరాజు, దేవిరెడ్డి రాజేశ్వరి, మిథునప్రభ, కాత్యాయిని

**మూడవ వరుస:** మానస ఎండ్లూరి, వి. మల్లికార్జున్, అరిపిరాల సత్యప్రసాద్, అనిల్ గొర్రె, ఇండ్ల చంద్రశేఖర్, విరాజిత వర్మ, స్నేహారెడ్డి, -------.